సంపుటి : 3
సంచిక : 2
రు. 20/-లు
తెనాలి
పుటలు : 52

1993-2013 నడుస్తున్న చరిత్ర

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

ఏప్రిల్ 2017



మార్చి 14న జీవితాన్ని చాలించిన వకుళాభరణం లలిత గారు తెలుగుజాతి చరిత్రలో తనదైన చెరగని ముద్ర వేసుకొన్న మహావ్యక్తి. ఆమె ఒక సామాజిక మహిళ. ఆమె జీవనం, జీవితం సంఘహితం. గిరిజన జాతులపై ఆమె చేసిన పరిశోధన, వెలువరించిన పుస్తకాలు సాటిలేనివి. ఒక ఆదర్శమూర్తిగా మనందరి ఆలోచనల్లో, సాంఘిక పరిశోధకుల మనసుల్లో, నిబద్ధంగా క్షేత్రపరిశోధన చేపట్టే విద్యార్థుల, విద్యావ్యాసంగుల సిరాచుక్కల్లో, వాక్య నిర్మాణాల్లో ఆమె జీవిస్తారు.



ప్రపంచంలోని ఏడు ఖండాలకు చెందిన ఏడు మహోన్నత శిఖరాలను కేవలం 172 రోజుల్లో అధిరోహించి, భారత పతాకాన్ని అన్నిచోట్లా ఎగరవేసి, తిరిగి వచ్చిన తెలుగుబిడ్డ మల్లి మస్తాన్‌బాబు. 2015 మార్చి 23న స్పెయిన్‌లో శిఖరారోహణ చేస్తూ తుపానులో చిక్కుకొని మరణించాడు. రెండేళ్ళు గడిచిపోయినా, అతడిని భారత ప్రభుత్వం ఉన్నత పురస్కారంతో గౌరవించలేదు సరికదా, ఇచ్చిన వాగ్దానాలనూ అమలు చేయలేదు. పర్వతారోహణలో యువతకు ఆదర్శంగా, స్ఫూర్తిగా నిలిచిన దళిత యువకుడు మల్లి మస్తాన్‌బాబుకు ఎంతైనా ఋణపడి వున్నాం.

## తెలుగు-ఆంగ్ల భాషల సంబంధం : ప్రభావాలు, పర్యవసానాలు



పురస్కార వ్యవస్థ నిర్వాహకులు, అతిథులతో పురస్కార గ్రహీతలు



తెలుగు భాషోద్యమ కార్యకర్త, కథారచయిత స.వెం.రమేశ్‌కు పురస్కారం

# ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహిత్య పురస్కారాలు

**ఈ** ఫిబ్రవరి 26న హైదరాబాదులోని పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో శ్రీమతి కొలకలూరి విశ్రాంతమ్మ, శ్రీమతి కొలకలూరి భాగీరథీ పురస్కార ప్రదాన సభ జరిగింది. పదేళ్ళుగా ప్రతిఏటా జరుగుతున్న ఈ కార్యక్రమాల్ని సంక్షిప్తంగా ఆడియోవిజుయల్ ద్వారా ప్రదర్శించటంతో సభ మొదలైంది. ఈ సభకు తెలంగాణ రాష్ట్ర బి.సి.కమీషన్ అధ్యక్షులు బి.ఎస్.రాములుగారు అతిథిగా, సభ్యులు డా॥జూలూరి గౌరీశంకర్, డా॥వకుళాభరణం కృష్ణమోహనరావు, డా॥ఇ.ఆంజనేయగౌడ్ విశిష్ట అతిథులుగా విచ్చేశారు. ఆచార్య కొలకలూరి మధుజ్యోతి అధ్యక్షత వహించారు.

ముందుగా ఆచార్య కొలకలూరి ఇనాక్ కుటుంబ సభ్యుల పుస్తకాలను ఆవిష్కరించారు. ఇనాక్‌గారి "నేను పులుల బోను", "అమరావతి", "సర్పయాగం", "అమరావతి-మాదిగలస్థితి"లను ఆవిష్కరించారు. తర్వాత మధుజ్యోతి గారి "గుప్పెడు తలపులు", డా॥చిలుమూరి శ్రీనివాసరావుగారి 'పర్సనాలిటీ డెవలప్‌మెంట్ అండ్ సాఫ్ట్‌స్కిల్స్'లను ఆవిష్కరించారు. తన పుస్తకాలనూ, వాటికి ఉన్న సమకాలీన ప్రాధాన్యతను ఆచార్య ఇనాక్ వివరించారు.

శ్రీమతి కొలకలూరి విశ్రాంతమ్మ నవలా పురస్కారానికి శిరంసెట్టి కాంతారావుగారి 'వ్యూహం' (రు.10,000/-) ఎంపిక అయ్యింది. దానితోపాటు సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డిగారి 'ఒక్క వాన చాలు'కు కూడా పురస్కారం (రు.5,000/-) ఇచ్చారు. శ్రీమతి కొలకలూరి భాగీరథీ కథానికా పురస్కారానికి స.వెం.రమేశ్ గారి "కతలగంప" (రు.10,000/-) ఎంపిక కాగా, దానితోపాటు శాంతి నారాయణ గారి "కొండచిలువ" (రు.5,000/-) , డా॥ షాజహానా గారి 'లద్దాఫ్ని' (రు.5,000/-) కూడా పురస్కారానికి ఎంపిక అయ్యాయి. వారిని శాలువ, నగదు, జ్ఞాపిక, పూలదండతో సత్కరించారు. ఆచార్య ఇనాక్ గారి సాహిత్యంపై పరిశోధనలు చేసిన శ్రీ బి.నాగశేషు, శ్రీమతి కె.అరుణలకు సత్కారాలనందజేశారు. జస్టిస్ చంద్రయ్యగారు, రచయిత దాసరి అమరేంద్రగారు పురస్కార గ్రహీతలను అభినందించారు. ఆచార్య కొలకలూరి సుమకిరణ్ సభను నిర్వహించగా, శ్రీమతి కె.అనిత వందన సమర్పణ చేశారు.


ఏప్రిల్‌లో విడుదల...

ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు రచన

**అమ్మనుడితోనే మనుగడా ముందడుగూ!**

(పరిశోధనాత్మక వ్యాసాల సంకలనం)

- తెలుగు రాష్ట్రాలలో భాషా సంక్షోభం
- భాష-ఆర్థిక వ్యవస్థ-సామాజిక సంబంధాలు
- భాషా సంక్షోభం-ప్రపంచీకరణ
- కొన్ని ప్రశ్నలూ సమాధానాలూ
- శాస్త్రీయత కొరవడిన ఇంగ్లీషు మాధ్యమ ఉద్యమం
- తెలుగు ఆంగ్లభాషల సంబంధం : ప్రభావాలూ పర్యవసానాలూ

అనుబంధం : తెలుగు రాష్ట్రాలలో భాషావిధానం

తెలుగుజాతి ట్రస్టు ప్రచురణ

## పాలన, న్యాయ రంగాల్లో తెలుగు

ఏ అవసరాలకు వాడినప్పటికీ భాష అంతా ఒకటే. భాషను ఏ కార్యరంగంలో వాడితే ఆ రంగానికి సంబంధించిన ప్రత్యేకతాముద్ర ఆ రంగంలో వాడే భాష మీద పడుతుంది. దాన్ని బట్టి సాహిత్యభాష, విజ్ఞానశాస్త్రభాష, కంప్యూటర్‌భాష పరిపాలన భాష, న్యాయ పాలనభాష మొ॥న పేర్లు పెట్టుకుంటాం. పరిపాలన, న్యాయ పాలన వ్యవహారాలు రెంటిలోనూ సామాన్యంగా వాడే భాష తీరు ను బట్టి ఉమ్మడిగా, “అధికార భాష” అంటు న్నాం. దాన్నే పూర్వకాలంలో “రాజభాష” అనేవారు. పరాధీనపు బతుకు లేని దేశంలో కాని, రాష్ట్రంలో కాని సాధారణంగా, ప్రజలకు వాడుకలో ఉన్న భాషే ప్రభుత్వ న్యాయ వ్యవ హారాలకు వినియోగం కావడం ధర్మం. అప్పు డు ప్రజల భాషే అవసరమయిన పారిభాషిక పదాలను కూర్చుకొని అధికార భాష అని పించుకుంటుంది.

తెలుగు ప్రజలూ తెలుగునాటి ఏలికలూ కొన్నివేల సంవత్సరాలకు పూర్వం నుంచి ఉన్నప్పటికీ ఇటీవల కొన్ని శతాబ్దుల కిందటి వరకు తెలుగు భాష పాలన భాషగా పూర్తిగా మన్ననలందుకోలేదని చెప్పాలి. “శాతవాహనులు, ఇక్ష్వాకులు, విష్ణు కుండినులు, బృహత్పలాయనులు, పల్లవులు తెలుగుదేశాన్ని పాలించినంతకాలం మహారాష్ట్రీ ప్రాకృతమే రాజభాషగా, సాహితీభాషగా ఉండేది. అంటే అయిదో శతాబ్దివరకు అదే పరిస్థితి . మొత్తం తెలుగులో ఉన్న శాసనాలు క్రీ.శ.575 నుంచీ దొరుకు తున్నాయి.” అంటారు బూద రాజు రాధాకృష్ణ. “కాల క్రమాన రెడ్డిరాజుల కాలానికి సుస్థితికి వచ్చి, విజయనగర చక్రవర్తుల కాలంలో, మధుర తంజావూరు సామంతుల కాలంలో సంస్కృతం కన్నా ఎక్కువ గౌరవాన్ని తెలుగు సంతరించు కోగలిగింది”. గోల్కొండ కుతుబ్షాహీల కాలం నుంచి రాజ శాసనాల్లో తెలుగు భాషకు ఇతోధిక గౌరవమో, స్థానమో లభించటం మొదలయింది. బ్రిటిష్ వారి పాలనకాలంలో సామాన్య ప్రజలను ఉద్దేశించి చేసిన ప్రకటనలూ నోటీసులూ గ్రామాధికారుల రికార్డులూ తెలుగులో ఉన్నా రాజ భాషా స్థానం ఇంగ్లీషే ఆక్రమించింది.” 1947లో స్వాతంత్ర్యం వచ్చినా, 1953లో ప్రత్యేకరాష్ట్రం ఏర్పడినా, 1956లో విశాలాంధ్ర అవతరించినా ఇప్పటికీ ఇంగ్లీషే రాజ్యమేలుతోంది. తెలుగు రాష్ట్రంలో తెలుగు అధికారభాషగా వర్ధిల్లాలనిపించటం ‘దూరాశ’ గానే ఉండిపోయింది !

–తెలుగు భాషాచరిత్ర

(సంపాదకులు:భద్రిరాజు కృష్ణమూర్తి)

**మార్చి** 14న జీవితాన్ని చాలించిన వకుళాభరణం లలితగారు తెలుగుజాతి చరిత్రలో తనదైన చెరగని ముద్ర వేసుకొన్న మహావ్యక్తి. ఆమె ఒక సామాజిక మహిళ. ఆమె పుట్టుక, బతుకు వ్యక్తిగతం. ఆమె జీవనం, జీవితం సంఘహితం. ఆమె ఒక మహిళగా జన్మించారు. ఒక మహామనిషిగా మరణించారు. ఒక ఆదర్శమూర్తిగా ఆమె తప్పకుండా మనందరి ఆలోచనల్లో, సాంఘిక పరిశోధకుల మనస్సుల్లో, నిబద్ధంగా క్షేత్రపరిశోధన చేపట్టే విద్యార్థుల, విద్యా వ్యాసంగుల సిరాచుక్కల్లో, వాక్య నిర్మాణాల్లో జీవిస్తారు.

**పుటలు 13-17**



## లోపలి పుటలలో....


| | | |
|---|---|---|
| **‘అమ్మనుడి’కి అభినందన :** | | **6** |
| **సంపాదకహృదయం :** ................. | **–డా॥సామల రమేష్‌బాబు** | **7** |
| **మాతృభాషామాధ్యమం కోసం సాగుతున్న ఉద్యమం :** వార్తలు | | **9** |
| **బోధనా మాధ్యమం :** విద్యావంతులైన తల్లిదండ్రుల ....... | **–ఆచార్య గారపాటి .....** | **12** |
| **బోధనా మాధ్యమం–చర్చ :** తెలుగు రాష్ట్రాలో పాఠశాల ........ | **–కస్తూరి విశ్వనాథం** | **13** |
| **శ్రద్ధాంజలి :** వకుళాభరణం లలిత | **–సుందర్ కొంపల్లి** | **17** |
| **శ్రద్ధాంజలి :** మహాసంస్కర్తల వారసురాలు | **–వాడ్రేవు చినవీరభద్రుడు** | **18** |
| **భాషల చుట్టరికం :** తెలుగు–ఆంగ్లభాషల సంబంధం..... | **–ఆచార్య గారపాటి ......** | **22** |
| **భాషల చుట్టరికం :** తెలుగు – ఇంగ్లీషు భాషాసాహిత్య....... | **–అక్కిరాజు రమాపతిరావు** | **29** |
| **మనరాజులు వారి బిరుదులు :** కాకతీయులు | **–డా॥ఈమని శివనాగిరెడ్డి** | **32** |
| **తెలుగోడి గొప్పదనం :** సప్తశిఖరాలనెక్కిన......... | **–డా.సుజన్ తథాగత్** | **33** |
| **నడుస్తున్న చరిత్ర :** మూలాల వెతుకులాట | **–గోవిందరాజు చక్రధర్** | **36** |
| **సాహిత్యరంగం :** మనవూరు మదరాసు | **–మధురాంతకం నరేంద్ర** | **37** |
| **పిట్టచూపు :** జవాబుదారీతనం లోపించిన..... | **–చలసాని నరేంద్ర** | **39** |
| **చరిత్ర :** ద్వారబంధాల చంద్రయ్యనాయుడు | **–భట్టరుశెట్టి పద్మారావురాయలు** | **41** |
| **సందర్భం :** ఉస్మానియా యూనివర్శిటీ..... | **–సంకేపల్లి నాగేంద్ర శర్మ** | **44** |
| **ఇదీదారి :** యోగాకు యోగం కల్పించిన..... | **–వుప్పల నరసింహం** | **45** |
| **తెలుగులెంక సూక్తులు :** | **–డా॥నాగభైరవ ఆదినారాయణ** | **47** |
| **స్పందన :** సాంకేతిక పురోగతితో తెలుగు భాషే..... | **–క్రిష్టాఫర్ మాలా** | **48** |
| **గ్రంథాలయం :** | | **50** |

**కవితలు**

| | | |
|---|---|---|
| **–బి.వి.శివప్రసాద్** | రెక్కలు కావాలి | **17** |
| **–సడ్లపల్లి చిదంబరరెడ్డి** | సహారా ఎడారి దిక్కుకు | **20** |
| **–కరణం కళ్యాణ్** | మట్టివాసన | **31** |
| **–డి.నటరాజ్** | తెలియదు | **36** |



కంప్యూటరీకరణ : **కలిమిశ్రీ, సోమయాజులు**

ఫొటోలు : **తమ్మా శ్రీనివాసరెడ్డి** పకపకలు(కార్టూన్లు) : **సరసి**



రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా

**డాక్టర్ సామల రమేష్‌బాబు**, సంపాదకుడు, **అమ్మనుడి,**

జి–2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ–520004.

దూరవాణి: కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136*

e-mail : editorammanudi@gmail.com



పత్రికలో రచయితలు వ్యక్తం చేసే అభిప్రాయాలు వారి స్వంతం.
వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

మాసపత్రిక

నుడి • నాడు • నెనరు

సంపాదకుడు డా॥ సామల రమేష్‌బాబు

శాలివాహన శకం 1939 : హేవళంబినామ సంవత్సర చైత్ర *(ముత్తాపి) శుద్ధ పంచమి శనివారం మొదలు హేవళంబి నామ సంవత్సర వైశాఖ*(కొంగాపి) శుద్ధపంచమి ఆదివారం వరకు


## చందా వివరాలు

| | వ్యక్తులకు | సంస్థలకు | విదేశీయులకు |
|---|---|---|---|
| శాశ్వత చందా : | రూ.5000 | రూ.7500 | -- |
| 5 సం॥ : | రూ.1000 | రూ.1500 | 150 డాలర్లు |
| 3 సం॥ : | రూ. 700 | రూ.1000 | 75 డాలర్లు |
| 1 సం॥ : | రూ. 240 | రూ. 400 | 25 డాలర్లు |

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'అమ్మనుడి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.
**AMMA NUDI - AXIS BANK, TENALI**
అక్కౌంట్ నెం. **915020010550189**
**IFSC Code : UTIB0000556**
ఆన్‌లైన్‌లో చందాను పంపినవారు, ఆ వెంటనే దయతో - చిరునామా, ఫోన్ నెం. తదితర వివరాలను జాబుద్వారాగాని, ఫోన్ మెసేజి ద్వారాగాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా


**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి**
గుంటూరు జిల్లా - 522 211. ఫోన్ : 9440448244
ఇ-మెయిల్ : ammanudi@gmail.com


**చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంప గలము. ఇందుకోసం మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.**

## చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ - పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.

## రచయితలకు సూచనలు

1. విభిన్న అంశాలపై వ్యాసాలను పంపవచ్చు. ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకుండా ఉండాలి. అన్నిరంగాలలో తెలుగు వారి శ్రేయస్సుకు సంబంధించిన రచనలను పంపండి. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. అప్రజాస్వామిక రచనలను తీసుకోలేము. సరళమైన తెలుగులో వ్రాయాలి. 2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి, పి.డి.ఎఫ్.పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్ చేసి editorammanudi@gmail.com కు పంపాలి. లేదా కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో పంపవచ్చు. **3. రచనతోపాటు రచన స్వంతమేనని, ఇతర పత్రికలకు గాని, ఇంటర్నెట్ పత్రికలకు గాని పంపలేదని, పరిశీలనలో లేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీపత్రాన్ని స్పష్టంగా వ్రాసి పంపాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము. పోస్టల్ చిరునామా, ఫోన్ నెం., ఇ-మెయిల్ కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.** 4. మాకు పంపే రచన నకలును మీ వద్ద ఉంచుకోండి. ప్రచురణకు ఎంపిక చేయని రచనలను తిప్పి పంపడం వీలుకాదు.

### కథారచయితలకు, కవులకు విన్నపం

1. మాట్లాడుకొనే తెలుగులో వ్రాసిన కథల్ని **'నడుస్తున్న చరిత్ర'** ప్రచురించిన సంగతి చదువరులకు, రచయితలకు తెలిసిందే. ఈ సంప్రదాయాన్ని **'అమ్మనుడి'** పత్రిక కొనసాగిస్తున్నది. పాత్రల సంభాషణలు తప్పనిసరిగా మీ ప్రాంతంలో మాట్లాడుకొనే తెలుగు తీరులో ఉండాలి. కథాచిత్రణ కూడా మీ తెలుగు తీరులోనే ఉంటే మంచిది. కఠినమైన సమాసాలను ఉపయోగించవద్దు. తేలికైన తెలుగు మాటలు కుదరకపోతే జనం వాడుకలోని ఇతర ప్రాంతాల తెలుగు మాటల్ని వ్రాయవచ్చు. తప్పనిసరి అయితే తప్ప ఏ ఇతర భాషల మాటలను ఉపయోగించవద్దు. ఈ సూచనలే కవితలకూ వర్తిస్తాయి.

2. **'అమ్మనుడి'**లో ప్రచురణకై పంపించే కథలు, కవితలు తెలుగు వారి సామాజిక, భాషాసంస్కృతుల వికాసానికి తోడ్పడేవిగా ఉండాలి. ప్రతినెలా ఒకటి లేక రెండు కథలను మాత్రమే ప్రచురించగలం. ముద్రణలో 2 లేక 3 పుటలకు మించకుండా ఉండేవాటినే తొలి ఎంపికకు తీసుకుంటాం. కవితలు 20 నుంచి 30 వరుస (లైను) లకు మించకూడదు.

## 'అమ్మనుడి' లభించుచోట్లు

నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజ్ భవనం ఎదురుగా,
కాచిగుడా. **హైదరాబాదు - 500 027.**
ఫోన్ :040-24652387

మైత్రీ బుక్‌హౌస్, జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్‌రోడ్డు
(ఏలూరు రోడ్డు) **విజయవాడ - 520 002.**
ఫోన్ : 9866211995

మణి బుక్‌స్టాల్, షాప్ నెం.58, సండేమార్కెట్,
**నెల్లూరు**-1. ఫోన్:7386223538.

# తెలుగుజాతి (ట్రస్టు) విన్నపం

'నడుస్తున్న చరిత్ర' ప్రోత్సాహంతో ఆంధ్రప్రదేశ్‌లోనే కాక, పొరుగు రాష్ట్రాల్లోనూ నివసిస్తున్న తెలుగువారి శ్రేయస్సుకు, తెలుగు భాషోద్యమ నిర్మాణానికి కృషి జరిగింది. దక్షిణ భారతదేశమంతటా చిక్కగా అల్లుకొని, మొత్తం దేశంలోనేకాక, అనేక ఇతర దేశాల్లో కూడా భాషా సాంస్కృతిక మూలాలను విస్తరించుకొనివున్న తెలుగుజాతిలో చైతన్యాన్ని పెంపొందించి, వారిలో సంఘీభావాన్ని, భావసమైక్యతను బలపరచవలసిన అక్కరను గుర్తించిన కొందరు కార్యకర్తలు అందుకోసం పనిచేస్తున్నారు. అయితే, అనివార్య కారణాల వల్ల నడుస్తున్న చరిత్ర పత్రికను 2013 నవంబరు నుంచి నిలిపి వేయవలసి వచ్చింది. మళ్ళీ పత్రికను ప్రచురించడంతోపాటు తెలుగు నుడి, చరిత్ర, జాతి ముందడుగుకు అవసరమైన పుస్తకాల ప్రచురణను, ప్రచార కార్యక్రమాలను చేపట్టాలని తలపెట్టాము. ఇందుకోసం 'తెలుగుజాతి' పేరిట ఒక ట్రస్టును నమోదు చేయించాము. (92/ 2014). తెలుగు అమ్మనుడిగా కలిగినవారు ఎక్కడ నివసిస్తున్నా, వారి శ్రేయస్సు కోసం ఈ సంస్థ పనిచేస్తుంది.

2015 మార్చి నుంచి **అమ్మనుడి** పత్రికను ప్రచురిస్తున్నాము. పుస్తకాల ప్రచురణ కార్యక్రమంలో భాగంగా తొలుత స.వెం.రమేశ్ వ్యాసాల సంకలనం **'ఎల్లలు లేని తెలుగు'**ను విడుదల చేశాము. త్వరలోనే మరికొన్ని ప్రత్యేకమైన పుస్తకాలను వెలువరించ బోతున్నాము. ఈ ట్రస్టును బలమైన పునాదులపై, తగినన్ని వనరులతో బలపరచటానికి మీ అందరి చేయూత కావాలి. ట్రస్టు నిర్మాణంలో తోడ్పడాలని విన్నవిస్తున్నాము.

**ట్రస్టుకు విరాళాలనిచ్చి తోడ్పడ గోరుతున్నాము.**

| | |
|---|---|
| రాజ పోషకులురు. 1,00,000/-లు | పోషకులు రు. 25,000/-లు |
| విశిష్ట పోషకులు రు. 50,000/-లు | ప్రోత్సాహకులు రు. 10,000/-లు |

**దాత ఫొటోను, క్లుప్తంగా పరిచయాన్ని 'అమ్మనుడి' పత్రికలో ప్రచురిస్తాము.**

**దాతలందరినీ శాశ్వత చందాదారులుగా పరిగణించి పత్రికను ప్రతినెలా పంపిస్తాము. ట్రస్టు ప్రచురించే పుస్తకాలను కూడా ఉచితంగా పంపిస్తాము.**

సొమ్మును చెక్ / డ్రాఫ్టుగా / ఆన్‌లైన్‌లో 'TELUGUJAATHI' పేర పంపాలి. యాక్సిస్ బ్యాంక్, సికిందరాబాదు.

అక్కౌంట్ నెం. 914020020387880 I.F.S.C.Code : UTIB0000068

**డా॥ సామల రమేష్‌బాబు,** మేనేజింగ్ ట్రస్టీ, 9848016136 ట్రస్టీలు : **పారుపల్లి కోదండరామయ్య** 9505298565, **డా॥వెన్నిసెట్టి సింగారావు** 9393015584, **స.వెం.రమేశ్** 8500548142, **సామల లక్ష్మణబాబు** 9440448244

## మీరు 'అమ్మనుడి' చందాదారులేనా?

'అమ్మనుడి' పత్రికకు చందాదారులు పంపే చందా సొమ్మే ఆధారం. కనుక-

1. తాము చందాదారులైతే మీకు పంపే పత్రికపై చందా ఏ నెల వరకు ఉన్నదీ పేర్కొని వుంటుంది. దయచేసి దానిని గమనించి, సకాలంలో మీ చందా సొమ్మును పంపించి పత్రికను ఎల్లప్పుడూ అందుకోండి.
2. తాము చందాదారులు కాకపోయినా, తమకు గౌరవప్రతిగా (కాంప్లిమెంటరీగా) ఉచితంగా అందుతూ వుండవచ్చు. అటువంటి మిత్రులకు పత్రిక నచ్చితే, దయచేసి చందాను పంపించి తోడ్పడగలరు. పత్రిక నచ్చకపోయినా, మీకు ఆసక్తి లేకపోయినా 'పత్రికను పంపవద్దు' అని దయచేసి ఒక కార్డుపైగాని, ఎస్.ఎం.ఎస్/మెయిల్ గాని పంపించి సహకరించగోరుతున్నాము.
3. పత్రికకు చందాను చెల్లించేవారు తమ ఇష్టాన్ని బట్టి శాశ్వత చందా (రు.5000/లు) గాని, 5 సం॥ల చందా (రు.1000/లు) గాని, 3 సం॥ల చందా (రు.700/లు) గాని పంపి పత్రికకు ఆర్థికంగా తోడ్పడగలరు. వీలుగాకపోతే సం॥చందా రు.240/లు పంపించి ఏటా పునరుద్ధరించుకొనవచ్చు.

**-ప్రచురణకర్త,** అమ్మనుడి

**నడుస్తున్న చరిత్ర**

(2013 నవంబరు వరకు)

**అమ్మనుడి**

(2015 మార్చి నుండి...)

**పాత సంచికలు విడిగా గాని,**

**సంపుటి (వాల్యూం) బౌండులుగా గాని**

**కావలసినవారు సంప్రదించండి.**


అమ్మనుడి, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ-4.

ఫోన్ : 98480 16136, 0866-2439466


'అమ్మనుడి'కి
అభినందన

# 'అమ్మనుడి'కి కేంద్రమంత్రి శ్రీఎం.వెంకయ్యనాయుడు అభినందన

## అమ్మభాషపై తెలుగుజాతిలో చైతన్యాన్ని పెంచి వారిలో సంఘీభావాన్ని, భావసమైక్యతను పెంచేందుకు కృషిచేస్తున్నందుకు...



**గుం**టూరుకు చెందిన 'అమ్మనుడి' చదువరి, గ్రంథ సమీక్షకులు శ్రీ ఎం.వి.శాస్త్రి జనవరి 2017 సంచికలోని ఒక వ్యాసాన్ని చదివి ఎంతో కలతచెంది అందులోని ముఖ్యాంశాన్ని కేంద్ర మంత్రివర్యులు శ్రీ వెంకయ్యనాయుడుకు తెలియజేశారు. దానికి వెంటనే స్పందించిన కేంద్రమంత్రి వెంటనే వ్రాసిన జవాబును ఈ ప్రక్కన చూడండి. శాస్త్రిగారు మార్చి 22న కేంద్రమంత్రి లేఖ నకలును పత్రిక సంపాదకునికి పంపుతూ వ్రాసిన లేఖను కూడా ఇక్కడ ప్రచురిస్తున్నాము. ఈ సందర్భంగా 'అమ్మనుడి'కి అభినందనలు తెలియజేసిన కేంద్ర మంత్రివర్యులు శ్రీ ఎం.వెంకయ్యనాయుడు గారికి కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాము. తనంతట తానుగా చొరవతో ముందుకు సాగిన శ్రీ ఎం.వి.శాస్త్రిగారికి మా ధన్యవాదాలు. 'అమ్మనుడి'ని తమ స్వంత పత్రికగా స్వీకరించి ఆదరిస్తున్న పత్రిక చదువరులకు, రచయితలకు ఈ ఘనత చెందుతుందని మనవి చేస్తున్నాను. -సంపాదకుడు.



M. VENKAIAH NAIDU

MINISTER OF URBAN DEVELOPMENT,
HOUSING & URBAN POVERTY ALLEVIATION
AND INFORMATION AND BROADCASTING
GOVERNMENT OF INDIA

ఫిబ్రవరి 25, 2017

'అమ్మనుడి' సంపాదకులు
డా॥సామలరమేష్ బాబు గార్కి,

ఎమ్.వి.శాస్త్రి నమస్కరించి వ్రాయునది.

'అమ్మనుడి' జనవరి 2017 సంచికలో 'మరచి పోయిన ఇష్టసిద్ధి' పేరున డా॥ మధు రాంతకం నరేంద్ర వ్రాసిన వ్యాసం 37/38 పేజీలలో ప్రచురిత మైంది. నెల్లూరు పట్టణం లో పెన్నానది ఒడ్డున గల రంగనాధస్వామి ఆలయం సమీపాన కవిబ్రహ్మ తిక్కన వ్యాస భారతాన్ని ఆంధ్రీకరించిన ప్రదేశం గురించి, ఆ ప్రదేశం ఎంత అధ్వాన్నంగ ఉన్నదీ వివరించబడింది.

ఆ వ్యాసం చదివి ఎంతో కలత చెంది, తేదీ 04022017న గౌ॥ కేంద్ర పట్టణాభి వృద్ధి, పట్టణ పేదరిక నిర్మూలన మరియు సమాచార ప్రసార శాఖల మంత్రివర్యులు శ్రీ ఎం. వెంకయ్య నాయుడు గారికి ఈ విషయమై తగు చర్యలు తీసుకొన వలసినదిగా అభ్యర్థించాను. ఆ లేఖతో పాటు జనవరి 2017 సంచికను వారికి పంపాను.

శ్రీ వెంకయ్యనాయుడు గారు ఎంతో సహృద యంతో తేదీ 25-2-2017 ఈ విషయమై నాకు ప్రత్యుత్తరాన్ని యిచ్చారు. తగిన చర్యలు తీసు కునేలా అధికారులను కోరతానని, అమ్మ భాషపై తెలుగు జాతిలో చైతన్యాన్ని పెంచి వారిలో సంఘీ భావాన్ని భావ సమైక్యతను పెంచేందుకు కృషి చేసేందుకు 'అమ్మనుడి' పత్రిక కృషికి తన అభి నందనలు తెలియజేశారు. ఆ లేఖను మీకు పంపి స్తున్నాను.

ఈ సందర్భంగా, డా॥ మధురాంతకం నరేంద్ర గారికి, వారి వ్యాసాన్ని ప్రచురించిన 'అమ్మనుడి'కి, సహృదయంతో స్పందించిన గౌ॥కేంద్ర మంత్రి వర్యులు శ్రీ వెంకయ్య నాయుడు గారికి ధన్య వాదాలు. 'అమ్మనుడి' మరింత ప్రగతిని సాధించా లని కోరుతూ-

భవదీయుడు,
**ఎమ్.వి.శాస్త్రి**

సంపాదకీయం

## తెలుగుదేశం పార్టీ 1982 భాషావిధాన ప్రకటన:
# అమలు బాధ్యత ముఖ్యమంత్రిదే

**కా**లచక్రం ఆగదు. కానీ దాన్ని పట్టించుకోని ప్రభుత్వాలు కాలవాహినిలో కొట్టుకుపోతుంటాయి. కాలం శక్తిని గ్రహించని వారు చరిత్రగతిలో చిరునామా లేకుండా పోతారు.

రాజ్యాధికారం కంటే మించిన శక్తి మరొకటి మనకు కనిపించదు. కానీ ప్రజల శక్తి రాజ్యాధికారాన్ని శాసించగలుగుతుంది. ఆ శక్తి ఉద్యమాల్లోంచి ఏర్పడుతుంది. ఆ శక్తిని కాలం స్వాగతిస్తుంది. మార్పులకు దారి కల్పిస్తుంది. తిరుగులేని అధికారం అంటూ ఎవ్వరికీ ఎక్కువకాలం వుండదు. ఈ వాస్తవాన్ని గ్రహించిన ప్రభుత్వాలకు చిరంతన కీర్తి మిగులుతుంది.

పాలకులు వాగ్దానాలు చేయడంతోనే సమస్య పరిష్కారమవుతుందనుకోకూడదు. వాటిని అమలు చేయడం- అదీ సకాలంలో అమలు చెయ్యడం మాత్రమే ప్రజల్లో నమ్మకాన్ని నిలిపి ఉంచుతుంది.

తెలుగుదేశం పార్టీకి సంబంధించినంతవరకు – 1982 మేలో పార్టీ స్థాపన సందర్భంగా విడుదల చేసిన భాషావిధాన ప్రకటన పూర్తిపాఠాన్ని ఫిబ్రవరి 'అమ్మనుడి' సంచికలో ప్రచురించాం. అది ఒక అపురూపమైన ప్రకటన. దానిలోని స్ఫూర్తిని తీసుకొని తు.చ.తప్పకుండా తెలుగుదేశం పార్టీ అధికారంలో వున్నప్పుడు ఆచరించి వున్నట్లయితే దేశం మొత్తంమీదనే అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచి వుండేది. కానీ కీర్తిశేషుడు నందమూరి తారకరామారావు తర్వాత వచ్చిన తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఆ విధాన ప్రకటనను నాటి నుండి నేటి వరకూ నిర్లక్ష్యం చెయ్యడమే కాదు, దానికి పూర్తి వ్యతిరేకంగా పని చేస్తూ వుంది. రాష్ట్ర విభజనకు దారి తీసిన అనేక కారణాలతో- ప్రజల భాషను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చెయ్యడం కూడా ఒకటి.

ఆ విధాన ప్రకటనలో ఇచ్చిన 10 సూత్రాల పథకమూ, దానికి వ్రాసిన ముందుమాటలూ శిలాక్షరాలు. "రాజ్యభాషగా పరిగణించబడి ప్రభుత్వంచే అధికారయుతంగా ఆదరింపబడని ఏ భాషా పరిపుష్టి చెందదు. వికసించదు. ప్రభుత్వ కార్యాలయాల్లో, కోర్టులలో, విద్యాలయాల్లో అన్ని స్థాయిలలో ఉపయోగపడగల విధంగా తెలుగుకు రాష్ట్రంలో స్థానం లేకుండా చేయటానికి, ప్రజావ్యతిరేకులైన పాలకవర్గాలవారు ఇంతకాలంగా సాగిస్తూ వచ్చిన మోసపూరిత విధానాలు యికముందు సాగనివ్వమని 'తెలుగు దేశం' పార్టీ తీవ్ర హెచ్చరిక చేస్తున్నది" అని ఆ విధాన ప్రకటనలో పేర్కొన్నారు. "ఆ పదిసూత్రాల పథకాన్ని తక్షణం అమలులోకి తీసుకురావటానికి తెలుగుదేశం తనను తాను సమర్పించుకొంటూ తెలుగురాష్ట్రంలో తెలుగుభాషకు అన్నింటా ప్రథమస్థానం లభింపజేయుటకు అవసరపడిన ఎట్టి త్యాగాలకయినా సంసిద్ధులుగా వుండాలని తెలుగు ప్రజలకు పిలుపు ఇచ్చింది" అని ఆ విధాన ప్రకటన పేర్కొంది. ఆ దశ సూత్రాలనూ నాటి నుండి నేటి వరకు చంద్రబాబుగారు అతి లౌక్యంగా నిర్లక్ష్యం చేశారు. పూర్తి విరుద్ధంగా పరిపాలన నడిపారు. (ఒక దారీ తెన్నూ లేని బాధ్యతా రహితమైన కాంగ్రెస్ పార్టీని గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది). 1982 నుంచీ జరిగిపోయిన 38 ఏళ్ళలో పరిస్థితులు ఎంత తలక్రిందులయ్యాయో గమనిస్తే- ఒక పార్టీగా తెలుగుదేశం పార్టీని, పాలకనేతగా చంద్రబాబుగారిని- ప్రజలు అభిశంసించాలనుకొంటే-అది తప్పు కాబోదు.

ఆ పది సూత్రాలనూ ఒక్కసారి పరిశీలిద్దాం...

1. సచివాలయం మొదలు, సమితి కార్యాలయం వరకు అన్ని స్థాయిలలో ప్రభుత్వ కార్యాలయాలన్నింటిలో తక్షణం తెలుగు ఏకైక అధికార భాషగా పరిగణించబడి తెలుగు భాషలోనే రాష్ట్ర ప్రభుత్వ పాలన సాగాలి.
2. దిగువ న్యాయస్థానాలు మొదలు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం వరకు అన్నిస్థాయిల్లో తెలుగు భాషలోనే కార్యకలాపాలు జరగాలి.
3. ప్రాథమిక పాఠశాలలు మొదలు, విశ్వవిద్యాలయాల వరకు అన్ని స్థాయిలలో తెలుగుభాషే బోధనా భాషగా గుర్తించబడాలి.
4. గవర్నరు పిల్లలు మొదలు శ్రామికుని బిడ్డల వరకు బాల బాలిక లందరికీ ఒకే విధమైన ఏక ప్రమాణ విద్యాభ్యాసం జరిగేవిధంగా విద్యావ్యవస్థను సంస్కరించాలి అంతేకాక తెలుగునాడులో తెలుగు భాష ఒక్కటి మాత్రమే తప్పనిసరిగా నేర్చుకోవలసిన భాషగా అమలు చేయాలి.

5. హిందీ, తమిళం, కన్నడం, మలయాళం లాంటి ఇతర భారతీయ ప్రజా భాషలుగాని, ఇంగ్లీషు, రష్యన్, జర్మన్, జపానీస్ లాంటి విదేశీ భాషలు గాని, నేర్చుకోదలచిన వారికి అవి ఐచ్ఛిక భాషలుగా బోధించ టానికి ఏర్పాట్లు జరగాలి.
6. తెలుగునాడులో వుండే తంతి తపాలా రైల్వేలాంటి ప్రజాజీవన సంబంధిత కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలలో కూడా తెలుగుభాషలోనే కార్యకలాపాలు జరగాలి.
7. తెలుగునాడులో వున్న పారిశ్రామిక, వ్యాపారసంస్థలు అవి ప్రభుత్వ సంస్థలయినా, ప్రయివేటు సంస్థలయినా – అన్నీ, తమ కార్యకలాపాలను తెలుగులోనే నిర్వహించాలి.
8. కేంద్రప్రభుత్వంలోను, ఇతర రాష్ట్ర ప్రభుత్వాలతోను రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర ప్రత్యుత్తరాల మేరకు మాత్రమే ఇంగ్లీషుభాష వాడకాన్ని పరిమితం చేయాలి.
9. తెలుగునాడులో భాషాపరమైన అల్ప సంఖ్యాక వర్గాలకు చెందిన వారు తమ పిల్లలకు తమ మాతృభాషలో విద్యాబోధన చేసుకునేందుకు సౌకర్యాలు కలుగచేయటంతోపాటు, తెలుగు నేర్చుకునే విధానం అమలు పరచాలి.
10. తెలుగునాడులో ఉర్దూ మాతృభాషగా గల ప్రజలు అసంఖ్యాకంగా వున్న కొన్ని ప్రాంతాలలో రాష్ట్ర ప్రభుత్వ కార్యకలాపాలలో ఉర్దూ భాషకు తగు ప్రాధాన్యత యివ్వబడాలి.

భాషారంగంలో ఈ దశసూత్ర పథకాన్ని తక్షణం అమలులో తీసుకొని రావటానికి తెలుగుదేశం తనను తాను అర్పించుకొంటూ, తెలుగు రాష్ట్రంలో తెలుగు భాషకు అన్నింటా ప్రథమస్థానం లభింపజేయుటకు, అవసరపడిన ఎట్టి త్యాగాలకయినా సంసిద్ధులుగా వుండాలని తెలుగు ప్రజలకు పిలుపు యిస్తున్నది.

ఈ ఆదర్శాలలో ఏ ఒక్క అంశంపైనైనా కించిత్తు కూడా ముందడుగు లేకుండా పూర్తిగా వెనుకముఖం పట్టించారు. ఇప్పటికీ అధినేత ఆలోచనా విధానం మారలేదు. ఎప్పటికప్పుడు చేసే వాగ్దానాలలోనే అసంబద్ధత, ఎప్పటికప్పుడు దాటవేసే ధోరణి తప్ప, నిబద్ధత లేదు.

కొత్త రాష్ట్రం ఏర్పడడాన్ని ఒక అవకాశంగా తీసుకొని, తెలుగు కోసం మనసు పెట్టి పని చేస్తున్నారా అంటే, అదీ లేదు. రాజధానికి శంకుస్థాపన నాటినుండి రోజూ విడుదల చేసే అనేక జి.వోల వరకూ– అన్నీ ఇంగ్లీషులోనే. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచీ, ముఖ్య కార్యదర్శి కార్యాలయం నుంచీ మార్పులు జరగకపోతే తక్కిన అధికారులు పట్టించుకొంటారా? తెలుగు విషయంలో ముఖ్యమంత్రి గారు చెప్పే మాటల మీద అధికారులెవ్వరికీ ఏ మాత్రం నమ్మకం లేదు. అందుకనే వారి పనిని వారు చేసుకుపోతుంటారు. మంత్రులకూ పట్టదు.

పైగా మరొక మహత్తరమైన సంగతేమిటంటే– కూచిపూడి నాట్యం కోసం చేసేదంతా భాషా సేవే వారి దృష్టిలో! సత్కారాలూ సన్మానాలూ, పూజలూ, పుష్కరాలూ ఇవన్నీ భాషా సేవలే వారి దృష్టిలో! అసలు భాష కోసం చెయ్యవలసినదేంటి అనే విషయంలో వారికి గాని, వారు నియమించే కమిటీల్లోని మంత్రులకు గానీ ఒక స్పష్టత లేదు. సాహిత్యం కోసం సాంస్కృతిక కార్యక్రమాల కోసం చేసే సహాయ సహకారాలను చూపుతూ, మరొకవైపు ప్రాథమిక విద్య స్థాయినుండే తెలుగుభాషను అణచివేస్తున్నారు. ఇందుకు తాజా ఉదాహరణ మునిసిపల్ మంత్రిత్వశాఖ తన నిర్వహణలో వున్న అన్ని పాఠశాలల్లోనూ తెలుగు బోధనకు స్వస్తి పలుకుతూ ప్రభుత్వ ఉత్తర్వులను ఇవ్వడమే. ఇదంతా ముఖ్యమంత్రి గారికి తెలియకుండానే జరుగుతుందనుకోవాలా?

రెండున్నరేళ్ళుగా తెలుగు మంత్రిత్వశాఖ ఏంచేస్తున్నది? భాష రక్షణకు, అమలుకు, అభివృద్ధికి –ఆ శాఖ ఏంచేసింది? సంజాయిషీ చెప్పాలి. ఇప్పుడు నిర్మాణం చేస్తామంటున్న ప్రాధికార సంఘాన్ని ఎలా రూపొందించబోతున్నారు? దాన్నీ రాజకీయం చేసి, తాబేదారులతో నింపుతారా? నిపుణులకు, నిబద్ధత గల అనుభవజ్ఞులకు బాధ్యతలనిస్తారా?

నేటి రాష్ట్రమంత్రివర్గంలోగానీ, తెలుగుదేశంపార్టీలో గానీ చంద్రబాబుగారితో సన్నిహితంగా మాట్లాడి, విషయాలను విపులీకరించే ధైర్యం చేయగల వారెవరైనా వున్నారా? ఆయన సమున్నత వ్యక్తిత్వం– ఎవరికీ అందరాని స్థాయికి–ఆయన్ని చేర్చింది. అందువల్లనే ప్రతి అంశానికీ ఆయనే బాధ్యులవుతున్నారు. కనుక–తెలుగుదేశం స్థాపన సందర్భగా (1982లో) ప్రకటించిన భాషావిధానాన్ని ఎందుకు నీరుగార్చారో, తమకు తామే సమీక్షించుకొని, ఇప్పటికైనా తమ భాషా విధానాన్ని మళ్ళీ ముఖ్యమంత్రిగారు స్పష్టంగా ప్రకటించాలి. దాన్ని అమలులో పెట్టడానికి రెండేళ్ళ ప్రణాళికను ప్రకటించాలి. ఎన్నికల ముందు దాన్ని సమీక్షకు పెట్టాలి. ప్రజల ముందు ఆ అంశంపై ఎన్నికల సందర్భంగా మాట్లాడాలి.

మనసులో లేకుండా ఉత్తుత్తి ప్రకటనలు చేయడం, దాటవేత ధోరణులు– ఇక చెల్లవు. రానున్న ఎన్నికల్లో దీన్ని చర్చకు వచ్చే అంశంగా ఉద్యమకారులు గానీ, రాజకీయ నాయకులు గానీ ముందుకు తెస్తే అది వారి తప్పు కాదు కదా!

31-03-2017

సామల రమేష్‌బాబు

# మాతృభాషా మాధ్యమంకోసం సాగుతున్న ఉద్యమం

ఫిబ్రవరి 19న విజయవాడలో విజయవంతంగా జరిగిన సత్యాగ్రహం, నిరాహారదీక్షలు ప్రభుత్వ పెద్దలలో, ప్రజల్లో కొంత కదలికను కలిగించింది. రాష్ట్రమంతా అనేక వేదికలమీద ఆలోచనాపరుల మధ్య చర్చలకు దారితీసింది.

విశాఖపట్టణంలో ఉంటున్న మాజీ ఐ.ఎ.ఎస్.అధికారి, పర్యావరణోద్యమ కారుడు శ్రీ ఇ.ఎ.ఎస్.శర్మ తమంతట తాముగా చొరవ తీసుకొని మార్చి 8న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబునాయుడుగారికి లేఖ వ్రాశారు. దానికి సమాధానం లేకపోవడంతో మరల 24వ తేదీన లేఖ వ్రాశారు. రెండు లేఖల్ని ఈ ప్రక్కన ప్రచురిస్తున్నాము.

ఆ వెంటనే 25న విశాఖపట్టణంలో సమైక్యభారతి – ప్రజాస్పందనల ఆధ్వర్యంలో 'విద్యాహక్కు చట్టం–పాఠశాలల్లో ఆంగ్లమీడియం' అనే అంశంపై సదస్సు జరిగింది. ఆ సదస్సు ఫొటో, వార్తను ఇక్కడ ఇస్తున్నాం. ఆ సదస్సులో ఇ.ఎ.ఎస్.శర్మగారితోపాటు, విద్యాహక్కుచట్టంపై ప్రత్యేకంగా పనిచేస్తున్న శ్రీ నరవ ప్రకాశరావు, మాజీ ఐ.ఇ.ఎస్.అధికారి, విశాఖపెద్ద శ్రీసి.ఎస్.రావు ప్రభృతులు ఆ అంశంపై కూలంకషంగా చర్చించారు. ఇది రెండు తెలుగు రాష్ట్రాలకే కాక, అన్ని రాష్ట్రాలకూ సంబంధించిన సమస్య అని, పెద్దఎత్తున అన్నివిధాలుగా ఉద్యమించాల్సిన అవసరముందనీ, ప్రభుత్వ విధానాలను ప్రభావితం చెయ్యవలసిన అవసరముందనీ పెద్దలు అభిప్రాయపడ్డారు. న్యాయస్థానాలద్వారాకూడా పోరాడాల్సిన అవసరాలగురించి కూడా చర్చించారు.

ఇది ఇలా ఉండగా, మాతృభాషామాధ్యమ వేదిక సారథ్యసంఘ సభ్యులు విజయవాడలో రెండుసార్లు సమావేశమై మున్ముందు చేపట్టవలసిన కార్యక్రమాన్ని నిర్ణయించారు. అన్ని స్థాయిలలో ఉద్యమాన్ని ముందుకు నడపాలని నిర్ణయించారు. దీనిని భావోద్వేగ అంశంగాగాక, హేతుబద్ధమైన, శాస్త్రీయమైన అంశంగా సమాజంలోని అందరకూ మేలుజరిగే అంశంగా, పిల్లలకు అత్యుత్తమమైన విజ్ఞానాన్ని అందించే సరియైన సాధనంగా మాతృభాషామాధ్యమాన్ని ప్రచారం చెయ్యాలని సారథ్యసంఘం నిర్ణయించింది.

## ప్రభుత్వ ఉత్తర్వు 14/2-1-2017ను వెంటనే వెనక్కి తీసుకోవాలి.
## ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రికి పూర్వ ప్రభుత్వ కార్యదర్శి శ్రీ ఇ.ఎ.ఎస్.శర్మ లేఖ

ఈ అ స శర్మ, (మొబైలు: 9866021646)
14-40-4/1, గోఖలే వీధి,
మహారాణిపేట, విశాఖపట్నం- 530002.
8-3-2017.

గౌరవనీయులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి

అయ్యా,

తెలుగు దేశం పార్టీ సంస్థాపకులు, పూర్వ ముఖ్య మంత్రి, కీ. శే. నందమూరి తారక రామారావు గారు తెలుగు భాషకు ఇచ్చిన ప్రాముఖ్యత గురించి మీకు బాగా తెలుసు. ఆ విషయం తెలుగు ప్రజానీకానికి కూడా తెలుసు. ఆయిన తెలుగు భాష విషయంలో ఇచ్చిన పారదర్శకత తెలుగు ప్రజలకు గర్వ కారణం అయింది.

ఏ జాతిలోనయినా, ప్రజలకు వారి భాష గురించి, వారి సంస్కృతి గురించి పూర్తి అవగాహన ఉన్నప్పుడే, వారి ఆత్మాభిమానం, ఆత్మ గౌరవం బలపడతాయి. అటువంటి ఆత్మ గౌరవం ఎప్పుడు ఉంటుందో, అప్పుడే వారు అభివృద్ధి చెందగలరు. మాతృభాషగురించి అవగాహన ఉన్నప్పుడే, ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు, అవసరమైతే, మిగిలిన భాషలను సులభంగా నేర్చుకొని, వారి వారి వృత్తులను ఆయా భాషలలో ధైర్యంగా నిపుణతతో నిర్వహించగలరు. ఈ విషయం ప్రపంచ వ్యాప్తంగా గుర్తించబడింది. అందువలనే, అభివృద్ధి చెందిన దేశాలలో వారి వారి మాతృభాషలకు ప్రాముఖ్యమివ్వడమే కాకుండా, ఆయా భాషలను పాఠశాలలలో, విశ్వ విద్యాలయాలలో బోధనామాధ్యమంగా ఉపయోగిస్తారు.

మీరు ముఖ్యంగా గమనించవలసిన విషయం, పసిపిల్లలకు మాతృభాషలో బోధిస్తే కలిగే మనోవికాసం ఇంకొక భాషలో బోధిస్తే రాదు.

ఈ నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం జనవరి 2వ తారీఖున, GO 14 ద్వారా ప్రభుత్వ పాఠశాలలలో, ముఖ్యంగా మ్యునిసిపల్ పాఠశాలలలో, మొత్తం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత స్థాయిలలో మాతృభాషా మాధ్యమాన్ని పూర్తిగా ఎత్తి వేసి, ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశ పెడుతున్నట్లు ఉత్తరువులు ఇవ్వడం తెలుగు ప్రజలను ఆశ్చర్యానికి, అత్యంత ఆవేదనకు గురి చేశాయి. అటువంటి ఉత్తరువులను ప్రభుత్వం కార్పొరేటు విద్యా సంస్థల ఒత్తిడికి లొంగి ఇచ్చిందేమో అనే సందేహం ప్రజలకు కలగడం సహజం.

ఒక విధంగా అటువంటి ఉత్తరువులను ఇవ్వడం, నందమూరి తారక రామారావుగారి ఆశయాలకు విరుద్ధంగా, తెలుగు మాట్లాడే కోట్లాది రాష్ట్ర ప్రజల భావాలకు విరుద్ధంగా, మన రాష్ట్రంలో విస్తృత మాతృభాష అయిన తెలుగుభాష భవిష్యత్తుకే తిలోదకాలు ఇచ్చినట్లు

అవుతుంది. అది ఎంతవరకు సమంజసం, ప్రజాహితం?

ఇటువంటి విషయాలలో ప్రభుత్వం నిరంకుశత్వంగా నిర్ణయాలను తీసుకోకుండా, అన్ని రాజకీయ పార్టీలతో, ప్రజల మధ్య సంప్రదించి ఉండవలసింది. విద్యారంగంలో బోధన విధానాలను కూలంకషంగా అధ్యయనం చేసిన నిపుణుల, మేధావుల సలహాలను తీసుకోవలసింది. ఈ నిర్ణయం వలన విద్యారంగం మీద వచ్చే పరిణామాలు ఇప్పుడు ఉన్న కోట్లమంది ప్రజలమీదే కాకుండా, భవిష్యత్తరాల మీద కూడా ఉంటాయి.

ఈ విషయాలను దృష్టిలో పెట్టుకొని, మీరు తక్షణమే ఈ ఉత్తరువులను వెనక్కి తీసుకోవాలని నా విజ్ఞప్తి.

మ్యునిసిపల్ పాఠశాలలలో బోధనా విధానాలను మెరుగు పరచాలంటే ప్రభుత్వం నిర్వర్తించ వలసిన విధులు ఎన్నో ఉన్నాయి. అమరావతి రాజధాని వంటి పథకాల మీద దుబారాగా ఖర్చు చేస్తున్న ప్రజా ధనంలో కొంత శాతం మ్యునిసిపల్ పాఠశాలల అభివృద్ధి కార్యక్రమాలకు తరలించాలి. ఉదాహరణకు, మ్యునిసిపల్ పాఠశాలలలో కనీస సౌకర్యాలను, అంటే సురక్షితమైన భవనాలను నిర్మించడం, పోషక ఆహార సౌకర్యాన్ని, మంచి నీటి సదుపాయాన్ని కలుగచేయడం, విద్యార్థులకు విద్యార్థినులకు కావలిసిన పరిశుభ్రమైన శౌచాలయాలను కల్పించడం, మంచి గ్రంథాలయాలను, లాబొరేటరీలను, ఇంటర్నెట్, కంప్యూటర్ సౌకర్యాలను కలుగ చేయడం, ఉపాధ్యాయుల అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం, వారి వృత్తికి గౌరవం కలిగించే ఇతర పథకాలను చేపట్టడం.

మీరు, పైన నేను సూచించిన సలహాలను రాష్ట్ర ప్రజల ఉద్దేశాలకు అనుగుణంగా, తక్షణమే అమలు చేస్తారని ఆశిస్తున్నాను.

ఈ అ స శర్మ

# ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గారికి రెండవ లేఖ (మార్చి 24న)

గౌరవనీయులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి
అయ్యా,

ఈ నెల 8వ తారీఖున, ఈ విషయంమీద మీకు ఒక లేఖను పంపించాను. ఒక వేళ, ఆ లేఖను మీరు చదివి ఉండకపోతే, ఆ లేఖ నకలును ఇక్కడ జతపరుస్తున్నాను.

ముందు లేఖలో నేను, కీ. శే. నందమూరి తారకరామారావు గారు తెలుగు భాషకు ఇచ్చిన ప్రాముఖ్యత గురించి, మీ ప్రభుత్వం రెండు నెలలక్రితం GO 14 ద్వారా మునిసిపల్ పాఠ శాలలలో తెలుగు బదులు ఇంగ్లిష్ భాషను బోధనామాధ్యమంగా ప్రవేశపెట్టడం వలన తెలుగు ప్రజానీకానికి శాశ్వతంగా కలిగే నష్టం గురించి మీ దృష్టికి తెచ్చాను. ఇంతవరకు నా లేఖపై మీరు స్పందించకపోవడం చాలా ఆశ్చర్యకరం. అందుకు కారణం బహుశా కార్పొరేటు వ్యవస్థలు మీ ప్రభుత్వం మీద ఒత్తిడి పెడుతున్నాయేమో.

GO 14 (తారీఖు 2-1-2017) వలన, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యారంగం మీద, విద్యార్థులమీద అపారమైన వ్యతిరేక ప్రభావం ఉంటుంది అనడం అతిశయోక్తి కాదు.

మాతృ భాషలో ప్రాథమిక పాఠశాలలలో బోధిస్తే, పిల్లలకు ఆత్మ విశ్వాసము, ఆత్మ గౌరవము కలగడమే కాకుండా, విద్యలో వారికి ఆసక్తి కలిగి పురోగతిని సాధించే అవకాశం ఉంటుంది. మాతృభాషలో పునాది బలంగా ఉంటే, వారు మిగిలిన భాషలను సునాయాసంగా నేర్చుకోగలరు. పైగా, బోధనా మాధ్యమాన్ని మార్చడం బదులు, మీ ప్రభుత్వం విద్యారంగంలో తేవలసిన మార్పులు ఎన్నో ఉన్నాయి. బోధనా విధానాలను మెరుగు చెయ్యాలి. ఉపాధ్యాయులకు, విద్యార్థులకు సౌకర్యాలను పెంపొందించాలి. పాఠశాలలలో పరిసర పారిశుధ్యం, టాయిలెట్లు వంటి సౌకర్యాలను కలిగించాలి. మంచి గ్రంథాలయాలను నెలకొల్పాలి.

నా ఉద్దేశంలో, GO 14 రాజ్యాంగము దృష్ట్యా, విద్యాహక్కుల చట్టం దృష్ట్యా చెల్లదు.

రాజ్యాంగంలో 29వ ఆర్టికల్ ప్రకారం, పిల్లలకు వారి వారి మాతృభాషలలోనే పాఠశాలలలో బోధన పొందే హక్కు ఉంది. అందుకు అనుగుణంగా, విద్యా హక్కుల చట్టం 29(2)(ఎఫ్) సెక్షను ప్రకారం పాఠశాలలలో బోధన మాతృభాషలోనే ఉండాలని స్పష్టంగా నిర్ణయించబడింది. కొన్ని రోజుల క్రితం, సుప్రీం కోర్టు వారు, పాఠశాలలలో విద్యార్థులకు బోధనా మాధ్యంగా ఏ భాష కావాలో ఆ భాషలోనే బోధించాలని ఉత్తరువులు ఇచ్చారు. అంటే, బలవంతంగా ఇంగ్లిష్ భాషను బోధనామాధ్యమంగా ప్రవేశపెట్టే హక్కు ప్రభుత్వానికి లేదు.

ఈ విషయాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం GO 14 ను తక్షణం ఉపసంహరించుకోవాలని నా విజ్ఞప్తి.

అటువంటి చర్య తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైతే, తెలుగు ప్రజలు కోర్టులను ఆశ్రయించవలసి వస్తుంది.

విశాఖపట్నం
24-3-2017

అమ్మనుడిపై నెనరు లేనివాడు కన్నతల్లినీ, పుట్టిన నేలనీ ప్రేమించలేడు..
శిశువు శారీరక వికాసానికి తల్లిపాలు మానసిక వికాసానికి తల్లి భాష

# విశాఖపట్టణంలో 'విద్యాహక్కు చట్టం– పాఠశాలల్లో ఆంగ్లమీడియం' పై సదస్సు

## జీ.వో.నెం.14ను రద్దు చేయాలని డిమాండ్




ఎడమనుండి : పి.మణి, కన్నయ్య, రాజాచినబాబు, సి.ఎస్.రావు, ఇ.ఎ.ఎస్.శర్మ , నరవ ప్రకాశరావు



ప్రసంగిస్తున్న ఇ.ఎ.ఎస్.శర్మ

ప్రజాస్పందన, సమైక్యభారతి సంయుక్తంగా శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 'విద్యాహక్కు చట్టం– పాఠశాల్లో ఆంగ్లమీడియం' అను అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఐ.ఎ.ఎస్.అధికారి ఇ.ఎ.ఎస్.శర్మ మాట్లాడుతూ బోధన మాధ్యమం మార్చడంకంటే, బోధన విధానంలో మార్పు వచ్చినపుడే పురోగతి సాధ్యమన్నారు. మాతృభాషకు ప్రాధాన్యం ఇవ్వాలని రాజ్యాంగం చెబుతున్నా పాలకులు ఇష్టారాజ్యంగా ప్రజాభిప్రాయంతో సంబంధం లేకుండా ఆంగ్లమాధ్యమాన్ని ప్రవేశపెట్టడం సరికాదన్నారు. బోధన తెలుగులో ఉంటే విద్యార్థుల్లో ప్రగతి సాధ్యమవుతుందని అన్నారు. ప్రశ్నించే తత్వాన్ని విద్యార్థుల్లో పెంపొందించాలని, మాతృభాషలో బోధనవల్ల ప్రశ్నించే ధైర్యం వస్తుందన్నారు. పాఠశాలల్లో కనీస సదుపాయాలు కల్పించకుండా ఆంగ్లభాషలో బోధనవల్ల ఒరిగేదేమీ లేదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమంలో బోధన చేపట్టాలని ప్రభుత్వం విడుదల చేసిన జి.వొ.నంబరు 14ను రద్దు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, ఇది ప్రజా ఉద్యమంతో సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాస్పందన అధ్యక్షుడు సి.ఎస్.రావు, సమైక్య భారతి కన్వీనర్ పి.కన్నయ్య, రాజా చినబాబు, విద్యాహక్కురక్షణ ఉద్యమకారుడు నరవ ప్రకాశరావు, సింహాద్రప్పడు, పి.మణి పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు తెలుగుభాషకు ప్రపంచస్థాయి గుర్తింపుతేగా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధోగతి పట్టిస్తున్నారని పలువురు వారు మండిపడ్డారు.



# విద్యావంతులైన తల్లిదండ్రుల అలోచనా విధానంలో మార్పు రావాలి

-డా॥గారపాటి

తెలుగువారి ఆలోచనా విధానంలో మార్పు ఎప్పుడు వస్తుంది? ఎప్పుడు వస్తుందనే ప్రశ్న కంటే ఎలా వస్తుంది అనేదే ముఖ్యం.

ఇట్లాంటి బానిస సమాజంలో పుట్టిపెరిగిన పిల్లలకు ఎలాంటి అవగాహనా ఉండదు. ఈ అవగాహనను కలిగించాల్సింది తల్లిదండ్రులే. అందుకని తల్లిదండ్రులే ముందుగా ఈ బానిసత్వంనుండి బయటపడాలి. దానికోసం మాతృభాషా మాధ్యమాన్ని చట్టపరిధిలోకి తెచ్చేటట్లు కృషిచేయాలి. ఎవరికివారు తెలుగు వాడకాన్ని ప్రోత్సహించాలి. తెలుగురాష్ట్రాలలో తెలుగే మాట్లాడుదామని నిర్ణయం తీసుకోవాలి.

జనాభాలో ప్రపంచంలో 15 దేశాలే మనకంటే పెద్దవి కాగా, విస్తీర్ణంలో షుమారు 120 దేశాలు తెలుగు రాష్ట్రాలకంటే చిన్నవి. కోట్లకొద్దిగా వున్న తెలుగు జనం భాషను మార్చుకోడం అంటే ఏమిటో ఊహించగలరా?

షుమారు రెండుకోట్లమంది విద్యార్థులు ఇంగ్లీషు మీడియంలోకి మళ్లడమంటే ఏమిటో ఊహించగలమా? ఈ యేడు ఇంగ్లీషు మీడియం మొదలుపెడితే 15 యేండ్లకి మొదటి బ్యాచీ బయటికి వస్తుంది ప్రస్తుత అంచనాల ప్రకారం మూడింట రెండింతలు తప్పడమో మధ్యలో విద్యను వదిలిపోవడమో జరుగుతోంది. ఇప్పుడు ఇంగ్లీషు మీడియంలో చదివిన ఒక కొత్తరకం జనాన్ని తయారు చేస్తున్నాం. వీళ్లకీ మిగిలినవాళ్లకీ మధ్య మాటల్లోనూ, చేతల్లోనూ, నడవడికలోనూ, దేశంపట్లా, జనంపట్లా అభిప్రాయాలకూ, విశ్వాసాలకూ, నమ్మకాలకూ ఎక్కడా పొంతన ఉండదు. ఇది వారిమధ్య సంఘర్షణకు దారి తీస్తుంది. ఈ సంఘర్షణలు ఇంటా బయటా ప్రతిచోటా ఉంటాయి. ఇది మారి మామూలు కాలం రావడానికి అంటే అందరూ ఇంగ్లీషుకు మళ్లడానికి పట్టే కాలం షుమారు 150 యేళ్లు. ఆలోచించండి. ఈ లోపల ఈ ఘర్షణలు అనేక ఘోరాలూ నేరాలకు దారితీస్తాయి.

ఇట్లా మాతృభాషను మార్చుకోవలసిరావడాన్ని తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనగా చూడాలి. దీన్ని విద్యా హక్కు ఉల్లంఘనగా పరిగణించాలి. (Magga et al, 2005;. Tomaševski 2000; http://www.right-to-education.org/content/primers/rtem3.pdf). ఇది ఐరాస నిర్వచనాల ప్రకారం భాషాపరమైన జీవ విధ్వంసానికి దారితీస్తుంది (Dunbar & Skutnabb-Kangas 2008).

ప్రస్తుతం 10వ క్లాసు పరీక్షకు కూచొని పాసైనవారు 88% వరకూ ఉంటే, ఇంటర్మీడియేట్ పరీక్షకు కూచొని పాసైనవారు 70% వరకూ మాత్రమే ఉన్నారు. అంటే 10వ తరగతికీ ఇంటర్మీడియేటుకూ పాసయ్యేవారిలో లోటు 18%. దీన్ని ఎలా అర్థం చేసుకోవాలి. ఇంకా, మన పిల్లల పాఠశాల విద్యలో డ్రాపౌట్లు (బడిమానేసినవారు) 5వ తరగతివరకు 12% ఉంటే 8వ తరగతికి వచ్చేటప్పటికి 25% కాగా, 10 వ తరగతికి 32% ఔతోంది. ఎందుకో గమనించారా? ఈ మూడంచెలలో కొంతమంది ఇంగ్లీషు మీడియంకి బదిలీ అవడమే ప్రధాన కారణం. ఇక ఇంటర్లో పాస్ 70% అంటే 30% మంది చదువు మానేస్తున్నట్లే. దీనికి ప్రధానకారణం 10వ తరగతిలో తెలుగులో చదివినవాళ్ళు ఇంటర్లో ఇంగ్లీషుకు మళ్లడమే. అంటే వీటిని ఎట్లా అర్థం చేసుకోవాలి. అంచెలంచెలుగా మాధ్యమం మారినప్పుడల్లా 10% విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారు. ఇప్పటికే అరకొరగా ఉన్న ఇంగ్లీషు మాధ్యమం మన పిల్లల్ని విద్యకు దూరం చేస్తోంది. ఇక రేపటి విద్యా విధానంలో పూర్తిగా ఇంగ్లీషుకు మారితే జరిగే వినాశనం, అనర్థం ఊహించరానిది. ఇప్పుడు మూడింట ఒక వంతు విద్యకు దూరమైతే రేపు కనీసంగా రెండింతలు దూరమౌతారు. ఇదేనా మనం కోరుకున్న విద్యా విధానం? ఈ నష్టానికి బాధ్యత ఎవరు వహిస్తారు? ముప్పై శాతంమంది చదువు మానేస్తుంటే ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలు దానికి అడ్డుకట్టవేయకుండా ఏంచేస్తున్నట్లు? ఇది పూర్తిగా ప్రభుత్వాల నిష్క్రియాపరత్వమే.

చరిత్ర పుటల్ని తిరగవేస్తే బలవంతులు బలహీనుల్ని లొంగదీసుకోడానికి వాడిన మొదటి ఆయుధం భాషే. స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు పోగొట్టుకున్న మనిషికి మిగిలేది భాషా బానిసత్వమే.

అందుకు ఏం చెయ్యాలి? ఉద్యమించాలి. ఈ బానిస విద్యా విధానాన్ని నిరసించాలి. మనదేశం స్వయం సమృద్ధి సాధించాలంటే మన పిల్లలు మాతృభాషలో చదువుకోవాలి. ఇంగ్లీషును ప్రత్యేక విషయంగా ఎంచుకొని చదవాలి. దీనికి మాతృభాషా చట్టం చేయాలి. మాతృభాషలో విద్యను అందించని విద్యా యాజమాన్యాలు మన విద్యా హక్కును అతిక్రమిస్తున్నాయి. ఇది ప్రాథమిక హక్కును కాలరాయడమే. ఇది భాషా విధ్వంసానికీ జాతి విధ్వంసానికీ దారితీస్తుంది. ఇది సాంస్కృతిక వైవిధ్యాన్ని ధ్వంసంచేయటమే. విద్యా విషయం సాంస్కృతికపరంగా సముచితమైనదీ, వివక్షారహితమైనదిగానూ ఉండాలి. విద్య స్థానీయ నిర్దిష్ట అవసరాలకూ సందర్భాలకూ తగినట్లుగా ఉండాలి. ◆

బోధనా మాధ్యమం-చర్చ

-ఆచార్య కస్తూరి విశ్వనాథం
9480770557

# తెలుగు రాష్ట్రాలలో పాఠశాల విద్యామాధ్యమం- పూర్వాపరాలు

పాఠశాలలలో భాషలను బోధించడటమనేది చాలా పాత విషయమే. భారత దేశభాషల ప్రాచీనత, సమృద్ధ సాహిత్యము, ప్రాచీన వారసత్వ సంపదలను పరిరక్షించుకోవటము, సమృద్ధపరచుకోవటము గురించి ప్రజల, ప్రజానాయకుల, పండితుల మనస్సులలో ఆందోళన కలిగింది. 1949 నవంబరు 26వ తేదీన భారత రాజ్యాంగం ఆమోదింపబడింది. కాని, అంతకుముందే ఈ ఆందోళన ప్రజల, నాయకుల మనసుల్లో ఉండింది. భారత జాతీయ కాంగ్రెస్ (Indian National Congress) తమ 1949 ఆగస్టు 5వ తేదీన జరిగిన తమ కార్యనిర్వాహక కమిటీ తీర్మానంలో ఈ క్రింది విధంగా తీర్మానించారు. "ప్రాంతాలు లేక రాష్ట్రాలుగా ఉన్న ప్రదేశాలలో ఒకటి కంటె ఎక్కువ భాషలు మాతృభాషలుగా మాట్లాడబడుతున్నాయి. వీటిలో చాలా భాషలు సుసంపన్నము, అమూల్యము అయిన స్వంత సాహిత్యాలను కలిగి ఉన్నాయి. వాటిని పరిరక్షించటము, సమృద్ధి పరచటములో ఎటువంటి ఆటంకము కలుగకూడదు" అని నిశ్చయించారు. ఇది ఆనాటి ప్రజల, స్వాతంత్ర్య సమరయోధుల, ప్రజానాయకుల, పండితుల అభిలాష.

"దేశాన్ని సమైక్యంగా ఉంచటం కోసం ఆ భాషలలో కొన్నింటినైనా పరిపాలనకు, విద్యా బోధనానికి సమర్థవంతమైన వాటినిగా అభివృద్ధి చేయవలసిన అవసరమున్నది" అని కూడ వాళ్ళు అభిప్రాయపడినారు. ఈ అభిప్రాయం వల్ల VIIIవ షెడ్యూలును, XVIII వ విభాగంలోని IIవ చాప్టరును పొందుపరిచారు. "బాలలు ఇతరభాషల ద్వారా కన్నా మాతృభాష- అంటే తల్లిదండ్రులో, సంరక్షకులో అట్లా నిర్ణయించిన భాష- ద్వారానే సులభంగాను, సమర్థవంతంగాను నేర్చుకోగలరని, అందుచేత మాతృభాష- తల్లిదండ్రుల సంరక్షణలో మాతృభాషగా ప్రకటించినభాష- ద్వారానే విద్యాబోధన జరగాలి. ఆ భాష సాధారణంగా వాళ్ళు నివసించే ప్రాంతపు లేక రాష్ట్రపు భాష అయి ఉండాలి" అని కూడా వాళ్ళు నిర్ణయించారు.

1949 ఆగస్టులో జరిగిన ప్రాదేశిక విద్యామంత్రుల సదస్సులో ఈ అభిప్రాయాన్ని విశదీకరించి అంగీకరించారు. దాన్ని కేంద్ర మాధ్యమిక విద్యా సలహా మండలి (Central Board of Secondary education), భారత ప్రభుత్వము ఆమోదించాయి. దాని ప్రకారం "ప్రాథమిక స్థాయిలో (Junior basic state)లో బోధన భాష, పిల్లల మాతృభాష కావటమే కాక పరీక్షలు కూడ ఆ భాషలోనే ఉండాలి. మాతృభాష రాష్ట్రభాష ఒకటే కానప్పుడు, ఒక తరగతిలో 10మంది లేక మొత్తం బడిలో 40, అంతకన్నా యెక్కువమంది పిల్లలు ఒకే భాష మాట్లాడే వాళ్ళున్నప్పుడు, వాళ్ళకా భాషను బోధించటానికి కనీసం ఒక ఉపాధ్యాయుడిని నియమించాలి.

ఇక్కడ మాతృభాష, తల్లిదండ్రులో లేక సంరక్షకుడో అట్లా ప్రకటించిన భాషే మాతృభాషకు భిన్నమైనప్పుడు దాన్ని 3వ తరగతికి ముందుగాని, ప్రాథమిక స్థాయి తర్వాతగాని ప్రవేశ పెట్టకూడదు. మాతృభాషనుంచి ప్రాంతీయ భాషకు సులభంగా మారటంకోసం ప్రాథమికస్థాయి తర్వాత మొదటి రెండు సంవత్సరాలు మాధ్యమ (medium) భాషా ప్రశ్నలకు జవాబులు మాతృభాషలోనే వ్రాసే సదుపాయం కలిగించాలి". ఈ నిర్ణయం మాతృభాషలో ప్రాథమిక విద్యాబోధనానికి సంబంధించిన రాజ్యాంగపు 9వ సవరణకు కారణమై, రాజ్యాంగంలోని 350 ఎ నిబంధనను చేర్చటానికి దారితీసింది. ఈ నిబంధన (350A) "రాష్ట్రంలోని అల్పసంఖ్యాక వర్గాల పిల్లలకు ప్రాథమికస్థాయిలో వారివారి మాతృభాషలలో విద్యాబోధన సదుపాయాలను కలిగించటం ఆయా రాష్ట్ర ప్రభుత్వాల, స్థానిక సంస్థల బాధ్యత. ఆయా సదుపాయాలను కలిగించు విషయంలో రాష్ట్రాలకు స్థానిక సంస్థలకు దేశాధ్యక్షుడు తగు ఆదేశాలను జారీ చేయవచ్చు" (It shall be the endevour of every local authority within the state to provide adequate facilities for instruction in the mother tongue at the primary stage of education to children belonging to linguistic minority groups, and the president may issue such directions to any state as he considers necessary or propose securing the provisions of such facilities).

తర్వాత ప్రాంతీయ విద్యామంత్రుల సదస్సు తీర్మానం చాలా సమావేశాలు, కమిటీలు, విద్యావేత్తలు, సంస్థలు అంగీకరించి సిఫారసు చేయబడింది. స్థూలంగా ఈ అన్ని సంస్థల, సమావేశాల, వ్యక్తుల సూచనల కనుగుణంగా పాఠశాలలలో మూడు భాషలను బోధించాలనే త్రిభాషా సూత్రముద్భవించింది. ఈ త్రిభాషా సూత్రాన్ని ఎన్నో మార్పులు చేర్పులు చెందిన తర్వాత వరకు జాతీయ విద్యావిధానం (1968) అంగీకరించి ఈ క్రింది విధంగా సిఫారసు చేసింది.

1) హిందీ మాట్లాడే రాష్ట్రాలలో- హిందీ, ఆంగ్లం, ఒక హిందీతర భాష (ముఖ్యంగా ఒక దక్షిణ దేశభాష)ను

2) హిందీతర భాషలు మాట్లాడే రాష్ట్రాలలో- హిందీ, ఆంగ్లం, ఒక ప్రాంతీయ భాషను పాఠశాల స్థాయిలో బోధించాలి.

రాజ్యాంగంలోని 343, 345, 351 నిబంధనలకు (Articles)ను దృష్టిలో ఉంచుకొని, 1961 ఆగస్టు 10, 11,12లలో జరిగిన ముఖ్యమంత్రుల, కేంద్రమంత్రుల సమావేశంలో తీసుకొన్న నిర్ణయాలు గమనించదగినవి.

ఈ కమిటి రిపోర్టులోని 6,7 పేరాలలో ఆంగ్లభాషాధ్యయనం యొక్క ప్రాముఖ్యతను గుర్తిస్తూ దాన్ని దిగువస్థాయిలోనే పిల్లలకు నేర్పించాలని సూచించింది 9వ పేరాలో త్రిభాషా సూత్రాన్ని అమలు చేయాలని కూడ సూచించింది.

తర్వాత జాతీయ సమైక్యతా సదస్సు (National integration committee)- సెప్టెంబరు 1961, తమ నివేదికలోని 9,11,12 పేరాలలో మూడు భాషలను- ప్రాంతీయ భాష, హిందీ, ఇంగ్లీషు-

నేర్చుకోవటం అవసరమని గుర్తిస్తూ ముఖ్యమంత్రుల సమావేశం సిఫారసు చేసిన త్రిభాషా సూత్రాన్ని సమర్థించింది. **కేంద్రప్రభుత్వం నియమించిన అన్ని కమీషన్లు, జరిపిన సమావేశాల నిర్ణయం ప్రాథమిక విద్యా విషయంలో ఒక్కటే- అది మాతృభాష/ ప్రాంతీయభాష బోధన భాషగా ఉండాలి** అనేది.

1977లో వెలువడిన విద్యా సాంస్కృతిక మంత్రిత్వశాఖ వారి The report of the review committee on the cirriculum for the ten year school ఈ క్రింది విధంగా సిఫారసు చేసింది.

మొదటి భాష: 1నుంచి 4 తరగతుల దాకా ప్రాథమిక భాషలేక ప్రాంతీయభాష ఉండాలి.

రెండవ భాష: 5 / 6 తరగతులలో (మాధ్యమిక) ప్రారంభించబడి మొదటి మొదటి భాషతోపాటు 10వ తరగతి దాకా బోధింపబడాలి.

మూడవభాష: 8వ తరగతి నుంచి (ఉన్నత) నుంచి మొదటి రెండవ భాషలతో పాటు 10వ తరగతిదాకా బోధింపబడాలి.

అంతేకాక, ఏ భాషకెంత సమయం కేటాయించవలసింది కూడ నిర్ణయింపబడింది.

ప్రాథమిక స్థాయిలో మొదటిభాష మాత్రమే రోజుకు 2 1/2-3 గంటలకు మించకుండా బోధింపబడాలి. మాధ్యమిక స్థాయిలో- అంటే 5/6 తరగతులనుంచి 7/ 8 తరగతుల దాకా వారానికి ఉన్న 32 గంటల బోధన సమయంలో 7 గంటలు (22శాతం), ఉన్నత స్థాయిలో 32 గంటలలో వారానికి 8 గంటలు (25శాతం) మాత్రమే భాషా బోధనానికి వినియోగించాలి.

1962లో భారత ప్రభుత్వపు విద్యాశాఖ వెలువరించిన Report of the committee on emotional integration (కొఠారి కమిషను) నివేదిక దాదాపు ఇటువంటి అభిప్రాయాన్నే ప్రకటించింది. దాని ప్రకారం-

1 నుంచి 5వ తరగతి దాకా (ప్రాథమిక) స్థాయిలో వారంలోని మొత్తం బోధనసమయంలో 25 శాతము,

6 నుంచి 8 దాకా మొదటి భాష: 5 గం. 20 నిమిషాలు- అంటే ఎనిమిది, 40 నిమిషాల పిరియడ్లు.

రెండవ భాష: 3 గం. 20 నిమిషాలు- అంటే అయిదు, 40 నిమిషాల పిరియడ్లు

9 నుంచి 10 దాకా మొదటిభాష: 4 గంటలు అంటే ఆరు, 40 నిమిషాల పిరియడ్లు

రెండవభాష: 3 గం. 20 నిమిషాలు- అంటే అయిదు, 40 నిమిషాల పిరియడ్లు.

మూడవభాష: 1గం. 20 నిమిషాలు- అంటే రెండు, 40 నిమిషాల పిరియడ్లు.

పైన చెప్పిందంతా, స్థూలంగా కేంద్రప్రభుత్వం పాఠశాలా విద్యా బోధనానికి సంబంధించి నియమించిన వివిధ కమిటీల నివేదికల సారాంశం.

కాని, జరుగుతున్నదేమిటి? ఏరాష్ట్ర ప్రభుత్వం కూడ పై నిబంధనలను, నిర్ణయాలను పాటించటం లేదు. విద్యావిషయం రాజ్యాంగంలో ఉమ్మడి జాబితాలో చేర్చబడింది కనుక రాష్ట్రప్రభుత్వాలు పై సూచనలను లెక్కలోనికి తీసుకోకుండా తమ స్వంత భాషా విధానాలను యేర్పరచుకొన్నాయి. మాతృభాషా బోధనాన్ని ముఖ్యంగా చాలా రాష్ట్రాలు పూర్తిగా విస్మరించాయి. తెలుగు రాష్ట్రాలు కూడ ఈ పద్ధతినే అనుసరించాయి.

**భాషా నైపుణ్యాలు:**

ఈ సందర్భంలో భాషాధ్యయనం లేక భాషా బోధనం అంటే యేమిటి అనేదాన్ని గురించి కొంచెం విశదీకరించుకోవటం అవసరం.

ఎవరైనా నాకు ఫలానాభాష అర్థమౌతుంది' అంటే దానికర్థం అతడికాభాష వచ్చినట్లు కాదు. 'లేక మాట్లాడగలను' అన్నా, కేవలం 'చదవగలను' అన్నా, కేవలం కొద్దిగా వ్రాయగలను' అన్నా అతనికా భాష పూర్తిగా వచ్చినట్లు కాదు. ఒక మనిషి ఒక భాషను ఇతరులు మాట్లాడినప్పుడు విని అర్థం చేసుకోగలిగితేను, అర్థం చేసుకొని తను కూడ మాట్లాడగలిగితేను కొంతవరకు భాష వచ్చినట్లు అర్థం. అటు తర్వాత అతడా భాషలోని విషయాలను చదవగలిగితేను, వ్రాయగలిగితేను అతనికాభాష వచ్చినట్లు లెక్క వేసుకోవాలి. అతనికా భాష యొక్క సాహిత్యము, సాహిత్య రీతులు తెలిసి ఉండనక్కరలేదు. కాబట్టి భాషాధ్యయనమంటే- పైన చెప్పిన నాలుగు భాషా కౌశలాలను నిర్వర్తించగలగటమన్న మాట.

**కనుక, భాషా కౌశలాలు-**

విని అర్థం చేసుకోవటము (Listening comprehension) మాట్లాడగలగటము (speaking), చదవగలగటము (Reading comprehension) వ్రాయటము (writing). వీటిలో మొదటి రెండు మౌఖిక కౌశలాలు (oral skills), మూడు, నాలుగు లిఖిత కౌశలాలు (written skills) ఇంకొక దృష్టికోణంలో 1,3 గ్రాహ్య లేక నిశ్చేష్ట కౌశలాలు (Receptise or passive skills), 2,4 క్రియాశీల కౌశలాలు (Active skills).

**తెలుగే ఎందుకు?**

అత్యధికంగా తెలుగు రాష్ట్రాలలోని పిల్లల మాతృభాష తెలుగు. అది ప్రాంతీయ భాషకూడ. రాజ్యాంగంలోని 350ఎ నిబంధన ప్రకారం పిల్లలందరికి తమ మాతృభాషలో చదువు కోవటానికి హక్కుంది. దీనికోసం ప్రాంతీయ ప్రభుత్వాలు, స్థానికపాలన సంస్థలు తగు సదుపాయాలను కలిగించవలసి ఉంటుంది. పైన పేర్కొన్న పేరాలలో కూడ వివిధ కమీషన్లు, సంఘాలు, సమావేశాలు కూడ దీనిని స్పష్టం చేశాయి.

ఇక్కడ ముఖ్యంగా గమనించవలసిన విషయమేమిటంటే 3 సంవత్సరాల వయస్సు దాటిన పిల్లలకు మనం చెప్పింది గ్రహించటము, కొంతవరకు జవాబులు చెప్పటము, స్వంతంగా కొంతవరకు మాట్లాడటము తెలిసి ఉంటాయి. ప్రాథమిక పదజాలం, దైనిక జీవితంలోను, ఇంట్లో తల్లిదండ్రులతోను, ఇతర బంధుగణంతోను మాట్లాడటము, వాళ్ళు చెప్పింది అర్థంచేసుకోవటము తెలిసి ఉంటాయి. అంటే, ప్రాథమికమైన శ్రవణ భాషణ కౌశలాలు కొంతవరకు నేర్చుకొని ఉంటారు. తర్వాత ఆ పిల్లలు పాఠశాలలో చేరినప్పుడు అక్కడ ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు,మాట్లాడే వాక్యాలలోని చాలా పదాలు వాళ్ళకు అప్పటికే తెలిసి ఉంటాయి. అంటే, విన్నది అర్థం చేసుకోవటం సులభమై, క్రొత్త విషయాలు నేర్పినప్పుడు చాలా సులభంగా ముందుకు పోగలుగుతారు. ఉదాహరణకు: **ఆ పుస్తకం తీసుకురా, ఈ పుస్తకం ఆ కుర్చీలో పెట్టు** వంటి మాటలు

అప్పటికే వాళ్ళకు తెలిసి ఉంటాయి. ఇది ఒక్క తెలుగు విషయంలోనే కాక, ఏమాతృభాషకైనా వర్తిస్తుంది. అంటే వాళ్ళకు భాషాభ్యసనానికి చెందిన మొదటి రెండు కౌశలాలు కొంతవరకు తెలిసి ఉంటాయి. అయినా వాళ్ళు నిరక్షరాస్యులే. పాఠశాలలో మొదట అక్షరాస్యులుగా మారతారు. ఆ తర్వాతే విషయ పరిజ్ఞానం. ఒకవేళ ఆంగ్ల మాధ్యమ క్లాసనుకోండి. పై ఉదాహరణలోని రెండు వాక్యాలు Bring that book, keep this book in that chair గా మారతాయి. ఈ వాక్యాలలోని ఏ ఒక్క పదంకూడా ఆ విద్యార్థులు ఇంతకుముందు విన్నది తెలిసింది కాదు. కాబట్టి ప్రతిమాటను క్రొత్తగా నేర్చుకోవలసి ఉంటుంది. అంటే మొత్తం ఆ భాషకు చెందిన శ్రవణ భాషణ పఠన లేఖన కౌశలాలు నాల్గింటిని నేర్చుకోవలసి ఉంటుంది. పిల్లవాడికి తన భాషలో తెలిసిన **పుస్తకం, కుర్చీ, పెట్టు, తీసుకురా** వంటి నామవాచక క్రియారూపాలకు సమానమైన **book, chair, keep, bring** శబ్దాలనేకాక, in అనే ప్రత్యయము, **this, that** అనే దూర–సమీప బోధక నిర్దేశ సర్వనామాలను కూడ క్రొత్తగా నేర్చుకోవలసి ఉంటుంది.

ఇటువంటి పాఠశాలకే పరిమితమై పరిసరాలలో వినబడని భాషను నేర్చుకోవటంకంటే ఇంట్లోను బయట పరిసరాలలోను వినబడే, మాట్లాడబడే భాషను నేర్చుకోవడం, దానిద్వారా ఇతర విషయాలను నేర్చుకోవటము సులభతరమౌతుంది.

ఇటువంటి పరిస్థితి ఒక్క తెలుగు విషయంలోనే కాదు. ఏ మాతృభాష విషయానికి వచ్చినా ఇదే పరిస్థితి. ఇవన్నీ కూలంకషంగా ఆలోచించి తీసుకొన్న నిర్ణయమే మాతృభాషలోనే ప్రాథమిక విద్యా బోధనం జరగాలన్న ప్రతిపాదన.

**ఆంగ్లం ఎందుకు వద్దు?**

ఆంగ్లం భారతీయార్య భాషా కుటుంబపు ముఖ్యశాఖయైన జర్మానిక్ భాషా వర్గానికి చెందినది. తెలుగు ద్రావిడ భాషా కుటుంబానికి చెందినది. వీటి రెండింటికి గల అంతరాలు కోకొల్లలు. మచ్చుకు కొన్ని పరిశీలిద్దాం.

1. తెలుగు లిపి అక్షరలిపి. ఇంగ్లీషు లిపి ఆల్ఫాబీటా లిపి అంటే గ్రీకు లిపిలోని మొదటి రెండక్షరాలతో సూచింపబడే లిపి. తెలుగు లిపిని మనం అ.ఆ...లలో సూచించినట్లన్నమాట. మన ఒక తెలుగు హల్లక్షరానికి ఆంగ్లంలో కనీసం రెండక్షరాలు వ్రాయాలి. క=ka, ర= ra లాగా. సంయుక్తాక్షరమైతే కనీసం మూడక్షరాలు ఉంటాయి. స్త= **sta** లాగా.

2. మనలిపిలో ప్రతి అక్షరానికి ఒక పేరుంటుంది. వ్రాతలో కూడా దానిని ఆపేరులోనే ఉచ్చరిస్తాము. అ,ఆ లు. అమ్మ, ఆవు లో కూడ అలాగే పలుకుతాము. ఇంగ్లీషులో కూడ అక్షరాలకు పేర్లుంటాయి. కాని అవి ఉచ్చారణలో వేరు వేరుగా మారిపోతాయి. ఉదా: a: కాని ఉచ్చారణలో ఇది **అ (at)**, **ఆ (arm)** య **(am)** గాను మారుతుంది. అలాగే **c.** ఇది పేరులో సకారం సూచించినా ఉచ్చారణలో సకారాన్ని (centre, circle), క కారాన్ని (cat, camp) సూచిస్తుంది. మరికొన్ని ఉదాహరణలు:

i (ఇ) – it (ఇ), a (birth)
**e** (ఎ)– egg (ఎ), **i** (enough)
u (ఉ)– u (put), **a** (but)
g (జి)– g (girl), **j** (gender)
j (జె)– **j** (Jet), G (gender)

ఇట్లా ఇంగ్లీషులోని అన్ని అక్షరాలు వివిధ ధ్వనులను సూచిస్తాయి.

**accept** లో మొదటి **c** కకారంగాను, రెండవది సకారంగాను ఉచ్చరింపబడ్డాయి.

4. వేరు వేరు అక్షరాలకు అక్షర సముదాయాలు ఒకే ఉచ్చారణ కలిగి ఉంటాయి.

| | | |
|---|---|---|
| ఉదా : | f(ఫ్) - **F** (roof) , | **gh** (rough) |
| | **u**(ఉ) - u (put) , | **a** (but) |
| | k(క్) - (kit, king), | q(Cheque) |
| | s (స్) - (books) , | z (boyz) |
| | ti (టి) - (action) | |
| | ci (సి) - (vision) | |

5. ఆంగ్లంలో వేర్వేరు అక్షర సముదాయాలతో ఏర్పడిన పదాలు ఒకే ఉచ్చారణ కలిగి ఉంటాయి.

| | | | |
|---|---|---|---|
| ఉదా : | 1. | or | లేక |
| | | are | బహువచన క్రియారూపం |
| | 2. | beer | alcoholic drink(బీరు) |
| | | bier | పాడె |
| | 3. | no | know |
| | 4. | reed | నీళ్ళ అంచులలో నదులలో పెరిగే గడ్డిదంటు |
| | | read | చదువు |
| | | red | ఎరుపురంగు |
| | | read | read కు భూతకాల రూపము |

6. పైవాటికి వ్యతిరేకంగా వేరువేరు అక్షర సముదాయాలు (పదాలు) ఒకే ఉచ్చారణను కలిగి ఉంటాయి.

| | | | | |
|---|---|---|---|---|
| ఉదా : | hole | రంధ్రం | whole | మొత్తం |
| | role | నటునిపాత్ర | roll | చుట్ట |
| | sight | చూపు | site | ఇంటిస్థలం |
| | cite | ఉదహరించు | | |

7. నిశ్శబ్దాక్షరాలు : walk, talk లో l, known, knot లో k, doubt, debt లో b ఉచ్చరింపబడవు. ఇటువంటివి తెలుగులో ఉండవు.

**8. వాక్యనిర్మాణం**

తెలుగు వాక్యాలు కకక్రి (కర్త, కర్మ, క్రియ) పద్ధతికి చెందినటువంటివి. **రాముడు అన్నం తిన్నాడు** మాదిరి. ఇవి SOV రకపు వాక్యాలు– అంటే subject, object, verb రకం. ఇంగ్లీషు వాక్యాలు SVO రకం. అంటే తెలుగులోలాగా కాకుండా ఇంగ్లీషు వాక్యాలలో కర్త తర్వాత క్రియ వచ్చి, కర్మ చివరకు పోతుంది. అంటే అక్కడ **కక్రిక** (SVO) పద్ధతిలో వాక్యాలుంటాయి.

ఇంట్లో SOV రకపు వాక్యాలతో తెలుగులో మాట్లాడే పిల్లలకు బడిలో SVO పద్ధతిలో ఆంగ్లం నేర్చుకోవటం తికమకపెట్టించే కష్టసాధ్యమైన పని.

**9. క్రియారహిత వాక్యాలు:**

తెలుగులో క్రియారహిత వాక్యాలు విరివిగా ఉంటాయి. కాని ఆంగ్ల వాక్యాలలో కనీసం సహాయకక్రియ అయినా లేకుండా వాక్యం పూర్తికాదు. ఉదాహరణానికి:

**అది పుస్తకం** - That **is** a book

వాడుపిల్లవాడు- he **is** a boy.

ఆంగ్లానికి తెలుగుకు ఉన్న ఎన్నో వైరుధ్యాలు, భేదాలలో ఇవి కొన్ని మాత్రమే.

కనుక, ఇంట్లోను, చుట్టుప్రక్కల పరిసరాలలోను చిన్న వయస్సు నుంచి తెలుగులో మాట్లాడే పిల్లలు బడి వాతావరణంలో ఒక విచిత్ర మైన భయంకరమైన (తెలుగు మాట్లాడే వారికి) భాషను- తల్లి దండ్రులు, అన్నదమ్ములు, బంధువులు, పరిసర ప్రజలు మాట్లాడే భాషకు ఎన్నో విధాల విరుద్ధమైన, సంబంధరహితమైన భాషను నేర్పించాలని పట్టుపట్టటం కేవలం మూర్ఖత్వం కాక మరేమౌతుంది? అట్లని ఆంగ్ల మాధ్యమంలో చదివిన వాళ్ళందరు గొప్పవాళ్ళయి పోయారా, అయిపోతున్నారా? జ్ఞాన సముపార్జన వివిధ కారణాల మీద ముఖ్యంగా సహజసిద్ధ సామర్థ్యాల (innate capabilities) మీద ఆధారపడి ఉంటుంది; కాని కేవలం విద్యా మాధ్యమం మీదనే ఆధారపడి ఉండదని తెలుసుకోవటము, చదువు కేవలం ధనార్జన కోసము, ఉన్నత పదవుల కోసము మాత్రమే కాదని, ఆ పదవులు, ఆ ఆర్జన తెలుగు/ మాతృభాషా మాధ్యమంలో చదువుకొన్నవారు కూడ పొందగలరని మనం అనుభవంలో చూస్తున్నాము.

**ఉపాధ్యాయులు**

తెలుగు రాష్ట్రాలలో ఇప్పుడు పల్లెటూళ్ళలో కూడా ప్రాథమిక పాఠశాలలలో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టారు. మరి ఉపాధ్యా యుల సంగతేమిటి? ప్రభుత్వం ద్వారా నియమింపబడిన ఆ ఉపాధ్యా యులు నిజంగా ఆంగ్లాన్ని బోధించటానికి అర్హతలున్నవారేనా అనేది ఒక ముఖ్యప్రశ్న. ఇంగ్లీషు అక్షరాలు వచ్చి, కొన్ని మాటలు, వాక్యాలు చిన్న చిన్న పేరాలు, కొన్ని వార్తాపత్రిక విషయాలను వాళ్ళ పద్ధతిలో చదవగలిగితే వాళ్ళకు ఇంగ్లీషు వచ్చినట్లేనా? అటువంటివాళ్ళకు ఆ భాషోపాధ్యాయులుగా అర్హతలున్నాయా? వాళ్ళు ఆంగ్ల ధ్వనులను, ముఖ్యంగా తెలుగులోలేని ధ్వనులను సరిగా ఉచ్చరించగలరా? ఇంగ్లీ షులో ఉన్న 8 రకాల సంధ్యచ్చులు (diphthongs), దంతోష్మాలు (dental fricatives), దంతమూలియోష్మాలు(alveolar fricatives (sz),), దంతమూలీయ స్పర్శ ధ్వనులు (t,d), అర్ధ వికృత, అర్ధ సంవృత, అగ్ర, అంత్యాచ్చులు, (half open & half close front and back vowels), పదాది మహాప్రాణ ధ్వనులు మొదలైనవాటిని సరిగా ఉచ్చరించి ఉపాధ్యాయులు నేర్పించగలరా? ఈ ఉపాధ్యా యులు ఇంగ్లీషును బోధించటంలో సరియైన శిక్షణ పొంది ఉన్నారా? ఈ అర్హతలన్ని లేని ఉపాధ్యాయులు ఇంగ్లీషు నేర్పితే అది తెలుగు నేర్పటం కన్నా అధ్వాన్నంగా ఉంటుంది. వాళ్ళలో చాలామంది చిన్న చిన్న వాక్యాలను వాళ్ళ స్వంత పద్ధతిలో చదివి అనువాదం చేసి పిల్లలకు తెలుగులో చెప్పగలరు. అదే నిజంగా జరుగుతున్నది కూడా. ఇటువంటి బోధనం ఏమి సాధించటానికి?

పిల్లలే మన అమూల్య సంపద-
పిల్లల వికాసమే జాతి వికాసం!

ఆంగ్ల మాధ్యమం అనర్థం
ఆంగ్లం అవసరం!

పేదలైనా ధనికులైనా సొంతభాషలోనే
ప్రాథమిక విద్య!

**ముగింపు**

పైన ఉదహరించినవాటి దృష్ట్యా, ప్రాథమికస్థాయిలో రాజ్యాంగం లోని 350ఎ నిబంధన ప్రకారంగా తెలుగు రాష్ట్రాలలో తెలుగులోనే విద్యాబోధనం కొనసాగించాలి. అప్పుడే పిల్లలు శీఘ్రంగాను, మాన సిక గ్లాని లేకుండాను, సరియైన పద్ధతిలో విద్యాభ్యాసం చేయగలుగు తారు. వివిధ సంస్థలు, సమావేశాలు, కమిషన్లు సూచించినట్లుగా ఆంగ్లం 5,6 తరగతులలోనే ప్రవేశపెట్టాలి. తాము మాట్లాడే భాషకు పూర్తిగా భిన్నమైన, ప్రాంతీయం కాని, వాతావరణం లేని భాషను, పిల్లల మాతృభాషకు ఉచ్చారణ, లేఖన పద్ధతులు, వాక్యనిర్మాణము, సాంస్కృతికనేపథ్యము వేరైన భాషలో ప్రారంభ విద్యను నేర్పటము, నేర్పించాలనుకోవటము సమంజసంకాదు. అసమర్థనీయమూకాదు. 1857లో మెకాలే 101 ప్రాంతీయ భాషా మాధ్యమ పాఠశాలలను ప్రారంభింపజేస్తే చాలా తక్కువ మంది ఆ విద్యాలయాలలో చేరారట. ఎక్కువమంది ఆంగ్లమాధ్యమ పాఠశాలలలో చేరారట. అది ప్రభువుల పాలకుల భాష కాబట్టి. ఇప్పుడు కూడ అదే పరిస్థితి కనిపిస్తున్నది. ఇంగ్లీషు వాళ్ళు ప్రస్తుతం ప్రభువులు పాలకులు కాకపోయినా వాళ్ళ పౌండు స్టెర్లింగులు, డాలర్లు మన కత్యంత ప్రియమైనవి కాబట్టి, మాతృభాషలో కంటే, ఆంగ్లంలో చదివితే గొప్ప వాళ్ళవుతారని, గొప్ప ఉద్యోగాలు సంపాదించుకోగలరని, తల్లిదండ్రులనుకోవటం శుద్ధ తప్పు. ఇప్పటి పెద్దతరంవారు, ఇంకా ముందుతరాలవారు మాతృ భాషా మాధ్యమంలో చదివి ఉన్నతవిద్య నభ్యసించి, ఇప్పటివాళ్ళు ఉవ్విళ్ళూరుతున్న అమెరికా, ఇంగ్లాండు చదువులకు పోయిన వాళ్ళెం దరో ఉన్నారు. దేశంలో కూడా అత్యున్నత పదవులు పొందినవారు న్నారు. ఆ రోజుల్లో అమెరికా, ఇంగ్లాండు వంటి దేశాలకు పోయిన వాళ్ళు జ్ఞానార్జన కోసము, ఉన్నత చదువుల కోసమే వెళ్ళారు. కాని ఈ తరంవారు జ్ఞానార్జన కన్నా ధనార్జనే ముఖ్యంగా దృష్టిలో పెట్టుకొని అమెరికాకు, ఇంగ్లాండు, ఆస్ట్రేలియా వంటి దేశాలలో ఆర్థిక సంపా దనే ముఖ్య ధ్యేయంగా ఊహించుకొని చదువుతున్నారు. ఆ దేశాలకు పోవాలంటే ఇంగ్లీషు మాట్లాడగలిగితే చాలు అనే అపోహలో ఇంగ్లీషు పాఠశాలలపై మోజు, మక్కువ చూపుతున్నారు. కాని ఇంగ్లీషు మాట్లా డటము, పదోచ్చారణ, ఆ భాషాధ్వనులు తెలియని ప్రభుత్వ పాఠ శాలల ఆంగ్లాధ్యాపకుల ద్వారా ఇది నెరవేరుతుందా అనేది ఆలో చించాలి.

భాషాభ్యసనాలు, కౌశలాభివృద్ధి పద్ధతులు, ధ్వన్యోచ్చారణ సరిగా తెలిసిన సమర్థులైన అధ్యాపకులద్వారా ఆంగ్లం 6వ తరగతి నుంచి నేర్చుకొంటే పిల్లల తల్లిదండ్రులు కోరినది సాధించటం అసాధ్యం కాదు. ◆

శ్రద్ధాంజలి

## వకుళాభరణం లలిత (1937–2017)

-డా॥సుందర్ కొంపల్లి
99893 58883

# సమకాలీన సాంఘిక చరిత్ర దర్పణం



**మార్చి** 14న జీవితాన్ని చాలించిన వకుళాభరణం లలితగారు తెలుగుజాతి చరిత్రలో తనదైన చెరగని ముద్ర వేసు కొన్న మహావ్యక్తి. ఆమెతో జీవితాన్ని ఇష్టంగా పంచుకొన్న మరొక మహావ్యక్తి వకుళా భరణం రామకృష్ణగారు. ఎందరో శిష్యుల కు వారిద్దరూ గురువులు. నిజమైన గురువు లు. తెలుగువారి గడచిన చరిత్రనూ, నడు స్తున్న చరిత్రనూ, అనేక రంగాల్లో గ్రంథస్తం చేసిన పరిశోధకులు వీరిద్దరూ. వారిద్దరినీ విడదీసి చూడలేం. రామకృష్ణ గారిని ఒంట రిని చేసి, జీవితం నుంచి శాశ్వతంగా నిష్క్ర మించారు లలితమ్మ. ఇది రామకృష్ణ గారికే కాదు, మొత్తం తెలుగు సమాజానికే తీరని లోటు. ఆయన లోటు తీరేదికాదు గాని, సమాజానికి ఏర్పడిన లోటును తీర్చగల శక్తి మంతులు తప్పకుండా ఉంటారు. అలాంటి ప్రభావాన్ని కలిగించగల ఆదర్శాన్ని ఆమె సమాజం ముందుంచారు గనుక మనం ఆశ పెట్టు కోవచ్చు. లలితమ్మగారి ప్రియ శిష్యుడు శ్రీ కొంపల్లి సుందర్ ఈ సందర్భంగా వ్రాసిన వ్యాసాన్ని, ఆంధ్రజ్యోతి దినపత్రికలో శ్రీ వాడ్రేవు చినవీరభద్రుడు వ్రాసిన మరొక వ్యాసాన్ని ఆమెకు శ్రద్ధాంజలిగా ఇక్కడ ప్రచురిస్తున్నాము.

-సంపాదకుడు

**అ**క్షరాల అభ్యాసాన్ని లక్షల వ్యాపారంగా మార్చిన ఈ కాలంలో, విషయ సేకరణను అంతర్జాలానికి పరిమితం చేసిన సమకాలీన సమాజంలో, క్షేత్ర పర్యటన– పరిశోధన అనేవి అపురూపమైన సమయంలో, విస్మృత సాంఘిక వర్గాలపై చరిత్ర రచన లుప్తమైపోతున్న సంధియుగంలో వకుళాభరణం లలితగారు చేపట్టి కొనసాగించిన అర్ధశతాబ్ది అక్షరయజ్ఞం, సాంఘిక పరిశోధన అత్యంత ప్రశంసనీయం. ఈ అభ్యుదయ విద్యావేత్త జీవితం ఎందరో విద్యార్థులకు, పరిశోధకులకు, ఉపాధ్యాయులకు అభిలషణీయం, అనుసరణీయం. ఆమె చేసిన విస్తృత బౌద్ధిక వ్యవసాయం తెలుగు సమాజానికి అంతే విస్తృతమైన ఫలసాయాన్ని అందించింది. విద్యావేత్తగా, ఉపాధ్యాయురాలిగా, రచయితగా, పరిశోధకురాలిగా మాత్రమే సమాజానికి తెలిసిన ఆమె జీవితంలో ఎన్నో ఆదర్శనీయ కోణాలు దాగి ఉన్నాయి.

1937లో పుట్టిన లలితమ్మ బాల్యం చాలామటుకు కావలిలోనే గడిచింది. ఆమె తల్లి విశాలాక్షమ్మ. పేరుకు తగ్గ విశాలత్వం ఆమెది. అన్నార్తులకు, అర్థులకు ఆమె దోసిళ్ళనిండా వడ్లు పంచిపెట్టేదని కావలి పట్టణంలో అనేకమంది జ్ఞాపకం చేసుకుంటారు. ఆ విశాలత్వమే ఆమె కూతురికి వారసత్వంగా వచ్చింది. విశాలమనస్కులందరూ బోళామనుషులే! 'బోళా లలితమ్మ'గా ఆమె చాలామందికి పరిచయం. ఇక ఆమె పేరే ఆమె వ్యక్తిత్వం. లలిత. నిజంగానే వకుళాభరణం లలితగారు లలిత మనస్కులు. తనజీవితంలో ఆమెకు కోపం వచ్చిన సందర్భాలు దాదాపు మృగ్యం. విశాలత్వం, లలిత హృదయం– ఈ రెండు లక్షణాలు ఆమె జీవించినంతకాలం ఆమెతోనే నడిచాయి. ఆమె అనునిత్యం నిర్వహించిన పనుల్లోనే ఈ లక్షణాలు ద్యోతకం. ఉపాధ్యాయురాలిగా ఆమె కావలి జవహర్‌భారతి కళాశాలలో పనిచేస్తున్నపుడు కళాశాలకు రిక్షామీద వచ్చేవారు. చాలా సంవత్సరాల సమయం ఆమె ఒకే రిక్షాలో వచ్చేవారు. ఆ రిక్షా తోలరి ఆమెకు నమ్మినబంటు. రిక్షా మారలేదు. రిక్షాతోలరీ మారలేదు. కారణం చాలా సులువు. రిక్షాబండివాని స్థితి లలితమ్మను ప్రతిరోజూ కదిలించేది. ఐదు రూపాయలు ఇవ్వాల్సిన సమయంలో లలితగారు ఆ రిక్షాబండివానికి ప్రతిరోజూ రెట్టింపు లేదా రెట్టింపు కంటే ఎక్కువే ఇచ్చేవారు. ఈ మొత్తం రిక్షావాని కృషికి ప్రతిఫలం కాదు. అతని స్థితికి కలత చెందిన లలితమ్మ చేసిన సాయం. ఇటువంటి లలితమ్మలు ప్రపంచవ్యాప్తంగా ఉన్నారు. అలాంటి వ్యక్తులు అలవోకగా సాహిత్య ప్రస్థానంలోనూ పాత్రలైనారు.

ప్రఖ్యాత ఆంగ్ల రచయిత ఆలీవర్ గోల్డ్‌స్మిత్ సృజించిన 'Man in black' పాత్ర లలితమ్మలాంటి వ్యక్తులదే. గోల్డ్‌స్మిత్ రచనలోని ఆ పాత్ర కట్టెలమ్ముకొనే ఒక వృద్ధుడిని చూసి చలించి, అతణ్ణి ఆ బరువు నుంచి తప్పించాలని తలచి, రెట్టింపు మొత్తంలో ఇచ్చి కట్టెలను కొనుగోలు చేస్తుంది. పోతూ, పోతూ ఆ వృద్ధుడు అంటాడు, 'take all my cargo and a blessing with the bargain' అని. నా బరువుతో పాటు, దానికి సమానంగా నా దీవెనలందుకో అని సారాంశం. కావలిపట్టణంలో రిక్షా కార్మికుడు ఒక్కసారికాదు, ఒక్కరోజు కాదు, అనేక సంవత్సరాలు లలితమ్మను మౌనంగా దీవించాడు. లలితగారు సాంప్రదాయవాది కాదు. ఆచారఖండనం ఎపుడో చేశారు. ఒకవేళ నమ్మకాలు నిజమనుకుంటే, అదే రిక్షా కార్మికుడు లలితమ్మ సేవకోసం ఊర్ధ్వలోకంలో కాచుకొని కూర్చొని ఉంటాడు.

సాంప్రదాయ కుటుంబం నుండి వచ్చినా లలితగారిది స్వతంత్ర వ్యక్తిత్వం. తల్లిదండ్రుల సహకారం కూడా ఉంది. లేకుంటే 1950వ దశకంలో ఒక గ్రామీణ యువతిని ఒంటరిగా పై చదువులకోసం మద్రాసు పట్టణానికి పంపడం సాధ్యపడే విషయం కాదు. ఆమె తెలివైన

విద్యార్థి. ఆమె తన కుటుంబ బాధ్యతలను మోస్తూనే ఉన్నత చదువులు పూర్తి చేయగలిగారు. బి.ఎ., ఎం.ఎ., ఎం.ఫిల్, పిహెచ్.డి., పట్టాలను పొందారు. కావలి, మద్రాసు, నాగపూర్ పట్టణాల్లో విద్యనభ్యసించారు. తెలుగు సాహిత్యం, ప్రభుత్వ పాలనా శాస్త్రం, సోషల్ ఆంత్రోపాలజీ విషయాలను ఐచ్ఛికంగా తీసుకున్నారు. ఆమె చదువు ఒకే ఒక్క చట్రంలో ఇమిడేది కాదు. క్లుప్తంగా చెప్పాలంటే, **ఆమె బహుముఖ విద్యావేత్త. ఆమెలోని సామాజిక వ్యక్తిత్వం ఆమెను చివరకు విస్మృత సాంఘిక వర్గాల (ముఖ్యంగా గిరిజన, ఆదివాసీ తెగల) పరిశోధనవైపు మరల్చాయి. ఆమె జీవితం మొత్తం గిరిజన తెగల పరిశోధన, వ్యాస రచన, పుస్తక ప్రచురణ, ఉపన్యాసాల్లోనే గడిచిపోయింది.**

లలితగారు గొప్ప నటీమణి. కావలి కళాశాలలో చదువుతున్న రోజుల్లోనే ఆమె స్టేజీ నాటకాలు ప్రదర్శించేవారు. 'అనార్కలి' పాత్రలో ఆమె ముగ్ధమనోహరంగా మెరిసిపోయేవారు. బహుశా, ఆమెలోని ఆ లలిత సౌందర్యమే తనను ఆమెవైపు ఆకర్షించిందేమోనని ఆమె భర్త, ప్రఖ్యాత చరిత్రకారులు వకుళాభరణం రామకృష్ణగారి అభిప్రాయం. కావలి కళాశాల సాంస్కృతికంగా చాలా ఉత్తేజంతో కూడిన సంస్థ. ఉద్దండులైన పండితులు వేదుల, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, ఎస్.వి. భుజంగరాయశర్మ, కె.వి.రమణారెడ్డి మొదలగువారు లలితగారి ఉపాధ్యాయులు. తరువాతి కాలంలో సహోద్యోగులు. వెంపటి చినసత్యం వంటి సాంస్కృతిక రాయబారులతో లలితగారికి ప్రగాఢ పరిచయాలు. వెరసి, ఆమె వ్యక్తిత్వవికాసం కూడా బహుముఖం. అన్నిటికంటే మించి, జవహర్ భారతి కళాశాలలో ఉన్న బౌద్ధికస్వేచ్ఛ, హేతువాద భావాలు లలితగారికి కలిసివచ్చిన అంశాలు. కళాశాల వ్యవస్థాపకులు దొడ్ల రామచంద్రారెడ్డిగారు ఆ రోజుల్లోనే స్వేచ్ఛాపిపాసకు దోహదం చేశారు. ఆమె స్వేచ్ఛాతత్వమే ఆమె వివాహ నిర్ణయంలో ప్రముఖపాత్ర పోషించింది. కుటుంబంలో కొంచెంపాటి నిరసనలున్నా ఆమె వకుళాభరణం రామకృష్ణ గారిని పెళ్ళాడారు. తమ ముగ్గురు పిల్లలను సైతం (రాజా, విద్య, వంశి) హేతుబద్ధంగా పెంచారు. ఉన్నత విద్యావంతులను చేశారు. తను, తన భర్త, తన ముగ్గురు పిల్లలు– మొత్తం ఐదుగురు. ఈ మొత్తం మందికి పిహెచ్.డి. పట్టాలు. బహుశా, అందరు సభ్యులూ అత్యున్నత పరిశోధక పట్టాలు పొందిన ప్రముఖ కుటుంబాల్లో లలితగారిది ఒకటి.

లలితగారు అనేక దశాబ్దాలపాటు కళాశాలలో ఉపన్యాసకురాలుగా వృత్తిని కొనసాగించారు. ఆమె ఎప్పుడూ కొత్తదనం కోసం పరితపించేవారు. పాఠ్యాంశాలను తనదైన రీతిలో విద్యార్థులకు బోధించేవారు. 1980 దశకంలోనే ఆమె విద్యార్థులను విద్యాభ్యాస క్రమంలో భాగస్వాములను చేశారు. ఆనాటికి కేవలం జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (ఢిల్లీ)వంటి ఉన్నత విద్యాసంస్థలకే పరిమితమైన 'సెమినార్' అంశాన్ని ఆమె బి.ఎ. విద్యార్థులకు ప్రవేశపెట్టారు. విద్యార్థులు ఉపన్యాసకులుగా మారి, పాఠ్యాంశాలను వివరించే క్రమం అది. ఈ వ్యాస రచయిత సైతం ఆమె 'సెమినార్' కార్యక్రమంలో భాగస్వామే! లలితగారు చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా ఎందరో విద్యార్థులు లబ్ధి పొంది, ఉన్నత చదువుల్లో రాణించారు. అన్ని దశాబ్దాల ఉపాధ్యాయ జీవితంలోనూ ఆమె ముఖంపై చిరునవ్వు చిందులేస్తుండేది. అదిలేని కొందరు విద్యార్థులు, ఆమె ముఖంలోని చిరు



వకుళాభరణం రామకృష్ణ, లలిత దంపతులు

నవ్వును కొంత కత్తిరించి తమ ముఖాలకు అతికించుకునే ప్రయత్నం కూడా చేసేవారు!

లలితగారి జీవితంలో అత్యంత ప్రధాన విషయం ఆమె పరిశోధన, పరిశోధనకై ఆమె ఐచ్ఛికంగా ఎంచుకున్న అంశం. **ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని గిరిజన జాతులపై (సంచార జాతులు, నివాస జాతులు) ఆమె కొనసాగించిన క్షేత్ర పరిశోధన, ప్రచురణలు మనకు మరో హైమండార్ఫ్‌ను గుర్తుకు తెస్తాయి. ఆమె పరిశోధక పర్యవేక్షకులు కూడా ప్రపంచ ప్రసిద్ధి పొందిన ఆచార్య పి.కె.భౌమిక్. గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు, సాంఘిక, ఆర్థిక పరిస్థితులు, సాంస్కృతిక వికాసం మొదలగు విషయాలపై ఆమె పుంఖానుపుంఖాలుగా వ్యాసాలను ప్రచురించారు. గిరిజనుల్లోని మాజీ నేరస్త జాతులపై ఆమె పరిశోధన ఎంతోమంది విద్యార్థులకు ఆదర్శంగా నిలిచింది. సమాజంలోని విస్మృత వర్గాలను ఆమె పరిశోధనకు ఎంచుకోవడం వెనుక అనేక కారణాలు. అందులో ప్రథమం, లలితగారి సాంఘికాభినివేశమే. తనకు తానే ప్రేరణ. ఆమె పెరిగిన వాతావరణం, కళాశాలలోని హేతువాద భావాలు, స్వతంత్ర వ్యక్తిత్వం, తోటి సామాజికులపై అనురక్తి, కష్టాల్లో ఉన్న సమూహాలపై సానుభూతి లలితగారిని ఆవైపు నడిపించాయి.** అప్పటికే వామపక్ష భావాలను పుణికిపుచ్చుకొని, ఆంధ్రుల సాంఘిక చరిత్రకు కొత్త భాష్యాలను చెబుతూ సుప్రసిద్ధులౌతున్న భర్త వకుళాభరణం రామకృష్ణ ఆమెకు స్వాభావిక బలం. 1970 దశకంలో ఎస్.ఆర్.శంకరన్ (ఐ.ఎ.ఎస్.) నెల్లూరు జిల్లాలో పనిచేశారు. ఆయన సాంఘిక మార్పుకై చేసిన కృషి ప్రభావం లలితగారిపై ఉంది. కాలక్రమేణా శంకరన్‌గారు లలితగారి కుటుంబానికి ఆప్తులైనారు. మరొక ప్రధాన ప్రేరణకూడా ఉంది. ఆధునిక ఆంధ్రదేశంలో ప్రఖ్యాత సంఘసంస్కర్తలు లవణం, హేమలతాలవణం దంపతులు కావలి పట్టణంలో, పరిసర ప్రాంతాల్లో అనేక కార్యక్రమాలు చేపట్టారు. లలితగారు వారితో కలిసి అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. లవణం దంపతుల సంస్కరణా కార్యక్రమాలను లలితగారు వారసత్వంగా స్వీకరించారు. వాటిపై విస్తృతంగా వ్యాసాలు రాశారు. జవహర్ భారతి కళాశాలలో జరిగిన

మాజీ నేరస్త జాతుల సంస్కరణ సభల్లో లలితగారిది ప్రధాన పాత్ర.

వివిధ గిరిజన తెగలమీద విషయ సేకరణకు ఆమె కాలికి బలపం కట్టారు. ఆమె పరిశోధనాక్రమంలో కూడా అత్యంత మానవీయ కోణం ఉంది. పరిశోధనలో తనకు సహకరించటానికి, సహాయానికి ఆమె మాజీ నేరస్థ జాతుల సెటిల్మెంట్ స్టువర్టుపురం నుండి వచ్చిన మల్లిగాంధీని ఎంచుకున్నారు. ఈ ఎంపికలోనే ఆమె నిబద్ధత ఏమిటో తేటతెల్లమౌతుంది. అంతేకాక, మల్లిగాంధీకి పిహెచ్.డి.పట్టా వచ్చే వరకు ఆమె కృషిచేశారు. వారిరువురూ కలిసి తిరుగాడిన ప్రదేశాలు లెక్కకుమించి ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 23 జిల్లాలను చుట్టి వచ్చారు. బహుశా, అన్ని జిల్లాల్లో క్షేత్ర పరిశోధన చేసిన ఏకైక మహిళా పరిశోధకురాలు లలితగారే! ఇవేకాక, పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక (రాయచూరు, బళ్ళారి, సౌదత్తి, చిత్రగుత్తి), గోవా ('బైనీళ్ళు' జాతి గిరిజనులు), మహారాష్ట్ర (కైకాడి, పార్థి గిరిజన తెగలు) లను కూడా ఆమె సందర్శించారు. పరిశోధనలో భాగంగా ఆమె సంఘస్మృతికి బాహ్యంగా ఉన్న ఎన్నో గిరిజన, సంచార, మాజీ నేరస్త జాతులను కలిసి, విషయ సేకరణ గావించారు. యానాది, ఎరుకల, చెంచు, కోయ, లంబాడి, నక్కల, బోయ, పాముల, పిచ్చ గుంట్ల, సుగాలి, బుడగ జంగాలు, బుడబుక్కల, గంగిరెద్దుల, నీర్షికారి, కొరచ, కొరవ, కాటిపాపలు మొదలుగా గల అనేక గిరిజన తెగలను సందర్శించారు. శ్రీకాకుళం జిల్లా దోనెబాయి వంటి అతి మారుమూల గ్రామాలకు వెళ్ళారు. అక్కడి వారితో కలిసి ఉన్నారు. వారి ఆచార, సాంప్రదాయాలను అడిగి తెలుసుకున్నారు. తరువాయి కాలంలో తను ప్రచురించిన పుస్తకాలు, వ్యాసాల ద్వారా సమాచారాన్ని అటు ప్రభుత్వానికి, ఇటు ప్రజలకు చేరవేశారు. సాధారణ ప్రజలు, పరిశోధకులు చేయడానికి సాహసించని ప్రయాణాలు కూడా చేశారు. కరుడుకట్టిన మాజీ నేరస్త జాతుల సెటిల్మెంట్లను (కప్పరాళ్ళతిప్ప, స్టువర్టుపురం, సీతానగరం, సిద్ధాపురం, లింగాల మొదలగునవి) ధైర్యంగా సందర్శించి, అక్కడివారితో కలిసి పనిచేశారు. ఆమె తపనకు ఎన్నో ఉదాహరణలున్నాయి. కళాశాలలో ఉపన్యాసకురాలిగా చేస్తున్న సమయంలో, అసాధారణంగా అనిపించే అనేక సంఘటనలు ఆమె జీవితంలో ఉన్నాయి. తాను అమితంగా అభిమానించి, గౌరవించే సహ ఉపన్యాసకులైన కె.వి.కె. మాస్టారుతో కలిసి ఆమె మధ్యాహ్నం మండుటెండలో కొన్నిసార్లు కాలినడకన ఇంటికి బయలుదేరేవారు. ఆమె ఇంటికే వెళ్తోందని కెవికె భావించేవారు. కానీ ఆమె కాళ్ళు ఇంటికి దారితీసేవి కావు. తన పని మొత్తం పూర్తి గావించి, పిల్లల ఆలనా పాలనా చూసి, కళాశాలలో తరగతులు చెప్పి, మధ్యాహ్న సమయంలో కావలి దగ్గిరగా ఉన్న కప్పరాళ్ళ తిప్ప సెటిల్మెంట్‌కు క్షేత్ర పరిశోధన నిమిత్తం వెళ్ళేవారు. అలా ఎన్నో నెలలు ఆమె కృషి సాగింది. క్రమేణా కప్పరాళ్ళతిప్ప వాసులు లలితగారిని ఆడపడుచుగా గౌరవించి పసుపు, కుంకుమలతో (సాయంత్రం వేళకు) ఇంటికి పంపేవారు. ఒక క్షేత్ర పరిశోధకురాలి అసాధారణ విజయం ఇది.

లలితగారి దృష్టి, స్త్రీలెదుర్కొంటున్న అమానవీయ సంప్రదాయాల మీద కూడా పడింది. దేవదాసి, బసివి, మాతంగి, జోగిని మొదలగు ఆచారాల మీద ఆమె కూలంకషంగా పరిశోధన కొనసాగించి ఎన్నో గ్రంథాలను ప్రచురించారు. ఇవి ఆంగ్లంలోనూ, తెలుగులోనూ ప్రచురితమైనాయి. ఆచారంలో భాగమైపోయిన నృత్యరీతులపై కూడా ఆమె నటరాజ రామకృష్ణ వంటి ఉద్దండ నాట్యశాస్త్రవేత్తలతో కలిసి పనిచేశారు. తన రచనా వ్యాసంగానికి తోడు కేంద్రీయ విశ్వవిద్యాలయం వంటి ప్రఖ్యాత విద్యాలయాల్లో, తెలుగు అకాడెమీవంటి సంస్థల్లో ఆమె పనిచేశారు. భర్త వకుళాభరణం రామకృష్ణగారితో కలిసి దుర్గాబాయి దేశముఖ్, నటరాజ రామకృష్ణ వంటి ప్రముఖులపై; తన విద్యార్థి (ఈ వ్యాసరచయిత)తో కలిసి హేమలతా లవణం మీద జీవిత చరిత్రలను రచించారు. ఎన్నో వందల వ్యాసాలు, పదుల సంఖ్యలో పుస్తకాలు, అనేక సెమినార్లు, వందలకొలదీ ఉపన్యాసాలు వెరసి వకుళాభరణం లలిత జీవితం. ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్‌కు వ్యవస్థాపక సభ్యురాలిగా ప్రారంభమై, అదే చరిత్ర మహాసభల్లో ఆధునిక యుగ చరిత్ర విభాగానికి అధ్యక్షులుగా ఎన్నుకోబడ్డారు.

మొదట్లో పేర్కొన్నట్లు వకుళాభరణం లలిత ఒక ప్రత్యేక వ్యాసంగానికే పరిమితమైన వ్యక్తి కాదు. ఆమె బహుముఖ ప్రజ్ఞ ఆమెను అనేక రంగాలకు తీసుకు వెళ్ళింది. ఐతే, ఆమె తనకు ప్రియమైన గిరిజన జాతుల పరిశోధనను చివరిక్షణం వరకు కొనసాగించారు. ఆమె తన చివరి రచన కూడా గిరిజనజాతుల మీదనే ప్రచురించారు.


1989-90: కలకత్తా విశ్వవిద్యాలయంలో భారతచరిత్ర కాంగ్రెస్ మహాసభల సందర్భంగా తన శిష్యులు ఎ.వరదారావు, డా.కె.రాజు, డా.చాగంటి ఆంథోని, డా.సుందర్‌లతో ఆచార్య వకుళాభరణం లలిత

తన శిష్యులిద్దరితో (మల్లి గాంధి, కొంపల్లి సుందర్) కలిసి ఆమె మాజీ నేరస్త జాతులపై ఒక సమగ్ర పరిశోధన గ్రంథాన్ని ఇటీవలే ప్రచురించారు. (ప్రజాశక్తి ప్రచురణ, డిసెంబరు 2016). ఈ గ్రంథానికి మరో ప్రత్యేకత ఉంది. ప్రముఖ సంఘసంస్కర్త లవణం తాను జీవించి ఉన్న కాలంలో చివరిగా రాసిన 'ముందుమాట' ఈ గ్రంథానిదే! లలితగారు తాను చనిపోవడానికి ముందు పూర్తిచేసిన రాతప్రతి వెన్నెలకంటి రాఘవయ్యగారి జీవిత చరిత్ర. యానాది గిరిజన జాతి అభ్యుదయం కోసం జీవితాంతం కృషిచేసిన సంస్కర్త రాఘవయ్యగారు. గిరిజన జాతులపై పరిశోధనకు జీవితాన్ని వెచ్చించిన లలితగారి ఆఖరు పుస్తకం రాఘవయ్యగారి జీవిత చరిత్ర (ప్రచురణార్థం వేచి ఉంది). చరిత్రలో ఇది కాకతాళీయం కావచ్చునేమో కాని, సాధారణ పాఠకులకు ఇందులో ఊహకందని ఏదో విషయం కనిపిస్తుంది.

వకుళాభరణం లలితగారు చాలామందికి ఉన్నతమైన స్త్రీవాదిగా పరిచయం. 'అస్మిత' 'అన్వేషి' వంటి సంస్థల్లో ఆమె కీలక పాత్రను పోషించారు. స్త్రీవాదిగా ఆమె తనను తన రచనలు, పరిశోధనల

*(మిగతాది 21వ పుటలో...)*

# మహాసంస్కర్తల వారసురాలు

-వాడ్రేవు చినవీరభద్రుడు

**ఈ** నెల 14న శ్రీమతి వకుళాభరణం లలిత ఈ లోకాన్ని విడిచిపెట్టి వెళ్ళడంతో తెలుగు సమాజం, ముఖ్యంగా రెండు రాష్ట్రాల్లోనూ అణగారిన వర్గాలకు చెందినవాళ్ళంతా ఒక శ్రేయోభిలాషినీ, సంస్కర్తనీ, స్నేహితురాలినీ కోల్పోయారు. పదిహేనేళ్ళకు పైగా ఆమె నిర్విరామ కృషిని చాలా దగ్గరగా చూసిన నాలాంటి వాళ్ళకి ఆమె మన మధ్య లేకపోవడం వల్ల ఏర్పడే వెలితి ఎంత తీవ్రమైనదో అర్థమవుతూ ఉంది. ఆ వెలితి త్వరలో పూడ గలిగేది కాదని కూడా తెలుస్తూనే ఉంది.

డాక్టర్ వకుళాభరణం లలిత 1937లో ప్రకాశం జిల్లా వెంకంపాడు అనే కుగ్రామంలో పుట్టారు. అనేక ఇబ్బందుల్ని ఎదుర్కొని పబ్లిక్ అడ్మిని స్ట్రేషన్‌లో ఎమ్మే, యాంత్రోపాలజీలో డాక్టరేట్ చేశారు. కావలి జవహర్ భారతిలో రాజనీతిశాస్త్రం బోధించారు. మధ్యలో కొన్నాళ్ళు తెలుగు అకాడెమీలో కూడా పనిచేశారు. పదవీ విరమణ తరువాత సెంట్రల్ యూనివర్సిటీలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. ప్రసిద్ధ చరిత్ర పరిశోధకులు వకుళాభరణం రామకృష్ణ గారితో అరవై ఏళ్ళ కింద ఏర్పడ్డ పరిచయం ప్రేమగా మారి 55 ఏళ్ళ ఆదర్శ దాంపత్యంగా కొనసాగింది.

డాక్టర్ లలిత జీవితకాల కృషి ఏ ఒక్క రంగానికో పరిమితమయింది కాదు. ఆమె కృషి చేసిన ప్రతి ఒక్క రంగంలోనూ ఆమె చేసిన ప్రయత్నాల్నీ, సమాజానికి ఆమె అందించిన ఉపాదానాన్నీ మనమింకా అంచనా వేసుకోనే లేదు. అట్లాంటి అంచనా వెయ్యడం మొదలుపెడితే, అన్నిటికన్నా ముందు కలిగేది ఆశ్చర్యమే. ఒక్క మనిషి తన జీవితకాలంలో ఇంత బాధ్యత ఎట్లా నిర్వహించగలిగారా అని. ఉదాహరణకి, **ప్రసిద్ధ రచయిత్రి జ్ఞానపీఠ పురస్కార స్వీకర్త మహాశ్వేతాదేవి తన జీవితం ఉత్తరార్థంలో బెంగాల్‌లో డీనోటిఫైడ్ తెగల గురించి కృషి చేసిందని మనకు తెలుసు. డాక్టర్ లలిత ఆంధ్రప్రదేశ్‌లో విముక్తజాతుల మీద చేసిన పరిశోధన, వెలువ రించిన పుస్తకాలు, తక్కిన సమాజంలో వారిపట్ల రేకెత్తించిన జాగృతిని అంచనా వేసుకుంటే, ఆమె మహాశ్వేతాదేవి కృషికి సమానమైన, ఇంకా చెప్పాలంటే ఒక పాలు ఎక్కువే కృషి చేసారని అనిపిస్తున్నది.** పూర్వపు మద్రాసు రాష్ట్రంలోనూ, నైజాంలోనూ, ఆ తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ విముక్త జాతుల కోసం నిర్వహించిన పునరావాస కేంద్రాలు – కప్పరాళ్ళతిప్ప, సీతానగరం, సిద్ధాపురం, బిట్రగుంట, లింగాల, స్టువర్ట్ పురాలను ఆమె స్వయంగా అధ్యయనం చేసి, నేరస్థులుగా ముద్రపడ్డ 300 మందిని ఇంటర్వ్యూ చేసి, 1871 నుంచి పాత రికార్డులు తవ్వితీసి, ఆ జాతుల మీదా, వారి సమస్యల మీదా ఆమె ప్రసరించిన వెలుతురు అసామాన్యమైనది. ఒక ప్రభుత్వ శాఖనో, లేదా ఒక విశ్వవిద్యాలయమో చేపట్టవలసిన పనిని ఆమె ఇద్దరు విద్యార్థుల్ని వెంటబెట్టుకుని చేశారంటే అనూహ్యంగానూ, ఆశ్చర్యంగానూ ఉంటుంది.

బహుశా ఆ కృషిలో ఆమెలో పూర్వమహాసంస్కర్తల రక్తం ప్రవహిస్తూ ఉందనుకుంటాను. ఒక వీరేశలింగం, ఒక వెన్నెలకంటి రాఘవయ్య, ఒక దుర్గాబాయి దేశ్‌ముఖ్‌లతో మాత్రమే లలిత గారిని పోల్చగలనని పిస్తుంది. విముక్త జాతులతో పాటు, ఆమె దేవదాసీలపైనా, జోగినులు, బసివి, ఆడపాపలపైనా, దొమ్మరిసానులపైనా, వేశ్యావృత్తిపైనా కూడా మౌలికమైన, విశ్వసనీయమైన క్షేత్రపరిశోధన చేశారు. నటరాజ రామకృష్ణ




నిజామాబాద్ జిల్లా వర్ణిలో గల సంస్కార్ కేంద్రంతో లవణం, హేమలతా లవణంలతో వకుళాభరణం లలిత

కృషిపైన సమగ్ర రచన చేశారు. ఇవన్నీ ఒక ఎత్తూ, ఆమె పూర్వపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గిరిజనులపైన చేసిన పరిశోధన ఒక ఎత్తూ. అసలు ఆమె నాకు పరిచయం కావడమే ఆ పరిశోధనల సందర్భంగా. అటు శ్రీకాకుళం సవర వారి నుండి, ఇటు అదిలాబాద్ గోండుల దాకా ఆమె 18 గిరిజన తెగల నృత్యరీతుల మీద పరిశోధనలు చేయించారు. అది కూడా మెడికల్ లీవ్ పెట్టుకుని, ఎర్న్‌డ్ లీవ్ ఖర్చుపెట్టుకుని.

ఆమె గొప్ప గురువుల దగ్గర చదువుకున్నారు. కావలి విశ్వోదయలో డి.ఆర్., యస్వీ భుజంగరాయశర్మ, వేదుల సత్యనారాయణ శాస్త్రి, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, శ్రీపాద గోపాలకృష్ణమూర్తి, కె.వి. రమణారెడ్డి వంటి వారి దగ్గర. ప్రసిద్ధ మానవశాస్త్రవేత్త పి.కె. భౌమిక్ పర్యవేక్షణలో ఆమె పీహెచ్‌డీ చేశారు. ఇవి కాక **ఆమె ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ వ్యవస్థాపక సభ్యురాలు. ఆమెకీ, రామకృష్ణ గారికీ ఆ సంస్థతో జీవితకాల అనుబంధం. ఇవి కాక అస్మిత, నవవికాస్ వంటి సంస్థల్లో ఆమెది క్రియాశీల పాత్ర. నిర్మాలో ఆదివాసీ విభాగానికి గౌరవాధ్యక్షురాలు. రొమిలాథాపర్, బిపిన్ చంద్ర వంటి చరిత్రకారులతో లవణం దంపతులు, ఎస్.ఆర్. శంకరన్, వెన్నెలకంటి రాఘవయ్య వంటి సంఘ ప్రేమికులతో కలిసి పనిచేసిన కృషి ఆమెది. ఒక స్త్రీని చదివిస్తే ఒక కుటుంబాన్ని చది వించినట్టనేది పాతమాట. ఒక స్త్రీని చదివిస్తే ఒక సమాజాన్ని చది వించినట్టనేది లలితగారి జీవితం చెప్పే కొత్తమాట.**

'నా జ్ఞాపకాలు' (2012) పేరిట ఆమె రాసుకున్న అనుభవ కథనం హైస్కూలు విద్యార్థులకి పాఠ్యగ్రంథంగా పెట్టవలసిన పుస్తకం. ఆమె ఇంగ్లీషులో మాట్లాడుతుండగా విని ఒకరాష్ట్ర గవర్నరు ఆమెని ఐఏఎస్ ఎందుకు చేయలేదని అడిగాడట. ఆమె తల్లి విశాలాక్షమ్మ ఆమె డాక్టరు కావాలనుకుంది. కానీ డాక్టర్ లలిత తానొక పూర్తికాలపు సంఘసేవికురాలు కావాలనే అనుకున్నది. ఆమె ఒకచోట ఇలా రాసుకున్నారు: 'సంఘ సేవనే జీవిత పరమావధిగా ఎంచుకోలేకపోవడానికి కారణం ఒకవైపు కుటుంబ బాధ్యత, ఇంకోవైపున ఉద్యోగ బాధ్యత. అయినా వీధిలో అరుచు కుంటూ తిరుగుతున్న బుడబుక్కలవారు, ఒంటికి సరైన వస్త్రాలు లేక వేళకు

తిండిలేక అలమటిస్తున్న యానాదులు, అట్లే సఫాయి కర్మచారులుగా వీధివీధినా తిరుగుతున్న చల్లాయానాది స్త్రీలు –వీరందరూ నా దృష్టినుంచి ఏనాడు తప్పించుకోలేదు...వేశ్యావృత్తిలో ఉన్న స్త్రీలు, వారు చూపిన మాన వతా విలువలు నాలో ఇంకా ఇంకిపోలేదు.' కాని, మనకాలంలో ప్రభుత్వమూ, సాంఘిక సేవాసంస్థలూ చేస్తున్న కృషికి డాక్టర్ లలిత చేసిన కృషి ఏ మాత్రమూ తక్కువకాకపోగా, చాలాసార్లు, నాబోటి ప్రభుత్వోద్యోగులకి ఆ కృషి నుంచి ప్రభుత్వం నేర్చుకోవలసిందే చాలా ఉందని అనిపిస్తున్నది కూడా.

తన జ్ఞాపకాలు తలుచుకుంటూ ఆమె ఒకచోట ఇలా రాశారు: **'ఆనాటికీ, ఇనాటికీ అదే జీవితం, విశ్రాంతిలేని జీవితం, సుసంపన్నమైన జీవితం. ఆనాడు విశ్రాంతి లేని జీవితం గడపబట్టే ఈనాటికీ విశ్రాంతి లేని జీవితం అలవడింది. అందుకే ఒకరకంగా నాది సుసంపన్నమైన జీవితం అని చెప్పుకోవాలి'** అని.

బహుశా హాస్పిటల్లో ఉన్న ఈ చివరి మూడు వారాలూ విశ్రాంతి అనుకుందామా అంటే, రెండు రోజుల క్రితం రామకృష్ణ గారితో అన్నారట. 'ఇక్కణ్నుంచి తొందరగా డిశ్చార్జి అయిపోతే, నేను స్త్రీల సమస్యల గురించి రాద్దామనుకున్న 'ఊంబ్ టు టూంబ్' తొందరగా పూర్తి చేయాలి' అని. ఆ పుస్తకమే కాదు, ఎరుకలవారి పైన ఒక బృహద్గ్రంథం కూడా ఆమె రాయాలనుకున్నారు. ఇంకా అంతకన్నా బృహత్ప్రణాళిక, తెలుగు రాష్ట్రాల్లోని 35 గిరిజన తెగలకు చెందిన స్త్రీల పైనా ఆమె ఒక సమగ్ర రచన తేవాలనుకున్నారు. మేమెప్పుడు కలుసుకున్నా ఆ పుస్తకం గురించే మాట్లాడేవారు. ఆ మాటలు వింటుంటే, యాంత్రోపాలజీలో ఎమ్మే చదువుతున్న ఒక యువతిని చూస్తున్నట్టుండేది.

'ఊంబ్ టు టూంబ్' సార్థకంగా జీవించిన అరుదైన మనిషి డాక్టర్ వకుళాభరణం లలిత.

('ఆంధ్రజ్యోతి'దినపత్రిక 3 మార్చి 2017నుండి)

కవిత

# రెక్కలు కావాలి

–బి.వి.శివప్రసాద్
98485 27109

నాన్నా రెక్కలు కావాలి
అడిగింది ఆరేళ్ళ నా తనయ
అమాయకంగా, అత్యుత్సాహంగా
నా కళ్ళలోకి చూస్తూ...
ఏం చేస్తావమ్మా వాటితో?
అడిగాను ఒకింత సంభ్రమంతో...
పక్షిలా పైకెగురుతూ
హాయిగా పాటపాడతా! అంది
నాకూ ఎన్నాళ్ళనుంచో
ఎదలో ఆగక ఒకటే గీతిక
వినీలాకాశంలో విహంగం తీరుగా
విహరించాలనే తీరని కోరిక
అదే పాదాల అవిశ్రాంత నడక
ఎన్నో గమ్యాలను చేరుకున్న పిదప
మరేవో అనుభూతులకోసం
చేతులలో రెక్కలు మొలిపించుకుని
ఎక్కడికో ఎగరాలని ఎంతెంతో తపన...
దేహానికి రెక్కలు మొలవడం ఓ కలా?
మా ఇద్దరి కోరిక తీరేదెలా?
ఇది వైద్యశాస్త్రానికే పెనుసవాలా?
మానవాళి మనుగడలో సరికొత్త మార్పుకు ఆనవాలా?

**వకుళాభరణం లలిత**–19వ పుట తరువాయి

ద్వారా నిరూపించుకున్నారు. ఎక్కడా ఘర్షణకు తావివ్వని రీతిలో తన అస్థిత్వాన్ని నిలుపుకున్నారు. సాధారణంగా మర్రిచెట్టు నీడలో మామూలు మొక్కలు వికసించడం కొంచెం కష్టం. దీనిని కూడా లలితగారు తప్పు అని నిరూపించారు. ఆంధ్ర సాంఘిక చరిత్ర రచన, విశ్లేషణల్లో జగద్విఖ్యాతుడైన భర్త వకుళాభరణం రామకృష్ణ గారికి దీటుగా ఆమె ఎదిగారు. రచనలు చేశారు. పరిశోధనను కొనసాగించి పుస్తకాలను ప్రచురించారు. ఉపన్యాసాలిచ్చారు. విస్మృత వర్గాల చరిత్రను ప్రభుత్వాల దృష్టికి, సమాజం దృష్టికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో ఆమె కృషిని నమ్ముకున్నారు. ఘర్షణను మరచారు. ప్రమాదాలను సైతం ఎదుర్కొన్నారు. నక్సల్ సమస్య తీవ్రంగా ఉన్న సమయంలో ఆమె మల్లిగాంధితో కలిసి మహబూబ్‌నగర్ జిల్లా లింగాల సెటిల్మెంట్‌ని సందర్శించారు. అపుడు వారు స్థానికంగా ఉన్న ప్రభుత్వ అతిథి గృహంలో బస చేశారు. ఆమె క్షేత్ర పరిశోధన పూర్తిగావించి తిరిగి వెళ్ళిన మరునాడే ఆ భవంతిని నక్సలైట్లు పేల్చివేశారు. బహుశా, లలితగారి నిష్క్రమణ కోసమే ఈ సంఘటన ఆగి ఉంటుందేమో? ఇలాంటి సంఘటనలను సైతం ఆమె లెక్కచేయక తన కృషిని కొనసాగించారు.

సమాజంలో పురుషులు చేయగల్గిన ప్రతి పనినీ స్త్రీలు అవలీలగా చేయగలరని నిరూపించిన ధీరోదాత్త వనిత వకుళాభరణం లలిత. దీనిని ఆమె పోరాటం ద్వారా సాధించలేదు. తన నిత్య ఆరాటం ద్వారా సాధించారు. తన కృషి ద్వారా సాధించారు. తనమౌలిక పరిశోధన ద్వారా సాధించారు. తన రచనల్లోని సాంఘిక, చారిత్రక విషయ విస్తృతి ద్వారా సాధించారు. ప్రఖ్యాత సంఘసంస్కర్త దంపతులైన లవణం– హేమలతా లవణం మాటల్లో చెప్పాలంటే "వకుళాభరణం లలిత ఒక సామాజిక మహిళ. ఆమె పుట్టుక, బతుకు వ్యక్తిగతం. ఆమె జీవనం, జీవితం సంఘహితం" ఆమె ఒక మహిళగా జన్మించారు. ఒక మహామనిషిగా మరణించారు. ఒక ఆదర్శమూర్తిగా ఆమె తప్పకుండా మనందరి ఆలోచనల్లో, సాంఘిక పరిశోధకుల మనస్సుల్లో, నిబద్ధంగా క్షేత్రపరిశోధన చేపట్టే విద్యార్థుల, విద్యావ్యాసంగుల సిరాచుక్కల్లో, వాక్య నిర్మాణాల్లో జీవిస్తారు. అదే ఆమెకు నిజమైన, నికార్సయిన, సాంఘిక, బౌద్ధిక, పరిశోధక శ్రద్ధాంజలి◆

గుండెలోతుల్లోంచి వచ్చేదీ,
మనసువిప్పి చెప్పగలిగేది
అమ్మనుడిలోనే.

భాషా చైతన్యం

# తెలుగు- ఆంగ్లభాషల సంబంధం ప్రభావాలూ, పర్యవసానాలూ

-ఆచార్య గారపాటి
ఉమామహేశ్వరరావు
98661 28846

ప్రవహించే నదికి నిలకడ ఉండదు. ఎన్నింటినో తనలో కలుపుకుంటూ, తాను ఎన్నింటిలోనో కలుస్తూ ఎల్లప్పుడూ మార్పులకు లోనవుతూ ఉంటుంది. భాష కూడా అంతే. ఒక కాలంలోని భాషను గానీ ఒక ప్రాంతంలోని భాషనుగానీ తీసుకొని భాషాస్వరూపమూ, స్థితీ ఇది అనీ, ఎప్పటికీ ఇవి ఇలాగే ఉంటాయనీ నిర్ణయించలేం. నదిలో నీటి ప్రవాహ వేగం, రంగూ రుచీ ప్రాంతాన్ని బట్టీ మారుతున్నట్లే కాలాన్ని బట్టీ భాషలలో మార్పులు కనబడుతుంటాయి. భాషలలో మార్పులతోబాటు కొన్నిసార్లు భాషల పేర్లు మారుతుంటాయి. కాలానుగుణంగా వచ్చిన రాజకీయ, సామాజిక కారణాల వలన భాషల వాడుకలోనూ వాటి స్థాయిలోనూ మార్పులు చోటు చేసుకోవచ్చు. దక్షిణాపథంలో ఎప్పుడూ ప్రజల వాడుకలో తెలుగు ప్రాచుర్యంలో ఉన్నా, కొన్నిసార్లు ప్రాకృతం, సంస్కృతం, పర్షియను, ఉర్దూ భాషలు అధికార భాషలయ్యాయి. ఈ భాషలవలన ఒకటిరెండు రంగాలలో మాత్రమే తెలుగు వాడుకకు నష్టం కలిగింది. అయితే, నేడు అతివేగంతో నడిచే సమాచార సాంకేతిక యుగంలో మార్కెట్ శక్తుల బలమే పునాదిగా భాషల ఉనికికే ప్రమాదం ముంచుకొచ్చింది. ఈ సందర్భంలో భారతీయ భాషల నేటి దుస్థితికి కారణాల్ని వాటి నేపథ్యాలను ఒక సారి సమీక్షించుకోవలసిన అవసరం ఉంది.

**వలస భారతంలో భారతీయ భాషలు:**

ఒకప్పటి భారతదేశానికి గవర్నర్ జనరలైన విలియం బెంటింక్ 'కొత్త విద్యా విధానంతో', ఈ దేశ 'అధికారిక భాషగా ఇంగ్లీష్' పరిచయం అయింది. ఆ విధానం ఆంగ్ల భాషా మాధ్యమం ద్వారా భారతదేశంలో పడమటి దేశాల విద్యా వ్యాప్తికీ ఆ పై సంస్కృతి వ్యాప్తికీ దారితీసింది. ఆధునిక విజ్ఞానం, పడమటి విద్యావిధానంతో ప్రభావితులైన కొందరు భారతీయులు రామ్మోహన్ రాయ్ నాయకత్వంలో ఆంగ్ల భాషవైపు మొగ్గుచూపారు. ఐతే, అప్పట్లో వ్యతిరేక అభిప్రాయాలు కలిగిన రెండు వర్గాలు ఉండేవి. తూర్పు దేశాల సాంస్కృతిక భాషలైన సంస్కృతం, అరబిక్ పర్షియన్ కు అనుకూలమైనవారు ప్రాచ్యవాదులనీ ఇంగ్లీష్ కు అనుకూలం అనుకునేవారిని ఆంగ్లవాదులనీ పిలిచారు. ఇదే ఆ తరువాత ఆంగ్ల-ప్రాచ్య వివాదంగా ప్రసిద్ధి చెందింది.

ఈ వివాదం పది సంవత్సరాలు నడిచింది. బెంటింక్ భారతదేశానికి గవర్నర్ జనరల్ గా వచ్చేముందు కూడా ఐదు సంవత్సరాలు ఈ వివాదం నడిచింది. రామమోహన్‌రాయ్ - సంస్కృతానికి వ్యతిరేకంగా ఆనాటి బ్రిటిషు ప్రభుత్వానికి ఒక అభ్యంతరపత్రాన్ని సమర్పిస్తూ అందులో "ఇప్పటికే అటువంటి విద్యను బోధిస్తుండగా, మళ్లీ ప్రభుత్వంవారు హిందూ పండితులతో ఒక సంస్కృత పాఠశాలను(కలకత్తాలో)ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిసింది. ఈ నిర్ణయం వ్యక్తికీ సమాజానికీ ఉపయోగపడని వ్యాకరణ సౌందర్యాలనూ అధిభౌతిక తత్త్వశాస్త్ర సూక్ష్మభేదాలనూ యువత బుర్రలలో నింపుతుందని మాత్రమే అనుకోవచ్చు" అని తన అభ్యంతరాన్ని తెలియజేశాడు. ఆయన తన అభ్యంతరపత్రంలో "గణితం, సామాన్య తత్త్వశాస్త్రం, రసాయన, శరీర సంరచన లాంటి ఇతర ఆచరణాత్మక శాస్త్ర విషయాలను ఎన్నిటినో బోధించే ఉదారవాద జ్ఞానసంపన్న వ్యవస్థ" కోసం అభ్యర్థించాడు. క్లుప్తంగా చెప్పాలంటే, రామ్మోహన్ రాయ్ తన మద్దతుదారుల్తో కలిసి ఇంగ్లీషు మాధ్యమంలో పడమటి విద్యకోసం వాదించాడు.

ప్రాచ్యవాదులకు తూర్పుదేశాల లేక భారతీయ విద్యా వ్యవస్థ అతి విలువైనదిగా కనబడింది. వారిలో కొంతమంది గంభీరమైన పాండిత్యం గలవారు ఉన్నారు. వారు ప్రాచీన భాషలను ఎంతో కష్టపడి చదివారు. కొంతమంది సంస్కృతాన్ని జ్ఞాననిధిగా భావించారు. వారిలో కొంతమంది పాశ్చాత్యులే. భారతీయులు తమ దేశ సంస్కృతీ శాస్త్రాలను తమ భాషలలోనే నేర్చుకోవాలని వాదించారు. వారిలో గుర్తింపుపొంది ప్రసిద్ధులైనవారు హొరేస్ హైమన్ విల్సన్, ఎచ్.టి. ప్రిన్సెప్, ఇంకా డబ్ల్యు ఎచ్.మెక్నోటెన్ మొదలైనవారు. వారిలో కొంతమంది, "సంస్కృతం అరబ్బీ భాషలలో ఉన్న తత్త్వశాస్త్రాలు ఇతర భాషలలో అధ్యయనం చేసినట్లే ఆ భాషలలోకూడా చదవవచ్చు" అని అన్నారు. "భారతీయుల అంకగణితం, బీజగణితం అవే ఫలితాలను ఇస్తాయి. యూరపులో ఉన్న నియమాలపై ఆధారపడినవే. మద్రసాలలో నేర్పే గణితశాస్త్ర మౌలికాంశాలు యూక్లిడ్ కి సంబంధించినవే" అంటూ వాదించారు.

ఈ వివాదం తీవ్రంగా ఉన్నప్పుడు బెంటింక్ భారతదేశం చేరుకున్నాడు. గవర్నర్-జనరల్ దీన్ని చాలా సంక్లిష్ట విషయంగా పరిగణించాడు. చాలా పరిపాలనా విభాగాలలో భారతీయులను నియమించాలి అనుకుంటున్నాడు కాబట్టి దానికోసం ఇంగ్లీషులో విద్య అవసరం అని అనుకొన్నాడు. కానీ నిర్ధారణకు వచ్చేందుకు కొంత కాలంగా వేచిచూస్తున్నాడు.

అప్పుడే, అంటే 1834లో మెకాలే ఇండియా రావటం జరిగింది. ఇతనికి గవర్నర్ జనరల్ మండలిలో న్యాయ సభ్యుడిగానేగాక విద్యా విషయాల బాధ్యతను గూడా అప్పజెప్పాడు. ఈ పరిస్థితిలో మెకాలే ఆనాటి భారతదేశానికి విద్యావిధానాన్ని తయారుచేసే పనిలో మునిగిపోయాడు. ఐతే, ఆయనకు ప్రాచ్య దేశాలగురించి తెలిసింది తక్కువ. ప్రాచ్య విద్యపైగానీ ప్రాచ్య భాషలన్నాగానీ గౌరవం లేదు. సహజంగానే ప్రాచ్యవిద్యావాదులను ఈసడించుకొని ఆంగ్లవాదులను సమర్థించాడు. 1835 ప్రారంభంలోనే భారతదేశపు విద్యావిధాన నివేదికను పర తంత్ర భారత ప్రభుత్వ పరిశీలనకు సమర్పించాడు.

'మెకాలే విద్యావిధాన నివేదిక'గా కుఖ్యాతిని సంపాదించుకున్న ఈ నివేదికలో మెకాలే పనిగట్టుకొని సంస్కృత అరబ్బీ భాషలనూ

ప్రాచ్య దేశాల సాహిత్యాన్నీ, విజ్ఞానాన్ని నిశితంగా విమర్శించాడు. ప్రాచ్య భాషాసాహిత్యాలను విమర్శిస్తూనే ఆంగ్లభాషను బాగా ప్రశంసించాడు. అందులో ఇంగ్లీషును భారతదేశపు పాలక భాషగానూ అభివర్ణించాడు. ఐతే మెకాలే ఊహించనిది నేడు కొంత నిజం ఔతున్నదేమోనన్న అనుమానం కలుగుతోంది. ఇంగ్లీషు భాష భారతీయ సామాన్య జనవ్యవహారంలోకి త్వరత్వరగా వచ్చేస్తోంది. కానీ మెకాలే అనుకున్నదల్లా ఇంగ్లీషు భాష ప్రాచ్య విద్యా విధానం ద్వారా ప్రాచ్య దేశాల వ్యాపార భాషగానూ సామ్రాజ్యాధిపత్య భాషగానూ విస్తరిల్లాలని మాత్రమే. ప్రజల భాషగా కాదు.

మెకాలే దేశభాషల ద్వారా జనాదరణ కలిగిన విద్యావిధానం గురించి ప్రస్తావించలేదు. నాడు బ్రిటిషు ప్రభుత్వ పాలకులకూ కోట్లాది జనులకూ మధ్య దుబాసీలుగా పనిచేసే భారతీయులను రక్తమూ రంగూ భారతీయమైనా రుచీ అభిరుచులలోనూ ఆచారాలూ ఆలోచనలలోనూ నీతికీ బుద్ధికీ ఆంగ్లమానస పుత్రులైన ఒక వర్గాన్ని తయారు చేయాలన్నదే ఆయన కోరిక. ఈ వర్గమే దేశభాషలను సంస్కరించి, శాస్త్ర పరిభాషను రూపొందించి, వాటిని ఆధునిక అవసరాలకు మహాజనసామాన్యానికి జ్ఞానాన్ని అందించే దిశగా సాగాలని ఉద్దేశించాడు. ఇట్లా మెకాలే ఇంగ్లీషును భారతదేశపు ఉన్నత విద్యాభాషగానూ పడమటి విజ్ఞానాన్ని అధ్యయన అధ్యాపన విషయాలుగా చేయాలని సూచించాడు. ఇలాంటిదానికే ఎదురు చూస్తున్న బెంటింక్ వెంటనే దీనికి తన ఆమోదం తెలిపాడు. దీని ఆధారంగా, 1835 మార్చి 7వ తేదీన ప్రభుత్వం ఒక తీర్మానం చేసింది. ఆ తీర్మాన సారాంశమే, 'ఏలినవారి అభిప్రాయం ఏమిటంటే బ్రిటిషు ప్రభుత్వంవారి ఘనమైన లక్ష్యం యూరోపియన్ సాహిత్యమూ విజ్ఞానాన్ని భారతీయులలో పెంపొందించడం. ఇలాంటి విద్యకోసం ఉద్దేశించిన నిధులను పూర్తిగా ఇంగ్లీషు విద్యకోసమే వినియోగించాలి' అని.

**భారతీయ భాషల హక్కుల హరణం:**

బెంటింక్ ప్రవేశపెట్టిన ఈ ప్రతిపాదన భారతీయ విద్యావ్యవస్థ చరిత్రలోనే ఓ కొత్త అధ్యాయానికి తెరతీసింది. ఆనాటినుంచే పడమటి విద్యావిధానంతోపాటు ఇంగ్లీషు వాడకం వేళ్లూనుకొంది. కొత్తగా ప్రారంభించిన కాలేజీలూ విశ్వవిద్యాలయాలతోనూ వాటివల్ల వచ్చిన ఉద్యోగాల లభ్యత వలన ఇంగ్లీషు నేర్చుకోవాలనే తపన పెరిగింది. ఈ చారిత్రాత్మక మార్పు భారతదేశపు వేల సంవత్సరాల వారసత్వ సంపదగా సంక్రమించిన భాషా సంస్కృతులకు పోయేకాలం దాపురించిపెట్టిన ఘనత మెకాలేకు దక్కుతుంది.

1854 వరకూ భారతదేశం వచ్చిన ఆంగ్లేయులూ, యూరోపియన్లూ, తదితర అధికారులూ అందరూ స్థానిక భాషలను అధ్యయనం చేస్తూ స్థానిక పండితులనుండీ స్థానిక భాషలను నేర్చుకొంటూ ఉండేవారు. ఈస్టు ఇండియా కంపెనీ ఏలుబడిలో భారతీయ భాషలలోనే పాలన సాగేది. అయితే, నూట ఎనభై ఏళ్లకిందట ప్రారంభమైన ఆంగ్ల విద్యావిధానం ఒకరకంగా దేశీయ భాషల ప్రయోజకత్వాన్ని ప్రశ్నించేదిగా తయారైంది. దానికి కారణం 1857 నుండి ప్రారంభమైన కేంబ్రిడ్జి, ఆక్స్ఫర్డు మాదిరి విశ్వవిద్యాలయాలూ, కళాశాలలూ, ఉన్నత పాఠశాలలూ, వాటిలో చదివినవారికే బ్రిటీషు పాలనలో ఉద్యోగాలూ. దీనితో భారతీయ విద్యాబోధన ఒక్కసారిగా ఇంగ్లీషుకు మళ్లడం, ఆంగ్లవిద్యను జీవనానికి ముడిపెట్టడం ఒకేసారి జరిగిపోయింది. ఇది భారతీయ భాషలకు ఊహించరాని దెబ్బ. బ్రిటిషు ఇండియాలో ప్రభుత్వం అధికారికంగా ఒకే భాషతో పని చేసింది. అదే ఇంగ్లీషు. ఆనాడే భారతీయ భాషలకు చెల్లుచీటీ రాయడం జరిగింది. ఐతే ఉద్యోగాలు తక్కువ అవడం, అత్యధిక జనం 99% స్థానిక సాంప్రదాయిక వనరులైన వ్యవసాయమూ, వృత్తిపనులపై ఆధారపడడం చేత భారతీయ భాషలకు ఏమంత నష్టం జరగనట్లే అనుకోవాలి. ఇంగ్లీషు విద్యావిధానంతో హైస్కూలు విద్యవరకూ తెలుగులోనూ ఆపైన కళాశాల లేక విశ్వవిద్యాలయ చదువులు ఐచ్ఛికంగా ఇంగ్లీషులో ఉండడం వలన ఇంగ్లీషు పరిపూరకస్థితిలో ఉండేది. అంటే ఇంగ్లీషు కొన్ని రంగాలకే పరిమితమై ఉండేది. ఉదాహరణకు ఉన్నత విద్య, ప్రభుత్వ పాలనా న్యాయ రంగాలకే పరిమితం. తెలుగూ తదితర భారతీయ భాషలను ఇతర రంగాలన్నింటా స్వేచ్ఛగా వాడుతుండేవారు. ఇదే కాలంలో ఇంగ్లీషు విద్య వలన దాని ప్రభావంతో భారతీయ భాషల వాడకంలో మార్పులు చోటుచేసుకున్నాయి. తెలుగులో ఆంగ్ల లేక యూరోపియను భాషా సరళిలో వ్యాకరణాల రచనా, నిఘంటువుల నిర్మాణం, వచన రచనల వాడకం పెరగడం ఒక రకంగా రచనా భాషను ప్రజలకు చేరువచేసే ప్రయత్నం జరిగింది. అయితే ఉన్నత విజ్ఞాన భాషలుగా పాలనా భాషలుగా వాడకానికి వీలులేకుండా చేయడం కాళ్లూ చేతులూ విరిచి రెక్కలు కట్టినట్లు ముందుకు సాగడానికి వీలులేకుండా శాశ్వతంగా వైకల్యాన్ని అంటగట్టింది. ఇది తెలుగుకూ తదితర భారతీయ భాషలకూ కోలుకోలేని స్థితికి తీసుకువెళ్లింది.

ఆధునిక యుగంలో ఏర్పడిన సామాజికభాషా సంక్లిష్టతకు వ్యాపారం, ఉద్యోగం, సంస్కృతి, విజ్ఞానంవంటివి ఎన్నో కారణాలు ఉన్నాయి. ఈ ప్రభావాలవల్ల ఆధునిక సమాజంలో వినిమయ వస్తు సముదాయాన్ని పునర్నిర్వచించవలసివస్తోంది. నేడు 'భాష' ఒక వినిమయ వస్తువు. ఒకప్పటి సాంస్కృతిక ఉపకరణం అత్యంత వేగంతో నేడు సామాజిక ఉన్నతికి ఉపకరణంగా మారుతోంది.

భారతదేశపు మొత్తం జనాభా నూట పాతిక కోట్లు కాగా, వారిలో సగం 25 ఏళ్లవారు –అంటే వారిలో 55 కోట్లమంది యువకులే. ఇంగ్లీష్ మాట్లాడేవారి శాతం వయోజన భారతీయుల్లో కంటే యువ భారతీయుల్లో ఎక్కువ. ఇంగ్లీష్ మాట్లాడేవారు మొత్తం భారత జనాభాలో (రెండవ భాషగా మాట్లాడేవారినీ మూడవభాషగా మాట్లాడే వారినీ కలుపుకొని) 9 శాతం ఉన్నట్లు అంచనా. అమెరికా సంయుక్త రాష్ట్రాల తర్వాత ప్రపంచంలోని రెండవ అతిపెద్ద ఆంగ్లం మాట్లాడే దేశంగా భారతదేశం ఆవిర్భవించింది. వైవిధ్యంలో, భారతదేశాన్ని మొత్తం ఐరోపా ఖండంతో పోల్చవచ్చు. భారతీయ రాష్ట్రాలు కొన్ని యూరోపియన్ దేశాల కంటే పెద్దవిగా ఉన్నాయి. ప్రతి రాష్ట్రానికీ దాని సొంత సంస్కృతీ దాని స్వంత భాష ఉన్నాయి. ప్రతి భారతీయ భాషా మరో భారతీయ భాషకు భిన్నంగా ఉంటుంది. ప్రతి భారతీయ భాషకూ దాని సొంత లిపి – ఉంటుంది. నేడు, విద్యావంతులైన భారతీయుల్లో ఇంగ్లీషు ఒక అనధికారిక "ఉమ్మడి" భాష. ఉన్నత విద్యను అభ్యసించిన భిన్నరాష్ట్రాల భారతీయులు ఇద్దరు కలిస్తే, వాళ్ల సంభాషణ ఇంగ్లీష్‌లోనే ఉండటం సర్వసాధారణం. నేడు కార్పొరేట్ వ్యాపారం, బ్యాంకింగ్, విద్య, ప్రభుత్వపాలనా రంగాలలో

ఆంగ్లానిదే పైచేయి. భారతదేశంలో కంప్యూటర్ వినియోగదారులు ఉపయోగించేది -ఇంగ్లీషే. భారతదేశపు సమాచార ప్రసార సాధనాలలో ప్రధాన నగరాలలో ఇంగ్లీష్ ఛానెళ్ల వాడకం తక్కువేమీ కాదు. ప్రపంచంలోనే అతిపెద్ద వార్తా పత్రికలలో మొదటి రెండు స్థానాలలో ఉన్న హిందుస్తాన్ టైమ్స్ మరియు ది హిందూ ఆంగ్ల దినపత్రికలు భారతదేశంలోనివే. భారతదేశపు సామాజిక కలనేతలో ఇంగ్లీష్ పాత్ర చాలా విలక్షణమైనది. భారతదేశానికి పట్టణం, గ్రామీణం అనే రెండు ముఖాలు ఉన్నాయి. గ్రామీణ భారతదేశం ఇంగ్లీష్ మాట్లాడటం లేదు, అయితే పట్టణ ప్రజలలో చెప్పుకోదగినంత మంది ఇంగ్లీష్ వాడుతుండవచ్చు. భారతదేశంలో ఇంగ్లీష్ సామాజిక ఉన్నతికి సూచికగా మారింది. భారతీయ సమాజంలో ఉన్నత, మధ్య తరగతి వర్గాలు ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడగలవు. నేడు, ఆంగ్లభాషా పరిజ్ఞానం సామాజిక ఉన్నతికి ఒక అత్యవసరంగా మారింది.

భారతదేశపు ఉన్నత విద్యా మాధ్యమ భాషగా పిలవని పేరంటానికి వచ్చిన ఇంగ్లీష్, ఆధిపత్య ధోరణిలో నెరపుతున్న దాని కర్రపెత్తనం, భారతీయ భాషలను అటకెక్కించివేసే దిశలో సాగుతోంది. ఈ విషయాన్ని ఆలంకారికంగా చెప్పాలంటే భారతీయులు ఇంగ్లీషు సరొగేట్ తల్లికి మారుటి పిల్లలు అని చెప్పవచ్చు.

**భారతీయ భాషలూ–ఇంగ్లీషూ: స్థితి–పరిస్థితి:**
**సాహిత్య, విద్యారంగాలు:**

భారతీయ భాషలు గడచిన రెండువందల ఏండ్లలో ఇంగ్లీషు తదితర పాశ్చాత్య భాషాప్రభావానికి గురయ్యాయి. పరభాషా ప్రభావం భారతీయ భాషలకు కొత్త విషయమేమీ కాకపోయినా పాశ్చాత్య భాషల ప్రభావం భారతీయ భాషలలో అనేక రకాల మార్పులు చోటుచేసు కునేందుకు దోహదంచేశాయి. ఈ ప్రభావం భారతీయ భాషలలో గుణాత్మకమైన మార్పులకూ పరిపుష్టికీ దోహదంచేసినా ఉత్తరోత్తరా వాటి ఉనికే ప్రశ్నార్థకమయ్యేలాగా చేసింది అనాలి. ఆధునిక యుగంలో ఆంగ్లభాషా పరిచయం వలన మన సాహిత్యం పరిపుష్టి అయిందని చెప్పవచ్చు. ఆంగ్లసాహిత్యాన్ని చదివి, అక్కడి భావజాలమే కాకుండా సాహితీ ప్రక్రియలు సైతం దిగుమతి అయ్యాయి. కథ, నవల, ఖండకావ్యం, ఆత్మకథ, జీవితచరిత్ర లాంటి ప్రక్రియలెన్నో తెలుగులో ఆవిర్భవించాయి. ఉదాహరణకు 'సత్యరాజా పూర్వదేశ యాత్రలు' అనే రచననే తీసుకుంటే దీనికి మూలం జోనాథన్ స్విఫ్ట్ రాసిన 'గలివర్ ట్రావెల్స్' అనే రచన మూలం. తర్వాతికాలంలో అనేక రచయితలు విదేశీ రచయితలచేత ప్రభావితులయ్యారు. ఎడిసన్ రాసిన 'స్పెక్టేటర్'ను చదివిన తరువాతే పానుగంటివారు 'సాక్షి'ని సృష్టించారు. భమిడిపాటి, మొక్కపాటివారి నాటక సృజన మోలియర్ నాటకాలు చదివిన ప్రభావమే. పిజి ఉడ్‌హౌస్ రచనలకు ప్రభావితులైన తెలుగు రచయితలలో పాలగుమ్మి పద్మరాజుతో సహా ఎందరో రచయితలు వున్నారు. శ్రీశ్రీ, ఆరుద్ర వంటి మహామహుల హాస్యపద్య రచన ఆగ్డెన్ నాష్ రాసిన లిమరిక్స్ ప్రభావమే అంటారు. ఆధునికి విమర్శ కూడా భారతీయ అలంకారశాస్త్ర పరిధిని దాటి పాశ్చాత్య ప్రభావంతో కొత్తపుంతలు తొక్కింది. సంప్రదాయ సాహిత్యంపైనే కాక అలంకారాది శాస్త్రాలపై కూడా సంస్కృత భాషాప్రభావం అధికంగా ఉన్న కాలంలో తెలుగు వ్యాకరణ రచన సంస్కృత వ్యాకరణ సంప్రదాయాలను అనుసరించింది. కొన్ని వ్యాకరణాలు, వ్యాఖ్యానాలు సంస్కృతవ్యాకరణ ప్రభావంతో వెలుగు చూశాయి.

తరువాత కాలం మారింది. కాలంతోపాటు అవసరాలూ మారాయి. ఆంగ్లేయులు తెరమీదికి వచ్చారు. వారి రాక భారతీయ సంస్కృతి సంప్రదాయాలనే కాక భాషా సాహిత్యాలనూ ప్రభావితం చేసింది. ప్రాచీనపద్ధతిలో వచ్చిన సంస్కృతంలో ఉన్న తెలుగు వ్యాకరణాలు విద్యార్థులకు సులభంగా అర్థం కావడంలేదనే భావన కలిగింది. పద్యరూపంలోనో, సంస్కృతంలోనో సూత్రప్రాయంగానో ఉండడం వల్ల వ్యాకరణాన్ని సులభంగా అర్థం చేసుకోవడంలో వైఫల్యాలు తొంగిచూశాయి. ఈ అవసరాన్ని పూరించేందుకు ఆంగ్ల విద్యావిధానం ఫలితంగా తెలుగులో లఘువ్యాకరణ రచన ప్రారంభమైంది. ప్రాచీన వ్యాకరణాలను, వాటిపై గల ప్రభావాలను అన్నింటినీ క్షుణ్ణంగా అధ్యయనం చేసిన ప్రసిద్ధ భాషా పండితులు కొందరు విద్యార్థులకు వ్యాకరణాన్ని బోధించే అధ్యాపకులుగా ఉండటం ఈ రకమైన వ్యాకరణాలు రావడానికి దోహదం చేసింది.

తెలుగు దేశంలో తమ వ్యవహార కార్యకలాపాలను సమర్థంగా నిర్వర్తించడానికి తెలుగుభాషను నేర్చుకోవలసిన అవసరం ఆంగ్లేయులకు ఏర్పడింది. ముఖ్యంగా వచన భాషలోనూ, వాడుక భాషలోనూ ప్రావీణ్యం సంపాదించడానికి, తెలుగు పండితుల చేత ఆంగ్లేయులు వ్యాకరణాలను రాయించుకొన్నారు. ఆ విధంగా తెలుగు వ్యాకరణాలు ఆంగ్లంలో కూడా వెలుగు చూశాయి. పుదూరి సీతారామశాస్త్రి (క్రీ.శ.1834) ప్రశ్నోత్తరాంధ్ర వ్యాకరణం, రావిపాటి గురుమూర్తిశాస్త్రి (1770-1836) తెనుఁగు వ్యాకరణం, వడ్లమూడి గోపాలకృష్ణయ్య (1958) వ్యావహారిక భాషావ్యాకరణం, మల్లాది సూర్యనారాయణశాస్త్రి (క్రీ.శ.1926) ఆంధ్రభాషానుశాసనం, వి.వెంకటేశ్వర్లు (క్రీ.శ.1982) ప్రామాణికాంధ్రవ్యాకరణం ఆంగ్ల భాషావిధానాన్ని అనుసరించి వచ్చిన వ్యాకరణాలే.

**తెలుగు నిఘంటువులపై ఆంగ్లభాషా ప్రభావం:**

వైదిక, లౌకిక సంస్కృత పదాలకు వ్యత్యాసం ఉండడం వల్ల నిఘంటు నిర్మాణావశ్యకతను ప్రాచీనకాలంలోనే మనవారు గుర్తించారు. సంస్కృతనిఘంటువులలో వైదిక నిఘంటువు, యాస్కుని నిరుక్తం, అమరకోశం ఈ మూడూ సలక్షణమయిన నిఘంటువులు. ప్రాచీన అర్వాచీన నిఘంటు నిర్మాణ పద్ధతులకు మూలాలు ఈ నిఘంటుత్రయం నుండే అభివృద్ధి చెందాయని చెప్పవచ్చు. తెలుగు భాషకు సంబంధించి నిఘంటురచన క్రీ.శ. 17వ శతాబ్ది నుండి ప్రారంభమైంది. తెలుగు భాషా సాహిత్యాలపై సంస్కృత భాషా ప్రభావం ఉండటం వల్ల సంస్కృతంలోని అమరకోశాదుల అధ్యయనం తెలుగు వారికి అవసరమైంది. అందువల్ల 17వ శతాబ్ది వరకు నిఘంటునిర్మాణానికి ప్రయత్నాలు జరగలేదు. అనంతర కాలంలో అచ్చతెలుగు కావ్యాలు ఆవిర్భవించాయి. అన్యదేశ్య ప్రయోగాలు కూడా కావ్యాలలో పెరిగాయి. కాబట్టి తెలుగుభాషకు సంస్కృత కోశాలు పరిపూర్ణంగా ఉపయుక్తాలు కావనే భావన కల్గింది. అప్పటి నుండి పద్యనిఘంటువులు ఆవిర్భవించాయి. అయితే ఇవి కూడా సంస్కృత కోశాదుల పద్ధతిలోనే ఉన్నాయి. పాశ్చాత్యుల రాకతో, వారి సంపర్కం వల్ల అకారాది నిఘంటువులు వెలిశాయి. అకారాది

క్రమంలో ద్విభాషాకోశాలు, ఏక భాషాకోశాలు పారిభాషిక నిఘంటువులు, పదపట్టికలు, వైద్య నిఘంటువులు, లఘుకోశాల వంటి విలక్షణమైన గ్రంథాలు ఆవిర్భవించాయి. ఆధునిక విద్యలో భాగంగా ఆంగ్ల భాషావిధానాన్ని అనుసరించి తెలుగులో భాషాశాస్త్ర అధ్యయనం ప్రారంభమయ్యింది. ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి వంటివారు తెలుగు భాషాశాస్త్ర పరిశోధనకు పునాదులు పటిష్టంగా వేశారు. అందులో భాగంగానే మాండలిక భాషాపరిశోధన ప్రారంభమైంది. తెలుగు రాష్ట్రాలలో ఉన్న అనేక వృత్తులవారు మాట్లాడే వివిధ రకాల తెలుగు మాండలిక భేదాలకు సంబంధించిన వివరాలను సేకరించి వ్యవసాయం, చేనేత, కమ్మరం, కుమ్మరం, వడ్రంగం, వాస్తు, మేదర వంటి సుమారు 25 వృత్తిమాండలికాలలో పదకోశాల నిర్మాణం జరిగింది. సామాజిక భాషశాస్త్ర పరిధిలో జరిగిన ఈ పని వలన తెలుగు ప్రపంచ భాషలలోనే ఒక విశిష్ట స్థానాన్ని సంపాదించుకుంది.

**తెలుగుభాషపై ఆంగ్ల భాషా ప్రభావం:**

ఇక తెలుగు భాష విషయానికి వస్తే... తెలుగు భాషపై సంస్కృత, ప్రాకృత, ఉర్దూ, ఇంగ్లీషు భాషల ప్రభావం ఉంది. నేడు ఆంగ్లభాష ప్రపంచ భాషలలో 3వ లేక 4వ భాషగా అధిక వాగ్వ్యవహారంలో ఉంది. దానికి సామాజిక, చారిత్రకాది అనేక కారణాలు ఉన్నప్పటికీ భాషాపరంగా చూసినట్లయితే ఎటువంటి కొత్తభావాలనైనా తనలో ఇముడ్చుకొని వాటికి స్వీయభాషాలక్షణాలను జతకలిపి ప్రయోగారంగా మార్చుకోగలగడం ఆంగ్లభాషకు ఉన్న ప్రత్యేకతలలో ఒకటి. అసాధారణ స్వీకరణ అనుకరణ లక్షణాలు (extraordinary receptive and adaptability), భిన్నజాతీయాత్మకత (heterogeneousness), స్వతంత్రత (Individuality) మొదలైన లక్షణాలతో ఆంగ్లభాష విశ్వప్రఖ్యాతిని సాధించుకొంది. వీటిని దృష్టిలో ఉంచుకొనే ప్రఖ్యాత అమెరికా తత్త్వవేత్త రాల్ఫ్ వాల్డో ఎమర్సన్ ఆంగ్ల భాష అనే సముద్రం ప్రపంచంలోని అన్ని ప్రాంతాల కాలువల నుండి నీటిని స్వీకరించింది అన్నారు. ఈ లక్షణాలవల్ల పరిపుష్టమైన ఆంగ్లభాష నుండి పాలనా పరంగా సంపర్కం ఏర్పడిన కారణంగా ఎన్నో పదాలు భారతీయభాషలలోకీ అలాగే తెలుగులోకీ ప్రవేశించాయి. ఉదాహరణకు కోర్టు, కోచ్, రౌడీ, ర్యాలీ, జడ్జీ, ఫీజు, టైం, కారు, లారీ, బస్సు, రోడ్డు, లైటు మొదలైనవి ఆంగ్లపదాలే. ఆయా కాలాల్లో ఆయా భాషల నుంచి ఎన్నో పదాలు, సమాసాలు, ప్రత్యయాలు, వాక్యనిర్మాణాలు తెలుగులోకి ప్రవేశించాయి. అంతకుముందు మహమ్మదీయుల పరిపాలన కారణంగా అరబ్బు, పర్షియన్ భాష పదాలు తెలుగులోకి వచ్చాయి. మహమ్మదీయులు 13వ శతాబ్దంలో తెలుగునాట దండయాత్ర జరుపక ముందే మహాకవి తిక్కన సోమయాజి (13వ శతాబ్దం) తరాజు (త్రాసు) అనే పదాన్ని రెండుసార్లు తన భారత రచనలో ప్రయోగించాడు. అంటే మహమ్మదీయులు వచ్చీరాక ముందే తరాజు అనే పదం తెలుగులోకి వచ్చిందని తెలుస్తోంది.

విజయనగర రాజులకాలంలో మహమ్మదీయ సైనికులు హిందువులతో సఖ్యంగా ఉండటం వల్ల వారు మాట్లాడే పంజాబీ, హర్యానీ, అరబిక్, పర్షియన్ పదాలు తెలుగువారి పదాలుగా మారిపోయాయి. మహమ్మదీయుల పరిపాలన కాలంలో ప్రభుత్వ ఉద్యోగులు, పాలకుల కూడా పర్షియన్ భాషను నేర్చుకున్నారు. తద్వారా పర్షియన్ పదాలు అనేకం తెలుగులోకి వచ్చిచేరాయి. దివాన్, కొత్వాలు మొదలైన పర్షియన్ పదాలను పరిపాలనా సౌలభ్యం కోసం 1580 సంవత్సరంలో మహమ్మద్ కులీకుతుబ్‌షా కాలంలో దిగుమతి అయ్యాయి. మాతృభాష అయిన తెలుగునే కాకుండా సామాన్య ప్రజలు కూడా కుతుబ్‌షా కాలం నుంచి పర్షియన్, ఉర్దూ, హిందుస్తానీ పదాలను విరివిగా నేర్చుకోవాల్సిన అవసరం ఆనాటి పాలకులవల్ల కలిగింది. ఉదా. జమ, దఫా, కబ్జా, ఖాతా, హోదా, గూండా, అర్జీ, గస్తీ, కుస్తీ, బస్తీ, కూపీ, మాఫీ, హామీ, లారీ, బాకీ, పేచీ, రద్దు, బంద్, జప్తు, షురూ మొదలైనవి. దీనిని బట్టీ సామాజిక సాంస్కృతిక, రాజకీయాది ప్రభావాలు తెలుగు భాషపై ఉన్నట్లు తెలుస్తోంది.

ఇదే ఒరవడిలో ఆంగ్ల భాషనుండి కేవలం పదాలే కాక ఆంగ్లంలోని నుడికారాలు కూడా తెలుగులోనికి ప్రవేశించాయి. ఉదా. రెడ్ హాండెడ్‌గా పట్టుకొను, రెడ్ అలర్ట్ ప్రకటించు, బ్లాక్ మెయిల్ చేయు, బ్లాక్ లిస్టులో పెట్టు, క్లీన్ చిట్ ఇచ్చు, హాట్ కేక్ లా అమ్ముడు పోవు మొదలైనవి. ఇచ్చిపుచ్చుకొనే ఏ రెండు భాషా(వ్యవహర్తల) సమూహాల మధ్యనైనా కొంతకాలానికి వారి సంస్కృతీ, సాంప్రదాయాలూ, జీవన విధానంలో ఉన్న కొన్ని భేదాలు తగ్గి ఎంతోకొంత సామ్యం కనబడటం మొదలౌతుంది. అట్లాంటిదే భారతీయభాషలూ ఆంగ్లభాషల మధ్యనున్న సంబంధం. ఆంగ్లభాషా ప్రభావంతో తెలుగులోనికి ఇంచుమించు సమానార్థకాలుగా ప్రవేశించిన కొన్ని ప్రయోగాలు కన్పిస్తాయి. ఉదాహరణలు చూడండి.

He talks in the air. 'వాడు గాలిమాటలు చెప్తున్నాడు'

Who bells the cat? 'పిల్లి మెడలో గంటెవరు కడతారు?'

Bird's eye view - 'విహంగ వీక్షణం'

Prime minister took a bird's eye view 'ప్రధానమంత్రి విహంగ వీక్షణం చేశారు'

To have a hand - 'హస్తం ఉంది'

Crocodile tears - 'మొసలి కన్నీరు'

Out of date - 'కాలం చెల్లిన'

Jack pot - 'నక్కను తొక్కు'

అనువాదాలను అన్వేషిస్తే ఇటువంటి నుడికారాలూ కుప్పలు తెప్పలుగా తప్పక దొరుకుతాయి. కొన్ని కొన్ని ఆంగ్లభావాలకు అనుగుణంగా తెలుగులో నూతన పదాలను సృష్టించుకొని తెలుగులో వాడడం కన్పిస్తుంది. ఉదా. నగ్నసత్యం, శ్వేతపత్రం, కంటితుడుపు చర్య, పచ్చజండా ఊపు, కుంటిసాకులు చెప్పు, బాల్చీతన్నివేయు మొదలైనవి. ఎన్నో విరామ చిహ్నాలు కూడా ఆంగ్లం నుండే తెలుగు భాషలో ప్రవేశించాయి.

పత్రికలు భాషా వినిమయానికి ప్రధాన సాధనాలు. ఇందులో నివేదికలు, రాజకీయ, క్రీడా, వ్యాపార వార్తలూ ఇలా ఎన్నో అన్నీ పత్రికల పరిమితులకు లోబడి ఉంటాయి. ఆంగ్ల భాషలోని వార్తలనూ, కథనాలనూ అనువదించి తెలుగులో ప్రచురించటం వల్ల ఆంగ్లభాషా ప్రభావం ఎక్కువగా కన్పిస్తుంది. మౌఖిక భాషలో లేని ప్రయోగాలూ వాక్య విన్యాసాలూ పత్రికలలో కన్పిస్తుంటాయి.

ఉదా. అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరబడుతున్నాయి.

కర్మణిప్రయోగం తెలుగుభాషకు అసహజం. నన్నయ పూర్వయుగ శాసనాలలోనూ కర్మణి ప్రయోగాలూ యత్తదర్థక ప్రయోగాలు అత్యంత స్వల్పం. నన్నయ భాషలో సంస్కృత ప్రభావం వల్లనే కన్పిస్తు

న్నాయి. ఆధునిక భాషలో ముఖ్యంగా పత్రికా భాషలో ఆంగ్ల ప్రభావం వల్ల 'బడు' ప్రయోగం కన్పిస్తుంది.

ఉదా. కళాశాల ప్రారంభిస్తున్నామని చెప్పటానికి సంతోషిస్తున్నాం.

ఇలాంటి వాక్యాలు మౌఖిక భాషలో ఉండవు. ముఖ్యంగా ప్రచారం కోసం చేసే ప్రకటనలలో ఎక్కువగా కన్పిస్తాయి. శ, ష, స లు ఆధునిక తెలుగులో ఆంగ్ల, హిందీ భాషల ప్రభావం వల్ల ఒకదాని స్థానంలో మరొకటి ఉచ్చరింపబడతాయి. అవ్యుత్పన్నత కూడా దీనికి కారణంకావచ్చు.

ఉదా. ఆంధ్రప్రదేశ్ – ఆంధ్రప్రదేష్,

అరుణాచల ప్రదేశ్ – అరుణాచల ప్రదేష్, రమేశ్– రమేష్

రాతలో 'శ' కారమే ఉంటుంది. ఉచ్చారణ లోనే 'ష' కారం విన్పిస్తుంది. 'దేశం' అని విడిగా రాసినప్పుడూ పలికినప్పుడూ శకారమే ఉంటుంది. ఇలా ఎన్నో భాషాపరిణామాలు ఆంగ్లభాషాప్రభావం వల్ల తెలుగులో ఏర్పడ్డాయి.

**భాషలో మార్పులూ–ప్రపంచీకరణ:**

సంస్కృతీ సాంప్రదాయాలూ కట్టుబొట్టూ ఆహారపుటలవాట్లూ, విద్యా వ్యాపార రంగాలూ మొదలయినవాటిల్లో వచ్చిన పరిణామాల వల్ల తెలుగుపదజాలం కూడా నిత్యవ్యవహారంలోంచి జారిపోతోంది. సామాన్యజన వ్యవహారం కూడా దీనికి అపవాదం కాదు. శాస్త్ర సాంకేతిక రంగాలకు సంబంధించిన పదాల విషయంలో మూల భాషాపదాలను వాడడం సహజంగానే జరుగుతుంది. వీటికి కూడా తెలుగు పదాలను తయారుచేసుకోవచ్చు. సామాన్య వ్యవహారంలో అన్యభాషాపదాలను వాడవలసివచ్చినప్పుడు తెలుగులో ఉన్న పదాలనే ఆయా అర్థాలకు సంబంధించిన వాటిని వ్యాప్తి చేయవచ్చు. లేకపోతే కొత్తపదాలను సృష్టించవచ్చు. అయితే తెలుగులో ఈ రెండింటికీ విరుద్ధంగా జరిగింది. కొత్తగా పరిచయమయిన వాటికి కొత్తపదాలను సృష్టించకపోగా తెలుగులో ఉన్నపదాలకు బదులుగాకూడా ఆంగ్లపదాలనే వాడుతున్నారు. తెలుగులో మాటాడడాన్ని తక్కువగా భావించడం, పరిభాషను తయారుచేసుకోలేకపోవడం దీనికి కారణాలు.

బంధుత్వాలను తెలిపేందుకు నేడు ఆంగ్లాన్నే ఎక్కువ వాడుతున్నారు. ఆంటీ, అనే పదం పిన్ని, చిన్నమ్మ, అత్త, పెద్దమ్మ ఇంకా తనకంటే వయసులో పెద్దైన తన తల్లి వయసుకు అటూ ఇటుగా ఉన్న స్త్రీనీ అంకుల్ అనే పదం బాబాయి, చిన్నాన్న, మామ, పెద్దనాన్న తనకంటే వయసులో పెద్దైన తన తండ్రి వయసుకు అటూ ఇటుగా ఉన్న మగవాడినీ బ్రదర్, సిస్టర్ అనే పదాలు అన్నాతమ్ముళ్లనూ, అక్కా చెల్లెళ్లనూ తోసిరాజంటున్నాయి. ఇక మమ్మీ డాడి, గ్రాండ్ మదర్, గ్రాండ్ ఫాదర్ వంటిపదాలు సరేసరి.

నేటితరానికి వారి శరీరభాగాల పేర్లు పూర్తిగా తెలుగులో తెలీనే తెలియవు. అంగిలి, ఉల్లం, ఎమ్ము, కీలు, నరం, నెరిడె, మణికట్టు, మీగాలు, ముంజేయి, మునివేళ్ళూ, మూలగ లాంటి శరీరభాగాల పేర్లు తెలీదు.

ఆహారపుటలవాట్లు కూడ మారడంతో – చపాతీ, రోటీ, లడ్డూ, జిలేబీ, జాంగ్రీ, పూరీ, పుల్కా వంటి హిందూస్థానీ వంటకాలకు సంబంధించిన పదాలు, పిజ్జా, బర్గర్, సూప్, బ్రెడ్, బిస్కెట్ లాంటి ఆంగ్లపదాలు వ్యాప్తిలోకి వచ్చాయి.

నిత్యవ్యవహారంలో ఉపయోగించే కూరలపేర్లు, దినుసులపేర్లు, వస్తువులు, జంతువులు, కట్టడాలు, ఆటలు, కాలం మొదలయిన వాటిని సూచించే పదాలు, సంఖ్యావాచకాలు, వస్త్రవిశేషాలు... ఇలా చెప్పుకుంటూపోతే మానవజీవనంతో సంబంధం ఉన్న ప్రతి అంశం లోనూ తెలుగు పదాల్ని కుప్పలుకుప్పలుగా ఆంగ్లపదాలు ఆక్రమించాయి. ఐతే, ఇట్లా ఆంగ్ల పదాలనుకొంటున్న వేలాది పదాలు ఇంతకుముందే లాటిను, ఫ్రెంచి, జర్మానిక్ భాషలూ ఇంకా అనేక ప్రపంచ భాషలనుండి ఇంగ్లీషులోకి ప్రవేశించినవే.

తెలుగు భాష లోని పదాల స్థానే ఆంగ్లపదాలు వ్యవహారంలోనికి రావడానికి ఇతర కారణాలు కూడా ఉన్నాయి. సమాజంలో అతి వేగంగా వస్తున్న కొత్తకొత్త భావనలూ దానికి అనుగుణమైన మార్పులూ, అత్యంత ప్రభావశీల పారిశ్రామికీకరణం, అంతర్జాలం ద్వారా వాడుకలోకి వస్తున్న వాణిజ్యం మొదలైనవి. ఉదా. గ్యాస్ స్టవ్. ఈ పదం ఇదివరకు లేదు. పొయ్యి, కుంపటి వంటివే వాడుకలో ఉన్నాయి. ఇక తెలుగు పొయ్యా, కుంపటికీ పొయ్యేకాలం వచ్చేసినట్లే.

గ్యాస్ స్టవ్ వాడకం పెరగడంతో పొయ్యి, కుంపటితో పాటుగా పొంత, గొట్టం, నుసి, పిడక, కచ్చిక వంటి పదాలెన్నో వ్యవహారం లోంచి జారిపోతున్నాయి. అలవాట్లు మారినా నష్టం భాషకే. గ్యాస్ స్టవ్‌ను 'గాలికుంపటి' అని తెలుగులోకి అది ప్రవేశించినప్పుడే చేసుకొని ఉంటే కనీసం కుంపటి అనే పదమయినా మిగిలి ఉండేది.

ప్రాచీనకాలపు పనిముట్ల వాడకం కూడా నేడు తగ్గింది. అందు వల్ల ఆ పదాలు కూడా అందరికీ తెలియవు. ఇవేకాకుండా సామాన్య జనుల వ్యవహారంలో ఉన్న వివిధ రంగాలకు చెందిన పదాల స్థానం లోనూ ఆంగ్లపదాలు వ్యాప్తిలోకి వస్తున్నాయి. వైద్యం, ఆరోగ్యం, న్యాయం, పరిపాలన, ఆర్థికం, సామాజికం, వ్యవసాయం, వృత్తులు, వ్యాపారాలు, విద్య, వంటి రంగాలలోనూ అధికంగా ఆంగ్లభాషా పదాల వాడుక కన్పిస్తుంది. పాశ్చాత్య సంస్కృతి ప్రభావం వల్ల పాశ్చాత్యుల అలవాట్లు కూడా ఇక్కడికి దిగుమతి అవుతూనే ఉన్నాయి. దీని వల్ల కూడా ఆంగ్లపదజాలాన్ని తప్పనిసరిగా ఆశ్రయించవలసి వస్తోంది.

ఉదాహరణకి షాపింగ్ మాల్ సంస్కృతి. అందులో అమ్మే వస్తువులలో చాలావాటికి తెలుగులో పేర్లూ పదాలూ ఉన్నప్పటికీ ఆంగ్లం లోనే రాస్తున్నారు. వ్యవహరిస్తున్నారు. వీటన్నింటికీ ప్రపంచీకరణ, ప్రతిష్ఠాపాదకత కూడా కొంత కారణాలు అవుతున్నాయి. వాటివల్ల తెలుగుపదాలు మరుగునపడి పోతున్నాయి.

ఇక నుడికారం సంగతి సరే సరి. తామరతంపరగా వ్యాప్తిలోకి వస్తున్న పదాలకు అడ్డుకట్టవేసే విధానం ఎప్పుడూ భాషావ్యవహర్తల లోనే ఉంటుంది. వారు ఆయా వస్తువుల స్వరూపాన్ని బట్టి సహజంగా సులభంగా మూలానికి దగ్గరగా ఉండే పదాలు తయారుచేస్తారు. వాటిని గుర్తించి వ్యవహారంలోకి తెచ్చేప్రయత్నం చేయాలి. ఏదయినా ఒకపదం చక్కగా తెలిగించితే అది తప్పకుండా సర్వజనామోదాన్ని పొందుతుంది. భాష నష్టపోవడానికి మన పరభాషావ్యామోహం మాత్రం కారణం కాకూడదు.

జనవ్యవహారం చాలా పదునైనది. కొత్త భావనలకు కొత్త పదాలు అవసరమైనపుడు వాటిని ముఖ్యంగా తెలుగులో వాడడానికి అవకాశం ఉన్న సందర్భాలలో కూడా మన పత్రికలు ఆంగ్లపదాలనే వాడుతున్నాయి. ఉదా: స్వైన్ ఫీవర్ సామాన్యజనాన్ని వణికించిన రోగం.

దాన్ని పందిజ్వరం అని ఒక్క పత్రిక కూడా రాయలేదంటే తెలుగు భాషని వాడాలనే తపన పత్రికలవారికి ఎంత ఉందనేది తెలుస్తోంది. దీనికే కన్నడంలో 'హందిజ్వర' అని ప్రాచుర్యం. మరి పక్కవాళ్లని చూసి మార్చుకుందామని పత్రికలవాళ్లకి ఆసక్తి కలగలేదంటే కొత్తదనాన్ని మనవాళ్లు ఆహ్వానించడంలేదనే అనుకోవాలి.

ఆధునిక శాస్త్ర సాంకేతిక రంగాలకు సంబంధించిన పారి భాషికపదాలకు తెలుగులో కూడా ఆంగ్లపదాలనే ఉపయోగిస్తున్నాం. ఇవి ఇప్పటికే అధికప్రాచుర్యాన్ని పొందాయి. నామవాచకాల సంగతి అటుంచి క్రియలను కూడా యథేచ్ఛగా ఆంగ్లక్రియలనే వాడుతున్నాం. వీటి బాహుళ్యాన్ని తగ్గించి, తెలుగు క్రియా వినియోగాన్ని పెంచా లంటే- ప్రయత్నం నిరంతరం చేయాలి. అలాగే భాషాశాస్త్ర పరిభాష లోనూ, యంత్రానువాద పరిభాషలోనూ ఆంగ్లపదాలకు సమానార్థ కాలను కల్పించవచ్చు, ఉదా. Spell-checker 'దిద్దరి', icon 'రూపు', internet 'అంతర్జాలం', (word) generator '(పద) జనకం', మొదలైనవి. అలాగే సరళీకరణ ప్రపంచీకరణ లాంటి పదాల ప్రభావంవల్ల గ్లోబలీకరణ, ప్రైవేటీకరణ మొదలయిన పదాలు అర్థ బోధకశక్తి ఉన్నందువల్ల వ్యాప్తిలోకి వచ్చాయి. వీటినీ స్వీకరించాలి.

**మాతృభాషామాధ్యమం -ఆంగ్లభాషాప్రభావం**

క్రిస్టియన్ మిషనరీలు ఈస్టిండియా కుంఫిణీ ఏలుబడి మొదలు కాక ముందునుంచే విద్యారంగంలోకి ప్రవేశించాయి. ఈ మిషనరీలు 1717 నుండే కొన్ని పాఠశాలలు ఏర్పాటు చేసి, తెలుగు తదితర భారతీయ భాషలలోనే లౌకిక విద్యావిషయాలనూ వాటితోపాటు క్రైస్తవ తత్త్వజ్ఞానాన్నీ బోధించడం ప్రారంభించాయి. 1813లో ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రభుత్వం మొదటిసారి తమ అధీనంలో వున్న ప్రజలకు విద్యను అందించటం తన బాధ్యతగా స్వీకరించింది. అప్పటికి ధనవంతులు తమ పిల్లలకు గుడుల్లోనో, గ్రామ చావిళ్లలోనో లేక ఇళ్లల్లోనో చదవనూ రాయనూ నేర్పించేవారు. వీటిలో సాహిత్య, ధార్మిక, తాత్త్విక, గణితాది విషయాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవారు. అవి పూర్తిగా సంస్కృతంతోపాటు తెలుగులోనే సాగేవి. అయితే 1813లో కుంఫిణీ ప్రభుత్వం భారతీయులకు విద్యను అందించే ప్రక్రియలో కొన్ని మార్పులు ప్రవేశపెట్టారు. ఈ మార్పులు తామస్ మన్రోతో ప్రారంభం అయ్యాయి. మన్రో 1826లో ప్రజావిద్య పేరుతో మౌలికమార్పులు తీసుకువచ్చాడు. వాటిలో ముఖ్యంగా ప్రతి తాలూ కాలో ఒక తహశీల్దారీ పాఠశాల, ప్రతి జిల్లాకి ఒక కలెక్టరేటు పాఠ శాలలు పెట్టి నడిపించాడు. తహశీల్దారీ పాఠశాలల్లో పూర్తిగా తెలుగు మాధ్యమంలోనే చరిత్ర, రాజనీతి, భూగోళం, సాహిత్యం, గణితం నేర్పించేవారు. ఐతే జిల్లా స్థాయి కలెక్టరేటు పాఠశాలల్లో తెలుగూ తదితర భారతీయ భాషలు తప్ప, ఇంగ్లీషు భాషతోపాటు యూరొ పీయ సాహిత్యం, చరిత్ర, రాజనీతి, భూగోళం, విజ్ఞానం, గణితం లాంటివి అన్ని విషయాలూ ఆంగ్ల మాధ్యమంలోనే సాగేవి. బ్రిటిషు వారు కొత్తగా స్థాపించిన ఆంగ్ల మాధ్యమ పాఠశాల వ్యవస్థ భారతీయ వారసత్వం నుండి భారతీయ యువతను విముఖం చేయడమేగాదు, చాకచక్యంగా వారిలో విజాతీయతను పాదుకొల్పుతోంది అని అనీ బిసెంట్ (1897) భావించింది. అయితే, సర్ జార్జ్ కేంబెల్ ఆనాటి పల్లెటూరి బడులలో భారతీయ భాషలూ భారతీయ సాంప్రదాయిక విషయాలూ నేర్పుతుండేవారు అని 1872లో తన నివేదికలో పొందు పరిచాడు. అంటే ఆనాడు భారతీయ భాషలకు వెంటనే ఎలాంటి ప్రమాదమూ లేదని తెలుస్తోంది.

అధికారంతో, అహంభావ పూరితమైన బ్రిటిష్ చరిత్రకారులు భారతదేశం బ్రిటిష్ సృష్టి అని వాదించేవారు. ఒక ఉమ్మడి భాష, మతం లేకుండా, భారతదేశం అనే భావనలేదు అనీ ఒక దేశం కాదు అనీ వాదించారు. జాన్ స్టువర్ట్ మిల్ ప్రకారం, జాతీయవాదానికి గతకాలపు ఉమ్మడి సంఘటనలు ఉమ్మడి చారిత్రక జ్ఞాపకాలే మూలాలు. భారతదేశానికి గతంలో, అతను సూచించినట్లు, భారత దేశంపట్ల భారతదేశంలోని ప్రజలందరూ విధేయత గానీ అణకువ గానీ ప్రదర్శించడం లేదు. ఇంకా, ఆ దేశం అటువంటి బంధాలనూ భావజాలాన్ని గానీ అందించడంలేదు అంటాడు. అయితే భారతీయుల పట్ల భారతదేశంపట్ల గౌరవం, ఆదరణ ఉన్న ఎందరో పాశ్చాత్యులూ భారతీయులూ ఇట్లాంటి సంకుచిత జాతీయవాదానికీ అట్లాంటి ఆలోచనలకూ దీటుగా జవాబు చెప్పారు. ఒకే భాష, ఒకే మతం జాతీయతకు గుర్తింపు అని నమ్మడం సంకుచిత అభిప్రాయమనీ పలు భాషలూ, పలు మతాలూ, పలు సంస్కృతుల మేళవింపుతో వేల సంవత్సరాల చరిత్ర కలిగిన భారతదేశానికి పాశ్చాత్య జాతీయ వాదం గుడ్డొచ్చి పిల్లను వెక్కిరించినట్లుందని ఎందరో రాజనీతిజ్ఞులు ప్రకటించారు.

**భారతీయ భాషలూ తరిగిపోతున్న వ్యవహార రంగాలు:**

భారతదేశంలో ఆర్యభాషల మీద ద్రావిడభాషల (తెలుగు, తమిళం, మలయాళం, కన్నడం) ప్రభావం భాషా నిర్మాణంమీదా, అలాగే ద్రావిడ భాషలపై ఆర్యభాషల ప్రభావం పదజాలంమీదా ఎక్కువగానూ కనిపిస్తుంది. ఆస్ట్రో-ఏషియాటిక్, సైనో-టిబెటన్ భాషలపై కొంతమేరకు ఆర్య, ద్రావిడ భాషల ప్రభావం కనబడు తోంది. వివిధ భారతీయ భాషలూ, ప్రత్యేకంగా తెలుగుభాషపై మొదట సాంస్కృతికంగా సంస్కృతం, పరిపాలనాపరంగా ప్రాకృతాలూ తమ ముద్రవేశాయి. సంస్కృత ప్రాకృతాల ప్రభావం చరిత్రకందనంత కాలం నుండీ 10వశతాబ్దం వరకూ సాగింది.

సమకాలీన సమాజంలోని అన్ని పాఠశాలలలోనూ దాదాపుగా ఆంగ్లమాధ్యమంలోనే శాస్త్రసాంకేతిక విషయాలను బోధిస్తున్నారు. బహు భాషా వ్యవహర్తలు గల భారతదేశంలో 200 పైగా భాషలు ఉన్నాయి. ప్రతి రాష్ట్రంలోనూ ఎక్కువమంది ఏ భాష మాట్లాడితే ఆ భాష ఆ ప్రాంతీయ భాష. ఐతే దేశంలోని వివిధ ప్రాంతాల మధ్య అనుసంధాన భాషగా హిందీనీ అంతర్జాతీయ కార్యకలాపాలకు ఆంగ్లాన్నీ వినియోగిస్తున్నారు.

శాస్త్రసాంకేతిక వికాసం వలనా సామాజిక అవసరాల నిమి త్తమూ ఒక ప్రాంతీయ భాషతోపాటు ఇతర భాషలూ నేర్చుకోవలసిన అవసరం ఏర్పడింది. భారతదేశంలో కొన్ని రాష్ట్రాలలో ఒకటికంటే ఎక్కువ భాషలు మాట్లాడే సందర్భాలు ఉన్నాయి. స్వాతంత్ర్యానికి పూర్వం భాషా సమస్య ఉంది. 2వ అధ్యాయంలో చెప్పుకున్నట్లు బోధన మాధ్యమంగా ఆంగ్లం, సంస్కృతం, పార్శీ భాషలలో ఏది ఉండాలన్న దానిపై వివాదాలు తలెత్తాయి. చివరకు మెకాలే ప్రతి పాదనల ద్వారా ఆంగ్లం అధికార భాషగానూ బోధనా భాషగానూ స్థిరపడి చివరకు జాతీయ భాషా స్థానాన్ని ఆక్రమించింది.

**విద్యామాధ్యమం: మాతృభాషలూ - ఆంగ్లభాష :**

20 వ శతాబ్దిలో ద్విభాషా సూత్రం అమలులో ఉండేది. ఆంగ్లం ప్రథమ భాష. ప్రాంతీయ భాష ద్వితీయ భాష. స్వాతంత్రోద్యమ కాలంలో ప్రజలకూ, నాయకులకూ, ప్రభుత్వానికీ ఆంగ్లం అనుసంధానంగా ఉన్నప్పటికీ ఆ భాష తెలిసినది కొద్దిమందికే. స్వాతంత్రోద్యమంలో ఏదో ఒక దేశ భాష మాత్రమే అధికార భాషగా ఉండాలనే అభిప్రాయం బలపడింది. అధిక సంఖ్యాకుల మాతృభాష హిందీ (హిందీ అనేక భాషలకు పర్యాయంగా వాడే ఉతపదం) కావడంతో హిందీ వెలుగులోనికి వచ్చింది.

స్వాతంత్ర్యానంతరం హిందీ అధికారభాష అయ్యింది. దేశమంతటా హిందీభాషను అమలు చేయాలనీ పాఠశాలలో తప్పనిసరి చేయాలని నిర్ణయించారు. హిందీయేతర ప్రాంతాలలో దీనికి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. తమిళనాడులో ఏకంగా హిందీ వ్యతిరేక ఉద్యమాలు చెలరేగాయి. హిందీ భాషా వాదుల బలం ఎక్కువగా ఉన్నప్పటికీ హిందీని ఇతర భాషా రాష్ట్రాలపై రుద్దడానికి కేంద్రప్రభుత్వం ఒప్పుకోలేదు. ఈ పరిస్థితిపై సమీక్షించడానికి కొఠారి కమిషన్ వేసింది. వారి సిఫార్సుల మేరకు ఏర్పడిందే త్రిభాషా సూత్రం. దీని ప్రకారం: హిందీయేతర రాష్ట్రాలలో పిల్లలు నేర్చుకోవలసిన భాషలు: 1. మాతృభాష లేదా ప్రాంతీయ భాష, 2. జాతీయ అధికార భాష (Union Official Language) హిందీ, 3. అంతర్జాతీయ భాష ఆంగ్లం. హిందీ మాతృభాషగా గల రాష్ట్రాలలో నేర్చుకోవలసిన భాషలు: 1. మాతృభాష లేదా ప్రాంతీయభాష- హిందీ, 2. అంతర్జాతీయ భాషగా-ఆంగ్లం, 3. ఒక భారతీయ భాష (దక్షిణ భారత భాషకు ప్రాధాన్యం).

1964లో కొఠారీ కమీషన్ ప్రతి విద్యార్థీ ప్రాంతీయ భాషతోపాటు విధిగా హిందీ, ఆంగ్ల భాషలను అభ్యసించాలని ప్రతిపాదించింది. 1978లో ఎన్సిఇఆర్టీ (NCERT) రూపొందించిన 10+2+3 విద్యాప్రణాళికలో కూడా త్రిభాషా సూత్రాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని నిర్ణయించారు. 1986 జాతీయ విద్యావిధానం (NPE 1986) కూడా త్రిభాషా సూత్రానికి ఆమోదం తెలిపింది.

స్వాతంత్ర్యం తర్వాత భాషా ప్రాతిపదికన పునర్వ్యవస్థీకరణ చెందిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. అయితే ఆంధ్రప్రదేశ్‌లో నైరుతి సరిహద్దులో కన్నడ-తెలుగు, దక్షిణ ప్రాంతంలో తమిళం-తెలుగు వాడకంలో ఉన్నాయి. తెలంగాణా ప్రాంతంలో తెలుగు, మరాఠీ, ఉర్దూభాషలూ వ్యవహారంలో ఉన్నాయి, ఆంగ్లేయుల పాలనలో ఆంగ్లం అధికారభాషగా బోధనభాషగా ఉండటంవల్ల దేశ భాషలకంటే అధికంగా అది ప్రాచుర్యం పొందింది. దేశ భాష అయిన తెలుగు వెనకబడింది. ఉపాధి సముపార్జన ఆంగ్ల మాధ్యమంలో చదివిన వారికే. తెలుగు మాధ్యమంలో చదివినవారికి ఉద్యోగ భద్రత లేదు. దీనివల్ల బోధనలోగానీ పాలనలోగానీ ఆశించినంతగా తెలుగు వ్యవహారంలో లేదు. దేశంలోని చాలా రాష్ట్రాలలో హిందీని తృతీయ భాషగా ప్రవేశపెట్టారు. మన రాష్ట్రంలో వారానికి మూడు గంటలు హిందీకి కేటాయించారు. అంటే కొఠారి కమీషను సూచనల ప్రకారం హిందీయేతర రాష్ట్రాల విద్యా విధానం, భాషావిధానం, ఆచరణలలో భాగంగా త్రిభాషా సూత్రం జాతీయ స్ఫూర్తిని కలిగిస్తుంది. ఇతర ప్రాంతాలతో సంబంధ బాంధవ్యాలు కలిగేలా చేస్తుంది. అనువాదాలను, మాతృభాషా ప్రాధాన్యాన్నీ ప్రోత్సహిస్తుంది. తద్వారా అంతర్జాతీయ అవగాహన కలుగుతుంది.

దీనితోపాటు ఉన్నత విద్యాస్థాయిలో కూడా విద్యాబోధన ప్రాంతీయ భాషల్లోనే జరగాలని సిఫారసు చేసిన మొట్టమొదటి నిపుణుల కమిటీ డా.రాధాకృష్ణన్ కమిషన్ (క్రీ.శ.1948). దీనికి మద్దతుగా కాశ్మీర్, నాగాలాండ్‌లలో ఆంగ్లభాషా మాధ్యమం విఫలమయ్యిందని విద్యావేత్త శ్రీ.ఎం.వి. రాజగోపాల్ గారు పేర్కొన్నారు. ఇవన్నీ మాతృభాషా మాధ్యమం కాకపోవడం వల్ల కలిగే అనర్థాలు. మనోవైజ్ఞానికంగా చూస్తే -అజ్ఞాత విషయాన్ని అపరిచిత మాధ్యమం ద్వారా సాధించటం అవాంఛనీయం. జాతీయ విద్యా విధాన ప్రణాళిక 1968, విద్యా విధాన ప్రణాళిక 1986, త్రిభాషాసూత్రం అమలు కోసం విద్యావిధానంపై పునరుద్ఘాటిస్తూ 1992లో భారతచట్టసభ చేసిన కార్యాచరణ ప్రణాళికా ఇవన్నీ అక్షరాలా చిత్తశుద్ధితో అమలు లోనికి రావాలి. కనీసం ప్రాథమిక విద్యాస్థాయిలోనైనా మాధ్యమంగా మాతృభాష ఉండాలి.

పాఠశాల ప్రక్రియలో మరిన్ని భాషలు నేర్చుకోవడం విద్యార్థికి భారం కాకుండా చూడటమే సరైన పద్ధతి. అసలు ఎవరికీ మాతృభాషకాని ఆంగ్లమాధ్యమం ఎవరికోసం? ఎందుకోసం? దీనికి కొందరు చెప్పే జవాబు ఉద్యోగభద్రత. భారతదేశం లోపలా భారతదేశం బయటా ఉద్యోగాలకోసం భారతీయభాషలను వాడే పద్ధతికి తగిన విద్యావిధానం భారతదేశంలో లేదు. దీనికి చైనా, జపాన్, రష్యా, ఫ్రాన్స్ వంటి ఆంగ్లేతర భాషలు మాట్లాడే దేశాలే తార్కాణాలు. ఉదాహరణకు, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికోన్నత పాఠశాల స్థాయిలో రెండు భాషలలో ఒకటిగా కన్నడ (ప్రాంతీయ భాష) భాషను పరిచయం చేసింది. ఆ స్థాయిలో మార్గదర్శకాలుగా మూడు భాషలు ఉన్నాయి. అవి, మాతృభాష/ప్రాంతీయ భాష, ఒక ఆధునిక భారతీయ భాష మరియు విధిగా ఆంగ్లం. మూడు భాషలు బోధించడం ప్రాథమిక విద్యావిధానంలో సర్వసాధారణం. ప్రాంతీయభాషా మాతృభాషా ఒకటి కాని విద్యార్థులు తమ మాతృభాషను ఎంచుకుంటే గనక తమ రాష్ట్ర అధికార భాషనే ప్రాంతీయభాష లేక ఆధునిక భారతీయ భాషల విభాగంలో ఏదో ఒక దానినే విధిగా స్వీకరించాలనే నియమం రాష్ట్రప్రభుత్వమే విధించవచ్చు.

రాష్ట్ర పౌరులందరిచేతా తమ సొంత ఆధికారిక భాషా విధాన వ్యాప్తిని అమలు చేయడానికి రాష్ట్రానికి ఇది ఒక అవకాశం కల్పిస్తుంది. దీనివల్ల పాలన వ్యవహారాలలో అధికారభాషా విధానాన్ని కచ్చితంగా అమలుచేయడానికి రాష్ట్రానికి ఇదో అవకాశం కల్పిస్తుంది. ఉదాహరణకు, కన్నడ మాతృభాషగా కలవారు. కన్నడం మాతృభాష కాకపోయినా కర్ణాటక రాష్ట్రంలో నివసించేవారందరూ తప్పనిసరిగా త్రిభాషాసూత్రంలో భాగంగా కన్నడభాషను తప్పక చదవాలని కర్ణాటక ప్రభుత్వం నియమం పెట్టింది. అందుకు కావలసిన ఉత్తర్వులను జారీచేసింది. అయితే విద్యామాధ్యమంగా ఒక భాషను తప్పనిసరి చేయడం వ్యక్తుల ప్రాథమిక హక్కులను హరించడం అవుతుందని భారతీయ న్యాయకోవిదుల అభిప్రాయం. తల్లిదండ్రులకు తమ పిల్లల విద్యావసరాల నిమిత్తం భవిష్యత్తు ప్రణాళిక కోసం భాషను ఎంచుకునే సౌకర్యం రాజ్యాంగం కల్పించిన హక్కు అని న్యాయమూర్తుల అభిప్రాయం. ఇది పూర్తిగా సమాజంలోని వ్యక్తుల అభిప్రాయానికి అనుగుణంగా ఉండాలి. అంటే ఐచ్ఛికంగా సాగాలి.

# పందొమ్మిదో శతాబ్ది (1800–1900)

–అక్కిరాజు రమాపతిరావు
040–27423352

# తెలుగు–ఇంగ్లీషు భాషాసాహిత్య సంబంధాలు

**ఆ**శ్చర్యం ఏమిటంటే పందొమ్మిదో శతాబ్ది ఆగమనం దాకా ఇంగ్లీషువారితోనూ, ఇంగ్లీషు భాషతోనూ, ఇంగ్లీషువారి సామాజిక ఆచార వ్యవహారాలలోను తెలుగువారికి పెద్ద పరిచయం లేదు. ఏ కొద్దిమందో విని ఉంటే విని ఉండవచ్చు. అటువంటిది పందొమ్మిదో శతాబ్ది మొదలై కాలం గడిచేకొద్దీ ఇంగ్లీషు భాష, ఇంగ్లీషు సాహిత్యం తెలుగువారి నూతన సామాజిక వికాసంపై, సాహిత్య రీతులపై, సాంఘిక దృక్పథంపై బలమైన ప్రభావాన్ని ప్రసరింపజేస్తూ వచ్చింది. ఒక గొప్ప ఆకర్షణను కలిగిస్తూ వచ్చింది. దీనివల్ల తెలుగువారి కట్టుబాట్లు, ఆచార వ్యవహారాలలో, సామాజిక జీవన వ్యవస్థలో, అనూచాన విశ్వాసాలలో, సాంఘిక మతాచార పద్ధతులలో నవీనమైన మార్పులు ఎన్నో వచ్చాయి.

మరింత ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే భారతదేశానికి ఇంగ్లీషువారి వర్తక వాణిజ్య వ్యాపారాలతో, భాషతో, పరిపాలన వ్యవహారాలతో, వార్తా ప్రసార సాధనాలతో, ప్రయాణసౌకర్యాలతో, న్యాయ వ్యవస్థ, పత్రికా ప్రచురణతో, విద్యాబోధన పద్ధతులతో పరిచయమైన తర్వాత వీటిని స్వీకరించటానికి ముందుకువచ్చిన వారిలో తెలుగువారిదే అగ్రస్థానం. మొత్తం భారతదేశంలోనే ఇంగ్లీషులో రచనలు చేసినవారు, ఇంగ్లీషుపట్ల మమకారం చూపినవారు, ప్రాథమ్యస్థానం వహించినవారు ఎవరంటే వారు తెలుగువారేనని చెప్పాలి.

ఈ విషయం ప్రొఫెసర్ కె.శ్రీనివాసయ్యంగారు ఇండో–ఇంగ్లీషును గూర్చి రాసిన గ్రంథంలో ఇంగ్లీషులో తొలి రచనలు చేసినవారు తెలుగు వారేనని చెప్పారు. ఇంగ్లీషుపట్ల వారికటువంటి మోజో, ప్రబలాకర్షణమో కలగడానికి వివిధ కారణాలుండవచ్చు. గొప్ప హోదాగల ప్రభుత్వోద్యోగుల ప్రాపకమో, ఉద్యోగాలో, తమ దేశ స్థితిగతులను గూర్చి పరాయి భాషవారికి చెప్పి వారికి దగ్గర కావాలన్న ఆశయమో, ఇందుకు తెలుగు వారిని ప్రోత్సహించి ఉండవచ్చు. స్వప్రయోజన కాంక్ష ప్రేరేపించి ఉండవచ్చు.

రాజా రామమోహనరాయ్ కన్నా ముందే ఇంగ్లీషులో రచన చేసిన వాడు కావలి బొర్రయ్య (1774–1803). భారతదేశ సర్వేయర్ జనరల్‌గా గొప్ప ఉద్యోగం చేసి ముఖ్యంగా దక్షిణహిందూదేశ చరిత్ర ఆకరాలు ఎన్నో సేకరించి, సంరక్షించిన కల్నల్ కాలిన్ మెకంజీకి బొర్రయ్య అత్యంత సన్నిహితుడు. సహాయకుడు, బోధకుడు, మార్గదర్శకుడు. పార్సీ, సంస్కృతం, మరాఠీలతోపాటు దాక్షిణాత్య భాషలు తెలిసిన గొప్ప విద్వాంసుడు బొర్రయ్య. మెకంజీ వెంట ఉండి స్థానిక వృత్తాంతాలు సేకరించటంలో తోడ్పడినవాడు బొర్రయ్య. బొర్రయ్యవాళ్ళు ఐదుగురు అన్నదమ్ములు. అందరూ గొప్ప ప్రతిభావంతులు. అనేక భాషలు తెలిసిన వారు. మెకంజీ, కావలి బొర్రయ్యను ఎంతగా అభిమానించాడంటే బొర్రయ్య ఇరవై ఆరు, ఇరవై ఏడేళ్ళ లేత వయసుననే మరణించగా కడు దుఃఖించి తన వీలునామాలో బొర్రయ్య కుటుంబానికి కొంత సొత్తు చెందేట్లు, ఆయన చేసిన ఉపకారాన్ని స్మరిస్తూ ఏర్పాటుచేశాడు కాలిన్ మెకంజీ. కొమర్రాజు లక్ష్మణరావు, నిడుదవోలు వెంకటరావు, కోన వేంకట రాయశర్మ, చల్లా రాధాకృష్ణ శర్మ, సి.వి.రామచంద్రరావు వంటి తెలుగు చరిత్రకారులు కాలిన్ మెకంజీ, బొర్రయ్య వృత్తాంతాలను వివరంగా రాశారు. డార్రింప్స్ ఓరియంటల్ జర్నల్‌లో బొర్రయ్య ఇంగ్లీషు రచనలున్నట్లు దిగవల్లి వేంకటశివరావుగారు ప్రస్తావించారు. సరస్వతీబాయి అనే రచయిత్రి మహారాష్ట్ర భాషలో రచించిన పాక శాస్త్రాన్ని బొర్రయ్య ఇంగ్లీషులోకి అనువదించినట్లు బొర్రయ్య చరిత్రకారులంతా రాశారు.

ఈ విధంగా రాజారామమోహనరాయ్ కన్నా ముందుగానే ఇంగ్లీషులో రచనలుచేసినవాడు బొర్రయ్యేయని నిర్ధారణ అయింది. ఇండో, ఇంగ్లీష్ రచనల గూర్చి రాసిన వాళ్ళంతా తెలుగువాళ్ళే భారత దేశంలో ఇంగ్లీషు రచనకు ఆద్యులు అని అభిప్రాయపడ్డారు.

1802లోనే కుంఫిణీ పరిపాలన తెలుగునాట పరిపాలన నిమిత్తం కలెక్టర్లను నియమించింది. పర్మినెంట్ సెటిల్‌మెంట్ ఆక్టుపేరిట జమీందారీ వ్యవస్థకు తెలుగునాట శ్రీకారం చుట్టింది. భూమిమీద శిస్తు వసూలుచేసి కుంఫిణీ ప్రభుత్వానికి అప్పగించే బాధ్యతను కొందరు దేశీయ తాబేదార్లకు అప్పగించి ఆ పర్యవేక్షణను కలెక్టర్లకు కట్టబెట్టింది. అంతకు మూడు సంవత్సరాలకు పూర్వమే ఇంచుమించు దక్షిణ భారత దేశంలోని తమిళ, కర్ణాటక, ఆంధ్రప్రాంతాలను తన పాలన కిందికి తెచ్చుకుంది కుంఫిణీ ప్రభుత్వం.

1799 మేనెల 4వ తేదీ శ్రీరంగపట్టణం యుద్ధంలో టిప్పుసుల్తాన్ పరాజయంపాలు కావడం, కుంఫిణీ సేనలు విజయం సాధించడంతో దక్షిణ హిందూదేశం ఇంగ్లీషు కుంఫిణీ పరిపాలనలోకి వచ్చింది. కుంఫిణీ సైన్యానికి నాయకత్వం వహించి విజయం సాధించిన సైన్యాధిపతి అలెగ్జాండర్ డంకన్ కాంబెల్ ఆ తరువాత చెన్నపట్నం పరిపాలన వ్యవస్థలో ప్రముఖుడైనాడు. ఆంగ్లేయాధికారులు దేశభాషలు నేర్చుకోవలసిన ఆవశ్యకతను గుర్తించాడు.

1812లో చెన్నపట్నంలో సెయింట్ పోర్ట్ జార్జి కళాశాల స్థాపనమైంది. పరిపాలన విభాగాలైన జిల్లా అధికారులకు, కలెక్టర్లకు, మేజిస్ట్రేట్‌లకు (వీళ్లంతా తెల్లవారే) ఆయా ప్రాంతాలలో న్యాయవ్యవస్థ, పాలనపరమైన అధికార నిర్వహణకోసం సెయింట్‌ఫోర్ట్ జార్జి కళాశాలలో తర్ఫీదు, శిక్షణ, దేశభాషా పరిచితి కలిగించడానికి విధానపరమైన ఏర్పాట్లు జరిగాయి. పందొమ్మిదో శతాబ్ది తెలుగుజిల్లాలలోది అనీ వెన్నెలకంటి సుబ్బారావు స్వీయచరిత్రలో రాసుకున్నారు. అన్నిటి కన్నా ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే కుంఫిణీ కాలంలో న్యాయ స్థానాలలోనూ, పరిపాలన వ్యవస్థ దేశీయ ఉద్యోగుల స్థాయిలోనూ తెలుగువారు ప్రముఖస్థానంలో ఉండేవారని వెన్నెలకంటి సుబ్బారావు స్వీయచరిత్రలో ఉంది. 'ఏనుగుల వీరస్వామయ్య, వెన్నెలకంటి సుబ్బారావు, నాగరాజు శేషగిరయ్య మొదలైన తెలుగు వారు న్యాయస్థానాలలో

భాషాపరివర్తకులుగా అత్యున్నతమైన పదవులు నిర్వహించారు. ఇంగ్లీషు వారి న్యాయవ్యవస్థననుసరించి వ్యాజ్య పరిష్కారం చేసే అత్యున్నత న్యాయస్థానమైన 'సుప్రీంకోర్టు' ప్రధాన భాషాపరివర్తకుడైన ఉన్నతోద్యోగి ఏనుగుల వీరాస్వామయ్య. అట్లానే దేశీయ న్యాయవ్యవస్థ ప్రమాణాలతో వ్యాజ్యాలు పరిష్కరించే ఉన్నత న్యాయస్థానాన్ని 'సదర్ అదాలత్ కోర్టు' అనేవారు. ఈ న్యాయస్థానంలో చీఫ్ ఇంటర్‌ప్రెటర్ అనే ప్రధాన ఉద్యోగి వెన్నెలకంటి సుబ్బారావు. భాషాపరివర్తనోద్యోగి అంటే ఇంగ్లీషులో ఉండే వ్యాజ్యవ్యవహార పత్రాలను దేశీయభాషలలోకి, దేశభాషలలో ఉండే పత్రాలను, సాక్ష్యాలను, ఆధారాలను ఇంగ్లీషులోకి అనువాదం చేయగల ప్రజ్ఞాశీలత కల ఉద్యోగి అని అర్థం. వెన్నెలకంటి సుబ్బారావుకు ఐదారు దేశభాషల నుంచి ఇంగ్లీషులోకి అనువాదం చేయగల ప్రజ్ఞ ఉండేది. జాన్ మెక్కరల్ అనే ఉన్నతాధికారితో కలసి సుబ్బారావు కన్నడ నిఘంటువు, కన్నడ వ్యాకరణమూ రూపొందించినట్లు సుబ్బారావు స్వీయ చరిత్రలో ఉంది. సుబ్బారావు జీవితకాలం 1784-1839. ఈయన బందరులో ఇంగ్లీషు చదువుకున్నాడు. ఆ తరువాత సైన్యానికి జీతాలిచ్చే చిన్న ఉద్యోగంచేసి కర్ణాటక ప్రాంతానికి వెళ్ళి న్యాయస్థానాలలో అత్యున్నతమైన హోదాగల దేశీయోద్యోగిగా రాణించారు.

ఈయన స్వీయచరిత్ర ఇంగ్లీషులో రాసుకోవడం అత్యంత విస్మయ కరం. బహుశా భారతీయుడు ఎవరైనా స్వీయచరిత్ర ఇంగ్లీషులో రాసు కోవడం అనే విషయంలో ఈయనే ఆద్యుడు కావచ్చు. ఎ లైఫ్ అండ్ జర్నల్ ఆఫ్ వి.సుబ్బారావు అనే పేరుతో ఉంది ఈ స్వీయచరిత్ర. 1873లో చెన్నపట్నం ఫాస్టర్ ప్రెస్ ద్వారా దీనిని సుబ్బారావు మనవడు గోపాలరావు అచ్చువేయించాడు. వెన్నెలకంటి సుబ్బారావు జీవయాత్రా చరిత్ర పేరుతో ఇది1976లో నెల్లూరు నుంచి వచ్చే జమీన్‌రైతు పత్రికలో తెలుగు అనువాదంగా వెలువడింది. 1822లోనే వెన్నెలకంటి సుబ్బా రావు దేశీయ పాఠశాలల స్థితిగతుల గూర్చి కుంఫిణీ ప్రభుత్వకోరికపై ఒక నివేదిక ఇంగ్లీషులో రాసి సమర్పించాడు. తెలుగు నేర్చుకొనే ఇంగ్లీషు ఉన్నతాధికారులకోసం సుబ్బారావు 'వినోదకథల'పేరుతో ఒక కథల సంకలనం ప్రకటించాడు. దీనినే ఆయన 'ప్లీజింగ్ టేల్స్' పేరుతో ఇంగ్లీషులోకి అనువదించాడు. 'వెర్నాక్యులర్ టెక్స్ట్‌బుక్ సొసైటీ' అనే దేశభాషా గ్రంథకరణ సభకు సుబ్బారావు సలహాదారుగా ఉండేవారు.

1829 నాటికే కావలి వెంకట రామస్వామి (ఈయన బొర్రయ్య తమ్ముడు) కలకత్తాలో గవర్నర్ జెనరలైన విలియం బెంటింక్ ప్రాపకం సంపాదించడం చెప్పుకోదగిన సంగతి. 'లైవ్స్ ఆఫ్ దక్కన్ పొయెట్స్'అనే దక్షిణాది కవులచరిత్రను ఈయన ఇంగ్లీషులో రచించి విలియం బెంటింక్‌కు అంకితం చేశాడనటానికి సాక్ష్యాధారాలున్నాయి. ఆ మొదటి ముద్రణం ఇప్పుడు లభించదు. బ్రిటిషు మ్యూజియంలో లభిస్తుందేమో ప్రయత్నించాలి. ఆ తర్వాత రామస్వామి జీవితకాలంలో 1840లలో ఇది మరోసారి అచ్చైంది. మళ్ళీ 1976లో విశేష విషయ వివరణ సహితంగా డా॥సి.వి.రామచంద్రరావు దీనిని పునర్ముద్రణగా ప్రకటిం చాడు. దీనిలో రామస్వామి అరిస్టాటిల్ పొయెటిక్స్‌ను గురించి ప్రస్తావిం చాడు. ఆదిశంకరాచార్యులను గురించీ తెలుగులో సుప్రసిద్ధ ప్రబంధకవి భట్టుమూర్తిని గూర్చీ రాశాడు. ఇందువల్ల ఏమి నిరూపితమవుతున్న దంటే భారతదేశంలో ఇంగ్లీషు విజ్ఞాన ప్రసార భాషగా పరిగణనం పొందుతున్న తొలిరోజులలోనే కవుల చరిత్ర, స్వీయచరిత్ర, వాచకరచన, విద్యా నివేదికలు ఇంగ్లీషులో తెలుగువారు రాశారని.

కాశీయాత్ర చరిత్రద్వారా ఆధునికకాలంలో అత్యంత ప్రసిద్ధుడైన ఏనుగుల వీరాస్వామయ్య చార్లెస్ ఫిలిప్ బ్రౌన్‌కు స్నేహితుడు. బ్రౌన్ సలహాపైనే వీరాస్వామయ్య దినచర్య వృత్తాంతంగా తన యాత్రా చరి త్రను గ్రంథస్థం చేశాడు. బ్రౌన్‌దొర తెలుగు సాహిత్యానికి చేసినసేవ లోకవిదితం. 1850లలో ఆయన ఇంగ్లీషు - తెలుగు, తెలుగు- ఇంగ్లీషు నిఘంటువులు కూర్చాడు. వఠ్యం అద్వైత బ్రహ్మశాస్త్రి, జూలూరు అప్పయ్య పంతులు, మాలపాక బుచ్చన్నశాస్త్రి, వెలగపూడి కోదండ రామయ్యవంటి విద్వాంసులను ఆయన ఆదరించాడు. పోషించాడు. ఆదుకున్నాడు. వేమన పద్యాలను చక్కగా ఇంగ్లీషులోకి అనువదించాడు. ఆంధ్రదేశంలో నలుమూలలా తాళపత్ర ప్రతులకోసం అన్వేషణ సాగించి వాటిని తనపండితుల సాయంతో సేకరించి పరిష్కరింపజేసి ప్రతులు రాయించాడు. మనుచరిత్రను సంపాదించి ప్రతులు రాయించాడు. అదివరకు తెలుగు పండితులకు గ్రంథపరిష్కరణం విషయం తెలియదు. వివిధ ప్రతులలో పాఠాంతరాలున్నప్పుడు సరైనా పాఠాన్ని పరిశీలించే పద్ధతి ఏదో తెలియదు. తెలుగు పండితులకు గ్రంథ పరిష్కరణ పద్ధతులు ఆయన బోధించాడు. మనుచరిత్రవంటి అత్యంత ప్రసిద్ధమైన తెలుగు ప్రబంధం బ్రౌన్ సేకరించి భద్రపరచి ఉండనట్లైతే తెలుగువారు ఆ గొప్ప ప్రబంధాన్ని శాశ్వతంగా కోల్పోయేవారు. ఆంధ్రదేశమంతా గాలిం చగా ఆయనకు మనుచరిత్ర ఆరు తాళపత్ర ప్రతులు మాత్రమే లభించి నవి. ఇందువల్లనే ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్‌ను ఆంధ్ర వాఙ్మయో ద్ధారకుడని తెలుగువారు కీర్తించారు. కృతజ్ఞత చూపారు. ఆయన పేరుమీద పండిత పరిషత్తులు నెలకొల్పారు. కోస్తాజిల్లాలలోనూ, రాయలసీమలోనూ కూడా ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్ వివిధ ఉద్యోగ హోదాలు నిర్వహించినపుడు తెలుగు తాళపత్ర గ్రంథాలు సేకరించడమే తన జీవిత ధ్యేయంగా కృషి సాగిం చాడు. కవిత్రయ భారతాన్ని పరిష్కరింపజేసి మొట్టమొదట అచ్చు వేయించినవాడు ఆయనే. అందువల్ల ఆ తరం తెలుగు పండితులు బ్రౌన్‌గూర్చి కథలు- గాథలు అల్లుకున్నారు. ఆత్మీయంగా స్మరించు కున్నారు. కొమర్రాజు లక్ష్మణరావు, వేటూరి ప్రభాకరశాస్త్రి, నిడుదవోలు వెంకటరావు, బంగోరె వంటి పండితులు, పరిశోధకులు బ్రౌన్‌దొరను కీర్తించారు.

ఆ రోజుల్లో పండితులు, ఉద్యోగార్థులు, ప్రభుత్వ శాఖలతో పని ఉన్నవారు తమ అర్జీలు, విన్నపాలు తెలుగులోనే రాసుకునేవారు. కుంఫిణీ పరిపాలన వ్యవస్థలో ఒక అనువాదశాఖ పనిచేసేది. ఈ అనువాదశాఖ ప్రధానాధికారిగా ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్ కొంతకాలం పని చేశారు. ఇంగ్లీషువారైన ఉన్నతాధికారులు, ఉద్యోగులు దేశీయు లతో ఉత్తరప్రత్యుత్తరాలు నిర్వహించవలసి వచ్చినప్పుడు అనువాద శాఖ సహాయం పొందేవారు. ఇంగ్లీషు అధికారులు తెలుగు నేర్చుకోవడానికి సహాయకారిగా ఒక నిఘంటువు అవసరం కుంఫిణీ ప్రభుత్వం గుర్తిం చింది. బందరులో ఉండే మామిడి వెంకయ్యగారిని ఇందుకు వారు అర్థించారు. ఆయన 'ఆంధ్రదీపిక' అనే నిఘంటువును ఇందునిమిత్తం సమకూర్చారు. మామిడి వెంకయ్యగారి ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ తెలుగు లోనే ఉన్నవి.

ఇట్లా ఇంగ్లీషు అధికారులు తెలుగు నేర్చుకోవడానికి సహాయ పడేందుకు ఎ.జి.కాంబెల్, విలియం బ్రౌన్, జె.సి.మారిస్ మొదలైనవారు పదకోశాలు, వ్యాకరణ బోధినులు, అభ్యాసికలు, చిన్నచిన్న నిఘంటు

వులు పందొమ్మిదో శతాబ్ది పూర్వార్థంలోనే కూర్చారు. సెయింట్ ఫోర్ట్ జార్జ్ కళాశాలలో వేదం పట్టాభిరామశాస్త్రి, రావిపాటి గురుమూర్తి శాస్త్రివంటి పండితులు దేశభాషలయిన తెలుగు, సంస్కృతంలను ఉన్నతోద్యోగాలు చేపట్టే యూరోపియన్‌లకు బోధించేవారు. వీళ్లకోసం వచనగ్రంథాలు కూర్చేవారు. పందొమ్మిదో శతాబ్ది ప్రథమ దశకాలలోనే చెన్నపట్నం వంటి రాజధాని నగరంలో అచ్చుయంత్రాలు వచ్చినా, తక్కిన ఆంధ్రదేశంలో ఆతరువాత కొన్ని దశాబ్దాలవరకు రాలేదు.

ఏ ప్రాంతంలో ఉద్యోగం చేసినా అక్కడి కవి పండితులూ సాహిత్య ప్రముఖులతో సి.పి.బ్రౌన్ సాన్నిహిత్యం అభిలషించేవారేమోనని పిస్తుంది. విశాఖజిల్లా 'సర్వసిద్ధి' గ్రామకరణంగారైన వద్దిపర్తి కోనమ రాజుగారు ఆరోజులలో గొప్పకవిగా భక్తుడిగా యోగసిద్ధుడిగా ప్రసిద్ధి పొందారు. ఆయన మహాలక్ష్మీ పరిణయం, రేవతీ పరిణయం అనే రెండు కావ్యాలు రచించారు. అప్పటి యూరోపియన్ ఉన్నతోద్యోగులు, గొప్ప అధికారులు ఈయన యోగసిద్ధులను విశ్వసించక మాకు ఏదైనా రుజువు లేదా తార్కాణం కావాలి చూపగలరా? అని ప్రశ్నించగా దానిని మీరే నిర్ణయించండి అన్నారు కోనమరాజుగారు. అప్పుడా అధికార్లం దరూ కూడబలుకుకొని మిమ్మల్ని అండమాన్ ద్వీపంలోకి తీసుకొనిపోయి వదులుతాము. మీరు ఎటువంటి యానసాధనమూ లేకుండా విశాఖ తీరం చేరగలరా? అని కోరారు. అదెంతపని? అన్నారు వీరు. ఈ గొప్పగొప్ప అధికారులంతా సంప్రదించుకొని కోనమరాజుగారిని అండ మాన్ ద్వీపంలోకి తీసుకొని వెళ్లి ఉంచారు. ఇక సముద్రతీరంలో ప్రధాన మైనచోట్ల గస్తీ ఏర్పాట్లుకూడా చేశారు. ఆ తరువాత నాలుగు రోజులకు కోనమరాజుగారు సముద్రం వెంబడి అలలపై తేలుతూ విశాఖసముద్రపు ఓడరేవు చేరినట్లు ఐతిహ్యం. కోనమరాజుగారు స్వీయచరిత్రోదంతం పద్యాలలో రాశారు. విశాఖ సముద్రతీరంలో కోనమరాజుగారు ప్రత్యక్షం కావడంచూసి దొరలంతా అత్యుత్సాహంతో వచ్చి కరచాలనాలతోనూ, పొగడ్తలతోనూ ఆయనను అభినందించినట్లు కోనమరాజుగారి స్వీయ చరిత్రోదంతం చెపుతున్నది. ఈతరం వారికి ఇటువంటి సంఘటనలు నమ్మశక్యంకాని నిజాలు అనిపించవచ్చుగాని స్వయంగా వద్దిపర్తి కరణం గారే లిఖితపూర్వకంగా చెప్పినప్పుడు ఆయన ఏ ప్రయోజనం ఆశించి ఇలా రాసుకున్నాడని మనం ప్రత్యాఖ్యానం చేయవచ్చుకదా! ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్‌గారిని నేను ఎరుగను కాని అట్లా సముద్రసైకత తీరంలోకి వచ్చి నాతో కరచాలనంచేసి అభినందించి వారిలో ఆయనకూడా ఉన్నా డని నాకు తెలిసింది అని కోనమరాజుగారు రాసుకున్నారు. వీరు పందొ మ్మిదో శతాబ్ది పూర్వార్థానికి చెందినవారు.

ఏనుగుల వీరాస్వామయ్యగారి సమకాలికులు అవధానం పాపయ్య గారు చెన్నపట్నం వేపేరిలో ఉండేవారు. ఆయన పెద్దపెద్ద ఇంగ్లీషు దొరలకు ద్విభాషిగా ఉండి చాలా ప్రాపకమూ, పలుకుబడీ, సంపదా ఆర్జించారు. చెన్నపట్నం సముద్రతీరంలో ఓడసుంకాలు వసూలు చేసే అధికార కార్యాలయంలో 'లింకరేజ్ సూపరింటెండెంట్' (శుల్క పర్యవేక్ష ణాధికారి) అనే చాలా పలుకుబడిగల ఉద్యోగం నిర్వహించారు. అప్పట్లో చెన్నపట్నం గవర్నరుతో, ఆయన కార్యాలోచన సభ్యులతో ఈయనకు చాలా సాన్నిహిత్యం ఉండేదనీ, ఈయన చాలా ఘటికుడనీ, మంత్రాం గంలో నేర్పరి అనీ, ఇంగ్లాండు వ్యాపారవర్గాలవారు ఈయనను ఆశ్ర యించేవారనీ, ఈయన గవర్నర్ దగ్గర కూడా చక్రం తిప్పగలిగేవారనీ, ఈయన వల్ల సహాయం పొందలేకపోయిన వ్యాపార ప్రముఖులు, లాభం పొందలేకపోయిన అధికారులూ ఈయనను చాలా చెడుగా చిత్రించి అనేక అభియోగాలు మోపి, చాలా మోసగాడు అనీ, క్రూరుడనీ, అవినీతి పరుడనీ ప్రచారంచేశారనీ, ప్రభుత్వ వర్గాలలోకూడా గొప్ప అలజడికి, ఆందోళనకు ఈయన కారకుడైనాడనీ, ఆ తరువాత ఈయన ఖైదుశిక్ష కూడా అనుభవించవలసి వచ్చిందనీ, దిగవల్లి వేంకట శివరావుగారు తమకథలు- గాథలులో విపులంగా ఈయన కథంతారాశారు. వీరుచేసిన ఓడరేవు ఉద్యోగం బట్టి వీరిని ప్రజలు లంగరు పాపయ్య అనేవారనీ, ఈయన గొప్ప విద్వాంసుడనీ, బ్రౌన్‌దొరవారి కోరికపై ఈయన దగ్గర స్కాందపురాణంలో ఇదివరకు లభించని కొన్ని సంహితలు ఉన్నాయేమో తాము వాకబు చేశామనీ ఏనుగుల వీరాస్వామయ్య కాశీయాత్రా చరిత్రలో పీఠికద్వారా మనకు తెలుస్తున్నది. ఈయన వృత్తాంతం ఇంత విపులంగా ప్రస్తావించడం ఎందుకంటే లంగరుపాపయ్యగారి వల్ల నష్టపడిన వ్యాపారవర్గాలవారు ఇంగ్లండులో ఈయన అవినీతికర దుర్మా ర్గాలను గోరంతలు కొండంతలుగా ప్రచారం చేయడంతో సుప్రసిద్ధ నవలా రచయిత సర్ వాల్టర్ స్కాట్ తన 'సర్జన్స్ డాటర్' నవలలో అవ ధానం పాపయ్యగారిని ఒక దుష్టపాత్ర (విలన్) గా చిత్రించారని దిగవల్లి వారు కథలూ, గాథలులోపూసగుచ్చినట్లు అవధానం పాపయ్యగారి గొప్ప (?)తనాన్ని గూర్చి ఉటంకించారు. మన అవధానం పాపయ్యగారి ఖండాంతర కీర్తినిగూర్చి మనం తెలుసుకోవద్దా? ◆

## మే 13, 14 తేదీల్లో 'ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం' ఆవిర్భావం సాహిత్య సభలు-కవి సమ్మేళనాలు

ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల కవులు, రచయితలను అనుసంధానం చేస్తూ, సాహిత్యపరంగా వారి అభివృద్ధికి సంఘం పరిధిలో కృషి చేయాలనే సంకల్పంతో రూపుదిద్దుకున్న 'ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం' -ఆవిర్భావ సభ-సాహిత్య కార్యక్రమాలు 2017 మే 13, 14 తేదీల్లో విజయవాడ-ఐ.ఎం.ఏ హాలులో జరుగనున్నాయి. ఈ కార్యక్రమాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రులు, 13 జిల్లాలకు చెందిన ప్రఖ్యాత కవులు, రచయితలు పాల్గొని సందేశాలిస్తారు. రచయితల సంఘం 13 జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొంటారు. కొత్త పుస్తకాలు ఆవిష్కరణలు వుంటాయి. ఈ సందర్భంగా ప్రత్యేక శతాధిక కవి సమ్మేళనం జరుగనుంది. ఈ కవి సమ్మేళనంలో పాల్గొనే కవులకు అల్పాహార, భోజన ఏర్పాట్లు కల్పించబడును. జ్ఞాపిక, దుశ్శాలువా, ప్రశంసా పత్రంతో కవులకు సత్కారం వుంటుంది. ఆసక్తి గల కవులు ఏప్రిల్ 20వ తేదీలోగా ఫోన్ ద్వారా గానీ, పోస్టు కార్డు ద్వారా గానీ పేర్లు నమోదు చేసుకోవాలి. ఫోన్ ద్వారా అయితే 92474 75975, 92464 15150 నెంబర్లలో నమోదు చేసుకోవచ్చు. పోస్టు ద్వారా పేర్లు నమోదు చేసుకునేవారు ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం, పోస్ట్‌బాక్స్ నెం.5, 11-57/1-32, సెకండ్‌ఫ్లోర్, జె.ఆర్.కాంప్లెక్స్, రజకవీధి, విజయవాడ-1 చిరునామాకు కార్డు రాయవచ్చని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్ తెలియజేశారు.

# కాకతీయులు

-ఈమని శివనాగిరెడ్డి- స్థపతి
సెల్ : 98485 98446

**శా**తవాహనుల తరువాత, తెలుగు మాట్లాడే ప్రజలున్న భూభాగాలన్నింటినీ ఒక్కటిగా చేసి తెలుగు సామ్రాజ్యాన్ని నిర్మించిన ఘనత కాకతీయులకే దక్కింది. కాకతీయుల మూలపురుషుడు వెన్ని రాజు. ఇతడు రాష్ట్రకూటులకు సామంతుడుగా ఉండేవాడు. తరువాత కళ్యాణ చాళుక్యుల కాలంలో వీరికి సామంతునిగానున్న కాకర్త్య గుండన కుమారుడైన బేతరాజును అనుమకొండ ప్రాంతానికి పాలకునిగా నియమించటంతో కాకతీయుల పాలన ప్రారంభమైంది. ఆ తరువాత మొదటి ప్రోలరాజు, వేములవాడ భూభాగాన్ని, మెదకును కాకతీయుల పాలనలోకి తెచ్చారు. ప్రోలరాజు కుమారుడు రెండో బేతరాజు, కాకతీయుల అధీనంలోకి ముదిగొండ చోళుల భూభాగాన్ని కూడా కలిపి విస్తరించాడు. రెండో ప్రోలరాజు కందూరు చోళులు, పొలవాస పాలకులను ఓడించి మరింత విస్తృతపరచి తీరాంధ్రలో వెలనాటి చోళులతో జరిగిన యుద్ధంలో మరణించాడు. రుద్రదేవుడు (క్రీ.శ.1158-1195), మహదేవుడు (క్రీ.శ.1195-99), గణపతి దేవ చక్రవర్తి (క్రీ.శ. 1199-1262), రుద్రమదేవి (క్రీ.శ. 1262-1289), రెండో ప్రతాపరుద్రుడు (క్రీ.శ. 1290-1323), స్వతంత్ర రాజులుగా, చక్రవర్తులుగా తెలుగునేలను పాలించారు. వీరు కవిపండితులను పోషించి, వాస్తు, శిల్ప కళారంగాలను ప్రోత్సహించి, తెలుగు వారి సాంస్కృతిక వికాసానికి దోహదం చేశారు. ఇప్పటి తమిళనాటగల కంచి, కర్ణాటకలోని బళ్ళారి, మహరాష్ట్రలోని దేగులూరు, మధ్యప్రదేశ్‌లోని దంతెవాడ, ఒడిషాలోని కటక్ వరకూ, తూర్పున బంగాళాఖాతం వరకూ సువిశాల భూభాగాన్ని పాలించి ఆంధ్రఖండ మండలంగా తీర్చిదిద్దారు. సామంత మాండలికులుగా పాలన ప్రారంభించినా, తొలి కాకతీయులు కూడా వారి పాలనా దక్షత, శౌర్యప్రతాపాలను బట్టి ఒకటిరెండు బిరుదులు ధరించారు. అటుతరువాత స్వతంత్ర కాకతీయ సామ్రాజ్యాన్ని పాలించిన గణపతిదేవ చక్రవర్తి లాంటివారు అనేక బిరుదుల్ని పొందారు. కాకతీయ రాజులు, రాజ్యాలతోపాటు పాలనలో పాలుపంచుకున్న దండనాయకులు, ప్రధానులు, సంధి విగ్రహులు, ఇతర ఉన్నతోద్యోగులు, సామంత మండలాధీశులు కూడా వారి వారి సామర్థ్యం, శక్తియుక్తులను బట్టి **కాకతి రాజ్య స్థాపనాచార్య** లాంటి బిరుదుల్ని పొందటం గమనించాల్సిన విషయం.

వీరిలో మొదటి బేతరాజు (క్రీ.శ. 995-1050)కు **కాకతిపురాధినాథ, చోడక్ష్మాపాల చమూవార్ధి ప్రమథన సమార్జితలక్ష్మీ** అనే ప్రశంసాపూర్వక బిరుదులున్నాయి. అతని తరువాత సామంత కాకతీయుడైన మొదటి ప్రోలయరాజు (క్రీ.శ. 1052-1076)కు **'సమధిగత పంచ మహాశబ్ద, అరిగజకేసరి** అనే బిరుదులున్నాయి. మొదటి ప్రోలరాజు కుమారుడైన రెండో బేతరాజు (క్రీ.శ. 1076-1108) **మహామండలేశ్వర, త్రిభువనమల్ల, విక్రమచక్రి, చలమర్తిగండ** అనే బిరుదులను వహించినట్లు శాసనాలు తెలియజేస్తున్నాయి. అతని తరువాత అతని కుమారుడైన దుగ్గరాజు (క్రీ.శ. 1108-1116) కు **త్రిభువనమల్ల, చలమర్తి గండ** అనే బిరుదులున్నాయి.



దుగ్గరాజు తరువాత అధికారానికొచ్చిన అతని తమ్ముడు (క్రీ.శ. 1116-1157) తొలితరం కాకతీయుల్లో ప్రసిద్ధుడు. ఇతనికి **మహామండలేశ్వర** అనే బిరుదుంది. కొందరు పరిశోధకులు **మహామండలేశ్వర** పదం అధికార హోదాయే కాని, బిరుదు కాదన్నారు. రెండో ప్రోలరాజు తరువాత అతని పెద్దకొడుకు రుద్రదేవుడు అధికారాన్ని చేపట్టి, స్వతంత్రుడై కాకతీయ రాజ్యాన్ని స్థాపించాడు. ఇతడు క్రీ.శ. 1158 నుంచి 1196 వరకు పాలించాడు. అనేకమంది ఇరుగు పొరుగు రాజులను జయించి, కాకతీయ భూభాగాన్ని విశాలం చేశాడు. ఎంతో విక్రమ, పరాక్రమ వంతుడైన రుద్రునికి అంతగా బిరుదులున్న ఆధారాలు లభించనప్పటికీ ద్రాక్షారామ శాసనం మాత్రం అతన్ని **వినయభూషణు**డని పేర్కొంటుంది. ఇతని సేనాని ధరణి కోటను ఆక్రమించి, దొడ్డభీముని వధించి, **దొడ్డభీమ శిరచ్ఛేదక, కోట గెల్పాత** అన్న బిరుదులు ధరించాడు.

రుద్రుని తరువాత రాజైన మహదేవుడు (క్రీ.శ. 1196-99) కూడా ఎలాంటి బిరుదులనూ ధరించలేదు. అయితే వరంగల్లు శాసనంలో గణపతిదేవ చక్రవర్తికి **మహామండలేశ్వర, పరమమాహేశ్వర, లాట, చోడ, కటక, చూఱకాఱ, మంనియ బెంటకార, కదన ప్రచండ, చలమర్తిగండ, విభవ దేవేంద్ర, సత్యహరిశ్చంద్ర** అన్న బిరుద ప్రశస్తులను కలిగి ఉన్నాడని పేర్కొంటుంది. కాకతీయ గణపతిదేవుని సామంతుడైన మల్యాల గుండయ, వర్ధమానపురంలో వేయించిన శాసనంలో గణపతి దేవునికి **పంచమహాశబ్ద, మహామండలేశ్వర, అనుమకొండ పురవరాధీశ్వర, మూరు రాయర జగదాళ, పరమ మాహేశ్వర, చలమర్తిగండ, కదన ప్రచండ, మహారాజు** బిరుదులు చెప్పబడినాయి. వీటితో పాటు **రాయగజకేసరి** బిరుదును, అతని కుమార్తె రుద్రమదేవి (క్రీ.శ.1262-1289) **రాయగజకేసరి** బిరుదును, తరువాత రాజైన చివరి కాకతీయ పాలకుడు ప్రతాపరుద్రుడు (క్రీ.శ.1290-1323) కూడా **రాయగజకేసరి** అనే బిరుదును ధరించాడు. ◆

## సప్త శిఖరాలనెక్కిన రారాజు

# మల్లి మస్తాన్‌బాబు

-డా. సుజన్ తథాగత్
99498 45629

ఎంత పట్టుదల, సాహసం, ప్రాణాలకు తెగింపు లేకపోతే, మైనస్ డిగ్రీల మంచుతో, దారీతెన్నూలేని ప్రపంచంలోని ఏడు ఖండాలకు చెందిన ఏడు మహోన్నత శిఖరాలను, కేవలం 172 రోజుల్లో అధిరోహించి, ఎవరు తిరిగి రాగలరు?

ఈ పని మహాసాహసి మల్లి మస్తాన్‌బాబు చేశాడు. అతడు మన భారతీయుడు. అంతేకాదు, మన తెలుగుబిడ్డ.

అతడి సాహసాలు తెలుసుకుంటుంటే వళ్ళు నిక్కపొడుచుకుంటుంది. మానవమాత్రుడికి సాధ్యమేనా ఇదంతా? అనిపిస్తుంది.

తన పర్వతారోహక సాహసాలద్వారా మల్లి మస్తాన్‌బాబు భారతీయులందరికీ స్ఫూర్తిప్రదాత అయ్యాడు. ఇప్పుడు ఆంధ్రా, తెలంగాణాలలోని కుర్రగాళ్ళు, తమ తమ ప్రాంతాలలోని కొండలు, చిన్నవి, ఒక మోస్తరువే కావచ్చు, పందాలేసుకుని మరీ ఎక్కి దిగి వస్తున్నారు. 'కొండలెక్కాలి, అత్యున్నత శిఖరాలు అధిరోహించాలి' అన్న ఆశయం మన యువకులకు అందించింది మల్లి మస్తాన్‌బాబే.


ప్రాణాలకు తెగించి కొండ శిఖరాలెక్కి తిరిగివచ్చిన యువకుల ముఖాలలోని ఆనందం, ఆత్మవిశ్వాసం చూడాలి, అవి పురాణకాల వీరులగాథలకేమీ తీసిపోవు.

బాల్యంలో చిన్న చిన్న చెరువుల్లో సరదాగా ఈతలు కొట్టి, పెద్దయ్యాక పెద్దపెద్ద నదులనే దాటివేసినవారున్నారు. అగ్గిపెట్టెలతో కార్లు, రైళ్లు తయారుచేసినవారు పెద్దయ్యాక పెద్దపెద్ద ఇంజనీర్లు అయినవారున్నారు. అలాగే కోరుకొండ సైనికస్కూలులో చదువుకునే రోజుల్లో, హిమాలయాలనెక్కుతూ, మంచు తుఫానులో చిక్కుకుని మరణించిన ఉదయభాస్కర్ అనే తన సీనియర్ విద్యార్థి విగ్రహాన్ని చూసినప్పుడల్లా మల్లి మస్తాన్ బాబు, ఎలాగైనా తాను ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించాలని కలలు కన్నాడు, మహదాశయం పెట్టుకున్నాడు. ఎవరెస్టు శిఖరం ఎక్కాలంటే మాటలా? ఎంతో డబ్బు ఖర్చుపెట్టగలిగి ఉండాలి. పర్వతారోహక సామగ్రికే తక్కువలో తక్కువ అయిదువేల డాలర్ల డబ్బు వుండాలి.

కూలిపనులు చేసుకుని బ్రతికే ఒక ఎరుకల కుటుంబానికి చెందిన అతడికి, ఎవరెస్టుని అధిరోహించాలన్న కోరిక, అతడి శక్తికి మించిందే. అయినా మానుకున్నాడా? తన కలని నిజం చేసుకునేందుకు నిరంతరం శ్రమిస్తూనే వున్నాడు, తపిస్తూనే వున్నాడు.

మంచి వుద్యోగం, బాగా డబ్బు రాగల మంచి వుద్యోగం రావాలంటే మంచి మంచి చదువులూ, పెద్దపెద్ద చదువులూ చదవాలి. ఐ.ఐ.టి.లాంటి ఇనిస్టిట్యూట్స్‌లో సీటు సంపాదించాలి. కష్టపడి చదివాడు. సీటు సంపాదించాడు. అత్యున్నత శ్రేణిలో చదువులు పాసై, అవార్డులు కూడా తెచ్చుకున్నాడు. విలువైన వుద్యోగాలకు ఎంపికైనాడు. ఇదంతా అతడి ఆశయాన్ని తీర్చుకోవడానికే.

పర్వతారోహణలో తానొక అథ్లెట్‌నని తన్ను తాను ప్రకటించు



కున్నాడు. ధనికులు మాత్రమే ఖర్చులు భరించగల డార్జిలింగ్ లోని నెహ్రూ స్కూల్ ఆఫ్ మౌంటెనీరింగ్‌లో చేరాడు. సిక్కిం, భూటాన్ కొండల్ని ఎక్కడం, దిగడం సాధన చేస్తున్నాడు. అతడి ఆశయం అక్కడ కొత్త మొలకలు వేసింది. శరీరాన్ని ఎంతటి కష్టాన్నైనా భరించగలిగేలా తీర్చిదిద్దుకున్నాడు.

అత్యంత కష్టసాధ్యమైన అ ట్రైనింగ్‌లో అతడిక ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించే ప్రయత్నాల్లో ఉండగా, సెవెన్ సమ్మిట్ అనే పర్వతారోహక వుద్గ్రంథాన్ని చదవడం తటస్థించింది. ఆ గ్రంథం చదివాక అతడు తన్నుతాను నిలుపుకోలేకపోయాడు.

ప్రపంచంలో వున్న అత్యంత ఎత్తైన ఏడుశిఖరాల గురించి వివరాలున్నాయి ఆ గ్రంథంలో. ఆ ఏడు శిఖరాలనూ అధిరోహించినవారు భారతీయుల్లో ఒక్కరు కూడా లేరు. ఏదో ఆశయం అతడ్ని క్రమ్మివేసింది. ఎవరెస్టుశిఖరం ఎక్కాలన్న అతడి ఆశయం, యింకా యింకా విశాలమై ఆ ఏడు శిఖరాలనూ ఎక్కిన భారతీయుడిగా పేరుపొంది, భారతీయుల శక్తి ఏమిటో ప్రపంచానికి చూపించాలి, తెలుగువాడి ప్రతిభ ఏమిటో చూపించాలి అని గాఢమైన నిర్ణయం తీసుకున్నాడు.

అంతటి మహోన్నత ఆశయం సాధించేందుకు ఎన్ని కష్టాలు పడాలి, ఎన్ని ట్రెక్కింగులు చేయాలి, ఎన్నెన్ని కొండలు ఎక్కిదిగాలి? ఎంత డబ్బు వుండాలి? అతడు చదివిన చదువులకు లక్షలు కుమ్మరించే యింజనీరింగ్ వుద్యోగాలు వస్తాయి. అయినా, ఆ డబ్బుతో, ఆ వుద్యోగాలతో అతడు సంతృప్తిపడలేదు. తన ఆశయాన్ని సాధించుకునేందుకు కావలసిన ధనాన్ని సంపాదించడానికే ఆ వుద్యోగాలు చేసేవాడు. లక్షల్లో జీతాలుండే ఆ వుద్యోగాల్లో చేరి అతడెంతయినా సుఖపడవచ్చు. సప్తశిఖరాలనధిరోహించి భారతీయ శక్తికి కొత్త రికార్డు నెలకొల్పాలన్న అతడి ఆశయం ముందు ఎంతటి సంపాదనా అతడికి గడ్డిపోచతో సమానమయ్యింది.

అయినా ఇంకా డబ్బు వుండాలి. అప్పటికే పర్వతారోహకుడిగా

మంచిపేరు వుంది. కానీ ఏ ప్రభుత్వమూ **అతడు సప్తశిఖరాల నధిరోహించే ప్రాజెక్టుకు ఏ విధంగానూ తోడ్పడలేదు. ఈనాడు అతడు నెలకొల్పిన రికార్డులనన్నింటినీ** మన **భారతీయుల రికార్డులుగా జమ చేసుకుంటున్నాం. కానీ, అతడి ఆశయానికి ఏ ప్రభుత్వమూ కలిసి రాలేదని మనం గుర్తుంచుకోవాలి. సిగ్గుపడాలి కూడా.** అతడి స్నేహితులే అతడిపై వున్న ఆరాధనతో, గౌరవంతో లక్షల్లో డబ్బు సమకూర్చారు. అలా ఒక్కొక్క శిఖరం ఎక్కుతున్నకొద్దీ సప్తశిఖరాలనధిరోహించాలన్న భావన బలపడసాగింది.

**2006 సంవత్సరంలో** ప్రపంచంలోని ఏడు ఖండాలలోని ఏడు **ఎత్తైన శిఖరాలను 172 రోజుల్లో ఎక్కాలని నిర్ణయించుకున్నాడు. అంటార్కిటికా ఖండంలోని 'విన్సన్ మాశిఫ్' శిఖరాన్ని అధిరోహించడంతో మొదలుపెట్టి, ఒకో శిఖరాన్ని ఒకో వారంగా గుర్తుపెట్టుకున్నాడు. నాలుగువేల ఎనిమిది వందల తొంభై ఏడు మీటర్ల ఎత్తున వున్న ఆ విన్సన్ మాశిఫ్ శిఖరాన్ని జనవరి 19, గురువారం నాడు అధిరోహించాడు. ఆ తరువాత దక్షిణ అమెరికాలోని ఆరువేల తొమ్మిది వందల అరవైరెండు మీటర్ల ఎత్తున వున్న 'అకాన్ గువా' అనే పర్వతాన్ని ఫిబ్రవరి 17న శుక్రవారంనాడు అధిరోహించాడు. ఆ తరువాత ఆఫ్రికాలోని అయిదువేల ఎనిమిది వందల తొంభై అయిదు మీటర్ల ఎత్తున వున్న 'కిల్మంజారో' పర్వతాన్నిమార్చి 15 బుధవారంనాడు అధిరోహించాడు. ఆ తరువాత ఆస్ట్రేలియా ఖండంలోని రెండువేల రెండు వందల యిరవై ఎనిమిది మీటర్ల ఎత్తునవున్న 'కోషస్ జోకో' పర్వతాన్ని ఏప్రిల్ 1 శనివారం రోజున అధిరోహించాడు. ఆ తరువాత ప్రపంచంలోనే ఎత్తైన ఎనిమిదివేల ఎనిమిది వందల నలభై ఎనిమిది మీటర్ల ఎత్తున వున్న మన ఎవరెస్ట్ శిఖరాన్ని మే 21 ఆదివారం నాడు దిగ్విజయంగా అధిరోహించాడు. ఆ తరువాత యూరప్‌లోని అయిదువేల ఆరువందల నలభైరెండు మీటర్ల ఎత్తున వున్న 'ఎల్‌బరస్' శిఖరాన్ని జూన్ 13 మంగళవారంనాడు అధిరోహించాడు. ఆ తరువాత ఉత్తర అమెరికాలోని ఆరువేల నూటతొంభైనాలుగు మీటర్ల ఎత్తు వున్న 'మెక్ ఇన్ లే' పర్వతాన్ని జూలై 10 సోమవారంనాడు అధిరోహించి, మొత్తం 172 రోజుల్లో సప్తశిఖరాలనధిరోహించి ప్రపంచ రికార్డు సృష్టించిన భారతీయుడిగా చరిత్రలో నిలిచిపోయాడు.**

ఏ శిఖరం మీదికి వెళ్లినా అక్కడ అతడు మన జాతీయ జెండాను ఎగురవేస్తాడు. ఆ జాతీయ జెండామీద అతడినెంతో ప్రోత్సహించే అతడి ప్రియమైన చిన్నక్క డాక్టర్ దొరసానమ్మ, అతడి సంతకాన్ని అందంగా దారంతో కుడుతుంది.

ప్రపంచ రికార్డుని నెలకొల్పి భారతీయుల సాహసాన్ని నిరూపించిన, చాటి చెప్పిన మల్లి మస్తాన్‌బాబు అక్కడితో ఆగిపోలేదు. ఇంకా యింకా నూతన రికార్డులు నెలకొల్పాలని తలిచాడు. వందలాది, వేలాదిమంది విద్యార్థులకు పర్వతారోహణలో క్లాసులు చెప్పాడు. శిక్షణనిచ్చాడు. నేషనల్, ఇంటర్ నేషనల్ కాన్ఫరెన్సులలో పాల్గొని యువకులకు తన ఉపన్యాసాలతో, తర్ఫీదుతో ఎంతో ఉత్తేజపరిచాడు. తన అనుభవాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు ఎంతో వివరంగా చెప్పేవాడు. ఉత్తరాలు రాసేవాడు. వీడియోలు పంపేవాడు. వ్యాసాలు రాసేవాడు. యోగ, విపస్సన క్లాసులు కూడా చెప్పేవాడు.

మొదటిసారిగా అతడు ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించినప్పుడు జాతీయజెండాతోపాటు అక్కడ, పర్వతారోహణలో తనకు ఆరాధ్యుడైన ఉదయభాస్కర్‌కి గుర్తుగా కోరుకొండ సైనిక్ స్కూల్ యొక్క ఫ్లాగ్‌ని కూడా ఎగురవేశాడు. ఆ విధంగా ఏకలవ్య శిష్యుడిగా అతడి రుణం తీర్చుకున్నాడు.

ఒక్క 2007వ సంవత్సరంలో అతడు ఉత్తరాఖండ్‌లోని హిందూ ధామ్స్‌ని అధిరోహించాడు. ఆ తరువాత అతడు పద్నాలుగు రాష్ట్రాలలోని సరిహద్దుల్ని స్పృశిస్తూ మారథాన్ చేశాడు. ఆ తరువాత యింకా గొప్ప విషయం ఏమిటంటే ఎవరెస్టు శిఖరాన్ని మరల అధిరోహించటమే కాకుండా, ఎవరెస్టు పర్వతానికి చుట్టూవున్న కాంచనగంగ, కైలాసపర్వతం యికా ఎన్నో అత్యున్నత పర్వతాలు దాదాపు 2వేల కిలోమీటర్లు అనేక శిఖరాలు ఎక్కుతూ దిగుతూ గమ్యాన్ని చేరుకున్నాడు.

దక్షిణ అమెరికాలోని స్పెయిన్ మరియు చిలీ దేశాలలోని ఆండియన్ పర్వతాలు ఎత్తైనవి 14 వుంటాయి. వాటిని కూడా అధిరోహించాలని అతడు సంకల్పించుకున్నాడు. ఆ సందర్భంగా అతడు స్పానిష్ భాష నేర్చుకున్నాడు. స్పానిష్ భాషలో అనర్గళంగా మాట్లాడుతూ అనేకమంది స్పానిష్ జాతీయులను వారి దేశ ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు ప్రోత్సహించేవాడు. అతడు ప్రాణాలు పోగొట్టుకున్నదీ అక్కడే. అతడు సంకల్పించిన చిలీ దేశంలోని 'ట్రెస్ క్రూసెస్' అన్న ఆరువేల ఏడువందల నలభై తొమ్మిది మీటర్ల ఎత్తున వున్న శిఖరాన్ని అధిరోహించడానికి వెళ్ళేముందు, అమెరికాలోని పర్వతారోహణపై ఎంతో మక్కువవున్న 60 సంవత్సరాల అమెరికన్ మహిళకు ట్రైనింగ్ యిచ్చి, ఆమెచేత భారతదేశంలోని ఒక పర్వతాన్ని ఎక్కించాడు. ఆమె సంతోషానికి హద్దులు లేవు. ఈసారి వారు గంగోత్రి వద్దకు వెళ్ళడానికి ప్రణాళికను వేసుకున్నారు. ఆ సందర్భంగా ఇండియాకు వచ్చిన ఆమెకు తన యింటిలోనే ఆతిథ్యమిచ్చి, చిలీ నుండి తాను రాగానే గంగోత్రికి వెళదాం అని చెప్పి, ఆమెను మరింత బలంగా చెయ్యడానికి మంతెన సత్యనారాయణరాజు ప్రకృతి వైద్యశాలలో చేర్పించి చిలీ దేశానికి వెళ్ళాడు.

ఆ 'ట్రెస్ క్రూసెస్' పర్వతాన్ని అధిరోహించి క్రిందకు దిగుతూ వుండగా బాగా తుఫానులాగా వర్షాలు పడ్డాయి. అమెరికన్ మహిళకు మార్చి 28కల్లా గంగోత్రి వెళ్ళడానికి ప్రణాళిక వుంది. ఆరోజు మార్చి23. తోటి పర్వతారోహకులు పరిస్థితి ప్రమాదకరంగా వుందని చెప్తున్నా, యిలాంటివాటినెన్నో చూసిన అనుభవంతో అతడు వారికంటే ముందు దిగుతూ మంచు తుఫానులో చిక్కుకు పోయాడు. ఆ చిలీ పర్వతాలు నిముషాలలో తమ రూపాన్ని మార్చేసుకుంటాయి. అందువల్ల అతడి భౌతికకాయాన్ని కనుగొనడానికే పదిరోజుల సమయం పట్టింది. 2015 మార్చి 23న భరతమాత తన ముద్దుబిడ్డను కోల్పోయింది.

చిన్నక్క డాక్టర్ దొరసానమ్మ ఎన్నో ప్రయాసలు పడి, అతడి భౌతిక కాయాన్ని ఇండియాకు తీసుకువచ్చింది. ప్రధానమంత్రి, మరియు కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు చిలీ దేశంతో సంప్రదింపులు జరిపి, భౌతిక కాయాన్ని ఇండియాకు తీసుకువచ్చేటట్లు సాయపడ్డారు.

అతడి మరణవార్త విని భారతదేశం తుళ్ళిపడింది. వేలాది ప్రజల మధ్య, అభిమానుల మధ్య, అతడి వూరిలోని అతడికున్న ముప్పావు ఎకరం పొలంలోనే అతడ్ని సమాధి చేశారు. ఆంధ్ర, తెలంగాణ

మంత్రులందరూ పాల్గొన్నారు.

అతడి సాహసాన్ని పాఠ్యాంశాలలో చేర్చుతామన్నారు. అతడి కుటుంబానికి రెండెకరాల స్థలం యిచ్చారు. అతడికి గొప్ప అవార్డు యిస్తామన్నారు. తల్లికి పెన్షన్ ఏర్పాటు చేస్తామన్నారు. అతడి పేరున అవార్డు ప్రకటిస్తామన్నారు.

ఏమీ జరగలేదు. అతడి కుటుంబానికి యిచ్చిన రెండు ఎకరాల భూమి వూరి చివరవున్న శ్మశానాల ప్రక్కన వున్నభూమి. అంతేకాదు, తగవులో వున్న భూమి. అతడి తల్లికి చిల్లిగవ్వ యివ్వలేదు. ఆరోజుల లోనే అతడిని ప్రభుత్వాలు మరిచిపోయాయి. హిమాలయమంత ఎత్తున వున్న అతడ్ని కనీసం తలెత్తి చూడలేని మరుగుజ్జులైపోయారు నాయకులూ, ఉన్నతాధికారులూ.

భారతరత్న అవార్డు యివ్వగల అర్హతలున్న ఆయనకు, భారతరత్న అవార్డు యివ్వకపోయినా, ప్రజలు అతడ్ని 'భారతరత్న మల్లి మస్తాన్ బాబు' గానే పిలుచుకుంటున్నారు.

**అతడి స్ఫూర్తి ఎంత గొప్పదంటే, పర్వతాలెక్కడంలో ఏమాత్రం అనుభవం లేని అతడి సోదరి, అతడు చనిపోయిన ఆ 'ట్రెస్ క్రూసెస్' పర్వతాన్ని ఎక్కి, అతడు చనిపోయిన చోటున తన తమ్ముడికి నివాళు లర్పించింది.**

**ఆశ్చర్యంగా అతడు అక్కడ వదిలివేసిన లేదా జారి పడిపోయిన భారతీయ జెండాను గుర్తించి, లేపి, తన గుండెలకు హత్తుకుని, భారత్‌కు తిరిగి వచ్చింది. మల్లి మస్తాన్‌బాబు తన చివరి గుర్తుగా ఆ భారతీయజెండా యిపుడు ఆమె దగ్గరే వుంది. ఇది చాలదా ఆ అక్కాతమ్ముళ్ళకు ఉమ్మడిగా 'భారతరత్న' అవార్డు యివ్వడానికి? ఎట్టి సహాయ సహకారాలు యివ్వకపోయినా భారతీయులకు యింతటి ప్రతిష్ఠ తెచ్చిపెట్టిన దళితబిడ్డకు నిరాదరణేనా పాలకులు యిచ్చే బహుమతి?** ◆

కవిత

## సహారా ఎడారి దారి దిక్కుకు...!!

-సద్దపల్లె చిదంబరరెడ్డి
9440073636

**గా**ంధీతాతో, అంబేద్కరో,
గురజాడో, శ్రీశ్రీనో, యామన్ననో....
గురుతుకు తెచ్చుకోని,
వాళ్ల "దినం" సేసినట్ల
"ఉగాది పండగ" అంటూనే నాకి
ప్రక్కురుతి మాత గొంతును కోసి
ఆ తల్లి అపురూప ఆకుపచ్చ రగతాన్ని
యాపారాల తీర్తాన్ని సేసి- ఆ మాత
బతికిన కాలాన్ని పుర్రెకు ఒగోరకంగా
సెప్పుకొనే గబ్బు జనాల
శద్దతనాలే గురుతుకొస్తాయి!!

ఆ కాలంలో......
బూమితల్లికి దప్పికయితే
సెట్ల సేతులని పైనికెత్తి సినుకుల్ని పోయమని
పై పీటంలో వుండే మేగం మారాజుకి
మాటల్లేని బాషలతో వర్తమానాన్ని పంపిస్తా వుండె!!

కొమ్మల బుజాల మింద గూళ్లుకట్టి పెంచుకోనుండే
సిలకా, గోరింకా, కోకిలమ్మల పిలకాయిల్తో
కమ్మగా వుండే పాటల్ని పాడిచ్చి,

కన్నుల్లో కాంతులు నింపే
రంగుల సుందరాల పూల మకరందాల మర్మాలనంతా
తుమ్మెదా, తేనీగల్తో తాగించి
అల్లీ బిల్లీ తీగల మద్యన ఆట్లాడించి
గాలి వొంటికంతా సుగందాల సారాన్ని రాస్తే.....!!

వనాలన్నీ సిలక పచ్చని సీరకట్టి
కొత్త ఆలోశన్ల జతగాని కోసరం
వసంతాల వాకిలిని వొయ్యారంగా తీస్తా వుండె!!

కాలుగాలిన పిల్లిమాదిరీ తచ్చాడ్తా వుండే
మగతనాల మేగంగాడు తొంగి సూసి
సిటా పటా సినుకులయి కిందకి దిగి
వంకలు, వాగులు, సెరువులు, యేర్లు పట్టనంత
ఆనంద జలాలయి పొంగి పొర్లతా వుండె!!

మట్టితల్లిని నమ్మిన పల్లెల జనాలు
సల్లని నీళ్ల సిరులనీ
సెట్ల సంకల్లోని సిట్టి పిందెల్నీ
సేన్ల సిగల్లోని ఆశల లేత పాసుల్నీ సూసి
"ఉగాది""ఉగాది" అని వురకలేసి మురిసిపోతా వుండ్రి!!
దాన్ని పల్లెల పండగంటా వుండ్రి!!

బూమ్మీద కండ్లు తెరుస్తూనే కన్న తల్లిని సంపుకోని
అమ్మతనమే తెలీని అనాద అవిటి బిడ్డల లెక్కన
పట్నాల పంచల్లో అడుక్కు తింటా వుండివి!!

నాజూకు రంకుతనాలు నేర్చిన నాయక తలకాయలంతా
నోట్ల సంపాదన సేసే పెద్ద గజ్జి రోగా లంటుకోని
సెజ్జులు, కొలువుల కూటాలకని కుట్రలు నేర్చి
పల్లెల్ని యేర్ల పురుగుల లెక్కన కొరుక్కోని తింటా
సమాజ జనాలని వసంతాల వనాలకి కాకుండా
సహారా యెడారి దారి దిక్కుకు పరుగులు తీయిస్తావుంటే!!??

తలలు తెగిన మామిడాకుల లెక్కన
యింటింటి వాకిట్లోనా తోరణాల తాళ్లకి
ఉరి పోసుకొని ఉగాది వేలాడినట్లుంది!! ◆

నడుస్తున్న చరిత్ర

# మూలాల వెతుకులాట....?

-గోవిందరాజు చక్రధర్
సెల్: 98498 70250

**"క**నీసం తెలుగమ్మాయినైనా నీ కోడలిగా తెచ్చుకుంటావా?" అమెరికాలో స్థిరపడిన నా కూతురును అడిగాను ఒకరోజు ఉబుసుపోక.

తెలుగమ్మాయి అనడం ద్వారా కులాలను, ప్రాంతాలను దాటివచ్చి విశాలభావంతో మాట్లాడుతున్నానని లోలోపల సంతోషించాను కూడా.

"తెలుగా? తమిళమా? పంజాబీనా? స్పానిషా? అమెరికన్ ఇంగ్లీషా? బ్రిటిష్ ఇంగ్లీషా? అని నేను ఆలోచించే పరిస్థితిలో లేను డాడీ! నీ మనవడికి ఇప్పుడు అయిదేళ్ళు. మరో పదిహేను, ఇరవైఏళ్ళ తర్వాత పరిస్థితులు ఎలా మారతాయో ఇప్పుడే ఏంచెప్పగలం? కానీ నేను వాడినుంచి పెళ్ళివిషయంలో కోరు కునేది మాత్రం ఒక్కటే. వాడు ఏ భాషకు చెందిన ఏదేశపు అమ్మాయిని చేసుకున్నా నాకుగాని, మీ అల్లుడుగారికి గానీ అభ్యంతరమేమీ లేదు.వాడు మరో అబ్బాయిని కాకుండా అమ్మాయిని చేసుకుంటే మాకదే పదివేలు."

కూతురి మాటలతో నివ్వెరపోవడం నావంతయింది. ఈ లెక్కనచూస్తే మరో నాలుగైదు తరాల తర్వాత నా ముని ముని మనవడు అసలు తెలుగులో మాట్లాడగలడా? తెలుగు సంస్కృతీ సంప్రదాయాలేమైనా నా వారసుల ఇళ్ళలో రవ్వంతైనా మిగులుతాయా?

నా కూతురు, అల్లుడు అమెరికాలో స్థిరపడినా మన భాష, కట్టు, బొట్టు ఇప్పటికీ ఏమాత్రం చెక్కు చెదరకుండా బలంగానే ఉన్నాయి.

వాళ్ళింట్లో ఇప్పటికీ ఎంతో శ్రద్ధగా మన పండగలన్నీ జరుపుకుంటూ ఉంటారు. ఏడాదికో, రెండేళ్ళకో స్వదేశానికి చుట్టపు చూపుగా వచ్చినప్పుడు, ప్రత్యేక సందర్భాలకోసం వాడేందుకు మన సంప్రదాయ వస్త్రాలను మక్కువగా కొని, తీసుకువెళ్తూంటారు. పనిలో పనిగా ఊరగాయ పచ్చళ్ళనూ పట్టుకెళ్తారు.

ప్లేజోతో వినాయకుడి బొమ్మను చేసుకుని అంతర్జాలం సహాయంతో వినాయకవ్రత కథను వింటూ, నియమ నిష్ఠలతో పూజచేసి, స్వామివారికి ఉండ్రాళ్ళు సహా నైవేద్యాలు సమర్పించు కుంటారు. పూజ మధ్యలో వచ్చే ధర్మసందేహాలను తీర్చటానికి వాళ్ళ అమ్మ వాట్సప్‌లో సదా సిద్ధంగా ఉంటుంది.

ఒక్క వినాయక చవితి అనే ఏమిట... ఉగాది, దీపావళి, దసరా, సంక్రాంతి వగైరా పండగలన్నీ అంతే శ్రద్ధాసక్తులతో జరుపుకుంటారు. ఈ మధ్య కాలంలో బతుకమ్మలనూ భక్తిగా కొలుస్తున్నారు. అమెరికాలోని మొదటి రెండు తరాల తెలుగు ఇళ్ళలో ఇది సాధారణమే.

తెలుగువారు ఉండే ప్రాంతాల్లో విధిగా మన గుళ్ళు, గోపురాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ప్రవాసభారతీయులు అందునా తెలుగు వారిలో ఆధ్యాత్మిక చింతనా భక్తి ప్రపత్తులు ఏరులై పారుతున్నాయి.

తెలుగు కుటుంబాలు వారాంతాల్లో కలుసుకున్నప్పుడు హాయిగా తెలుగులోనే మనసు విప్పి మాట్లాడుతూ కాలక్షేపం చేస్తున్నారు.

స్వదేశానికి వచ్చినప్పుడు షిరిడీ సాయిబాబానుంచి, తిరుపతి వెంకన్నదాకా, విజయవాడ కనకదుర్గమ్మ నుంచి అన్నవరం సత్యనారాయణస్వామి వరకూ ముఖ్య క్షేత్రాల సందర్శన విధిగా ఉంటోంది. వీలు చిక్కకుంటే బంధువులనైనా కలవకపోవచ్చునేమోకానీ, క్షేత్ర సందర్శనలో మాత్రం ఏమాత్రం తేడా రానివ్వటం లేదు. మరి మొక్కులు అలాంటివి.

ఇంతవరకూ బాగానే ఉంది. నా మనుమడు, మనవరాలు అమెరికాలోనే కళ్ళు తెరిచారు కనుక వారు జన్మతః అమెరికా పౌరులు.

నా కూతురు, అల్లుడు ఇంట్లో తెలుగులోనే మాట్లాడు కుంటున్నారు. తెలుగు మాటలను పిల్లలు ఆర్థం చేసుకోగలుగు తున్నారు. కానీ, ధారాళంగా తెలుగులో సంభాషణ కొనసాగించ లేకపోతున్నారు. మాటల్ని కూడదీసుకుని కష్టంమీద పట్టిపట్టి ఉచ్చరించగలుగుతున్నారు. నాలుగు ముక్కలు మాట్లాడి ఇంగ్లీషులోకి మళ్ళుతున్నారు.

మనవడి తరంలోనే మా ఇంట తెలుగుదీపం రెపరెపలాడు తున్నది. ఆ మనవడు పెరిగి పెద్దవాడయ్యాక మరోదేశపు అమ్మాయిని పెళ్ళాడాక వారి ఇంట తెలుగుతో పని ఏం ఉంటుంది? ఎంచక్కా అమెరికన్ ఇంగ్లీషు రాజ్యమేలుతుంది. మనవడి తరంలోనే తెలుగు మాట వినలేమనుకున్నప్పుడు ముని మనవడి హయాం గురించి వేరే చెప్పుకోవాలా?

నావరకూ అస్థిత్వమంతా నా భాషలోనే ముడిపడి కొనసాగుతోంది. నా సంస్కృతీ సంప్రదాయం అంతా తెలుగు నేలతో జమిలిగా వికసిస్తోంది.

మున్ముందు తరాల్లో నా వారసుల ఇళ్ళలో మచ్చుకు ఒక్క తెలుగుముక్క వినపడదు, ముచ్చటగా ఒక్క తెలుగు పండుగ కనపడదు. తలచుకుంటేనే గుండెల్లోనుంచి బాధ తన్నుకొస్తుంది.

అలెక్స్ హేలీ, 'రూట్స్' నవల(తెలుగులో 'ఏడుతరాలు') లో మాదిరి నా మునిముని మనవడో, మనవరాలో మూలాలను వెతుకుతూ తెలుగునేలపై కాలు మోపవచ్చు.

అప్పుడు వారికి తెలుగుపేర్లే వింతగా తోచవచ్చు. తెలుగు నేల ఘనత ఏమిటో బోధపడక పోవచ్చు.

డాలర్ల వేటలో, ట్రంప్ వద్దు పొమ్మంటున్నా అమెరికా చూరుపట్టుకుని వేళ్ళాడుతున్నాం మనం....

విశ్వవేదికపై వివక్ష తూటాకు గాయపడి తెలుగుతల్లి మూగగా రోదిస్తోంది.....

నా పునాదులు నా కళ్ళముందే కదిలిపోతున్నాయి. ◆

# మనవూరు మదరాసు

-డా॥మధురాంతకం నరేంద్ర
98662 43659

**"మా** వూరు మదరాసు - నా పేరు రాందాసు" అనే సినిమా పాటొకటి మా చిన్నతనంలో ప్రాచుర్యంలో వుండేది. మదరాసును మనవూరనే అనుకునేవాళ్ళం చాలాకాలం వరకూ. పెరిగి పెద్దవాడి నయ్యేకొద్దీ మదరాసు మనవూరు కాదనీ, అది చెన్నయిగా మారి తమిళ రాష్ట్రానికి రాజధానిగా మిగిలిపోయిందనీ హెచ్చరికలు వినబడ సాగాయి. తమిళనాడుకూడా మన ఆంధ్రప్రదేశ్‌లాగే భారతదేశంలో వొక రాష్ట్రమే గదా, మరి పొరుగు రాష్ట్రపు రాజధానయినంత మాత్రాన, ఆ వూరు మనది గాకుండా యెలా పోతుందని వాపో తున్నాం. యిప్పుడుగూడా మదరాసు మన వూరు గాదనుకోడానికి మనసొప్పడంలేదు.

హైదరాబాదుకంటే, విజయవాడకంటే ముందుగా నేను చూసిన మొదటి నగరం మదరాసే! అప్పుడు నేను ఏడో తరగతో, ఎనిమిదో తరగతో చదువుతూ వుండి వుంటాను. మదరాసులో వుండే మా బంధువులయింట్లో యేదో కార్యక్రమం జరిగింది. అప్పుడు మా నాన్న నన్నొక్కడ్ని తనతోబాటూ మదరాసు తీసుకెళ్ళారు. నగరం మధ్యలో ఏదో యింటి మొదటి అంతస్తులో వుండే మా బంధువుల యిల్లు ఇప్పుడు నాకు స్పష్టాస్పష్టంగా మాత్రమే గుర్తుంది. నా వయసే వున్న మా బంధువుల అమ్మాయి తమిళ పుస్తకంలో ఇ అనే అచ్చు పాము ఆకారముతో కనిపించి నన్ను విస్మయుడ్ని చేయడం కూడా గుర్తుంది. అప్పుడు మా నాన్న నన్ను బతికిన కాలేజీకి, చచ్చిన కాలే జీకీ తీసుకెళ్ళారు. ఒక పెద్ద సినిమా థియేటరులో "సరస్వతీ శపదం" అనే తమిళ సినిమాను చూశాం. ఆ థియేటర్ పేరు శాంతి అని తరువాతెప్పుడో తెలిసింది.

1969 ప్రాంతంలో చిత్తూరు జిల్లాలో రచయితల మహాసభలు జరిగాయి. అప్పుడు హాజరయిన గొప్ప తెలుగు రచయితలలో 90 శాతం మంది మదరాసునుంచే వచ్చారు. అప్పుడు తెలుగు పత్రికలు, తెలుగు సినిమా పరిశ్రమ మదరాసులోనే వుండేవి. దాదాపు 1975 వరకూ మదరాసు తెలుగువాళ్ళ సాంస్కృతిక రాజధానిగా వుండేది. 1975 ప్రాంతంలో నేను కథలు రాయడం మొదలుబెట్టాక ఆ తొలి సంవత్సరంలో నా తొలినాటి రచనలను మదరాసులోనే వుండిన ప్రముఖ పత్రికల కార్యాలయాలకే పోస్టులో పంపుతూ వుండేవాణ్ణి. మదరాసు తంబుచెట్టి వీధిలో భారతి, ఆంధ్రపత్రికలు మూతబడడ మన్నదొక కొండగుర్తులా, క్రమంగా మదరాసునుంచీ తెలుగు పత్రి కలూ, తెలుగు చలనచిత్ర పరిశ్రమా దూరమై క్రమంగా హైదరా బాదుకు తరలిపోయాయి. యింతలో మదరాసు చెన్నయిగా మారిపో యింది. యిదంతా పెద్ద సాంఘిక, సాహిత్య పరిణామం.

ప్రపంచంలో యాంత్రిక విప్లవం ముంచుకొచ్చినపుడు దానిలో భాగమైనవారు తామూ మార్పుచెందారు. తిరగబడ్డవాళ్ళు పరాజితులై పోయారు. తమిళీకరణంలో కూడా జరిగిందదే! అక్కడి నుంచీ తెలుగు రాష్ట్రాలకు పారిపోయినవాళ్ళు తెలుగు వారసత్వాన్ని నిలుపుకోగలి గారు. ఆ వూరిని వదలలేకపోయినవాళ్ళలో చాలామంది తమిళంలోకి చేరిపోయారు. ఆ మార్పునంగీకరించలేకపోయినవాళ్ళు గత ఆరేడు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నారు. ఆ పోరాటంలోంచి పుట్టిన దీప కళికే "మదరాసు బదుకులు"అనే యీ కథల సంపుటం.

అసలింతకూ వుమ్మడి మదరాసు రాష్ట్రంనుంచీ పోరాడి 'ఆంధ్ర ప్రదేశ్' అనే రాష్ట్రాన్నెందుకు తయారు చేసుకోవలసి వచ్చింది? దానికి సమాధానం ఈ పుస్తకంలోని వో కథలో దొరుకుతుంది. 'తెలుగు వెలుగు' అనే కథలో కన్యాకుమారి దగ్గర తిరునల్వేలికి చెందిన తెలుగువారేం చెబుతున్నారో వినండి: "ఇప్పటికీ మా ఇంట్లో తెలుగే మాట్లాడతాం. బయట తమిళం మాట్లాడతాము. ...తమిళంతోబాటూ తెలుగు అదనంగా వచ్చి ఉండటం వల్లనూ, తెలుగు కవి పండితు లంతా మదరాసు రాజధాని కనుక అక్కడే వుండటం వల్లనూ వాళ్ళతో పరిచయం ఏర్పడి మాకు కాస్తో కూస్తో తెలుగులో పాండిత్యమబ్బి తమిళ - తెలుగు పండితులమన్న గౌరవముండేది. తమిళులంతా మా యెడ గౌరవంతో మసలుకునే వారు ....నలభైఐదుశాతం వరకూ తెలుగు మాట్లాడేవారుండేవారు. కావేరీనదీ పరివాహక ప్రాంత రైతులంతా తెలుగువారే. ఆ రోజుల్లో తమిళ రాష్ట్రాన తెలుగువారికి అపారమైన గౌరవ మర్యాదలుండేవి. కానీ, తెలుగువారికి మరొకరితో కలిసిపోలేని ఆధిపత్య ధోరణి వుండేది. ఇక్కడి వాళ్ళకంటే మేం అధికులమనే అహంభావం వుండేది. పోనీ వాళ్ళలో వాళ్ళయినా కలిసి వుంటారా అంటే అదీలేదు. ఒకరిపొడ మరొకరికి గిట్టదు. వారిలో ఎవరైనా పైకివస్తే వాణ్ణి కిందికి లాగి పడేసేవరకూ నిద్రపోరు. ఐక్యతలేదు. కానీ పెత్తనం కావాలి. యం.యల్.ఏల బలం మావాళ్ళ కంటే మీకే ఎక్కువ వున్నా, ఆ పైన చెప్పిన జిల్లాలోని యం.యల్.ఏలు తెలుగువారైనా అధికారంకోసం కుక్కల్లా కాట్లాడటం, అంగలార్చడమే తప్ప అందరినీ కలుపుకుపోయే ఓర్పు, నేర్పు కొరవడింది. అందువల్ల మేధావియైన రాజాజీముందు స్వార్థపరులైన మీ వారి ఆటలు సాగ లేదు. ఇక్కడి మావాళ్ళేదో దెబ్బతీయాలని భాషారాష్ట్రవాదం లేవ దీశారు. ఇక్కడ మీవారికేం తక్కువైందని ఈ నినాదం లేవదీశారు? తెలుగువారంతా చేరి చాపకింద నీరులా తమిళ రాష్ట్రమంతటా ప్రవే శించారు...భవిష్యత్తులో తమిళ రాష్ట్రంలో తమిళులం అల్పసంఖ్యా కులమై తమిళరాష్ట్రం తెలుగు రాష్ట్రమైపోయే ప్రమాదముంది. తమిళ ప్రత్యేక రాష్ట్రం కావాలని తమిళులు భాషారాష్ట్రపు నినాదం లేవ దీయాలి. కానీ ఇక్కడ అన్ని హంగులూవున్న మీరెందుకు లేవదీశారు? ఫలితమేమైంది? పరువు పోగొట్టుకుని బోర్లాపడ్డారు. ప్రక్కనున్న ప్రతి రాష్ట్రానికి రెండుమూడు జిల్లాలను సమర్పించుకుని తెలుగు భాషనూ తెలుగు ప్రాంతాన్ని కుదించారు. ఉత్తరాదిన హిందీ, దక్షిణాదిన తెలుగు జనాభారీత్యా పెద్ద భాషలనే పేరుండేది. దానిని చెడగొట్టారు. తమిళులకు, కన్నడిగులకు, అట్లే మీ సరిహద్దునున్న మిగిలిన రాష్ట్రా లకు మీ భాషోన్మాదాన్ని అంటించారు. మదరాసు రాష్ట్రాన తమిళాన్ని నిర్బంధం చేశారు....తెలుగు పాఠశాలల్ని ఎత్తివేశారు...మా తర్వాత తమిళ, కన్నడ రాష్ట్రాల్లో తెలుగుండదు... మీవల్ల ఇక్కడ తెలుగు

చచ్చింది. అక్కడేమన్నా బ్రతికిందా అంటే, ఇప్పటికే రెండు చెక్కలయ్యే ప్రమాదాన్ని కొనితెచ్చుకున్నారు..." (తెలుగు వెలుగు– గంగుల బాబు)

భారతీయులదంతా జ్ఞాపకశక్తిపైన ఆధారపడిన చరిత్ర. రికార్డులూ, దస్తావేజుల రూపాల్లో చరిత్రను పదిలపరుచుకోవడం రాదు. పాతవాళ్ళు కనుమరుగైపోవడంతో మదరాసు గతచరిత్రను తెలుసుకొనే అవకాశాలు క్రమంగా తగ్గిపోతున్నాయి. (మార్పు –డా॥కావుటూరు వసుంధర). ఈ పుస్తకము కతలు రాసిన వాళ్ళల్లో దాదాపుగా అందరూ స్వాతంత్రం వచ్చిన తరువాత మదరాసుకెళ్ళినవాళ్ళే. చెన్నపట్నం మదరాసుగా మారకముందున్న దశాబ్దాల చరిత్రకు దాఖలాలేవీ ఈ కథల్లో దొరకడం లేదు. ఈ విషయాలు తెలుసుకోడానికి కొంతవరకూ ఏనుగుల వీరాస్వామి గారి 'కాశీయాత్ర చరిత్ర' మాత్రమే సాధనంగా వుంది.

దాదాపొక శతాబ్దం ముందు తమిళభాషావుద్యమ కారుడిగా వుండి తమిళుల భాగ్యవిధాతగా మారిన రామస్వామి నాయకర్ గూడా తెలుగువాడే. వోసారి తిరిగిచూస్తే మానవుడి జీవితమంతా అవకాశవాద రాజకీయాలేననిపిస్తుంది. అప్పట్లో తమిళంరాని తెలుగు రాజకీయ ప్రత్యర్థులను దెబ్బతీయడానికి తరతరాలుగా అక్కడే స్థిరపడిపోయిన తమిళం బాగా తెలిసి తెలుగు కొద్దిగా తెలిసిన ఆ నాయకర్ గారు పన్నిన పన్నాగమది.(కాలగమనం–ముళ్ళపూడి ఉమాదేవి). తెలుగువాళ్ళ అవకాశవాద రాజకీయాలకు అంతమెప్పు డనే ప్రశ్న మనల్ని వెంటాడుతూనే వుంటుంది.

35 కథలుండే యీ 'మదరాసు బతుకులు' పుస్తకంలోని చాలా కథల్లో చాలామంది నెల్లూరు జిల్లానుంచి బతుకుతెరువు కోసం మదరాసు చేరుకున్నవాళ్ళే వున్నారు. నెల్లూరు నుంచి రైలు ఎక్కితే రెండుమూడు గంటల్లో మదరాసు చేరుకోగలగడమే యిందుకు కారణం. అయితే నెల్లూరుకంటే దగ్గరగా వున్న చిత్తూరు జిల్లావాళ్ళు మదరాసుకు మరింత దగ్గరగా వున్నవాళ్ళు. వాళ్ళ గురించి కథలెందుకు చాలా తక్కువగా వున్నాయన్నది ప్రశ్న. (డా.మౌనిగారి చెన్నపట్నం కదంబ పూలపరిమళం, మన్నవ గిరిధర ప్రసాదుగారి నా చెన్నై కథ) బహుశ వాళ్ళు తమిళంలోకి సులభంగా ఒదిగిపోయి వుంటారు. ఈ కథల్లో చాలా కథల్ని ఇటీవల మదరాసుకు చేరినవాళ్ళు రాయడంతో వాళ్ళకు కథ రాయడమంటే వెంటనే గుర్తుకొచ్చేది మూర్‌మార్కెట్టు కాలిపోవడమూ రెండేళ్ళ క్రితం వరదలొచ్చి సగం నగరం నీటిలో మునిగిపోవడమూ (రూపాంతరం – రాయదుర్గం విజయలక్ష్మి, కన్నీటి వరద – డి.రాంబాబు)

కాలప్రవాహం ఆగదు. పాత విలువలూ, న్యాయాలూ కొట్టుకుపోతాయి. అలాగే పాతవాళ్ళూ, పాతచోట్లూ మాయమైపోతాయి. మదరాసులో తెలుగువాళ్ళు యెక్కువగా వుండే ప్రాంతాలు క్రమంగా రూపాలు మార్చుకొని పాత జ్ఞాపకాల్ని పటాపంచలు చేసి పారేస్తాయి. ( మరుగైన తన్నిదురై మార్కెట్టు – నెల్లుట్ల శ్రీనివాసులు) కోస్తా, కళింగాంధ్ర, తెలంగాణా, రాయలసీమ మాండలికాల్లాగే మదరాసు తెలుగును మరో మాండలికంగా గుర్తించాల్సింది పోయి, మనదే గొప్ప శుభ్రమైన తెలుగనీ, యితరులది గాదనీ ఛాందసాల్ని పెంచుకుంటున్నాం. (తెలుగు కల–రాణి పార్తీబన్, అనుభూతులు– ఆర్.ఎన్. హైమవతి, మా తెలుంగు పిల్ల – ముళ్ళపూడి శ్రీదేవి, వండి వచ్చిందా – గొల్లి శ్రీనివాసరావు). తమిళులు క్రమంగా తెలుగువాళ్ళను మరేదోజాతిగా భావించి మాకు మీరు అవసరం లేదు పొమ్మంటున్నారు.(అనుబంధం – ఆవుల వెంకటరమణ).

అయినా ఇప్పుడుగూడా మదరాసుకూ, తెలుగు రాష్ట్రాలకూ మధ్య తెగని బంధుత్వాలుండడంతో రాకపోకలు సాగుతూనే వున్నాయి. (రాముడొస్తాడా – అద్దేపల్లి సుజాతాదేవి, చెన్నపట్నం కదంబపూల పరిమళం – మౌని). మదరాసు మన సాంస్కృతిక రాజధానిగా వుండినప్పుడు అక్కడికి వెళ్ళి స్థిరపడిన మన సాహితీ వైతాళికుల పిల్లలుగూడా ఈ ప్రవాహంలో పడి కొట్టుకుపోతున్నారు. (మహదనుభవం – తిరుమల ఆముక్తమాల్యద, మసక – చల్లా భాగ్యలక్ష్మి, మునీశ్వరుని మొక్కు – డా.సజ్జా జయదేవ్ బాబు, ప్రదోష సంధ్య – పత్రి అనూరాధ, ప్రథమానుభవం – జె.టి. ఆచార్యులు, క్షమయా ధరిత్రి – లింగంనేని సుజాత). కొందరు తమకో బతుకు తెరువును చూపించిన మదరాసు నగరంపైన కృతజ్ఞతను మరవద్దని హెచ్చరిస్తున్నారు. (భయంలేని బతుకు – శ్రీ విరించి, దాత – రిషి శ్రీనివాస్). చెడిన భర్తను విడిచిపెట్టి నిబ్బరంగా తన వ్యక్తిత్వాన్ని నిరూపించుకోవాలన్న స్త్రీలకు మదరాసు అండగా వుందంటున్నారు.( పంచవర్ణం – హైమవతీదేవి).

నిజం లాంటి కలలూ, కలల్లాంటి నిజాలూ యీ కథల్లో వున్నాయి. (ఆమె నవ్వింది – యిమ్మిడిశెట్టి కోటేశ్వరరావు). వరదలు మదరాసు నగరాన్ని ముంచెత్తినప్పుడు భాషాభేదాల్ని మరిచిపోయి తెలుగువాళ్ళూ, తమిళులూ, మానవతా దృక్పథంతో పరస్పరం సహాయాలు చేసుకున్నారు.(తెలుగు మామి – కె.అరుణకాంతి, రెయిన్ కోటు – నల్లపాటి ఉషారాణి).

క్రమంగా తెలుగుబడులు మూతబడడంతో, మదరాసులో వుంటున్న తెలుగువాళ్ళు తమ పిల్లలకు మాతృభాషను నేర్పే బడులకోసం వెతుక్కుంటున్నారు.(మదరాసులో నా చదువు – చారుశ్రీ). తమిళులు భాషాభిమానాన్ని విడిచిపెట్టే మంచిరోజొకటి వస్తుందని కొందరు కలలు గంటున్నారు. తమిళనాడు ప్రభుత్వం తెలుగు భాషకోసం వొక మంత్రిత్వశాఖనే యేర్పాటుచేస్తుందని నమ్ముతున్నారు. (ఆచార్యుడు – గాదిరాజు అరుణ్‌కుమార్).

తమిళనాడులో స్థిరపడిన తెలుగువాళ్ళలో చాలామంది దళితులు. ముఖ్యంగా మాదిగలు. దళితులు కక్కసులు కడగడంవంటి దుర్భరమైన పనులు చేసుకుంటూ బతుకులు లాగుతున్నారు. వాళ్ళ దుస్థితిని పట్టించుకునే నాధులు లేరు. (తడి ఆరని బతుకులు – డా.విస్తాలి శంకరరావు).

త్యాగరాజునూ, కర్ణాటక సంగీతాన్నీ తమిళులు గౌరవించినంతగా తెలుగువాళ్ళు పట్టించుకోలేదు. మదరాసులో సంవత్సరం పొడువునా కచ్చేరీలు జరుగుతాయి. సంగీతంతో మనుషుల జబ్బుల్ని నయం చేయవచ్చునని ప్రకటించిన ప్రఖ్యాత తెలుగు సంగీత వాగ్గేయకారుడు మంగళంపల్లి బాలమురళీకృష్ణ మదరాసులోనే స్థిరపడ్డాడు.సంగీతానికి పరవశించి మరెక్కడా లేనంత తీయని పండ్లనిచ్చే మామిడిచెట్టు పుడితే మదరాసులోనే పుట్టాలి. (ద్వామిడిచెట్టు – శ్రీమతి రామ్‌నాధ్).

తెలుగూ–తమిళుల మైత్రికి జిడ్డు కృష్ణమూర్తీ, తత్త్వజ్ఞాన సమాజమూ నిలువెత్తు ప్రతీకలుగా మిగిలిపోయారు. కృష్ణమూర్తిగారి రచనల్ని తెనుగీకరించిన సరోజినీ ప్రేమ్‌చంద్ గారు 'వసంత్ విహార్'

**తరువాయి 47వ పుటలో**

# జవాబుదారీతనం లోపించిన ప్రజాప్రతినిధులు

-చలసాని నరేంద్ర
98495 69050

**తా**ను కోరిన తరగతిలో తనకు సీట్ కేటాయించలేదనే ఆగ్రహంతో శివసేన ఎంపి రవీంద్ర గైక్వాడ్ ఎయిర్ ఇండియా సిబ్బందిపై దౌర్జన్యంగా ప్రవర్తించడమే కాకుండా, జరిగిన సంఘటన పట్ల కనీసం విచారం వ్యక్తం చేయడానికి నిరాకరించడం మనదేశంలో ప్రజా ప్రతినిధుల వ్యవహారశైలికి అద్దం పడుతున్నది. దమ్ముఉంటే తనను అరెస్ట్ చేయమని ఢిల్లీ పోలీస్‌లను బెదిరించే రీతిలో కూడా ఆయన ప్రకటన చేయడం కూడా జరిగింది.

**తానే స్వయంగా 25 సార్లు చెప్పుతో ఒక ఉద్యోగిని కొట్టినట్లు సిగ్గులేక ఆ యంపీ 'ధైర్యం'గా ప్రకటించడం కూడా విస్మయం కలిగిస్తున్నది. దేశంలో ప్రజల గౌరవ మర్యాదలు కాపాడటం కోసం అవసరమైన చట్టాలను తయారు చేయవలసిన ప్రజా ప్రతినిధులు చట్టాన్ని తమ చేతులలోకి తీసుకోవడం, దానిలో తప్పేమీ లేదన్నట్లు వ్యవహరించడం గమనిస్తే ప్రజాప్రతినిధులు ఎంతగా బరితెగించ దానికి సిద్ధంగా ఉన్నారో స్పష్టం అవుతున్నది.**

ప్రజా ప్రతినిధుల మౌలికమైన బాధ్యత, కర్తవ్యం దేశంలో అమలులో ఉన్న చట్టాల పనితీరును సమీక్షించి అవసరమైన మార్పులు, చేర్పులు చేయడం. అవసరాల మేరకు కొత్త చట్టాలను తీసుకు రావడం. అయితే పార్లమెంటులో గాని, శాసనసభలలో గాని చట్టాలపై మొక్కుబడిగా మాత్రమే చర్చలు జరుగుతూ ఉన్నాయి. అనేకసార్లు కోరం లేక సభలు వాయిదా పడుతూ ఉండటం జరుగుతున్నది.

లోక్‌సభలో ఈ మధ్యనే ఒక సందర్భంలో ప్రాముఖ్యత గల అంశాన్ని చేపట్టిన సమయంలో కోరం లేక వాయిదా పడవలసి రావడం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి సైతం ఆగ్రహం కలిగించింది. ఎప్పుడూ సభలో ఉండవలసిందే అని తమ పార్టీకి చెందిన యంపీల సమావేశంలో ఆయన స్పష్టం చేశారు. తాను ఎప్పుడు ఎవ్వరిని పిలుస్తానో తెలియదని, ఆ సమయంలో వారు అందుబాటులో ఉండవలసిందే అని కూడా చెప్పారు. ఒక పాఠశాలలో విద్యార్థుల హాజరుకు ఏ విధంగా ఉపాధ్యాయులు తంటాలు పడుతూ ఉంటారో నేడు ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు అటువంటి పరిస్థితులలో ఉన్నట్లు కనబడుతున్నది.

రవీంద్ర గైక్వాడ్ దుశ్చర్యను అందరూ ఖండించినా ఆయనలో ఏ మాత్రం పశ్చాత్తాపం లేక పోవడం గమనిస్తే మన ప్రజా ప్రతినిధులలో జవాబుదారీతనం పూర్తిగా లోపించినట్లు స్పష్టం అవుతుంది. వారెంతసేపు తమకు ఇష్టమైన అధికారుల బదిలీలు, తమకు నచ్చినవారికి పదవులు- కాంట్రాక్టులు పొందే ప్రయత్నం చేయడం, కొన్ని వ్యాపార సంస్థల ప్రయోజనాలు కాపాడే కృషి చేయడం పట్ల చూపుతున్న ఆసక్తి చట్టాలను రూపొందించడం పట్ల చూపడం లేదు.

నేడు మన ప్రజాప్రతినిధులు ప్రపంచంలోనే అత్యధికంగా జీతభత్యాలు పొందుతున్నవారు. మన ప్రజలు పేదలుగానే ఉన్నా మన ప్రజా ప్రతినిధులు పలు సంపన్న దేశాలలో సైతం పొందని జీతభత్యాలను పొందుతున్నారు. అయితే ఎక్కువ మొత్తాలను భత్యాల పేరుతో తీసుకొంటూ తమ అసలు ఆదాయానికి సరిపడిన పన్నులు కూడా చెల్లించకుండా తప్పుకొంటున్న ఘనులు వీరు.

ప్రపంచంలో ఎవ్వరి జీతభత్యాలనైనా మధ్యవర్తిగా ఉండే ఒక కమిటీ మంచి, చెడులు సరిచూసి చేసే సిఫార్సులపైన ఆధారపడి ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఆ విధంగా వేతన కమిటీలను తరచూ నియమిస్తూ వస్తున్నారు. కానీ తమ జీతభత్యాలను ఎటువంటి సహేతుకత చూపకుండా పలురెట్లు తామే పెంచుకొంటున్న వారు ప్రపంచంలో మన దేశంలోని ప్రజా ప్రతినిధులే కావడం విస్మయం కలిగిస్తుంది.


**ముఖ్యంగా గత దశాబ్ద కాలంలో వారి జీతభత్యాలు పలు వందల రెట్లు పెరిగాయి. పార్లమెంటు సభ్యులకన్నా పలు రాష్ట్రాలలో శాసన సభ్యులు ఎక్కువ జీతభత్యాలు పొందుతున్నారు. సగటున నెలకు రెండు లక్షల నుండి నాలుగు లక్షల రూపాయల వరకు జీతభత్యాలను పొందుతున్నారు. పదవీకాలంలో 'ప్రజాసేవ' చేయదానికి వీలుగా వారికి భారీ జీతాలు ఇస్తున్నారు అనుకున్నా, మాజీలకు సైతం పారితోషికాలు అందించే సాంప్రదాయానికి తెలంగాణ ప్రభుత్వం ఇప్పుడు తెర ఎత్తుతున్నది.**

ఇప్పటికే మాజీలకు ఆరోగ్య, ప్రయాణ తదితర సదుపాయాలు ఎన్నో కల్పిస్తున్నారు. వీరికి కల్పిస్తున్న సదుపాయాలకు ఒక హేతుబద్ధత గాని, ప్రామాణికం గాని లేకపోవడం గమనార్హం. **ఈ విషయమై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు కొన్ని ప్రశ్నలు సంధిస్తే కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఆగ్రహం వ్యక్తం చేస్తూ రాజ్యసభలో పరోక్షంగా న్యాయవ్యవస్థను దాదాపుగా 'అభిశంసన' చేస్తూ చెప్పిన మాటలు ప్రజాధనాన్ని 'దుర్వినియోగ' పరచడం పట్ల మన ప్రజాప్రతినిధుల నిస్సిగ్గు ధోరణిని వెల్లడి చేస్తుంది.**

పార్లమెంటు సభ్యులకు ఎంత పింఛను ఇవ్వాలని నిర్ణయించే అధికారం కేవలం పార్లమెంటుదేనని అరుణ్‌జైట్లీ స్పష్టం చేశారు. పార్లమెంటు సభ్యుల పింఛనును, ఇతర భత్యాలను రద్దుచేయాలన్న అభ్యర్థనపై సుప్రీంకోర్టు స్పందించిన నేపథ్యంలో ఆయన ఈ విధంగా పేర్కొనడం ఒక విధంగా న్యాయవ్యవస్థను ప్రభావితం చేసే ప్రయత్నంగానే భావించవలసి ఉంటుంది.

నేడు మన ప్రజాప్రతినిధులు అత్యధికులు తమను ఎన్నుకున్న ప్రజల బాగోగులపట్ల కన్నా తమ సదుపాయాల పట్ల, తమ అధికార పరిధుల పట్లనే ఎక్కువగా శ్రద్ధ కనబరుస్తూ ఉన్నారు. శాసనసభ్యులయితే తమ నియోజకవర్గాన్ని తమ మాటకు ఎదురులేని ఒక రాజ్యంగా పరిగణిస్తున్నారు.

స్థానికంగా ఎవ్వరికి చౌకదుకాణం ఇవ్వాలి, రోడ్లు వేయడానికి కాంట్రాక్టులు ఇవ్వాలి దగ్గర నుంచి చిన్న చిన్న ఉద్యోగుల నుండి తాము చెప్పినవారే అక్కడ పనిచేయాలి అనేవరకు వెడుతున్నారు. తమ మాట కాదని వేరే ఉద్యోగులను నియమిస్తే మంత్రులు, ప్రజా ప్రతినిధులు ముఖ్యమంత్రి వరకు వెళ్లి పంచాయతీ జరిపిన ఉదంతాలు ఎన్నెన్నో ఉన్నాయి.




పైగా తమ నియోజకవర్గంలో అమలు జరిగే ప్రతి ప్రభుత్వ కార్యక్రమంలో లబ్ధిదారులు తాము చెప్పినవారే ఉండాలి. తమ పార్టీవారే ఉండాలి. ప్రభుత్వం చేస్తున్న ప్రతి రూపాయి ఖర్చులో తమ వాటా తమకు రావాలి. ఇప్పుడు చాలామంది ప్రజాప్రతినిధులు తమ బదులు తమ కుటుంబ సభ్యులను తమ ప్రతినిధులుగా పెట్టి వారే తమ బినామీలుగా వ్యవహరించేటట్లు చేస్తున్నారు. అధికార యంత్రాంగం అంతా వారి మాటలనే ఆయా ప్రజాప్రతినిధుల ఉత్తరువులవలె పరిగణించి అమలు చేయవలసిన పరిస్థితులు నెలకొన్నాయి.

కొన్నిచోట్ల కుమారులు ఆ విధంగా చేస్తూ ఉంటే, మరో కొన్నిచోట్ల భార్యలు, భర్తలు, బావమరుదులు, లేదా సన్నిహితులు అనధికార ప్రజాప్రతినిధుల వలే పెత్తనం చెలాయిస్తున్నారు. ఎటువంటి చట్టబద్ధత లేకుండా వారు రాజ్యాంగేతర శక్తులవలె ఆధిపత్యం చెలాయిస్తున్నారు.

ఈ విధంగా ప్రజాప్రతినిధుల పేరుతో దేశంలో జరుగుతున్న అరాచకత్వాన్ని పరిగణనలోకి తీసుకొంటే రవీంద్ర గైక్వాడ్ వ్యవహారం పెద్దగా ఆశ్చర్యం కలిగించడంలేదు. అదే మరో సాధారణ ప్రయాణీకుడు ఆ విధంగా ప్రవర్తించి ఉంటే వెంటనే అరెస్ట్ చేసి ఉండేవారు గదా.

చట్టసభలలో అధికార, ప్రతిపక్ష సభ్యులు ఎంతగా పరస్పరం ఆరోపణలకు దిగుతున్నా, క్షేత్ర స్థాయిలో తమ 'నిలువు దోపిడీ'ని కాపాడుకోవడంలో, తమ అరాచక పెత్తనాలకు రక్షణ ఏర్పరచుకోవడంలో, తమ చట్టాతీత వ్యవహారాలకు అడ్డులేకుండా చేసుకోవడంలో మాత్రం పరస్పరం సహకరించుకొంటూ ఉంటున్నారు. ప్రజలు తమపట్ల ఉంచిన విశ్వాసాన్ని వంచన చేయడంలో మాత్రం పోటీపడుతూ ఉంటున్నారు.

ఇక పాలనా బాధ్యతలు చేపడుతున్న మంత్రులు తమ కార్యాలయంలో అడుగుపెట్టి నప్పటి నుండి 'అవినీతి' పద్ధతులకు పాల్పడు తూనే ఉన్నారు. మంత్రిగారి పేషీలో సందర్శ కులకు ఇచ్చే టీ దగ్గర నుండి, అక్కడ వాడే తెల్ల కాగితాల వరకు ఆయా మంత్రుల ఆధీ నంలో ఉన్న అధికారుల కార్యాలయం నుండి తెప్పించినవే. చివరకు మంత్రిగారి వద్ద పనిచేసే సిబ్బందిలో పలువురు సైతం ఇతర కార్యాలయా లలో పనిచేస్తూన్నట్లు రికార్డులలో చూపి, ఇక్కడ పనిచేస్తూ ఉంటారు. మంత్రిగారు ఉపయోగించే వాహనాలు సైతం అదేవిధంగా ఉంటున్నాయి.

అర్హతను బట్టి మంత్రులకు సిబ్బందిని, ఇతర సదుపాయాలను కేటాయించి, వాటి పైననే ఆధారపడేటట్లు చేసుకోవచ్చు. కానీ ఆవిధంగా చేయకుండా 'అక్రమంగా' అన్ని వసతులు పొందే విధంగా చేయడం గమనిస్తే చట్టబద్ధంగా యంత్రాంగం పనిచేయడం పట్ల మనకు ఏ మాత్రం ఆసక్తి లేదని స్పష్టం అవుతుంది. మంత్రుల ఇళ్లల్లో ఇచ్చే విందులు, వినోదాలు అన్నింటికీ బిల్లుల చెల్లింపు అక్రమంగానే జరుగుతూ ఉంటుంది. ప్రజాప్రతినిధులకు ప్రవర్తన నియమావళి అంటూ ఏర్పాటు చేసుకుంటున్నా ఆచరణపట్ల ఎవ్వరూ ఆసక్తి చూపడం లేదు. ◆

## హోసూరు(తమిళనాడు)లో ఉగాది సందర్భంగా పుస్తకాల విడుదల



**త**మిళనాడు–హోసూరు–బస్తీ యువక బృందం 11వ ఉగాది వేడుకల సందర్భంగా – నగరంలోని చంద్రశేఖర కల్యాణ మండపంలో ఈనెల 26 ఆదివారం నాడు ఉగాది కవితా సంపుటితోపాటు మరి రెండు పుస్తకాలను ఆవిష్కరించారు. రాష్ట్ర పశుసంవర్ధక శాఖామాత్యులు బాలకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పలమనేరు బాలాజీ, గుడిమెట్ల చెన్నయ్య, తూమాటి సంజీవరావు, స.రఘునాధ్ గారలకు ఉగాది పురస్కారాలు అందజేశారు. మొత్తం కార్యక్రమాన్ని వసంత్ నిర్వహించారు.

-భట్టరుశెట్టి పద్మారావు రాయలు
90104 29826

## చరిత్రకారులు పట్టించుకోని స్వాతంత్ర్య సమరయోధుడు

# ద్వారబంధాల చంద్రయ్యనాయుడు

**అ**ల్లూరి సీతారామరాజుకంటే ముందు మన్యంలో బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా గిరిజన, దళిత, పీడిత వర్గాలను సంఘటితం చేసి పోరాటం జరిపిన విప్లవయోధుడు- ద్వారబంధాల చంద్రయ్య నాయుడు. అయితే, పాలకుల, పెత్తందార్ల, చరిత్ర రచయితల నిర్లక్ష్య ఫలితంగా ఆయన చరిత్ర మరుగున పడింది.

చంద్రయ్యనాయుడు క్రీ॥శ॥ 1860 సం॥లో ప్రస్తుత విజయ నగరం జిల్లా "బొబ్బిలి" తెలగవీధిలో సెప్టెంబరునెల దశమి ఘడియ లకు ముందుగా మూలానక్షత్రంలో తెలగదొరల కుటుంబంలో జన్మిం చాడు. ఆరోజుల్లో మూలా నక్షత్రంలో జన్మించిన ఆడ, మగ శిశువు లను గొంతులో ధాన్యపుగింజ వేసి చంపి పూడ్చేవారు. ఒకవేళ బ్రతికినా, నష్టజాతకుడిగా చూచేవారు.

చంద్రయ్యనాయుడు జన్మించడానికి కొన్ని రోజులకు ముందే అతనితండ్రి లక్ష్మయ్యనాయుడు బొబ్బిలి సంస్థానం ద్వారా సైనికాధి కారిగా బ్రిటిష్‌వారి తరపున "ఆఫ్ఘనిస్తాన్"లో తిరుగుబాటును అణచ డానికి "కాబూల్" వెళ్లాడు. తల్లి లక్ష్మమ్మ చంద్రయ్యను కన్న కొద్ది కాలానికే మరణించింది. యుద్ధానికి వెళ్లిన తండ్రి ఎంత కాలానికీ తిరిగి రాలేదు.

చంద్రయ్యనాయుడు తల్లి జన్మస్థలం తూ॥గో॥జిల్లా శంఖవరం మండలం నెల్లిపూడి గ్రామం. ఇతని మేనమామలు రవణం రామయ్య, లక్ష్మయ్యలు పురిటికందయిన చంద్రయ్యనాయుడిని "నెల్లిపూడి" గ్రామం చేర్చుకున్నారు. (నేటికీ నెల్లిపూడి గ్రామంలో "రవణం" అనే ఇంటిపేరుగల వారి బంధువులున్నారు) నాయుడు పెరిగి పెరిగి పెద్దవాడై విద్యాబుద్ధులు నేర్చుకున్నాడు. ఆయనకు చదువుమీద కంటే, కర్రసాము, కుస్తీ, తుపాకివేట అంటే చాలా యిష్టపడేవాడు. మేన మామ రవణం రామయ్య తన కుమార్తె సీతమ్మనిచ్చి బాల్యవివాహము చేశాడు. 1926వరకు. ఉభయ గోదావరి జిల్లాలు 'గోదావరి' జిల్లా గానే పిలవబడేది.

క్రీ॥శ॥ 1841 సం॥ తర్వాత పెద్దాపురం సంస్థానము ఉచ్ఛ స్థితిలో ఉండి పెద్దాపురం సంస్థానాధీశులకు సంతానం లేని కార ణంగా బ్రిటిష్ సామ్రాజ్యంలో కలిపివేయబడింది. అనగా విక్టోరియా మహారాణి పాలనలోకి వచ్చింది. ఆ సంస్థానం పతనం తర్వాత- కాట్రావులపల్లి, కిర్లంపూడి, కోలంక, పోలవరం, మొగల్తూరు, పేరూరు, కాత్రేనికోట, పంగెడిగూడెం, కొత్తపల్లి, పటవులి, కోటిపల్లి, కపిలేశ్వరం, ఆ సంస్థానం క్రింద వెళ్లగా ఇవిగాక మరికొన్ని ఎస్టేటులు ఉండేవి.

చంద్రయ్యనాయుడు నివసించిన గ్రామం నెల్లిపూడి. కోటిపల్లి ఎస్టేటులో ఉండేది, తోటపల్లి ఎస్టేటును పిఠాపురం రాజావారు పెద్దాపురం సంస్థానము నుండి వేలంపాటలో బ్రిటిష్‌వారినుండి కైవశం చేసుకున్నారు. ఈ తోటపల్లితో బాటు జడ్డంగి ముఠా, దశ్చర్తి ముఠా, రంపయర్రంపాలెం ముఠాలు కూడా ఉండేవి. ఈ మూడు ముఠాలు బ్రిటిష్‌వారి అధీనంలో ఉండేవి. నాయుడు తుపాకి కాల్చడం, విలువిద్య, కర్రసాము, గుర్రపుస్వారీలందు మంచి ప్రవీ ణుడు. తనకంటే గురికాడెవరైనా ఉన్నాడని తెలిస్తే సాధనచేసి అతనిని ఓడించేవరకు నిద్రపోడు. మంచి పట్టుదలగలవాడు. నెల్లిపూడి ప్రాంతములో వారి మేనమామలు "రవణం"వారు పెత్తందార్లుగా ఉండేవారు. పన్నులు వసూలుచేయు అధికారం, తీర్పుచెప్పే అధి కారము కలిగి పిఠాపురం జమీందార్లకు జవాబుదార్లుగా ఉండేవారు. నాయుడికి యుక్తవయస్సు వచ్చేనాటికి వానలు లేక పంటలు పండక కరువు పరిస్థితులేర్పడినవి.

సర్ ఆర్థర్ కాటన్ ధవళేశ్వరం వద్ద ఆనకట్ట కట్టినప్పటికీ ఆ నీరు దిగువ ప్రాంతాలకు పారుదల ఉండేది. ఎగువ ప్రాంత మెట్ట ప్రాంతానికి వర్షాభావ మేర్పడినది. పెద్దాపురం నుండి మెట్టప్రాంత మంతా తీవ్ర కరువు ప్రాంతంగా మారిపోయింది. కలరా, మశూచి, ప్లేగు, విషజ్వరాలు వంటి వ్యాధులు ప్రబలి సరైన వైద్యము లేక చాలామంది మృత్యువాత బడ్డారు. కాకినాడ ప్రాంతములో పెను తుఫాను సంభవించి పంటలు, జననష్టం సంభవించింది. ఇంతటి కరువు పరిస్థితులలో ఆయా సంస్థానాధీశులు ప్రజలపై పన్నులు పుల్లరి పేరుతో విధించి పీడించసాగారు. పన్నులు కట్టనివారి ఆస్తులు, పశువులను వ్యవసాయపనిముట్లను వేలం వేసేవారు. జప్తులకు, చాటింపులకు గురయినవారు అవమానంగా భావించి గ్రామాలను విడిచి కుటుంబముతో వేరే గ్రామాలకు తరలి వెళ్ళేవారు. కొందరు సన్నకారు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఆ విధంగా మన్యం గ్రామాలన్నీ వలసలతో నిండిపోయింది. స్త్రీల మానప్రాణాలకు విలువ లేకుండా పోయింది. బ్రిటిష్ పాలకుల తొత్తులైన సంస్థానాధీశులు, జమీందారులు, పాలెగాళ్లు, ముఠాదారులు, భోగలాలసులయ్యారు. విలాసవంతమయిన జీవితానికి అలవాటు పడ్డారు. స్త్రీలపైన, పేద వారిపైన అత్యాచారాలకు అంతులేదు. తెల్లదొరలు వీరి మాటలనే నమ్మేవారుతప్ప ప్రజల యోగక్షేమాలను స్వయంగా చూసి ఎరుగరు. ఈవిధంగా ప్రజలలో తీవ్రనిరాశ, భయాందోళనలు ఏర్పడ్డాయి.

రైలుమార్గాలు వేసి, స్టీమర్ల ద్వారా మన ఖనిజసంపదను ఇంగ్లాం డుకు తరలిస్తున్నారనే బాధ, మనమీద పరాయిదేశస్థుల పెత్తనమేమిటి అని, మనపాలకులు వారి అడుగులకు మడుగులొత్తుతున్నారని- ఆవేదన కలిసి యువకులలో కదలిక వచ్చింది. బ్రిటిష్ పాలకులపై ఏవగింపు కలిగింది.

నాయుడు ఇవన్నీ చూస్తూ ఉండలేకపోయాడు. అసలే పౌరుష వంతుడు తిరగబడ్డాడు మన తెలుగు బిడ్డ. అప్పటి ఆయన వయస్సు

27 సంవత్సరములు. దళిత, గిరిజన, ముస్లిం, వెనుకబడిన వర్గాలను, వ్యవసాయకూలి, రైతు వర్గాలలో యువకులను కూడగట్టాడు. శిథిల మైన పెద్దాపురం కోటలోవున్న ఫిరంగులను, నెల్లిపూడి గ్రామ సమీపం లోని "బురదకోటకు" తరలించాడు. ఫిరంగులను ఉపయోగించే నిపుణులను పిఠాపురం నుండి తోడ్కొనిపోయి, తాను నేర్చుకుంటూ యువకులకు నేర్పించాడు. విలువిద్య గిరిజన యువకులకు వెన్నతో పెట్టినవిద్య. యువకులందరూ అన్ని విద్యలలో ఆరితేరారు. ఒక దళంగా ఏర్పడ్డారు. బాణాలు, కత్తులు, కర్రలు, ఫిరంగిమందు తయారు చేసుకున్నారు. కొందరు స్వదేశీ అభిమానులైన రైతులు సహకరించారు. గుర్రాలను కొనుగోలు చేశారు.

క్రీ॥శ॥ 1887 "లార్డ్ డల్‌హౌసి" చట్టప్రకారము పెద్దాపురం సంస్థానము బ్రిటీష్ ఇండియాలో చేర్చబడింది. బ్రిటీష్ ప్రభుత్వం అన్ని గ్రామాలలో సారాయి, నల్లమందు, గంజాయి పాటలను ప్రవేశ పెట్టింది. అంతకుముందు గిరిజనులు సాంప్రదాయంగా సారాయి, కల్లు, తయారుచేసుకొని త్రాగేవారు. "ఇజారుదారు" (కాంట్రాక్టరు) ఆ పరిస్థితిని సాగనివ్వలేదు. దాంతో గిరిజనులు నాయుడు నాయ కత్వంలో తిరుగుబాటు చేశారు. గిరిజనుల గుండెల్లో కుదురు కొన్నాడు. వారి నాయకుడిగా చంద్రన్న పిలవబడినాడు.

మొట్టమొదటగా ఇప్పటి ప్రత్తిపాడు మండలం, చింతలూరు నూకాలమ్మ తీర్థంలో తగవు ప్రారంభమయింది. చిలికి, చిలికి గాలి వానగా మారి పెద్దాపురం రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్.డి.వో) జోక్యం చేసుకోవలసిన పరిస్థితి ఏర్పడినది. అప్పటికది సద్దుమణిగినా, తర్వాత "చంద్రన్న" నాయత్వంలో గిరిజనదళ సభ్యులతో పెద్దిపాలెం మీద దాడిచేశాడు. అక్కడ చింతాడుల అక్కయ్య అనే వడ్డీవ్యాపారి ప్రజలను తీవ్రంగా ముక్కుపిండి వసూలు చేస్తూ బాధిస్తున్నాడు. గిరిజన భూములను అసలుకు వడ్డీకలిపి నిరక్షరాస్యులైన గిరిజనుల చేత వేలిముద్రలు వేయించుకొని వారిని బెదిరిస్తూ బాధిస్తున్నాడు. చంద్రన్న ఆ వ్యాపారి ఇంటిపై దాడిచేసి, వెండిరూపాయల మూటలు, బంగారం, వడ్లు, మిర్చి, ఇతర వెచ్చాలు బండ్లకెత్తించి తండాలకు తరలించి, పేదలకు పంచమన్నాడు. ప్రామిసరీనోట్లు తగల బెట్టాడు. బ్రిటీష్ అధికారులకు చెపితే చంపేస్తానని బెదిరించాడు. ఆ బంగారం, డబ్బుతో ఆయుధాలు సమకూర్చుకున్నారు. తర్వాత కొంతకాలానికి కిర్లంపూడి గ్రామంపైకి దాడిచేశాడు. కిర్లంపూడిలో ఆ కాలంలో "రమణాయమ్మ" జమీందారిణి. వారి సోదరులు నరసింహరాయుడు, ప్రకాశరాయుడు అనువారు కిర్లంపూడి ఎస్టేటును చక్కపెట్టేవారు.

కిర్లంపూడికి ప్రక్కనే ఉన్న 'చిల్లంగి' గ్రామంలో కిర్లంపూడి ఎస్టేటులో పనిచేస్తున్న పండితులు, కవులు, గాయకులు, నౌకర్లు ఇతర ఉద్యోగులు నివసించేవారు. ఆ గ్రామము సుభిక్షంగా ఉండి దళితులను అంటరానివారిగా చూస్తూ, వీధిలో నడవాలన్నా చెప్పులు చేత్తో పట్టుకొని నడవాల్సి వచ్చేది. ఆగ్రామంపై దాడిచేసి అక్కడఉన్న సంపదనంతా ఎడ్లబండ్లపై బురదకోటకు తరలించాడు. మూడుసార్లు చిల్లంగి గ్రామంపై దాడి జరిగింది. నేటి కిర్లంపూడి అగ్రహారం ఆ విధంగా నిర్మించినదే. పూర్వము కిర్లంపూడి జమీందారు ప్యాలెస్ అనుకొని కవులు, గాయకులకు, ఇతర ఉన్నతాధికారులకు జమీం దారుకు ఇళ్లు నిర్మించారు.

కిర్లంపూడి జమీందారు "చంద్రన్న" బృందానికి భయపడి కోటచుట్టూ పటిష్టమయిన గోడను నిర్మించాడు. కోటలోపల నుండి తుపాకితో కాలిస్తే చంద్రన్న మనుషులకు తగిలేటట్లు, చంద్రన్న మను షులు కాలిస్తే కోటలోనివారికి తగలకుండా కోటగోడకు రంధ్రాలు ఏర్పాటు చేసుకున్నారు. ఆ ఏర్పాటు నేటికీ అట్లాగే ఉంది. అప్పట్లో చంద్రన్న ముఠా ఎప్పుడు వచ్చి పడుతుందోనని సుమారు రెండు వందల మంది మనుషులు మారణాయుధాలతో కోటకు రేయి, పగలు కాపలా కాసేవారు. తరచూ చంద్రన్న బృందము పెద్దరైతులమీద, పెద్దవ్యాపారులమీద, వారి వారపు సంతలు, పెద్దాపురము, తుని, సంతలకు వెళ్లే ఆహారధాన్యాలు తోడ్కొని వెళ్లే ఎడ్లబండ్లమీద దాడిచేసి ఆహార పదార్థములు, వస్తువులు దోచుకొని కరువుతో అల్లాడుతున్న పేద ప్రజలకు పంచేవాడు. గంజికేంద్రాలు స్థాపించాడు. చింతపిక్క రంగు గుర్రంమీద తుపాకితో, వీపుమీద కత్తి, మొలలో కత్తితో తిరుగు తుండేవాడు. ఆరు అడుగుల ఎత్తు, ఎర్రని శరీరఛాయతో ఉండేవాడు. తండాలలో గూడెములలో గ్రామాలతో తిరుగుతూ ప్రజల బాగోగులు చూస్తూ వైద్యులను బెదిరించి బలవంతంగా తీసుకెళ్లి పేదలకు వైద్యం చేయించేవాడు.

అదే సమయంలో గోదావరిజిల్లా కలెక్టరుగా "సర్ ఎస్క్వైర్ పర్విన్ దొర" వచ్చాడు. 1884 నుండి 1891 వరకు చంద్రన్నముఠా తిరుగుబాట్లవలన గోదావరిజిల్లాలో ప్రభుత్వ ఆదాయం సగానికి తగ్గిపోయింది. వర్షాలు లేక ప్రజలు వలసబాట పట్టారు. కొంతమంది ఉత్తరాంధ్ర, దక్షిణ కోస్తా జిల్లాలకు వలసలు వెళ్లారు. గౌరవ రైతు కుటుంబాలు గూడా కరువుతో తల్లడిల్లాయి. ఆడపిల్లలను తెలంగాణా ప్రాంతము వారికి "ఓలి" తీసుకొని కన్యాశుల్కము తీసుకున్న సందర్భా లున్నాయి. సర్ ఆర్థర్ కాటన్‌గారి జీవిత చరిత్రలో ఈవిషయాలన్నీ పొందుపరిచారు.

ఈ పరిస్థితులలో లార్డ్ పర్విన్ దొర జగ్గంపేటలో పిఠాపురం రాజావారి ఆధ్వర్యములో ఒక సమావేశం ఏర్పాటు చేశారు. ఆ సమావేశానికి గోదావరి జిల్లాలలోని చిన్న చిన్న ఎస్టేటుదారులు, మొఖాసాదారులు, ముఠాదారులు వచ్చారు. సమావేశం మూడు రోజులు జరిగింది. విందులతో, పొందులతో జరిగింది. సమావేశం చివరిరోజున వారిపై చంద్రన్నముఠా హఠాత్తుగా దాడిచేసింది. దానికి కలెక్టరు బిత్తరపోయాడు. ఆ దాడిలో పెద్దగా రక్తపాతము జరగక పోయినా చంద్రన్నముఠా ఈ జమీందారులందరికి తుపాకులు గురి పెట్టారు. కలెక్టరుకు చంద్రన్నకు ముఖాముఖి రసవత్తరంగా చర్చ జరిగింది. అక్కడ విందులు, వినోదాలలో ఉన్న కలెక్టరు, జమీందార్ల నుద్దేశించి చంద్రన్న మీరూ ఒక పాలకులా? మీరు ప్రభుత్వాధి కారులా? ప్రజలు కరువుతో ఈతిబాధలతో అల్లాడుతుంటే మీరు విందులు, చిందులతో ప్రజలు కట్టిన పన్నుల సొమ్ముతో జల్సాలు చేసుకుంటున్నారా? సిగ్గులేదూ, మీది ఒక బ్రతుకా! అంటూ హుంక రించాడు. మీరు ప్రజల గురించీ వారి బాగోగుల గురించీ తక్షణం చర్య తీసుకోకపోతే తర్వాత ఏం జరుగుతుందో! నేను మాటల్లో చెప్పను. ఈ తుపాకి సమాధానం చెబుతుంది. అని హెచ్చరించి వెళ్లిపోయాడు.

ఆ సంఘటనతో కలెక్టరుగారి ఆత్మవిశ్వాసం దెబ్బతిన్నది. ఎలా గైనా చంద్రన్నను పట్టి బంధించడానికి ప్రయత్నాలు ప్రారంభ మయినవి. పెద్దాపురం మెట్టప్రాంతమును కల్లోలిత ప్రాంతముగా

ప్రకటించారు. చంద్రన్నకు సహకరించేవారెవరైనా శిక్షార్హులే. ఆయనకు ఆయన ముఠాకు ఆశ్రయమిచ్చినా నేరస్థులే! అన్ని గ్రామాలలో చాటింపు వేయించారు కలెక్టరుగారు. చంద్రన్నను సజీవంగా పట్టించినవారికి వెయ్యిరూపాయలు నజరానా ప్రకటించారు. ఆరోజుల్లో వస్తుమార్పిడి పద్ధతి ఎక్కువగా ఉండేది. బస్తా ధాన్యం ఒక రూపాయిగా ఉండేది. చంద్రన్న మారువేషములో ప్రజలమధ్య తిరుగుతూ ఉండేవాడు. చాలావరకు పేదల ఆకలిని తీర్చుటకు ప్రయత్నించాడు. అతను స్థాపించిన గంజికేంద్రాలు మూతబడ్డాయి. చంద్రన్నదళం ఇంత క్లిష్టపరిస్థితులలోనూ, ఎక్కడో ఒక చోట దాడిచేసి అడవిదారులలో వెళ్లే ధాన్యము బండ్లను దారి మళ్లించి పేదలకు పంపేవాడు. ఏది ఏమయినా ప్రజలకు ఆరోజులు దురదృష్టకరమైనవి.

చంద్రయ్యనాయుడికి కిర్లంపూడిలో బంధువులున్నారు. ఏనుగుల వెంకటస్వామి, ఏనుగుల కందస్వామి అనువారు. కిర్లంపూడి జమీందారిణి రమణాయమ్మ, ఆమె సోదరులు అందరూ కలిసి వీరికి డబ్బు ఆశ చూపి బెదిరించి చంద్రన్నను బంధించడానికి పథకము పన్ని కలెక్టరు అనుమతి తీసుకున్నారు. వెంకటస్వామి, కందస్వామి కుట్రలో భాగంగా ఆహారధాన్యములు, డబ్బు యిస్తామని, నీవు రహస్యంగా మమ్ములను కలవమని కబురు పంపారు. అమాయకంగా బంధువుల మాటలు నమ్మాడు. ప్రజలు బాగుపడతారని ఒక ముహూర్తాన కిర్లంపూడి మోదుగులరేవడిలో తన గుర్రాన్ని అనుచరులను ఉంచి ఏనుగుల వెంకటస్వామి యింటిలో రాత్రిపూట ఒక్కడే ప్రవేశించాడు. కుశల ప్రశ్నల తరువాత భోజనంలో మత్తుమందు కలిపి పెట్టారు. అతను మత్తులో ఉండగా బ్రిటీష్ సైన్యం బంధించింది. అతనికి స్పృహవచ్చేసరికి సైనికుల చేతిలో బందీగా ఉన్నాడు.

ఈ విషయం తెలుసుకున్న అతని అనుచరులు అతనిని విడిపించుటకు ప్రయత్నించి విఫలమయ్యారు. ఆ సంఘటనలో కొందరు ప్రాణాలు కోల్పోయారు. తెల్లవారిన తర్వాత ఏనుగులవీధి, రామకోవెలకు దక్షిణదిశగాఉన్న రావిచెట్టుకు కట్టివేసి ప్రజల సమక్షములో బ్రిటీష్‌సైనికులు తుపాకులతో కాల్చి చంపారు. బ్రిటీష్‌వారు శవాన్ని బంధువులకు గూడా అప్పగించలేదు. కాకినాడ సంతచెరువు సమీపములో గ్రామోద్యోగులు కలెక్టరు అనుమతితో శవాన్ని ఖననం చేశారు. వేలాదిగా మన్యం ప్రాంత గిరిజనులు, దళిత, పీడిత జనాలు రైతు కూలీలు, అభిమానులు దేశభక్తిగల ప్రజలు తరలివచ్చి కన్నీళ్లతో తమ నాయకునికి నివాళులర్పించారు.

1891వ సం॥ ఫిబ్రవరి 23వ తేదీన బ్రిటిష్ ప్రభుత్వం చంద్రయ్యనాయుడిని కాల్చిచంపింది. (జన్మదినం 1860-9-10).

గోదావరిజిల్లా పి.ఎస్. శర్మగారి స్వాతంత్ర్య సమరయోధుల గాథలు అనుగ్రంథములో ఈ ప్రస్తావన కలదని, హిందూదినపత్రిక ప్రచురించిన తొలినాళ్లలో ఇతని చరిత్ర ఆమూలాగ్రంగా వ్రాయబడిందని శ్రీ గెద్దం సూర్యనారాయణరావు వీరవరం గ్రామవాస్తవ్యులు తెలిపారు.

చంద్రయ్యనాయుడు ఆరడుగుల విగ్రహమని, ఆజానుబాహుడని, తేనెరంగు శరీరఛాయ, ఉంగరాల జుట్టు వెనుక జులపాలు, చింతపిక్కరంగు గుర్రముతో సంచారము చేసేవాడు. ఇతనిని ప్రత్యక్షంగా చూసినవారు కిర్లంపూడి ప్రాంతములో 1957 వరకు బ్రతికే ఉన్నారు. తర్వాతకాలంలో సానా సూర్యనారాయణ, (కిర్లంపూడి), రవణం అప్పారావు గారు(నెల్లిపూడి) (ఇతను ద్వారబంధాల చంద్రయ్యనాయుడు మేనల్లుడు 1990లో మరణించాడు) వీరి బంధువులున్నారు.

పిఠాపురం సంస్థానంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టరుగా 1947 ఆగస్టు 15వ తేదీ వరకు పనిచేసిన తరువాత భారత ప్రభుత్వములోగూడా రెవెన్యూ అధికారిగా తహసీల్‌దారుగా పదవీవిరమణ చేసిన తర్వాత 1994 సం॥లో మరణించిన కీ॥శే॥ శ్రీ చిలకమర్తి మల్లయ్య శాస్త్రిగారు కూడా వీరాధివీరుడైన చంద్రయ్యనాయుడిని గురించి ఎన్నో విషయాలు ప్రజలకు, తన స్నేహితులకు చెప్పేవారు.

అల్లూరి సీతారామరాజు సినిమాలో హీరో చెప్పే డైలాగులలో చంద్రన్న ప్రసక్తి వస్తుంది. తెలుగువీర లేవరా! దీక్షబూని సాగరా! అనే పాటలో గూడా చంద్రన్నమాట వస్తుంది.

చంద్రన్నకు బ్రిటీష్‌వారు బలరాంపురం (రౌతులపూడి) ముఠా యిస్తామని ఆశచూపినా తిరుగుబాటు విరమించలేదు. చంద్రన్న ఈ దళములో చేరిన తరువాత భార్యను వదిలేశాడు. తర్వాత బాగరాయి గ్రామములో మరొకామెను వివాహం చేసుకున్నాడు. ఆమెకు కుమారులున్నారు. ఇప్పటికీ పేదరికం అనుభవిస్తున్నారు.

1889 సం॥నుండి 1891వరకు మూడు సంవత్సరాలు పెద్దాపురం డివిజన్లోనే తిరుగుబాట్లకు నాయకత్వం వహించాడు. చంద్రన్న తర్వాత గరిమెళ్ల మంగన్న, పిట్టల భీముడు, ఉద్యమాన్ని కొనసాగించారు. కాని విఫలమయ్యారు. ఈ స్వాతంత్ర్య సమర యోధుని గుర్తుగా ప్రభుత్వం విగ్రహం పెట్టి చరిత్రను పాఠ్యాంశంగా పెట్టాలని కోరుతున్నాను. ◆

## 8, 9 తేదీల్లో బహుజన సాహిత్య సదస్సు

'సంధికాలపు స్వేచ్ఛా సాహిత్యం : బహుజన దృక్పథం' అనే అంశంపై ఆంధ్రప్రదేశ్ బహుజన రచయితల వేదిక ఆధ్వర్యంలో ఏప్రిల్ 8,9 తేదీల్లో రాష్ట్రస్థాయి సాహిత్యసదస్సు నిర్వహించనున్నాము. గుంటూరు బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞానకేంద్రంలో ఈ సదస్సులు నిర్వహిస్తాము. తొలిరోజు వేర్వేరు అంశాలపై నిర్వహించే సదస్సుల్లో ఆచార్య చల్లపల్లి స్వరూపరాణి, డాక్టర్ యండా శ్రీనివాసరావు(భారతీ దాసన్ యూనివర్సిటీ), విక్టర్ విజయ్‌కుమార్, ఉషా. యస్.డానీ, అరుణ గోగులమండ, దుప్పల రవికుమార్, ముప్పవరపు కిషోర్, కొల్లాబత్తుల సత్యం, శామ్యూల్ జొనాథన్, వేంపల్లి షరీఫ్, పాలిమాటి రాంబాబు తదితరులు ప్రసంగిస్తారు. ఈ సదస్సుల్లో పలు పుస్తకాల ఆవిష్కరణ ఉంటుంది. రెండో రోజు ' అంబేద్కరిజం-మాస్టర్ కీ' అనే అంశంపై 126మంది కవులతో కవితాహోరు నిర్వహిస్తాము. మరిన్ని వివరాలకు 98481 87416 నంబరులో సంప్రదించవచ్చు.

**డాక్టర్ నూకతోటి రవికుమార్**

తెలుగులోనే చదువు-
తెలుగులోనే బ్రతుకు-తెలుగుతోనే వెలుగు

# ఉస్మానియా యూనివర్సిటీ శతజయంతిని చరితార్ధకం చెయ్యండి

-సంకేపల్లి నాగేంద్రశర్మ
ఫోన్:9441797650.

## ఈ ఉత్సవాల నిర్వహణకై తెలంగాణ ప్రభుత్వం వందకోట్లు కేటాయించాలి.



**వం**దేళ్ళ చరిత్రకు సాక్ష్యంగా నిలువడమేకాదు, ఎన్నో రంగాల్లో చరిత్రను సృష్టించిన ఉస్మానియా విశ్వవిద్యాలయం (హైదరాబాదు) శతాబ్ది (1917-2017) ఉత్సవాలకు సన్నద్ధమవుతోంది. నిజాం రాజుల కాలంలో వంద సంవత్సరాల క్రితం స్థాపించబడిన హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ప్రపంచంలోని అత్యుత్తమమైన ఉత్తమ విశ్వవిద్యాలయాలలో ఒకటి అన్న పేరును సంపాదించుకుంది. ఇటీవలే ఈ విద్యాలయం ఆసియాలోని విశ్వవిద్యాలయాలలో ఉత్తమ వర్సిటీగా పేరుతెచ్చుకుంది. విదేశీ విద్యార్థులను ఆకర్షించడంలో దేశంలోనే పూణేతర్వాత రెండవ స్థానంలో వుంది. త్వరలోనే పూణే స్థానాన్ని తాము అధిగమించగలమన్న ధీమాతో యూనివర్సిటీ వుంది. విదేశాలలోని అప్పటి విశ్వవిద్యాలయాల భవనాలను, తరగతుల బోధనా నిర్వహణా విధానాన్ని విద్యా నిపుణులచే పరిశీలించిన తర్వాతే హైదరాబాద్‌లోని అడిక్‌మెట్ సమీపంలో ఉస్మానియా విశ్వ విద్యాలయం స్థాపించబడింది. ఎన్నెన్నో చారిత్రిక ప్రాధాన్యాలను, భవనాల నిర్మాణంలో వైభవాల్ని సొంతం చేసుకున్న ఉస్మానియా విశ్వవిద్యాలయం, తెలంగాణాకే గర్వకారణంగా నిలుస్తోంది. హైదరాబాద్ కు వచ్చిన యాత్రీకుడెవరూ ఈ విశ్వవిద్యాలయాన్ని చూడకుండా ఉండలేరు. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి గుండెకాయ లాంటిది ఆర్ట్స్ కళాశాల భవనాల నిర్మాణాలేనని చెప్పాలి. ఏడవ చిట్టచివరి నిజాం రాజు ఉస్మాన్ అలీఖాన్ ఈ విశ్వవిద్యాలయాన్ని స్థాపించడానికి ఎంతోచొరవ, ప్రత్యేక శ్రద్ధాసక్తులను చూపించారు. కేవలం ప్రాంతీయ రాజభాషైన ఉర్దూ మీడియం ప్రాతిపదికగా ఈ విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించారు. 1948లో పోలీస్ చర్య తర్వాత ఇది ఉర్దూమీడియం నుండి ఆంగ్ల మీడియానికి మార్చబడింది. అంతవరకు వైద్య ఇంజనీరింగ్, ఎంఎ, వివిధ కోర్సుల తరగతులను ఉర్దూ మీడియంలోనే నిర్వహించెడివారు. తెలంగాణాలోనే ఇది మొట్టమొదటి యూనివర్సిటీ. సుప్రసిద్ధ విద్యాక్షేత్రంగా ఈ యూనివర్సిటీ ఈ వంద ఏళ్ళలో చక్కటి పని తీరును ప్రదర్శిస్తున్నది. నేటి ప్రముఖ రాజకీయవేత్తలు, విద్యావేత్తలు, మేధావులు, ఇంజనీర్లు, వైద్యులు, శాస్త్రవేత్తలు ఎందరో ఈ యూనివర్సిటీలో విద్యాభ్యాసం చేసి, విశ్వవ్యాప్తంగా పేరు గడించినవారే.

బ్రిటిష్ ఇండియాలో విశ్వవిద్యాలయాల స్థాపనకు అప్పటి ప్రభుత్వం 1813లో ఒక తీర్మానం చేసింది. అందులో భాగంగానే పాట్నా, బెనారస్, హైదరాబాద్, మైసూరు, తదితర ఏడు చోట్ల ఈ యూనివర్సిటీల స్థాపన జరిగింది. భారత్‌లో ఇది ఏడవది కాగా, దక్షిణభారత దేశంలో ఇది మూడవ యూనివర్సిటీగా నిలిచింది. బ్రిటిష్ కాలంలో హైదరాబాద్ ఒక ప్రత్యేక సంస్థానంగా ఉంది. ఈ యూనివర్సిటీ స్థాపనకు అప్పటి నిజాం ఏడవ రాజు ప్రపంచంలోని అమెరికాలోని కాలిఫోర్నియా, హార్వర్డ్, స్టాన్ ఫోర్డు, కొలంబియా, బ్రిటన్‌లోని ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జిలలోని యూనివర్సిటీల తీరును విషయ నిపుణులచేత అధ్యయనం చేయించారు. 16 వందల ఎకరాలలో ఏడు కాలేజీలతో ఈ యూనివర్సిటీని స్థాపించారు. 25మంది సిబ్బంది, 250మంది విద్యార్థులతో ప్రారంభించారు. ప్రస్తుతం 62 సబ్జక్టులతో 8 ఫ్యాకల్టీస్‌తో యూనివర్సిటీ సమగ్ర విద్యాబోధనల్ని సాగిస్తోంది. దూరవిద్య విధానాన్ని దేశంలోనే తొలిసారిగా ప్రారంభించిన గడ్డం రాంరెడ్డి వంటి ఉన్నత విద్యావేత్తలు ఈ యూనివర్సిటీ ఉపకులపతులుగా పనిచేసి, యూనివర్సిటీ ప్రతిష్టను ఎంతో పెంచారు. యూనివర్సిటీ ఆవరణలో ప్రాచ్యలిఖిత భాండాగారం, దుర్గాభాయి దేశ్‌ముఖ్ ఆంధ్రమహాసభ ఉన్నాయి. యూనివర్సిటీ ఈ కార్యాలయాల ఏర్పాటుకు స్థలదానం చేసింది. ఈ యూనివర్సిటీ క్యాంపస్ బయట కోఠీ వుమెన్స్‌కాలేజీ, నిజాం కాలేజీ, సికింద్రాబాద్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ, సైఫాబాద్ కాలేజీలను కలిగివుంది.

### ఆర్ట్స్ కాలేజీ భవనాలు

ఉస్మానియా యూనివర్సిటీకి గుండెకాయ ఆర్ట్స్ కళాశాల. ఉన్నతమైన నిర్మాణాలతో ఈ కళాశాల భవననిర్మాణాలు చూస్తే అచ్చెరువందుతాం. స్వదేశీ, విదేశీ వాస్తునిర్మాణంతో భవనాలను నిర్మించారు. నైజాం ఏడవరాజు జమానాలో సుప్రసిద్ధ వారసత్వ కట్టడంగా ఈ కళాశాల భవనాలను ఉదహరించవచ్చును. బెల్జియం ఆర్కిటెక్ట్ జర్నెస్ జాన్‌ఫర్ కన్సల్‌టెంట్‌గా వ్యవహరించగా, సయ్యద్ అలీరజా, నవాబ్ జయంత్‌సింగ్ బహదూర్లు భవన నిర్మాణాలను పర్యవేక్షించారు. 1939డిసెంబర్4న నిజాం ఏడవ రాజు ఉస్మాన్ అలీఖాన్ ఈ కళాశాలను ప్రారంభించారు. ఈకళాశాల భవన నిర్మాణాలకు అప్పటి ప్రభుత్వం 36లక్షల రూపాయలను వెచ్చించింది. ఉత్తమమైన ఉన్నత విద్యలకేకాక, ఆర్ట్స్ కాలేజీ నాటి నుండి నేటి వరకు ఆత్మగౌరవ ఉద్యమపోరాటాలకు నెలవైంది. నాటి నిజాం వ్యతిరేక తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటాలనుండి,1969 తెలంగాణా ముల్కీ ఉద్యమం, నిన్నటి తెలంగాణా రాష్ట్రసాధన పోరాటాలకు ఈ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణం ప్రత్యక్ష సాక్షిగా నిలిచింది. ఆర్ట్స్ కళాశాలలోనే 25 వరకు విభాగాలున్నాయి. ఎంఎలో తెలుగు, ఉర్దూ, హిస్టరీ, సోషియాలజీ ఇంగ్లీష్, జర్నలిజం, వాణిజ్య శాస్త్రం, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, రాజకీయ శాస్త్రం, ఆర్థిక శాస్త్రం, భాషాశాస్త్రం తదితర కోర్సులున్నాయి. ఎందరో ప్రముఖ ఆచార్యులు వీటిలో పనిచేశారు. మాజీ ప్రధాని పివి వంటి విద్యావేత్తలు ఈ యూనివర్సిటీలోనే చదువుకున్నారు.

### శతాబ్ది ఉత్సవాలు


ఈ యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలను ఏప్రిల్ 26,2,728వ తేదీలలో (1917-2017) మూడురోజుల పాటు నిర్వహించనున్నారు. ఈశతజయంతి సంవత్సరమంతా యూనివర్సిటీలో వివిధ ఉత్సవాలు నిర్వహింపబడతాయి. శతాబ్ది ఉత్సవాలను రాష్ట్రపతి ప్రణబ్‌కుమార్ ముఖర్జీ ఏప్రిల్ 26న లాంఛనంగా ప్రారంభిస్తారు.

### నిధులను సమకూర్చాలి

ఘనత కలిగిన ఉస్మానియా యూనివర్సిటీకి నిధుల కొరత వేధిస్తున్నది. యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలను ప్రభుత్వం ఘనంగా నిర్వహించాలని యూనివర్సిటీ విద్యార్థిలోకం కోరుతోంది. తెలంగాణాకే మకుటాయమానమైన ఈ విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించడానికి, యూనివర్సిటీ పాలకవర్గం కోరినట్లుగా శతాబ్ది ఉత్సవాలకు వందకోట్ల నిధులను కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ ఉత్సవాల నిర్వహణపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరుతున్నారు. సగంకుపైగా వున్న అకాడమిక్ ఉపన్యాసకుల ఖాళీ పోస్టులను భర్తీచేయాలని, కొత్తగా ఉద్యోగులను పెంచాలని, నాన్ అకాడమిక్ సిబ్బంది ఖాళీలను భర్తీ చేయాలని వేతనాలు సకాలంలో చెల్లించాలని యూనివర్సిటీ సిబ్బంది కోరుతున్నారు. ఇప్పుడు వి.సి.గా ఆచార్య ఎస్.రామచంద్రం, రిజిస్ట్రార్‌గా ఆచార్య ప్రతాపరెడ్డిలు, ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి కృషిచేస్తున్నారు. ◆

# యోగాకు 'యోగం' కల్పించిన స్వామి రామ్‌దేవ్!

-పుప్పల నరసింహం
99857 81799



**ప**తంజలి యోగాను రామ్‌దేవ్ బాబా ప్రాచుర్యంలోకి తీసుకొచ్చారు. గతంలో ఎవరూ ఇంత పెద్ద ఎత్తున యోగాను ప్రజలకు పరిచయం చేయలేదు. అఖండ భారతంలోనేకాక ప్రపంచం నలుమూలలా ఆయనవల్ల యోగా విస్తరించింది. 200 దేశాల్లో రామ్‌దేవ్ యోగా కేంద్రాలు క్రియాశీలకంగా పనిచేస్తున్నాయి. జూన్ 2న 'ప్రపంచ యోగా దినోత్సవం' జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితి తీర్మానించడం వెనుక ప్రధాని నరేంద్రమోదీ ప్రయత్నంతో పాటు స్వామి రామ్‌దేవ్ ధ్యానఘోష కనిపిస్తుంది, వినిపిస్తుంది.

ఆధ్యాత్మికత కొందరికి నచ్చదు. అది తిరోగమన భావజాలంగా భావిస్తారు. లేదా మూఢవిశ్వాసంగా తలుస్తారు. మార్క్సిస్టులైతే మతాన్ని మత్తుమందుతో పోల్చారు. నాస్తికులైతే భగవంతుడిని విశ్వసించరు. సైన్సును ప్రేమిస్తారు.

**ఇప్పుడు యోగా ఒక సైన్సుగా ఉబికి వచ్చింది. అనేక వ్యాధుల, రుగ్మతల చికిత్సలో యోగా ఎంతో ఉపకరిస్తోందని అలోపతి వైద్యులు సైతం చెబుతున్నారు.** శ్వాసమీద ధ్యాసపెట్టడం, శ్వాసపై ఆధారపడిన మానవ శరీరానికి శ్వాస అనులోమ-విలోమ అభ్యాసం చేసినట్టయితే జల-వాయు సంబంధంగా ఏర్పడే రుగ్మతలు నయమవుతాయని చెబుతున్నారు.

ఇప్పుడు ఇంటింటికి షుగర్, బి.పి., కొలెస్ట్రాల్, ఊబకాయం, దృష్టిలోపం లాంటి సమస్యలతో బాధపడుతున్నవారి సంఖ్య పెరుగుతోంది. ఆహారం, జల-వాయు సంబంధంగా కొన్ని రుగ్మతలు, అనారోగ్యాలు తలెత్తుతున్నాయని నిపుణుల మాట. ఈ వ్యాధుల చికిత్స కోసం అలోపతి మందులు వాడి సైడ్ ఎఫెక్ట్సుతో కొత్త సమస్యలు, దుష్పరిణామాలు తెచ్చుకున్నవారు కోకొల్లలు.

దీనికి ఏమిటి పరిష్కారం?...దాదాపు రెండు దశాబ్దాలుగా స్వామి రామ్‌దేవ్ యోగాను, ఆయుర్వేదాన్ని పరిష్కారంగా తెరపైకి తెచ్చారు. ఉదయంపూట 'ఆస్థా' ఛానల్‌లో యోగా చేస్తుంటే ఆయనను అనుసరించేవారి సంఖ్య అనూహ్యంగా పెరిగింది. పెరుగుతూ ఉంది.

అనేక నగరాలు, పట్టణాల్లో యోగా శిబిరాలు నిర్వహించి స్వామి రామ్‌దేవ్ ప్రత్యక్షంగా రోగ పీడితులకు ఉపశమనం మాటలతోపాటు యోగా శిక్షణ ఇవ్వటం ఇన్‌స్టంట్‌గా ఆకట్టుకుంది. ఇక స్వామి రామ్‌దేవ్ ప్రజాసేవలో వెనక్కి తిరిగి చూడకుండా దూసుకు పోతున్నారు. దేశంలో 20 అక్షల కిలోమీటర్లు ప్రయాణంచేసి కోట్లాదిమంది ప్రజల ముందు కనిపించారు. టీ.వీ.ద్వారానయితే ప్రపంచవ్యాప్తంగా దాదాపు వందకోట్లమంది ప్రజలను ఆయన చేరుకున్నారు. ఆయన మాటపై, యోగాపై విపరీతమైన గురి, విశ్వాసం. ఇది అంధవిశ్వాసం కాదు... ఫలితాలు చూశాకనే ప్రజలు ఆయన మాటను మంత్రంగా భావిస్తున్నారు.

**విచిత్రమేమిటంటే యోగా మతపరమైనదని ఇంతకాలం ఎందరో భావించారు. కాదని ఆయన ఆచరణలో నిరూపించారు.** ఇస్లాం మతాన్ని ఆచరించే దేశాల్లోనూ స్వామి రామ్‌దేవ్ యోగా శిబిరాలు గొప్ప విజయాన్ని సాధించాయి. దుబాయ్‌లోనైతే రాజ కుటుంబీకులు సైతం యోగాభ్యాసం చేస్తున్నారు. రేపో మాపో పాకిస్తాన్‌లోనూ స్వామి పెద్దఎత్తున యోగాను, పతంజలి ఉత్పత్తులను ప్రవేశపెట్టనున్నారు. ఆయన అభిమానులు పాకిస్తాన్‌లోనూ ఎక్కువ మందే ఉన్నారు. వారి ఆహ్వానం మేరకు ఆయన అక్కడకు వెళ్ళనున్నారు.

ఇప్పటికే బంగ్లాదేశ్‌లో భారీస్థాయిలో పతంజలి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. యోగా శిబిరాలే గాక హరిద్వార్‌లో మాదిరి పతంజలి ఫుడ్‌పార్కులు ఏర్పాటుచేసి ఆయుర్వేద ఔషధాలు, ఆహార పదార్థాలు దేశీయ సౌందర్య సాధనాలు తయారు చేస్తున్నారు. నేపాల్‌లోనూ ఇదే ప్రక్రియ కొనసాగుతోంది. వేలకోట్ల రూపాయల టర్నోవర్ జరుగుతోంది. అయితే ఆ దేశాల్లో అమ్ముడయ్యే వస్తువులపై వచ్చే లాభాలను ఆయా దేశ పేదప్రజల సేవ-సంక్షేమం కోసమే ఖర్చు చేస్తున్నామని, ఇది తమ సిద్ధాంతమని, ఇదంతా పారదర్శకంగా కొనసాగుతోందని స్వామి రామ్‌దేవ్, వారి సహచరుడు ఆచార్య బాలకృష్ణ చెబుతున్నారు.

హరిద్వార్‌లోని పతంజలి ఫుడ్‌పార్క్ యూనిట్ మాదిరి మెగా యూనిట్లను భారతదేశం నలుదిక్కులా నాలుగు యూనిట్లను అతిత్వరలో ఏర్పాటుచేసి, పతంజలి వస్తువులను డిమాండ్‌కు తగ్గట్లు అందిస్తామని వారు ప్రకటించారు. ఇది కలయా ? నిజమా? అన్న రీతిలో పతంజలి ఎదుగుదల కనిపిస్తోంది. దాంతో బహుళజాతి కంపెనీలు చతికిల పడుతున్నాయి. పతంజలి 'దంతకాంతి' మార్కెట్‌లో ప్రవేశించాక 'కోల్గేట్' గేటు మూసేస్తారని చమత్కారంగా స్వామి

తరచూ అంటూ ఉంటారు. అది నిజం కాబోతూందా? అనిపిస్తోంది. భారతదేశపు డబ్బును విదేశీ సంస్థలు దోచుకుపోవడాన్ని సహించలేని స్వామి దేశంలోని డబ్బు దేశంలోనే ఉండాలని స్వదేశీ వస్తుఉత్పత్తికి పెద్దపీట వేశారు. గాంధీ బాటనే శరణ్యమని అంటున్నారు. వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్నారు. కోట్లాది రైతులకు అదనపు ఆదాయాన్ని అందిస్తున్నారు. పతంజలి ఆవునెయ్యి ప్రజల్లో ఎనలేని గౌరవాన్ని సంపాదించుకుంది. 'గోరక్షణ' కోసం ఎన్నో నిధులను పతంజలి యోగ్ ట్రస్టు ఖర్చు చేస్తోంది.

దేశంలో ఒక్కో దేశీఆవు 25 నుంచి 50 లీటర్ల పాలు ఇచ్చేందుకు వీలుగా హరిద్వార్‌లో పరిశోధనలు చేస్తున్నారు. కొత్తరకం దేశీ ఆవులను 'బ్రీడ్' చేయనున్నారు. ఇది గ్రామీణ విప్లవానికి నాంది పలుకుతుందని, రైతుల ఆదాయం పెరిగి వారి జీవితాలు మెరుగు పడతాయని వారి కొత్త తరాలు చదువుకునేందుకు వీలు కలుగుతుందని స్వామి రామ్‌దేవ్ అంటున్నారు.

**ప్రపంచంలో ఎక్కడా లేనంత భారీస్థాయిలో మధ్యప్రదేశ్‌లో 'యోగా గ్రామ్'ను నిర్మించారు. అందులో ప్రకృతి చికిత్స కూడా జరుగుతోంది. ఒకవైపు ఆయుర్వేదం-యోగాతోపాటు ప్రకృతి చికిత్సను సైతం ప్రోత్సహిస్తున్నారు. ఆయుర్వేదంలో అంతర్భాగంగా దీన్ని చూస్తున్నారు. ఆధునిక పద్ధతులను ప్రవేశపెట్టి ప్రాచీన వైద్యానికి వన్నె తెస్తున్నారు. స్వామి రామ్‌దేవ్ విజయ రహస్యమంతా ఇందులోనే ఇమిడి ఉంది. ప్రాచీన యోగాను, ఆయుర్వేదాన్ని, గురుకుల విద్యను కొత్త రూపంలో ప్రజలముందుకు తీసుకు రావడంతో వాటికి ప్రజల్లో ఎనలేని ఆదరణ కనిపిస్తోంది. కొత్తగా 'ఆచార్యకులమ్' పేర గురుకులాలను ప్రారంభించారు. రెండు తెలుగు రాష్ట్రాలలోనూ వీటి గురించిన ప్రకటనలు వెలువడనున్నాయి.** వీటిలోనూ యోగాకు, వేదాలకూ పెద్దపీట వేశారు. కంప్యూటర్ విద్యతోపాటు వాటిని బోధిస్తున్నారు. విలువలు, సంస్కృతి-సభ్యతను కాపాడేవిధంగా ఉన్నత ఆదర్శాలను విద్యార్థులు పుణికి పుచ్చుకునేలా తీర్చిదిద్దుతున్నారు. వారి ప్రతిభను వెలికి తీస్తున్నారు. సమాజంలోని అన్ని రంగాల్లో విలువలను ఈ విద్యార్థులే ప్రతిష్ఠిస్తారన్న లక్ష్యంతో పనిచేస్తున్నారు. ఇప్పటికే ఈవిధమైన విద్యను వేలాదిమంది హరిద్వార్‌లో అభ్యసిస్తున్నారు. స్వామి రాందేవ్, ఆచార్య బాలకృష్ణల ఉత్తేజకర నాయకత్వంలో ఈ 'ఆచార్య కులమ్' దేశంలో ఐదు వందలకు పైగా జిల్లాల్లో ఏర్పడనున్నది. దేశంలో యోగాను ఎంత వేగంగా విస్తరింపజేశారో అంతే వేగంగా విలువలతో కూడిన విద్యను-ఆధునిక విద్యను అందించేందుకు స్వామి కంకణబద్ధులై ఉన్నారు.

కాషాయ వస్త్రాల్ని ధరించి స్వామిరాందేవ్ ప్రపంచమంతా తిరిగారు. యోగాను నేర్పించారు. ఒక సాధారణ రైతు కుటుంబంలో పుట్టిన తాను భగత్‌సింగ్, చంద్రశేఖర్ అజాద్, రాజగురు, స్వామి దయానంద సరస్వతి లాంటి ప్రముఖుల చిత్రపటాలను తదేకంగా చూసి వారిని ఆవాహన చేసుకుని, గురుకులంలో చేరి యోగ, సంస్కృతం నేర్చుకున్నానని, ఆయుర్వేదం సైతం అక్కడే పరిచయమైందని వినమ్రంగా చెప్పేస్వామిరాందేవ్ యోగాకు మారుపేరుగా నిలిచారు. ఆయనకు ముందు ఎందరో యోగాగురువులున్నప్పటికీ స్వామి రాందేవ్ రంగంలోకి దిగాక సామాన్య ప్రజలతోపాటు ప్రముఖులు, అత్యంత ప్రముఖులు సైతం యోగాపై మక్కువ పెంచుకుని సాధన చేస్తున్నారు. తమ ఆరోగ్యాన్ని సంరక్షించు కుంటున్నారు. ఆ విషయాన్ని ఆయా ప్రముఖులు బహిరంగంగానే అంగీకరిస్తున్నారు. ఇది అద్భుతం గాక మరేమిటి?

యోగులు ముక్కు మూసుకుని, హిమాలయాల్లో కూర్చుని ఆకులు, అలములు తింటూ కాలం గడుపు తారన్న భావనను స్వామి రాందేవ్ పటాపంచలు చేశారు. యోగి-రాజ గురు ఒకడేనని, 21వ శతాబ్దంలో, ప్రజాస్వామ్యంలో రాజగురు పాత్ర ఎంతో కీలకమైనదని అందుకే తాను యోగా, ఆయుర్వేదం, విద్యతోపాటు అవినీతి-నల్ల ధనంపై గళం విప్పుతున్నానంటారు. వ్యక్తికి చికిత్స ఎంత అవసరమో వ్యవస్థకూ చికిత్స అంతే అవసరమంటున్నారు. అటువైపుగా దృష్టి సారించారు. రాజగురు పాత్రను సమర్థవంతంగా పోషిస్తున్నారు. ఒక వ్యక్తి ఇన్ని పాత్రలు పోషించటం సాధ్యమా? అనిపించేలా ఆయన కష్టపడుతున్నారు. రోజుకు18 గంటలకు పైగా తాను సంవత్సరాల తరబడి దేశంకోసం శ్రమిస్తున్నానని వినమ్రంగా ఆయన చెబుతారు.

తనపేర బ్యాంక్ అకౌంట్ లేదని, అంగుళం భూమి లేదని, తాను ఫకీర్‌నని, బికారినని ఆయన నవ్వుతూ అంటారు.

దేశం క్లిష్టదశలో ఉన్నప్పుడు పౌరులందరూ జాగరూకతను ప్రదర్శించాలన్న కౌటిల్యుని మాటలను ఆయన తరచూ ఉటంకిస్తారు. అన్నిటి కన్నా దేశం ఉన్నతమైనదని దేశభక్తిని బోధిస్తారు.

రాజస్థాన్ సరిహద్దుల్లోకి వెళ్ళి బి.ఎస్.ఎఫ్.జవాన్లకు యోగా నేర్పించారు. వారిలో ధైర్యాన్ని నింపారు. వారి బలిదానాలను శ్లాఘించారు. త్యాగాలను కొనియాడారు. అద్భుతమైన తన గాత్రంతో 'రంగ్‌దే బసంతి చోలా...' అన్న దేశభక్తి గీతం ఆలపించి వారిని ఉత్సాహపరిచారు. అప్రమత్తంగా ఉండాలని వెన్ను చరిచారు.


అంతేనా...అర్ధసైనిక బలగాల జవాన్లకు హరిద్వార్‌లో ఎన్నో శిక్షణా శిబిరాలు నిర్వహించి, వారిలో ఒంటరితనాన్ని పోగొట్టారు. విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిడిని తొలగించుకునేందుకు అవసరమైన యోగాసనాలు నేర్పించారు. అలాగే వారి సంక్షేమ నిధికి పతంజలి ట్రస్టు తరపున కొంత మొత్తాన్ని జమచేశారు. ఇదంతా గొప్ప ఉత్తేజం కలిగించే రీతిలో కొనసాగిస్తున్నారు.

పోలీసులు, సైనిక జవాన్లు, ఇతర రంగాల్లో పనిచేసేవారు లక్షలాదిమంది హరిద్వార్‌లోని శిబిరాల్లో యోగసాధన చేసి, అక్కడ అందించే యోగాసాహిత్యాన్ని వెంట తెచ్చుకున్నారు. నిజ జీవితంలో యోగాను ప్రాక్టీసుచేస్తున్నారు. దీని వెనకాల ఒక శక్తిగా ఉన్నది స్వామి రాందేవ్ అన్నది విస్పష్టం.

**ఆధ్యాత్మికతతో పాజిటివ్ భావాల విస్తృతి పెరుగుతుందని, యోగా అందులో భాగమని, అందుకే అందరూ రోజూ కొన్ని నిముషాలపాటైనా యోగా చెయ్యాలని స్వామి సూచిస్తున్నారు.** ఆయన పాల్గొనే ప్రతి సభ-సమావేశంలో కపాల్‌భాతి, అనులోమ్-విలోమ్ యోగా చేసి చూపిస్తారు. ఆయన పొట్టను గుండ్రంగా తిప్పే విన్యాసానికి ఎందరెందరో ముగ్ధులవుతారు. అది ప్రేరణగా తీసుకుని కొంతనైనా యోగా చేద్దామని పూనుకున్నవారి సంఖ్య అసంఖ్యాకం.

ఏది ఏమైనా ఆదిశంకరాచార్య అనంతరం దేశంలో ఆధ్యాత్మికతను బలంగా జాగృతం చేసింది స్వామి రాందేవ్ అంటే అతిశయోక్తి అవదు. ◆

# తెనుగులెంక సూక్తులు-21



*పెద్దలతో స్వార్థప్రియ*
*బుద్ధులతో మన శిరమ్ము బొప్పులు గట్టెన్*
*రద్ధి యెఱుంగని పల్లెల*
*నిద్దరకిద్దరకు నడుమ నెగసె కటారుల్.*

'తెనుగు లెంక' 'అభినవ తిక్కన'
**తుమ్మల సీతారామమూర్తి.**

**ఒ**కప్పుడు పల్లెటూళ్ళు మమతానురాగాలకు మారుపేరుగా ఉండేవి. కులమతాలు వేరయినా అన్నదమ్ముల్లా అందరూ కలసిమెలసి ఉండేవారు. పేర్లతో కాకుండా అన్న, అక్క, వదిన అంటూ వరుసలతో పిలుచుకొనేవారు. మంచి అయినా, చెడ్డయినా అందరూ కలిసి ఉండేవారు. శుభకార్యాలలో కలిసి ఆనందించేవారు. అశుభం ఏర్పడితే అందరూ బాధను పంచుకునేవాళ్ళు.

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ప్రజలే ప్రభువులయ్యారు. పదవుల ద్వారా పొందే సౌకర్యాలు, అధికారం ద్వారా లభించే ఆదా యాలు, ప్రచార ఆర్భాటాలు, కీర్తిప్రతిష్ఠలు, సన్మాన సత్కారాలు సామా న్యులకు నోరూరించాయి. పదవులు పొందడానికి, పొందిన పదవులు కాపాడుకోవడానికి తమకొక వర్గాన్ని తయారుచేసుకోవడం మొదలు పెట్టారు. అందుకోసం ఎదుటి వర్గంమీద ద్వేషాన్ని రగిలించ సాగారు. దీనితో గ్రామాలు రెండు వర్గాలయ్యాయి. ఇద్దరు నాయకులు ఏర్పడ్డారు. కక్షలు, కార్పణ్యాలు, కొట్లాటలు, పోట్లాటలు అధికమయ్యాయి. ముఠానాయకులు క్రమంగా ఎదిగి 'పెద్ద'లయ్యారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయికి, క్రమంగా రాష్ట్రస్థాయికి, జాతీయ స్థాయికి ఎదిగారు.

రాజకీయ పార్టీలు ఎన్నికలలో గెలవాలంటే వారికీ 'పెద్దల' సాయం అవసరమయింది. ధనంతో, పదవితో ప్రలోభపెట్టి పార్టీలు 'పెద్దల'ను అక్కున చేర్చుకున్నాయి.

ముఠాలు లేకపోతే నాయకులకు పుట్టగతులుండవు. అందుచేత వీరు గ్రామాల్లోని కక్షలను చల్లారనివ్వరు. ఎన్నికలవేళ ఈ తగాదాలు తారాస్థాయికి చేరతాయి. ప్రజల్లోని వర్గపోరాటం ఆరకుండా ఎప్పుడూ ఏదో ఒక రూపంలో ఎన్నికలు జరుగుతున్నాయి. పార్లమెంటు, అసెంబ్లీ, పంచాయితీ, నీటిసంఘం, సహకార సంస్థలు - ఇలా ఎన్నికలు ఒకదాని వెంట మరొకటిగా వస్తూ తగాదాల చిచ్చు ఆరడంలేదు. ఒకవర్గం పార్టీమారితే, అప్పటివరకూ ఆపార్టీలో ఉన్నవర్గం ఈపార్టీ తీర్థం పుచ్చుకుంటుంది. దాంతో ముఠా తగవులకు అంతం లేకుండా నిత్యం రావణకాష్టంగా గ్రామాలు తయారవుతున్నాయి.

ముఠాకక్షలు అంతరించి, మనుషులమధ్య మమతానురాగాలు చిగురించినప్పుడు, మారణాయుధాలు మటుమాయమయినప్పుడు మాత్రమే పల్లెలు ప్రగతిరథంపై పరుగులు తీస్తాయి. అందుకే తుమ్మల "పెద్దలతో, స్వార్థపరులతో ప్రజలు నష్టపోతున్నారు. ఎటువంటి గోల తెలియని అమాయకులైన పల్లెప్రజలలో మనుషులమధ్య ఆయుధాలు లేస్తున్నాయి" అని బాధపడ్డారు. అలాంటి పరిస్థితి ఉండకూడదని ఆశించారు.

**-డా॥నాగభైరవ ఆదినారాయణ**
చరవాణి: 98497 99711

# మనవూరు మదరాసు

**38 వ పుట తరువాయి**

నేపథ్యంలో స్నేహం, వివాహం, దాంపత్యాలను అధునాతనమైన కృష్ణమూర్తి మార్గంలో వ్యాఖ్యానించడం మదరాసు బతుకుల్లోనే సహజంగా కనిపిస్తుంది. మామూలు మనుషులు భాషాసంకుచితమైన గొడవల్లో పడిపోయి మదరాసు వొక పెద్ద సార్వత్రిక (కాస్మోపాలిటన్) నగరంగా మారడాన్ని గుర్తించలేక పోతున్నారు. ఆ నగరం వివిధ భాషలకే గాకుండా, అనేక జాతులకూ, మతాలకూ పెద్ద కలగూర గంపలా (మెల్టింగ్ పాట్) తయారయిందని గమనించలేకపోతున్నారు. (నాన్నమ్మ - జలంధర, ఘర్షణ - సంధ్య).

తెలుగు కథలన్నీ కంచికే చేరుతాయి. తర్వాత తెలుగు పత్రికల కార్యాలయాలుండే మదరాసుకు చేరేవి. యిన్నాళ్ళ తర్వాత గూడా, యిప్పుడు కంచినుంచి మరొక తెలుగు పత్రిక పుట్టుకొస్తోందంటే అక్కడి తెలుగుకున్న పునాదులెంత బలమైనవో అర్థమవుతుంది. (కథ కంచికి చేరేనా? – పి.సుమబాల). సినిమా పరిశ్రమ హైదరాబాదును చేరినా యిప్పటికీ చాలామంది తెలుగు తారలూ, సాంకేతిక నిపుణులూ, రచయితలూ మదరాసును వదిలిపెట్టలేకున్నారు. (ఎవ్వరి యాక్షన్ డాట్ - భువనచంద్ర).

పాత తెలుగు సినిమాల్లోని కథానాయకులందరూ బతుకు తరువు కోసం చేరుకున్న పట్నం మదరాసే! మన తొలినాటి సాహిత్య వైతాళికులందరూ చదువుకున్న నగరమూ మదరాసే! లజ్ కార్నర్, మాంగళూరు మెయిలు, టీ నగరూ, వడపళని– మొదలైనవి తెలుగు కథలకప్పుడు (సెట్టింగ్స్) నేపథ్యాలయ్యాయి. ఆ వారసత్వానికి కొనసాగింపులేని కొరతను ఈ కథలు కొంతవరకూ తీరుస్తున్నాయి. తెలుగులో యిప్పుడు విరివిగా వస్తున్న ప్రాంతీయ కథా సంకలనాలకు 'మదరాసు కథలు' మంచి చేర్పుగా రూపొందింది. 'తెలుగు' అనే విస్తృతమైన పఠంలోని ఖాళీలన్నీ యిలాగే పూరించబడాలని కోరుకుందాం.

*(డా.నాగసూరి వేణుగోపాల్, భువనచంద్ర, డా.రాయదుర్గం విజయలక్ష్మిల సంపాదకత్వంలో చెన్నపురి రచయితల సంఘం (చెన్నరసం) ప్రచురిస్తున్న 'మదరాసు బదుకులు' కథల సంపుటికి రాసిన ముందుమాట.)* ◆

**నడుస్తున్న చరిత్ర** 2013 నవంబరు వరకు
**అమ్మనుడి** 2015 మార్చి నుండి...
**పాత సంచికలు విడిగా గాని,**
**సంపుటి (వాల్యూం) బౌండులుగా గాని**
**కావలసినవారు సంప్రదించండి.**
అమ్మనుడి, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ,
హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ-4.
ఫోన్ : 98480 16136, 0866-2439466

కవిత



# మట్టివాసన

-కరణం కళ్యాణ్ కృష్ణకుమార్
9848428978

ఎక్కడిదో ...
గుండె చప్పుడు...
స్పష్టంగా వినబడుతోంది...
అట్టడుగు పొరల నుంచి.

పచ్చని హాహాకారాలు..
వెచ్చని గాలై స్పర్శిస్తున్నాయి..
ఉబికి వస్తున్న తడి..
అరిపాదాలను చల్లగా తడుముతోంది..

అరటి తోపుల ఆనవాళ్ళు
మునగ తోటల ఆవాసాలూ
గులాబీ ముళ్ళై దిగబడుతున్నాయ్..
మరులుగొల్పిన మట్టి వాసన
కమురు ఖంపుగ మారి
ముక్కుపుటాల తాకుతోంది

ఎక్కడి నుంచో ఏడుపు సంగీతం
కర్ణకఠోరంగా ఘోషిస్తోంది..
నిత్యం పవళించే పచ్చకోక లేక
ప్రభాతం పరిహసిస్తూ భగ్గుమంటోంది..
అసుర సంధ్యల సాయం కాలాలు
సాయం కోల్పోయి ఆత్మాహుతి చేసుకున్న
హాలికుడి ప్రాణంలేని కన్నుల్లా తేలిపోతున్నాయి...

'పసిడి'తనం పోగొట్టుకున్న
నల్లరేగడి తనలో తానే దిగబడిపోతోంది..
నేలకేసే చూసి ఆకాశం
రోజుకొక్కసారన్నా కన్నీరొలికిస్తోంది..

నిన్నటి దాకా జలజలా పారిన
నదీమ తల్లి చేష్టలుడిగి
గంభీరముద్ర దాల్చింది..
స్వేచ్ఛగా అటు ఇటు పరిగెట్టిన బాల్యం
కాలుష్య కాసారమై దుమ్ముకొట్టుకొని
బిత్తరచూపులు చూస్తోంది...

దాతృత్వమో.. దోపిడీనో..ఏదైనా
అది అన్నదాత గుండెకాయ..
అవసరమో ..ఆకాంక్షో...
అది రైతన్న నిలువుకోత..

ఎర్రగా మారిన స్వేదబిందువులు
రాలిన క్షేత్రంపై
ఎగురుతున్న మువ్వన్నెల రెపరెపలు
ఏదో చెప్పాలని పరితపిస్తున్నాయ్..

నల్లని త్రాచై పరిగెడుతున్న అభ్యున్నతి
విషం కక్కింది...
ఆకలి తీర్చిన చేను
అనాథలా మారింది..
పచ్చదనం పంచిన తావు
ఎడారై నోరు తెరిచింది

నా హృదయం తడిబారింది..
మనసు కొండను మోస్తున్నట్టైంది
లోలోతున గాయం స్రవించడం
మొదలెట్టింది
కనుచూపుమేర కనిపించని గతం
వెక్కిరించసాగింది.. ◆

స్పందన



క్రిష్టాఫర్ మాలా
సిస్టం ఎనలిస్ట్
ఎస్.పి.టి.ఐ.ఎల్., కాల్ట్స్
హైదరాబాదు
కేంద్రీయ విశ్వవిద్యాలయం

## సాంకేతిక పురోగతితో తెలుగుభాషే మాధ్యమంగా ఉండాలి.

రానున్న తరాలన్నీ సాంకేతిక రంగంతో ముడిపడి ఉన్నాయి. ఈ క్రమంలో ఏ భాష అయితే సాంకేతికతను అమర్చుకుంటుందో అది రాజ్యమేలుతుంది అన్నది అందరికి తెలిసిన విషయమే. ఈ రంగంలో, తెలుగు భారతీయ భాషలలోనే అగ్రస్థానంలో ఉంది. తెలుగు ఖతుల నిర్మాణానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చాం. తెలుగులో మనకు ఎన్నో భాషా సాంకేతిక పరికరాలు ఇప్పటికే రూపుదిద్దుకొని ఉన్నాయి. వాటిలో కొన్ని, చరవాణులలో వాడేందుకు వీలుగా తెలుగు బహుభాషా యాపులు పదవిశ్లేషిణి (word Analyzer), పదజనకం(word Generator), దిద్దరి (SpellChecker), లిప్యంతరణం, తెలుగు నుండి ఇతర భారతీయ భాషలకు యంత్రానువాద పరికరాలు(Machine Transaltion System), తెలుగు నిఘంటువులు, పదకోశాలు మొదలగునవి ఇప్పటికే ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు గారి నేతృత్వంలో హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం లోని కాల్ట్స్ విభాగం రూపొందించి అంతర్జాలంలో ఉంచింది (caltslab.uohyd.ac.in). వీటితో తెలుగువారికి ఉద్యోగావకాశాలు విస్తరిస్తాయి. ప్రజలూ ప్రభుత్వం మధ్యన సమాచారం ఇచ్చిపుచ్చు కోవడం తేలికవుతుంది.

ఇంత సాంకేతిక పురోగతిలో ప్రపంచ వేగాన్ని అందుకొంటూ, ప్రాచీన హోదాకు ఎదిగి అంతర్జాల మాధ్యమంలో విస్తరిస్తూ ఉన్నప్పుడు వీటన్నిటినీ సమన్వయపరుస్తూ, ఇంకా ముందుకు వెళ్లేందుకు చేయూతనిచ్చి తెలుగు అభివృద్ధికి బాటలు పరవాల్సిన ప్రభుత్వం తెలుగు భాషని బోధనా మాధ్యమం నుంచి తీసివేసి ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టడం చాలా శోచనీయమూ విచారకరమూ. ఇట్టి పనికి పూనుకున్న ప్రభుత్వం ప్రజల హితం కోరి, ముందున్న తరాల మంచి భవిష్యత్తు కోసం తక్షణమే జి.ఒ.నెం.14/ 2.1.2017ను వెనక్కి తీసుకొని ఇక మీదట అన్ని విద్యా సంస్థలలో కనీసం ఇంటర్మీడియట్ వరకు ఒకే మాధ్యమం - అది తెలుగు మాధ్యమం, ఒకేరకమైన కరిక్యులం ఉండేలా ఒక చట్టం తీసుకురావాలని కోరుతున్నాను.

# 'ప్రజాసాహితి' 40వ వార్షికోత్సవం-400వ సంచిక ఆవిష్కరణ



ప్రజాసాహితి 40వ వార్షికోత్సవం, 400వ సంచిక ఆవిష్కరణ, 400 సంచికల డివిడిల ఆవిష్కరణ సభలు జనసాహితి ఆధ్వర్యంలో 19-3-2017న హైదరాబాద్, విజయవాడ, ఒంగోలు, అనకాపల్లి లోనూ, 22-3-2017న తిరుపతి, వెంకటగిరిలోనూ, 26-3-2017న శ్రీకాకుళంలోనూ, కావలిలోనూ జరిగాయి.

19-8-2017న సాయంత్రం 6 గంటలకు విజయవాడ శిఖర స్కూలులో 400వ సంచిక, 400 సంచికల డివిడిల ఆవిష్కరణ సభ జరిగింది. ఈ సభకు వక్తలను డా॥ అరుణ జనసాహితి ఆహ్వానించారు. ప్రజాసాహితి ప్రధాన సంపాదకులు కొత్తపల్లి రవిబాబు సభను నిర్వహించగా ప్రముఖ సాహితీ విమర్శకులు కడియాల రామ్మోహన్‌రాయ్, కవి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కొప్పర్తి వెంకటరమణమూర్తిగారు, కవి, కథకుడు, సాహితీ విమర్శకులు, కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్ ఉపన్యసించారు.

ముందుగా ప్రజాసాహితి ప్రధాన సంపాదకులు రవిబాబు మాట్లాడుతూ 'ప్రజాసాహితి' పత్రిక 400 సంచికలు తీసుకురావటం - 40 ఏళ్ళుగా కొనసాగుతూనే పండటం అన్నది సంస్థకున్న స్పష్టమైన సామాజిక, సాహిత్య వైఖరి, సమిష్టి కృషి అన్నారు. అవరోధాలను ఎదుర్కొంటూ తప్పొప్పులను సరిచేసుకుంటూ ముందుకు సాగుతున్నామన్నారు. మొట్టమొదట పత్రిక రంగనాయకమ్మగారి సంపాదకత్వంలో వెలువడింది. ఎమర్జెన్సీ తర్వాత జనసాహితి సంస్థ ఆవిర్భవించింది. 1979లో రంగ నాయకమ్మ జనసాహితి సంస్థకు పత్రికను అప్పగించారనీ, పత్రికను తీర్చిదిద్దటంలో ఎదురయ్యే సమస్యలను వివరించారు.

కడియాల రామ్మోహన్‌రాయ్ ప్రజాసాహితి 400వ సంచికను ఆవిష్క రించి - ఆ సంచికను విశ్లేషిస్తూ మాట్లాడారు. నవ్యాంధ్ర చరిత్ర రాయ వలసివస్తే 'ప్రజాసాహితి' పత్రిక లేకుండా ఎలా సాధ్యం? అంటూ ఈ 400 సంచికలలో ప్రతి సంచికను నేను చదివానని, అందులో వున్న విశిష్ట సంచికలు, ప్రత్యేక సంచికలు తెలుగు సాహిత్య చరిత్రలో "ప్రజాసాహితి" కృషికి అద్దంపడతాయని అన్నారు.

కొప్పర్తి రమణమూర్తి మొదటి 200 సంచికల డివిడిని ఆవిష్కరించి, మాట్లాడారు. ఈ 400 సంచికలకు పునాది ఐన మొదటి సంచికలోనే ప్రజాసాహితి తన దృక్పథాన్ని వెలిబుచ్చిందని, దానికనుగుణంగా మిగతా సంచికలన్నీ నడిచాయని అన్నారు. సమాజం రెండు వర్గాలుగా విభ జించినపుడు దోపిడీకి గురౌతున్న అశేష పీడిత ప్రజల ఉద్యమవేదికగా 'ప్రజాసాహితి' వుంటానని ప్రకటించిందని, ప్రజలంటే ఎవరో నిర్వ చించిందన్నారు.

పాపినేని శివశంకర్ రెండవ డివిడిని ఆవిష్కరించి, 40 ఏళ్ళ ప్రజాసాహితి ప్రస్థానం గురించి మాట్లాడారు. సాహిత్యమంటే రసదృష్టితోనే చూసే తనలాంటి ఎంతోమంది రచయితల దృష్టిని ప్రజాసాహితి, జన సాహితి సంస్థ ప్రజలవైపు సమాజంవైపు మరల్చి ప్రజా రచయితలను చేసిందన్నారు. వస్తువుకిచ్చిన ప్రాధాన్యత రూపం (శిల్పం)కి ఇవ్వాలని - ఈ మధ్యకాలంలో వస్తున్న కవిత్వంలో అది లోపిస్తుందన్నారు. జన సాహితి పెట్టిన రచయితల వర్క్‌షాప్‌లో తానూ పాల్గొన్నానని, జన సాహితి సంస్థ తనని తీర్చిదిద్దిన అనుభవాలను పంచుకున్నారు. చందు నాగేశ్వరరావు, శశి, బండ్ల మాధవరావు, కార్తీక్-ప్రజాసాహితితో తమ అనుభవాలను తెలిపారు. ◆


---

కవిత

## తెలియదు!

-డి. నటరాజ్
94404 28597


వాడెక్కడుంటాడో ఎలా వుంటాడో మనకు తెలియదు....
దివ్యవాక్కు ఒకటి వదులుతాడు, ప్రపంచం అంతా
తనభాషే మాట్లాడాలని
ఇంకేముంది బానిసకొాక బానిసకొాక బానిస వుంటాడు కదా
ఆర్డరు వేసేస్తాడు తన ఆస్థానంలో అందరూ
తల్లిభాషను మరచిపోయి సవతిభాషలోనే మాట్లాడాలంటాడు
సవతి భాషలోనే కూడూ, గుడ్డా, వుద్యోగం అంటాడు
మట్టి పిసుక్కుంటూ బిడ్డని చదివించే తండ్రికి తెలియదు
తన బిడ్డే పైచదువులు చదివీ చదివీ తనను
'యూ డర్టీమాన్ గెట్ లాస్ట్' అంటాడని
అత్తలకి తెలియదు, 'బికినీలు' వేస్తే తప్ప తమను
అల్లుళ్ళు గౌరవించరని
పుట్టి పెరిగిన ఊళ్ళే డర్టీ డర్టీ అంటూ, 'యూ
డర్టీ ఇండియన్' అంటూ
రేపటి తరాలు తెల్లోళ్ళ చెప్పులు నాకుతారని
అధికార బానిసలకి తెలియదు, తమ
అధికారాలు ఊడగానే
తమ కొడుకులు తమను మునిసిపాలిటీ చెత్తకుప్పలో
పడేస్తారని
ముందుగతి ఆలోచించగల రచయితలు
తమ మాతృభాషలో రచనలు చేస్తూనే ఉంటారని.



**నా స్మృతిపథంలో :** కీ.శే. లవణం ఆత్మకథ (అసంపూర్ణం) పుటలు: 471, వెల: రు.350. ప్రచురణ, ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్, 27-1-64, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్ పేట, విజయవాడ-520 002. ఫోన్: 0866-2577533




**సంశోధన :** తొలి సంచిక. త్రైమాసిక తెలుగు పరిశోధన పత్రిక. సంపాదకులు: ఆచార్య ఆర్వీయస్.సుందరం. 120 పుటలతో, విశిష్ట వ్యాసాలతో వెలువడింది. సంవత్సర చందా: రు.100, ప్రతులకు: ఇడమకంటి లక్ష్మీరెడ్డి, బెంగుళూరు-43. ఫోన్: 9342540479



**ఇల్లిందల సరస్వతీదేవి ఉత్తమ కథలు:** సంపాదకులు: ముదిగంటి సుజాతా రెడ్డి. పుటలు: 238, వెల: రు.225.00. ప్రచురణ, ప్రతులకు: నేషనల్ బుక్‌ట్రస్ట్, ఇండియా, నెహ్రూభవన్, 5, ఇనిస్టిట్యూషనల్ ఏరియా, ఫేజ్-2, వసంత్ కుంజ్, న్యూఢిల్లీ - 110070.




**నిద్రిత నయనాలు :** కథా సంపుటి; రచన: డా॥ పెళ్ళకూరు జయప్రద సోమిరెడ్డి. వెల: రు.120. ప్రతులకు: వంశీ పబ్లికేషన్స్, నెల్లూరు. ఫోన్: 94402 79594, మరియు సాహితి ప్రచురణలు, చుట్టుగుంట, విజయవాడ-4. ఫోన్: 8121098500




**గండికోట రహస్యం** : ప్రపంచ ప్రఖ్యాత పెమ్మసాని కమ్మరాజుల వైభవం. రచన: అలపర్తి పిచ్చయ్య చౌదరి. పుటలు: 108, వెల: అమూల్యం, ప్రతులకు: ఎ.పిచ్చయ్య చౌదరి, ఇంటి నెం.42/169, జయనగర్ కాలనీ, కడప - 516 002. ఫోన్: 9177013845



**వేము శతకం :** పద్య కవిత్వం; రచన: వేము రాములు. పుటలు: 48, వెల: రు.20, ప్రతులకు: వేము రాములు, టీచర్, ఇంటి నెం. 1-140/4/1, మధిర.ఖమ్మం జిల్లా. ఫోన్: 98665 44192, 80997 91985




**చెర్నాకోల** : రెక్కల్లో మానవవాదం. రచన: ఇసనాక మురళీధర్. పుటలు: 120, వెల: రు.100లు, ప్రతులకు: దీపిక పబ్లికేషన్స్, జయప్రకాష్ నగర్, హైదరాబాదు - 500 073. ఫోన్: 9010601919




**వెన్న ముద్దలు :** బాల గేయాలు; రచన: డా.పత్తిపాక మోహన్. పుటలు: 80, వెల: రు.60, ప్రచురణ,ప్రతులకు: గంగ ప్రచురణలు, 5-4-47, పత్తిపాక వీధి, సిరిసిల్ల-505 301. ఫోన్: 9966 22 9548



**కావ్య సంజీవి** : శిఖామణి కవిత్వంపై విశ్లేషణ; రచన: డా॥యు.ఎ.నరసింహమూర్తి. పుటలు: 32, వెల: రు.50. ప్రచురణ, ప్రతులకు: కవిసంధ్య గ్రంథమాల, 2-1-043, అంబేద్కర్ నగర్, యానాం-533 464. ఫోన్: 98482 02526



**శ్రీ పరమప్రియ శతకము**: రచన: శ్రీ స్వామి పరమ ప్రియానంద సరస్వతి. పుటలు: 30, ఉచితము. ప్రతులకు: డా॥పెద్దిన సుదర్శనరావు, ఇంటినెం.5-1-648, త్రినాధ మందిరం ఎదురుగా, జయపురం-764 005, ఒడిశా. ఫోన్: 94379 44590,



**నవ్యాంధ్ర** : సాహిత్య ప్రత్యేక సంచిక; 20 కథలు,12ఇంటర్వ్యూలు, పుట్టా పెంచలదాసు బాతిక్ పెయింటింగులతో. సంపాదకులు: సాకం నాగరాజు, గంగవరం శ్రీదేవి. పుటలు: 136, వెల: రు.100. సమర్పణ: రాజాచంద్ర ఫౌండేషన్, తిరుపతి. ప్రతులకు: ఫోన్: 8049539860 / 9908900098



**ఇందులేఖ :** మలయాళంలో 1889 లో ఒ. చందుమీనన్ రచించిన నవలకు తెలుగు అనువాదం: ఎస్.జయప్రకాశ్. పుటలు: 351, వెల: రు.305. ప్రచురణ/ ప్రతులకు: నేషనల్ బుక్‌ట్రస్ట్, ఇండియా, నెహ్రూభవన్, 5, ఇనిస్టిట్యూషనల్ ఏరియా, ఫేజ్-2, వసంత్ కుంజ్, న్యూఢిల్లీ 70.

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136)
RNI-APTEL/2015/62362

# రాజకీయాలలో నైతిక విలువల పతనం

## విశాఖ సదస్సు నిరసన



ఎడమ నుండి : నరవ ప్రకాశరావు, చందు సుబ్బారావు, సి.ఎస్.రావు, ఇ.ఎ.ఎస్.శర్మ, కె.వి.రమణ, సామల రమేష్‌బాబు, డి.వి.సూర్యారావు

**మా**ర్చి 7 మంగళవారం నాడు విశాఖ పౌర గ్రంథాలయంలో స్థానిక ప్రజాస్పందన, సమైక్య భారతి సంస్థలు పుచ్చలపల్లి సుందరయ్య, కూర్మా వెంకటరెడ్డి నాయుడు, తెన్నేటి విశ్వనాథం, సర్దార్ గౌతు లచ్చన్నగార్ల స్మృత్యర్థం 'రాజకీయాలు–నైతిక విలువలు' అనే అంశంపై సదస్సును నిర్వహించారు. దీనికి ఆంధ్రవిశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఆచార్య కె.వి.రమణ అధ్యక్షత వహించగా డా.డి.వి.సూర్యారావు ప్రారంభోపన్యాసం చేశారు. విశ్రాంత ఐ.ఎ.ఎస్ అధికారి శ్రీఇ.ఎ.ఎస్ శర్మ, తెలుగు భాషోద్యమసమాఖ్య అధ్యక్షులు డా॥సామల రమేష్‌బాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విశిష్ట అతిథులుగా ఆచార్య చందు సుబ్బారావు, శ్రీబి.ఎల్ నారాయణ, శ్రీనరవ ప్రకాశరావు, డా॥చెంబూరి వెంకట్రావు పాల్గొని ప్రసంగించారు. మన ఎంపీలలో కనీసం 30శాతం మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయంటే రాజకీయ రంగంలో నైతిక విలువలు ఎంత దిగజారి పోయినవో తెలుస్తున్నదని, ప్రజల ఓట్లతో గెలిచిన నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని, ప్రజాసమస్యలను పట్టించుకోకుండా తమ స్వార్థానికే పనిచేస్తున్నారని శ్రీ ఇ.ఎ.ఎస్.శర్మ అన్నారు. ఓటు అడిగిన వారి సంతకంతో హామీలు పొందేలా రానున్న ఎన్నికలకు సిద్ధం కావాలని ఆయన పిలుపు ఇచ్చారు. ఉన్నత స్థాయిలోని నేతల్లోనే నైతిక విలువలు దిగజారిపోవడం స్వాతంత్ర్యానికి ముందునుంచే మొదలైందని, తర్వాత ఇది మరింతగా పెరుగుతోందని, ప్రజల భాషను పట్టించుకోకపోవడమనే అప్రజాస్వామ్య ధోరణి ఇందులో భాగమేనని డా॥సామల రమేష్‌బాబు అన్నారు. నిరంతర ఉద్యమాలతోనే ఈ సమస్యను ఎదుర్కోగలమని వక్తలు అభిప్రాయపడ్డారు. పరవస్తు పద్యపీఠం శ్రీ పరవస్తు సూరి, సమైక్యభారతి శ్రీ కన్నయ్య సభను నిర్వహించారు.

మే నెల
సంచిక నుంచే...

## బౌద్ధం–వైజ్ఞానిక మార్గం

రచన : బొర్రా గోవర్ధన్



**బౌ**ద్ధం గొప్ప మానవీయ సిద్ధాంతం. నైతికత, మానవీయతే దాని దేహం, ప్రాణం. కార్యకారణ సిద్ధాంతం బౌద్ధానికి చుక్కాని. ప్రత్యక్ష ప్రమాణం తెరచాప. భౌతికవాదం దిక్సూచి. వైజ్ఞానిక దృక్పథం బౌద్ధానికి ముందే వున్నా దాని పయనం తెరచాప తెగిన నావలా, దిక్సూచి లేని దారిలో సాగింది. అనాత్మవాదాన్ని, భౌతికవాదాన్ని భుజానికెత్తుకున్న బౌద్ధ ప్రయాణం తప్పక వైజ్ఞానిక తీరానికే చేరుతుంది.

బౌద్ధుల ఆ దృక్పథమే బౌద్ధంలో ఎన్నోచోట్ల వైజ్ఞానిక ఆలోచనలకు తెరతీసింది. బుద్ధుడు, ఆ తర్వాత ఆసంగుడు, ఆర్యభట్ట, జీవకుడు...ఇలాంటి ఎందరెందరో తమ ప్రవచనాల్లో, రచనల్లో వైజ్ఞానిక అంశాల్ని ప్రకటించారు.

ఆ విషయాలు...ఇక ప్రతినెలా **'అమ్మనుడి'**లో **'బౌద్ధం-వైజ్ఞానిక మార్గం'** శీర్షికద్వారా ధారావాహికంగా మీకు అందుతాయి.

అమ్మనుడి (తెలుగుజాతి పత్రిక) Pages : 52
AMMANUDI (Telugu Monthly)
April 2017, Vol.3, Issue 2
Date of publication : 1st of every month
Date of posting : 4th of every month
RNI-APTEL/2015/62362
Postal Reg. No.TEN/12/2015-17

స్థాపితం : 2001 విశ్వసనీయత - భద్రత - పారదర్శకత సంస్థ లక్ష్యంగా

# ది కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ (లి) తెనాలి

Regd. No. A.M.C./G.N.T./D.C.O./2001/532

హెడ్ ఆఫీస్ : కొత్తపేట, **తెనాలి** - 522 201. గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్
ఫోన్ : 08644 - 235671, 235672

బ్రాంచి ఆఫీసులు :

1) మెయిన్‌రోడ్, **అంగలకుదురు** - 522 211. ఫోన్ : 08644 - 233299
2) లాకులరోడ్డు, **కొల్లూరు** - 522 324. ఫోన్ : 08644 - 243788
3) రథంబజారు, **బాపట్ల** - 522 311. ఫోన్ : 08643 - 224051

## ఖాతాదారులకు మా సేవలు

డిపాజిట్స్‌పై యితర బ్యాంకులకన్నా అత్యధిక వడ్డీ **9.5%**

సీనియర్ సిటిజన్స్‌తో పాటు 58 సంవత్సరాలకు రిటైరయిన ప్రభుత్వోద్యోగులకు 55 సంవత్సరాలు నిండిన మహిళలకు ఒక సంవత్సరం పైకాలపు డిపాజిట్స్‌కు ఒక శాతం అదనపు వడ్డీతో **10.5%**

ప్రతిరోజూ తక్కువ వడ్డీకే తక్షణం మంజూరయ్యే 'గోల్డులోన్స్' పై వడ్డీ. **12%**

ఇళ్ళు, ఇళ్ల స్థలాల హామీపైన, వ్యక్తిగత జామీను పైన **16%** వడ్డీతో అప్పులివ్వబడును.

నెలవారీ రికరింగ్ డిపాజిట్స్ సదుపాయం కలదు
చిన్న మొత్తాల పొదుపు పథకం - డైలీ డిపాజిట్

**లాకర్స్ సదుపాయం కలదు**

సెక్రెటరీ : కనమర్లపూడి ఝాన్సీలక్ష్మి, చరవాణి : 93478 96473



పాలక మండలి

శ్రీ దావులూరి లక్ష్మీకాంతారావు, అధ్యక్షులు
శ్రీ గ్రంథి చంద్రమౌళీశ్వరరావు, ఉపాధ్యక్షులు
శ్రీ చిరుమామిళ్ళ రవీంద్రబాబు, డైరెక్టర్
శ్రీ కఠారి వాసుదేవనాయుడు, డైరెక్టర్
శ్రీ వేదాంతం సుబ్రహ్మణ్యశాస్త్రి, డైరెక్టర్
శ్రీ గెడ్డటి బాబూరావు, డైరెక్టర్
శ్రీ ఎ. పోతురాజు, డైరెక్టర్
శ్రీ షేక్ ఖలీల్, డైరెక్టర్
శ్రీ యడ్లపాటి విజయరంగనాథ్, డైరెక్టర్
శ్రీ పి.ఎస్.ఆర్. బ్రహ్మాచార్యులు, డైరెక్టర్



వ్యవస్థాపక అధ్యక్షులు :
కీ॥శే॥ దావులూరి సోమశేఖరరావు

అధ్యక్షులు :
శ్రీ దావులూరి లక్ష్మీకాంతారావు

**ది కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీలో సభ్యులుగా చేరండి.**
**డిపాజిట్స్ చేయండి - అధిక లాభం, విలువైన సేవలు పొందండి.**